జూలై '80 రూ.3/-



"పోటీలేని పరుగు"

– వి.రాజారామమోహనరావు

దేశంలో అత్యధికంగా చదవబడుతున్న తెలుగు మాసపత్రిక
07 - 1980



తెలుగులో కొత్త తరహా



పిల్లల మాస పత్రిక



తెలుగులో వస్తున్న అన్ని పిల్లల పత్రికల సైజు-గెటప్‌తో
ఆరు రంగుల ఆఫ్‌సెట్ ముఖచిత్రంతో, ప్రతి పేజీలో రెండు రంగుల
అందమైన బొమ్మలతో, వినోదభరితమైన పురాణ-జానపద కథలు,
పేజీ కథలు, వింతలు-విశేషాలు, శీర్షికలేగాక అదనంగా కడుపుబ్బ
నవ్వించే కార్టూన్ కథలు, గిలిగింతలుపెట్టే జోక్సు, కార్టూన్సు,
పజిల్స్ గల 16 పేజీల హాస్యపత్రికతోసహా

మిలియన్ జోక్సు

మాస పత్రిక

మీరూహించలేనంత ఆకర్షణీయంగా తయారై ఆగస్టు '80 సంచిక
జూలై మొదటి వారంలో విడుదల కాబోతోంది.
మీ కాపీ నేడే రిజర్వుచేసుకోనండి.

పేజీలు: **64** వెల: రు. **1-50**

డిపాజిట్స్ కట్టగలిగిన సమర్థులైన ఏజెంట్లు వివరములకు
నేడే సంప్రదించండి



మేనేజర్,
మిలియన్ జోక్సు,
29, పిళ్లయార్ కోయిల్ స్ట్రీట్,
వడపళని,
మద్రాసు-600 026.



సంస్థాపకులు
కీ॥ శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

జూలై 1980

సంపుటి 18 **విషయసూచిక** సంచిక 6

ఈ నెల నవలానుబంధం

పోటీలేని పరుగు

రచన : వి. రాజారామమోహనరావు

ముఖచిత్రం : 'శంకరాభరణం'లో మంజుభార్గవి

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, మద్రాసు-600 024. ఫోన్ : 423123
సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) 43 రూపాయలు

వచ్చే సంచికలోనే

ప్రారంభం!

ప్రఖ్యాత రచయిత్రి

బీ నా దే వి

సీరియల్ నవల

భూమి గుండ్రంగా వుంది

తొలిమాట


తొమ్మిది రాష్ట్రాల శాసనసభలకు ఇటీవల జరిగిన ఎన్నికలల్లో శ్రీమతి ఇందిరాగాంధీ అధ్యక్షతనగల కాంగ్రెసు-ఐ ఘనవిజయం సాధించింది. శ్రీమతి గాంధీ నాయకత్వం పట్ల ప్రజలకుగల విశ్వాసానికీ, శ్రీమతి గాంధీ పునః ప్రవేశానికిముందు అధికారంలో వున్న రాజకీయ పార్టీల పట్ల ప్రజల విముఖతకి ఈ శాసనసభల ఎన్నికల ఫలితాలు నిదర్శనమని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, తమిళనాడులో కాంగ్రెసు-ఐ, డి. ఎం. కె. పార్టీల ఐక్యసంఘటనని తిరస్కరించి ఎం. జి. రామచంద్రన్ నాయకత్వానగల అఖిల భారత అన్నా డి. ఎం. కె.ని గెలిపించి తమిళనాడు ప్రజలు తమ ప్రత్యేకతని మరొకసారి నిరూపించుకున్నారు. ప్రజాసంక్షేమమే పరమధ్యేయంగా కొత్తరాష్ట్రప్రభుత్వాలు పనిచేస్తాయని ఆశిస్తున్నాము.

* * *

ఈ సంచికతో కళాశాల విద్యార్థుల కథల పోటీని నిలిపివేస్తున్నాము. ఉత్సాహంతో ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థి రచయితలను అభినందిస్తున్నాము.

* * *

బీనాదేవిగారి సీరియల్ నవల 'భూమి గుండ్రంగా వుంది' వచ్చే సంచికలోనే ప్రారంభిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. బీనాదేవిగారి నవలని మళ్ళీ ప్రారంభిస్తున్నందుకు సంతోషం వెలిబుచ్చుతూ మాకు లేఖలురాసిన పాఠకులందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.



శ్రీశ్రీకి మరొక ప్రశ్న!

మీరు మే 80 సంచికలో ప్రచురించిన నా ఉత్తరం జూన్ సంచికలోని శ్రీశ్రీ సమాధానం చూశాను. 'సీడ'కు శ్రీశ్రీ ఆధారం—మొదట ముందు పిదప వెనక—అని. ఈ ఆధారం అసమంజసమని 'మొదట పిదప' అన్న మాటలు అర్థరహితమని నా వాదన. మనం సూర్యునకభిముఖంగా వున్నామా? లేదా? అన్న దాన్నిబట్టి 'సీడ' మారుతుందిగాని దానికి 'ముందూ వెనుకలు' లేవని నే రాశాను. దీనికి సమాధానంగా శ్రీశ్రీ ఐన్‌స్టెయిన్ సాపేక్ష సిద్ధాంతం ఆదిశంకరుల మిథ్యావాదం, లక్ష్మణ కవి పద్యం ఉదహరించి తేల్చిందేమంటే 'సీడకు ముందూలేదు వెనకాలేదు' అని నే చెప్పిన విషయమే. మరి అలాంటప్పుడు తానిచ్చిన ఆధారం తప్పని శ్రీశ్రీగారొప్పుకున్నట్లే గదా?

ఆధారమివ్వడంలో జరిగిన తప్పుని లేదా పొరపాటుని శ్రీశ్రీగారు ఒప్పుకొనుంటే గొప్పగా వుండేది. తానిచ్చిన ఆధారం సంగతి అసలు మాట్లాడకుండా సీడకు ముందూ వెనక ఉన్నాయని నేనే అన్నట్లు ధ్వనింపజేసి Preaching మొదలెట్టారాయన అందరు మహాకవుల్లాగే నిరంకుశత్వంగా.

—తోట చంద్రశేఖరరెడ్డి,
ప్రొద్దుటూరు.

అనుసరణా?

1980 మే నెల జ్యోతిలో ప్రచురింపబడిన పి. ఎస్. నారాయణగారి "కొండంత దీపం" కథ 21-12-79 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురింపబడిన శ్రీ తులసి బాలకృష్ణగారి 'వయసు—మనసు' కథకి పూర్తిగా అనుసరణ—మరో విధంగా చెప్పాలంటె కాపీ అనవలసివస్తుంది. వ్యక్తులపేర్లు, స్థలాలపేర్లు మార్చి, ఆ కథలో కాలినడక అని వుంటే ఇందులో స్కూటర్‌గా మార్చారంతే. రచయిత సమాధానం ఇవ్వగలరు.

—రాధికారాణి, హైదరాబాదు.

పి. ఎస్. నారాయణగారి జవాబు

జ్యోతి సంపాదకులకు

మీరు వ్రాసిన 30-4-80 లేఖ చాలా థ్రిల్ కలిగించింది. 150కు పైగా కథలు వ్రాసిన నాకు ఇలాంటి ఉత్తరం రావడం యిదే ప్రథమం. 21-12-79 ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురించబడిన శ్రీ తులసి బాలకృష్ణ గారి 'వయసు—మనసు' కథను ఇప్పుడే చదివాను. కొన్ని పోలికలు వున్నమాట వాస్తవమే. హైద్రాబాద్ పాఠకురాలి అపోహకు ఆశ్చర్యపడనవసరంలేదు. నా డైరీ ప్రకారం 'కొండంత దీపం' కథను మీకు 14-5-79 న పంపాను. మీరా కార్డు కూడా చూడవచ్చు. అందువలన 21-12-79న ప్రచురింపబడిన శ్రీ తులసి బాలకృష్ణగారి కథను కాపీ కొట్టాను అనే ప్రసక్తేలేదు.

నాకు శ్రీ తులసి బాలకృష్ణగారితో పరిచయం లేదు గనుక ఎప్పుడైనా ఆయనతో ఈ కథను గురించి చర్చిందాను అనుకోవటం కూడా తప్పే. ఇద్దరికీ కథ వ్రాయటానికి ఒకే ప్లాటు

దొరకటం చాలా కాకతాళీయంగా జరిగిందన్న మాట—చాలా విచిత్రమయిన విషయం.

—పి. ఎస్. నారాయణ, హైదరాబాద్.

నవల నచ్చింది

శోభన్‌బాబు ముఖచిత్రంతో వెలువడిన జూన్ నెల "జ్యోతి" ఎంతో ఆకర్షణీయంగా వుంది. "సులక్షణ", అగ్నిశిఖ", "జ్ఞానోదయం", "ముక్కుపుడక" కథలు చాలా బాగున్నాయి. "ప్రేమసింహాసనం", "మీర్గా" సీరియల్స్ చాలా ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ నెల నవలానుబంధంలో పాలకోడేటి సత్యనారాయణరావుగారి "కదలి అంచు కాపురం" ఎన్నిసార్లు చదివినా విసుగుపరచని రీతిలో ఉన్నది. దాస్‌బాబుగారి "అల్లాఉద్దీన్ అభినవదీపం" చాలా బాగున్నది.

—గమిని రామలక్ష్మి, అత్తిలి.

శోభన్ ముఖచిత్రంతో వెలువడిన జ్యోతి ఆకర్షణీయంగా వుండి చూడముచ్చటగా వుంది. ఈ నెల జ్యోతి చదివిన తరువాత ఇంతమంచి పత్రికను ఇంతకుముందు చదవలేదేనని బాధ కలిగింది. ఈ నెం కథలలో 'అగ్నిశిఖ' 'తూరుపుదారి' 'తపస్సు' కథలు చాలా బాగున్నాయి. 'బీనాదేవి' నవల ప్రారంభిస్తారని తెలిసి చాలా సంతోషించాము. ఈ నెల నవలానుబంధం 'కదలి అంచు కాపురం' చాలా బాగుంది.

—యు.యు. ఉరుకుందు, కె. గోవింద్, ఎమ్మిగనూరు.

ఆంధ్రదేశంలో 'దివ్యజ్యోతి'లాగ వెలిగే 'జ్యోతి' సచిత్ర మాసపత్రిక మొట్టమొదటిగా మా ఊరికి వచ్చిన సందర్భంలో అభినందనలు. శోభన్‌బాబు ముఖచిత్రంతో వెలువడిన జూన్ సంచిక చాలా ఆకర్షణీయంగా వున్నది. కథలు, మినీకథలు చాలా బాగున్నాయి. బహుమతి పొందిన కవితలు కూడ బాగున్నాయి. కార్టూన్లు కడుపుబ్బ నవ్వించాయి.

కె. గోవింద్, బూర్లి.

సాంస్కృతిక విశేషాలు

సంస్మరణ సభ

ఏప్రిల్ నెల ఇరవై ఎనిమిదవ తేదీన మైలాపూర్‌లోని గోఖలే శాస్త్రి ఇన్స్టిట్యూట్ హాల్లో మహాకవి ఆలూరి బైరాగి సంస్మరణ సభ జరిగింది. కీర్తిశేషులు దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రిగారి ఛాయాచిత్రాన్ని అధ్యక్షస్థానంలో వుంచి డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు సభాకార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా శ్రీ కె. జి. కృష్ణమూర్తి కార్యదర్శి నివేదికను చదివారు. శ్రీ కృష్ణశాస్త్రిగారి గౌరవ సంపాదకత్వంలో ప్రచురితమైన ఆలూరి బైరాగి సంస్మరణ సంచికను అవిష్కరించి గోపాలరెడ్డిగారు, శ్రీ గురజాడ వేంకట అప్పారావు పంతులుగారి రచనల ప్రథమ ముద్రణ ప్రకాశన బాధ్యతలను స్వీకరించిన పత్రికా రచయిత, సాహిత్య విమర్శకులు శ్రీ సెట్టి ఈశ్వరరావుగారికి సంచిక మొదటి ప్రతిక బహూకరించారు. బైరాగిగారి ఆత్మీయమిత్రులైన నన్నపనేని సుబ్బారావుగారికి సంచిక రెండవ ప్రతి బహూకరింపబడింది. బైరాగి కవితను అనేక దృక్కోణాల నుంచి అధ్యయనం చేసిన ప్రముఖుల రచనలు యీ సంచికలో కూర్చబడ్డాయి. సంస్మరణ సంచిక కోసం కీ.శే. కృష్ణశాస్త్రి రచించిన వ్యాసాన్ని రచయిత, జర్నలిస్టు శ్రీ ఈశ్వర్ చదివి వినిపించారు.

అనంతరం పాలగుమ్మి పద్మరాజు, ఆరుద్ర, ఏ. ఎస్. రామన్, చల్లా రాధాకృష్ణశర్మ, డా॥ బెజవాడ గోపాలరెడ్డి, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ప్రభృతులు బైరాగి వ్యక్తిత్వాన్ని గురించీ, ఆయన కవితా వైశిష్ట్యాన్ని గురించీ ప్రసంగించారు. □

కళాశాల విద్యార్థుల కథల పోటీలలో
మొదటి బహుమతి పొందిన కథ

రెండు జడల సీత

మంజుబాబు ఎం.బి.బి.ఎస్., (ఫైనల్)
గాంధీ మెడికల్ కాలేజీ, హైదరాబాదు.

వెన్నెల్లో వెల్లకిలా పడుకుని పున్నమి చంద్రుణ్ణి చూస్తూ ఆలోచిస్తున్నాడు చంద్రం. నీలాకాశంలో చుక్కలు గతంలోని తియ్యని అనుభవాల్లా మిణుకు మిణుకుమంటు న్నాయి.

"పాపం! ఆ అమ్మాయిని యెలాగైనా యిబ్బంది పడకుండా కాపాడాలి, తను ఏమైనా ఫర్వాలేదు."

ఆ అమ్మాయి జ్ఞాపకానికి వచ్చిన వెంటనే ఆతనికి చంద్రబింబానికి బదులు సరిగ్గా గుర్తు పట్టలేని వో అందమైన ముఖం కనబడ్తోంది. ఆమె హేమ్మాలినిలా వుంటుందా, వాణిశ్రీలా వుంటుందా? జయప్రదలా వుంటుందా, జయ సుధలాగుంటుందా, హైపిస్టు గీతలాగుంటుందా అన్నది ఎంతసేపు ఆలోచించినా తేలడంలేదు. ఆఖరికి వో విషయం గుర్తొచ్చింది. ఆమె పేరు సీత గాబట్టి రెండు జడలుండొచ్చు. (ఎక్కడో చదివిన జ్ఞాపకం) అయితే రెండు జళ్ళ సీత యెలా వుంటుంది? తనకు తెలిసినంతవరకు రెండు జడలున్న అమ్మాయిలని గుర్తు తెచ్చు కొనే ప్రయత్నం చెయ్యసాగాడు. ఎవ్వరూ అంత బాగున్నట్లు తోచడంలేదు. లేదు ఈ రెండుజెళ్ళ సీత అందరికన్నా బావుంటుంది అనుకొన్నాడు. యిలా అనుకోడానికి వెనకాల వో కథ వుంది.

ఏవిటంటే....

ఎప్పటిలా సాయంత్రం ఆఫీస్ నుంచి వచ్చాక చంద్రానికి రూమ్ తలుపు తీసేసరికి తలుపు సందుగుండా పడవేసిన వో ఉత్తరం కనిపించింది. తను యీ రూమ్‌కు వచ్చి వారం రోజులైనా కాలేదు. యింకా ఎవరికీ అడ్రసు గూడా యివ్వలేదు, ఎవరు రాసుంటారు చెప్మా అని ఆలోచిస్తూ చింపి చదవసాగాడు.

డియర్ మధూ,

నేను శనివారం సాయంత్రం ఆరున్నర బస్సులో అక్కడికి రాగలను. నాకు ఆదివారంనాడు వో ఎగ్జామ్ ఉంది. తప్పకుండా రూమ్‌లోనే ఉండగలవు. వీలైతే బస్టాండ్‌కు రాగలవు.


ఉంటాను,
సీత.

అంతా చదివాక ఆశ్చర్యపోయి అడ్రసు చూశాడు చంద్రం. అది మధుసూదనరావు అనే పేరుతో వుంది. అప్పు డతనికి గుర్తొచ్చింది తను రూమ్‌లోకి రావడానికి పూర్వం ఈ గదిలో మధుసూదనరావు అనే వ్యక్తి ఉండే వాడనీ, అతను ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతేనే తనకి గది దొరికిందనీ. వెనక అడ్రసుందేమోనని వెదికితే లాభం లేకపోయింది. ఆఖరికి పోస్టల్ వాళ్ళ ముద్ర కూడా సరిగ్గా గుర్తు పట్టేట్లు లేదు.

అదీ కథ. అప్పట్నుంచీ అదే ఆలోచన.

శనివారం అంటే యింక ఒక్క రోజే వుంది ఎలా? ఏం చేయాలి?

చేతివ్రాత చూస్తే గుండ్రంగా ముత్యాల్లా





వుంది కొబట్టి అది రాసినమ్మాయి అందంగా వుండక తప్పదనుకొన్నాడు ఎక్కడో చదివిన విషయాన్ని గుర్తుకి తెచ్చుకొంటూ.

పాపం అతను వెళ్ళిపోయిన సంగతెలీక ఈ అడ్రసుకు ఉత్తరం రాసినట్లుంది. ఆ అమ్మాయిమీద బోల్డు జాలిపడి పోయాడు చంద్రం.

ఒంటరి ఆడపిల్ల ఆ రాత్రి యెక్కడకెళ్తుంది? అందుకని తప్పకుండా తనే ఆమెకాతిధ్య మివ్వాలి. యీ నిర్ణయానికి వచ్చాక సీత యెలా వుంటుందోనని ఊహించడం మొదలెట్టాడు.

రేపే శనివారం....సాయంత్రం 'ఆమె' వస్తుంది. పొద్దున్నే లేచి గదీ అదీ శుభ్రం చేయాలి మరీ అసహ్యంగా వుంది అనుకొన్నాడు బలవంతంగా కళ్ళు మూసుకొంటూ చంద్రం. అతని కసలు నిద్ర రావడంలేదు.... ఏవేవో ఆలోచనలు.

అఖరికి కలత నిద్ర....దాంట్లో ఓ కల. ఓ అందమైన అమ్మాయి లోయలోకి దూకబోతూంటే తను రక్షించినట్లూ, ఆ అమ్మాయి అమాంతం తన్తో కలిసి డ్యూయెట్లు పాడుతూ కాశ్మీర్, బెంగుళూర్, ఊటీ... అక్కణ్నించి కోఠీ కొచ్చేసరికి ఓ నల్లి కుట్టి అతని కలలకు అంతరాయం కలిగించింది. లేచి కళ్ళు నులుముకుని బోల్డు సిగ్గు పడిపోయాడు చంద్రం. ఆఫీసుకు లీవు పడేసి ఆ రోజంతా గదిని అందంగా సర్దుతూ సాయంత్రం కోసం యెదురుచూడసాగాడు.

అతనికి ఆ రోజు కాస్త ఆలస్యంగానే సాయంత్రమయింది. శుభ్రంగా తయారై బస్టాండ్ కెళదామని బయల్దేరాడు.

అప్పుడే, ఎవరో కావాలని పంపించినట్లు ఓ నల్లపిల్లి "అప్పి మంచి శకునములే, కన్యాలాభ సూచనలే. లలా లలలా" అని పాడూపోతున్న చంద్రాన్ని ఆశ్చర్యంగా చూస్తూ అతని దారికి తొంభై డిగ్రీల కోణం చేస్తూ వెళ్ళిపోయింది.

మామూలుగా అయితే చంద్రం యివన్నీ పట్టించుకొనే రకం కాదు. కాని వెళ్ళేది అలాంటిలాంటి పని కాదు గాబట్టి గట్టిగా నిట్టూర్చి పిల్లుల్నీ, పిల్లుల్ని పెంచుకొనేవాళ్ళనీ తిట్టుకుంటూ రాబోయే 'వ్యక్తి' కోసం ఆ గదిలోనే ఉండి నిరీక్షిస్తే బాగుంటుందని తీర్మానించుకొన్నాడు మనసులో, యింకా ఏవేవో ఆలోచిస్తూ.

అరున్నరైంది. ఆరూ నలభై—బస్సు స్టాండునుంచి నడిచివచ్చినా మహా అయితే పదిహేను నిమిషాలకంటే తీసుకోదు ఇంకా. రాలేదేవిటీ అని ఎదురుచూస్తున్నాడు.

సెకన్లు నిమిషాలౌతున్నాయ్. నిమిషాలు.... అయిదూ....పది....అలా ఆగకుండా పరుగెత్తున్నాయ్.

చంద్రం ఆలోచిస్తున్నాడు. ఒకవేళ ప్రయాణంగాని కాన్సిలయ్యిందో? బస్సు దార్లో చెడిపోయిందో? పరీక్ష పోస్టుపోన్ అయిందో? కొంపదీసి ఆక్సిడెంట్ గాని....

టక్....టక్....టక్....తలుపుమీద వేళ్ళతో కొడుతున్న చప్పుడు. లేచి చూశాడు. బయటెవరో కొత్త వ్యక్తి నిల్చుని వున్నాడు భుజాన ఎయిర్‌బ్యాగ్‌తో.

ఒహవేళ ఆ అమ్మాయివాళ్ళ తాలూకు కాదు గదా!

"ఎవరు....ఎవరు కావాలండీ?"

మధుసూదనరావని ఒకతను యిక్కడ...."

"ఆయ నీ గది ఖాళీచేసి వెళ్ళిపోయారండీ ట్రాన్స్‌ఫరై తేను. పది రోజుల క్రితమే నే వొచ్చాను దీన్లోకి."

"అలాగా" అని "అయితే ఆ వుత్తరమ్మొక్కా అందుండదు" గొణుక్కుంటూ వెళ్ళిపోన్నా డతను.

"ఇంతకీ మీ పేరు?" అడిగాడు చంద్రం అతని వెనకాల యెవరన్నా ఆడపిల్ల ఉందేమోనని తొంగిచూస్తూ.

"సీతాపతి" చెప్పేసి వెళ్ళిపోయాడతను.

పాలిపోయిన మొహంతో గాలి తీసేసిన బెలూన్లా కుర్చీలో కూలబడిపోయాడు చంద్రం నిస్పృత్తువగా. ఇంకా ఓ రూపాన్నేర్పరచుకొనని రెండు జడల సీత అతని ఊహల్లోంచి చెదిరిపోసాగింది. □

ఎవరెవరు ఎందుకోసం రాస్తున్నారు?

నే నెందుకు రాస్తున్నాను?

(పలువురు రచయితల వ్యాసాలు)

సంకలనకర్తలు: భరాగో-అత్తిలి నరసింహారావు.

ప్రతులకు: నవజ్యోతి పబ్లికేషన్స్, ఏలూరురోడ్డు, విజయవాడ.

వెల: పదిరూపాయలు

పదిహేను మంది ప్రముఖ రచయితలు "నే నెందుకు రాస్తున్నాను"అనే విషయంపై వ్రాసిన వ్యాసాల సంకలనం ఈ పుస్తకం.


ఇందులో తెలుగు సాహిత్యరంగంలో తమదైన ఒక స్థానాన్ని ఏర్పరచుకున్నవారూ, ఇంకా రాస్తున్నవారూ, సాహితీ ఉపన్యాసం చేసినవారూ వ్రాసిన వ్యాసా లున్నాయి. 1965 ప్రాంతాలలో రచయితలు కొంతమంది మిత్రుల మధ్య ముఖతః వినిపించినవే (చాలా వరకు) ఈ వ్యాసాలని సంకలనకర్తలు పీఠికలో చెప్పారు. దాదాపు ఈ వ్యాస రచయితలందరూ విశాఖపట్నం నీరు తాగి, గాలి పీల్చినవారే.

"నే నెందుకు రాస్తున్నాను?" అనే ప్రశ్నకు సమాధానం యివ్వడం అనుకున్నంత తేలిక కాదు. ప్రారంభంలో ఏ రచయితా తను ఎందుకు రాస్తున్నా నన్న విషయం ఆలోచించి రాయడు. రాయగా రాయగా సాంఘిక స్పృహ ఉన్న రచయిత తప్పక ఆలోచిస్తాడు. ఈ విషయమే చాలామంది ప్రముఖ రచయితల వ్యాసాలలో కూడా వెల్లడైంది.

చాలావరకు వారు ఎందుకు రాస్తున్నారో భేషజాలకు పోకుండా చిత్తశుద్ధితోనే వ్రాశారని చెప్పడానికి సందేహంలేదు.

మొదటి వ్యాసంలో శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు "నన్నడిగితే కథ వ్రాయడం కూడా ఒక వ్యసనం, ఒక రకమైన ఆత్మన్యూనతా భావాన్ని కప్పిపుచ్చుకుందుకు రాసేనేమోననిపిస్తుంది. ఆదిలో గొప్పకోసమూ, సరదా కోసమూ, అచ్చులో పేరు చూసుకోవడం కోసమూ రాసేను, కాల్పనిక జగత్తులో విహరించడంలోని థ్రిల్ కోసమే రాసేను"అంటూ నిస్సంకోచంగా, నిజాయితీతో తాను ఎందుకు రాస్తున్నారో చక్కగా వివరించేరు. "సాంఘిక న్యాయాన్ని కూర్చాలని నేను గట్టిగా వాంఛిస్తా" నని అంటూ సాహిత్యానికి ఒక ప్రయోజనం ఉందనే నమ్మకంతో వ్యాసాన్ని ముగించారు.

"రాయడం మొదలుపెట్టిన చాలా రోజుల వరకూ ఈ ప్రశ్నకు సమాధానం నాకు తెలియదు. అంతే కాదు అది తెలుసుకోవాలని ఇచ్ఛ కూడా ఉండేది కాదు" అన్నారు శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావుగారు నిస్సంకోచంగా. "మనం రాసేది మనకోసం కాదు. పాఠకులకోసం అని



దృఢంగా నమ్ముతాను" అన్నారు. మానవ జీవితాన్ని సజీవంగా చిత్రించేందుకు, జీవితాలను అర్థం చేసుకొనే అన్వేషణలోనే ఉన్నానంటూ ముగించారు.

"నిజం చెప్తున్నాను—సరదాకి, నలుగురిలో పేరుకి వ్రాశానప్పుడు" అంటూ తను వ్రాయడం ఎందుకు ప్రారంభించారో చెప్పారు గొల్లపూడి మారుతీరావుగారు. తను రాయాలనుకున్న మంచి రచన యింకా బయటకు రాలేదనీ అందుకే యింకా రాస్తున్నాననీ అన్నారు గొల్లపూడి.

"ఎందుకు నేను రచన చేస్తాను. ఎందుకు కొందరు రచన చెయ్యరు? అందుకే నేను రచన చేస్తాను" అంటూ తమ వ్యాసాన్ని ప్రారంభించారు ప్రముఖ చిత్రకారులూ, రచయితా అయిన సంజీవ్‌దేవ్‌గారు. "చిత్ర రచన నాకోసం, రచనలు యితరులకోసం చేస్తాను" అన్నారు. తాను ఎందుకు రాస్తున్నదీ చక్కగా ఒక చిత్రం గీచినట్టు అందంగా మనసుకు హత్తుకొనేలా చెప్పారు. మానవతకు నవతను అందించేందుకు రాస్తున్నానన్నారు. ఈ వ్యాసం చదువుతుంటే బుర్రలో ఎన్నో ఆలోచనా తరంగాలు ఉవ్వెత్తున లేస్తాయి. అన్ని వ్యాసాలకంటే నన్ను యెక్కువగా ఆలోచింప చేసిన వ్యాసం ఇది.

శ్రీ తంబుగారు "నే నెందుకు రాస్తున్నాను" అని కాకుండా "నేను ఎందుకు రాశాను" అనే విషయంమీద తమ సహజ హాస్య, వ్యంగ్య ధోరణిలో చదువరులకు గిలిగింతలు పెట్టేలా రాశారు.

"నే నెందుకు తింటున్నాను? నే నెందుకు గడిస్తున్నాను! నే నెందుకు పెళ్ళి చేసుకొని సంసార తాపత్రయంలో పడ్డాను?" అందుకనే రాస్తున్నాను"అన్నారు శ్రీ బలివాడ కాంతారావు గారు.

శ్రీ కీర్తిప్రియ తాము ఎందుకు రాస్తున్నారో సూటిగా చెప్పలేదు. తాను రాసిన ఎన్నో కథల సారాంశాన్ని యిస్తూ చాలా పెద్ద వ్యాసం వ్రాశారు. నేను ఎందుకు రాస్తున్నాను అన్న ప్రశ్నకు ఈ వివరణ అంతా అనవసరం అనిపిస్తుంది.

శ్రీ జ్యేష్ఠగారు కూడా, అసలు విషయాన్ని వదిలి సంఘ జీవితాన్ని గురించీ, పాశ్చాత్య రచయితల గురించీ, ఈ దేశపు రచయితల రచనల గురించీ చెప్పారు. రచనలు ఎందుకు చెయ్యాలి అనే విషయం గురించి ఎక్కువగా చెప్పారేమో ననిపిస్తుంది.

శ్రీ అంగర వెంకటకృష్ణారావుగారు—

"ఒక విషయం నా గుండెకి తాకి నాలో ఒక భరించరాని బాధ కలిగినప్పుడు, బాధనే ఒక పద్యంగానో, కథగానో, నవలగానో రూపొందించి నా మనసు తేలిక చేసుకుంటా" అన్నారు.


పూసపాటి కృష్ణంరాజుగారు "ఈ ప్రశ్న ప్రతిరచయితా ఎప్పుడో ఒకప్పుడు వేసుకునే ప్రశ్నే"నన్న నిజం చెప్పారు. గురజాడ వారి రచనలు వారిని రచన చెయ్యడానికి పురికొల్పాయని అన్నారు. మనుషులు బాగుపడాలనే రాశానన్నారు.

"నా చిత్త విస్ఫూర్తి ప్రసాదించిన భావ చిత్రణల ప్రతిబింబాలే ఆ నాటి రచనలు" అంటారు శ్రీ పసూనాగారు.

అంగర సూర్యారావుగారు తాను ఎందుకు రాస్తున్నదీ" సూటిగా చెప్పలేదు. పైగా ఈ నాటి రచనలు ఎంత పలాయనవాదంతో కూడుకున్నవో చెబుతూ ఈ మధ్య తాను చదివిన ఒక నవల గురించి చెప్పారు. "చెయ్యి తిరిగిన రచయితలలో కూడా పెద్దలోపం కనిపిస్తుంది" అంటూ ఈ నాటి సాహిత్యంలోని లోపాలను ఎత్తి చూపించారు. విషయం పక్కదారి పట్టినట్టు నాకు అనిపించింది.

డా॥ కె. వివేకానందమూర్తి "తెలుగు అక్షరాలు అందంగా ఉంటాయి. తియ్యగా ఉంటాయి" అందుకే రాస్తున్నానంటారు. మొదట్లోనేకాదు—రచయితగా పేరు తెచ్చుకున్న తర్వాత కూడా ఆయన ఒక బాధ్యతతో రచనలు చేస్తున్నట్టు అన్పించదు, వ్యాసం చదివిన వారికి—

శ్రీ కాళీపట్నం రామారావుగారు, చదవగా చదవగా నాకూ రాయాలని బుద్ధి పుట్టింది అన్నారు. కాళీపట్నం రామారావుగారు ఏ



ప్రయోజనం లేకుండా కేవలం కీర్తికాంక్షతోనో, మరెందుకో రాయరనే విషయం ఆయన కథలు చదివిన వారికి తెలుస్తుంది. అయినా కొన్ని ప్రయోజనంలేని కథలు కూడా రాశానన్నారు వారు. ఈ అస్తవ్యస్తమైన సమాజంలో ఎటు వెళ్ళాలో తెలియని నేను మరొకరికి ఏం చెప్పగలను అన్నారు. అలా చెప్పడంలోనే వారి నిజాయితీ కన్పిస్తున్నది.

చివరి వ్యాసం రాచకొండ విశ్వనాథశాస్త్రి గారిది. కొత్తగా నడక నేర్చుకునే పిల్లవాడు "నడక ఎందుకు?" అని ఆలోచించడు అన్నారు. కాని పెద్ద అయినకొద్దీ "ఈ నడక ఎందుకు? ఎక్కడికి?" అన్న ప్రశ్న ఎదురౌతుందన్నారు. అలాగే మొదట మొదట ఇంట్లోని పెద్దలు తన గొప్పతనాన్ని గుర్తించాలనీ, ఆ తర్వాత తన భార్య మెప్పు పొందేందుకూ, ఆమెను సంతోషపెట్టేందుకు రాశానన్నారు. కాని ఆ తర్వాత ఆయన ఎందుకు రాసిందీ నిజాయితీతో, నిరాడంబరంగా చెప్పారు. రాచకొండ ఎందుకు రాస్తున్నారో ఆయన రచనలు చదివిన వారికి అర్థం అవుతుంది. "ప్రతి రచయిత కూడా రెండు మూడు లేక ఎన్నో కొన్ని మజిలీలు చేసి చివరికి ఈ మంచి చెడ్డల క్రాస్‌రోడ్స్‌కి వస్తాడనీ, రాశతప్పదనీ నేను నమ్ముతున్నాను. అప్పుడు అతను పాఠకుడికి తను ఏ మార్గం చూపించాలో నిశ్చయం చేసుకుంటాడు. ఆ దారంట వెళ్ళమని అందరికీ చెప్తాడు" అంటూ తను ఎందుకు రాస్తున్నదీ చెప్పకనే చెప్పారు రాచకొండ.

నేడు పాఠకుల సంఖ్య పెరిగింది. ఎందరో కొత్త రచయితలు వస్తున్నారు. ఈ వ్యాసాలు కొత్త రచయితలకు ఉపయోగకరంగా ఉంటాయనడంలో సందేహంలేదు. పాఠకులు ఇలాంటి వ్యాసాలవల్ల రచయితలను దగ్గరగా చూడగలరు.

ఈ వ్యాసాలని సేకరించిన వారినీ (సంకలన కర్తలను) ప్రచురించిన వారినీ అభినందిస్తున్నాను. ఇది సాహిత్య ప్రియులందరూ తప్పకుండా చదవవలసిన పుస్తకం. అయితే సంకలనకర్తలని ఒక ప్రశ్న అడగకుండా ఈ సమీక్షని ముగించలేకపోతున్నాను. ఈ పుస్తకంలోని వ్యాసకర్తలందరూ రచయితలే. ఒక్క రచయిత్రి కూడ తానెందుకు రాస్తున్నారో వివరించలేదిందులో. ఇలా ఎందుకు జరిగిందో తెలియదు. రచయిత్రులు సంకలన కర్తల అభ్యర్థనని తిరస్కరించారా? లేక సంకలనకర్తలే రచయిత్రులను విస్మరించారా?

—ఎస్. డి.



25 సీరియల్

సుధీర్ అప్పుడే కోర్టునుంచి వచ్చాడు. వస్తూనే అతను స్వప్నని పిలవలేదు. కోటు స్టాండుమీద పడేసి టై విప్పి పడక్కుర్చీలో కూర్చున్నాడు. స్వప్న అతనికి కాఫీ తెచ్చి యిచ్చింది. కళ్ళు మూసుకుని, దీర్ఘాలోచనలో వున్నట్టున్న అతను స్వప్న అలికిడిని గమనించలేదు కాబోలు కళ్ళు తెరవలేదు.

"ఇదుగో కాఫీ!" అంది స్వప్న. అతను వులిక్కిపడినట్టుగా కళ్ళు తెరిచాడు. కాఫీ అందిస్తున్న స్వప్నని క్షణంసేపు తదేకంగా చూస్తూండిపోయాడు.

"ఏమైంది?" అంది.

"ఏం కాలేదు" వెంటనే అన్నాడు.

"మరి ఎందుకలా వున్నారు?" అతని ముఖంలో భావాలు చదవటానికి ప్రయత్నిస్తూ అంది.

అతను చిన్నగా భుజాలు కుదిపి, కాఫీ కప్పు అందుకున్నాడు. స్వప్న క్షణంసేపు అతనేదయినా చెబుతాడేమోనని ఎదురు చూసింది. అతనేం చెప్పలేదు.

స్వప్న వెళ్ళి టేబిల్‌మీద వున్న అతని ఫైల్స్ సర్దసాగింది. మధ్య మధ్యలో క్రీగంట అతన్ని గమనిస్తూనే వుంది. అతను కాఫీ తాగుతున్నాడు కానీ ప్రతిరోజులా లేడు. ఒకే గుక్క తాగి, ఏదో ఆలోచిస్తున్నట్టుగా అలాగే కూర్చుండిపోయాడు. 'కాఫీ చల్లారిపోతోంది'. స్వప్న గుర్తుచేస్తే మళ్ళీ వులికిపాటుగా చూసి మళ్ళీ తాగసాగాడు. అతను స్నానం జేసాడు. భోజనం దగ్గర కూడా అలాగే వున్నాడు.

"ఏమైంది?" మళ్ళీ అడిగింది స్వప్న.

"ఏం కాలేదు" ముక్తసరిగా అన్నాడు.

స్వప్న తల దించుకుంది. అతను కేసువిషయమైనాసరే, ఏదయినాసరే మనసుకి కాస్త బాధ అనిపిస్తే తనకి చెప్పేస్తాడు. కానీ యీరోజు చెప్పటంలేదు. ఎందుకని? ఏమయింది? స్వప్న చిరాకుపడలేదు. అసహనం చూపించలేదు. మౌనంగా వుండిపోయింది. ఇలాటి పరిస్థితుల్లో మౌనమే శరణ్యం! రాయిలాటి కఠినమైన మౌనం! మంచుముద్దలాటి అతి శీతలమైన మౌనం! ఆ మౌనం వహించటానికి సహనం చూపించటానికి చాలా శక్తి కావాలి. ప్రస్తుతం స్వప్నకి మౌనమే, సహనమే ఆశ్రయం అయినాయి.

స్వప్న వంటయింటి తలుపు వేసి వచ్చేసరికి సుధీర్ మంచంమీద పడుకుని, తలక్రింద చేతులు పెట్టుకుని, సీలింగ్‌కేసి చూస్తూ దీర్ఘాలోచనలో మునిగివున్నాడు. స్వప్న వచ్చి మంచంమీద అతని దగ్గరగా కూర్చుంది.

"పడుకో!" అన్నాడు అతను.

"ఊహూ. నిద్ర రావటంలేదు."

"ఎందుకని?"

"ఏమో తెలియదు."

క్షణంసేపు స్వప్నని తదేకంగా చూసిన అతను స్వప్న చేయిబట్టి లాగాడు. ఎప్పటిలాఅతని పక్క దిండుమీద స్వప్న తల ఆనేట్టు లాగలేదు. అతని గుండెల మీద తల ఒదిగి వుండేలా లాక్కున్నాడు. స్వప్న కళ్ళు మూసుకుని అలాగే వుండిపోయింది.

స్వప్న జీవితం చాలా విచిత్రమైన అనుభవంగా గడిచిపోతోంది. చాలామందికి బ్రతుకు, ఏదయినా కలతలు వుంటే, పగలు సందడిగా వాటిని మరిచేట్టుగా, రాత్రి ఒంటరితనంతో అవన్నీ గుర్తుకు వస్తూ భయంకరంగా గడవటం సహజం. కానీ స్వప్నకి అలా కాదు. రాత్రివేళ ఎంతో ఆనందంగా, ఎంతో ధైర్యంగా ముల్లోకాలని ఒక్క కంటిచూపుతో ఎదిరించగలను అనేటంత మనస్థిమితంగా అనిపిస్తుంది. దానికి కారణం సుధీర్ పక్కన వుంటాడు. అతని లాలింపు మాటలతో, ప్రేమ సంభాషణలతో అతను పంచియిచ్చే శారీరక సౌఖ్యంతో జీవితం ఎంతో ఆనందంగా స్వర్గతుల్యంగా గడుస్తుంది. ఉదయం అవుతుంటే చాలు స్వప్న ఆనందం, మంచుతెరలా విడిపోయి మాయమవుతుంది. నిత్యజీవితంలో అందరి యెదుటా, తను దోషిగా, వారు నిర్దయగా చూపులతో, మాటలతో చెండాడుతుంటే వాటి బారినుంచి ఎదుర్కొని తనని తాను నిలవరించుకోవటం శక్తికి మించిన పని అవుతుంది. సుధీర్ యిచ్చే ప్రేమ బలమే తనని యింత మొండిదాన్ని చేసిందేమో! లేకపోతే తను బ్రతకటమే అసంభవం అయేది.

స్వప్నకి రాను రాను తన జీవితం రెండు రకాలుగా విభజించబడటం అలవాటయిపోయింది. సుధీర్ యెదురుగా వున్నపుడు, సంతోషంగా, ఆనందంగా, మన

స్థైర్యం గలదానిలా మసలటం, అతను లేనపుడు దిగులుగా, బాధగా కృంగిపోవడం।

స్వప్నకి అతని గుండెలమీద తల ఆనించి పడుకున్నప్పుడు యింకే బాధా గుర్తు రాలేదు। అది ఒక అనిర్వచనీయమైన సుఖం।

"స్వప్నా!" సుధీర్ పిలిచాడు.

"ఊ!"

"నేను నీకు ఓ శుభవార్త చెప్పబోతున్నాను!
మనం యీ యిల్లు మారుతున్నాం!"

"ఏమిటీ—" స్వప్న హఠాత్తుగా లేవబోయింది.

కానీ సుధీర్ స్వప్నని లేవనీయలేదు. అతని చేతులు స్వప్న తలని తన గుండెలకి అదిమిపెట్టి వుంచినాయి. అతను చెప్పసాగాడు.

"స్వప్నా! యీ యిల్లు నాదికాదు. అమ్మది! అమ్మ పేరుమీద వుంది. అమ్మ యీ యింట్లో వుండనప్పుడు, నేను మాత్రం వుండటం మాత్రం ఏం భావ్యం?" అతని కంఠం కంపించింది.

"ఆమె అలా అన్నదా?"

"అమ్మా! ఊహూ! అనలేదు. ఎంత మంచిది కదూ! నా కింతవరకూ, ఆ ఆలోచనే రాలేదు. మామయ్య అన్నాడు. అమ్మని యింట్లోంచి తరిమేసి నేను హాయిగా వున్నానుట. స్వప్నా, నిజం చెప్తున్నాను, అమ్మ నన్ను క్షమిస్తుందని, ఎప్పటికైనా తిరిగి వస్తుందని నాకు అపరిమితమైనఆశ!ఆంతేగానీ,యింకేవుద్దేశ్యం నాకులేనేలేదు!"

స్వప్న మౌనంగా వింటుండి పోయింది. సుధీర్ సరిగ్గా చెప్పటంలేదు. మేనమామ, యింకా పరుషంగా చాలా మాటలు అనే వుంటాడు! లేకపోతే అతను యింతగా బాధపడడు.

'అతనికి ఏమని చెప్పాలి? ఏమని ఓదార్చాలి?'

స్వప్నకి అంతుబట్టలేదు. ఆ క్షణంలో నిస్సహాయంగా అనిపించింది! ఈ బాధ తన మూలంగానే కదా అనే ఆలోచన నిలువెత్తు జ్వాలలా స్వప్నని చుట్టుముట్టింది.

"నేను యిల్లు చూసివచ్చాను. ఎల్లుండి మనం మారుతున్నాం. అమ్మకి యీ యింటి తాళంచెవులు ఎంత త్వరగా యిస్తే తప్ప నాకు మనశ్శాంతి వుండదు!"

స్వప్నకి ఆ క్షణంలో ఒక్క విషయం మాత్రం బాగా అర్థమైంది! తనకి బాధ కలిగితే సుధీర్ తనని ఓదారుస్తాడు. నచ్చచెబుతాడు. ధైర్యం నూరిపోస్తాడు. అతనికి బాధ కలిగితే ఒంటరిగా అనుభవిస్తాడు. అతని దరిదాపులకి కూడా తనని రానీయడు.

26

సుధీర్ స్వప్న కొత్త యింట్లోకి మారారు. ఫ్లాట్ సిస్టమ్‌తో కట్టిన యిళ్ళలో ఒకటి అది! చుట్టు ఎనలేని సందడి! కానీ మన తలుపులు మూసుకుంటే మన యిల్లే మనకి ఒక ప్రపంచంగా వుంటుంది.

సుధీర్, తన లా బుక్స్, ఫైల్స్, బట్టలు తప్ప, ఒక చిన్న సామాను కూడా ఏం ముట్టుకోలేదు. యింటి తాళంచెవులు డ్రైవరుచేత తల్లికి పంపించేసాడు. కారు అతని సంపాదనతో కొనుక్కున్నదే!

సుధీర్ స్వప్నని బజారుకి తీసుకువెళ్ళాడు. యింట్లో యేవేవి ముఖ్యంగా కావాలో అతనికి తెలియవు! షాపులో యిద్దరూ వాదించుకునేవారు! స్వప్న చెప్పిన సామాను క్లుప్తంగా వుండేది! సుధీర్‌కి, చూసినవన్నీ కావాలని అనిపించేది. ఒక సోఫాసెట్ చూసాడు! అది కొనటానికి ఆర్డరు యిచ్చేస్తుంటే స్వప్న వారించింది!

"అది బాగున్న మాట నిజమే! కానీ మన డ్రాయింగ్‌రూమ్‌కి చాలా పెద్దది అవుతుంది. నడవడానికి యిబ్బందిగా వుంటుంది!" అంటూ వివరించింది.

అతను నిరాశగా ఆ సోఫాసెట్ వైపు చూసి వద్దని చెప్పాడు.

అలాగే వంటయింట్లో సామాను. అతను చెప్పేవి ఎంతో ఖరీదుగలవిగా వుండేవి! స్వప్న అతన్ని వారించేది. "డబ్బంతా వీటికే ఖర్చు పెట్టేస్తే ఎలా? మనం ఇంకా ఎన్నో కొనాలి!" అంటూ గుర్తుచేసేది.

మొత్తానికి ఆ షాపింగ్ యిద్దరికీ ఒక ఆనందం లోపించిన సంఘటనగా అయింది.

స్వప్న అతని దుబారా ఖర్చుని, నిస్సంకోచంగా, తిరస్కరించేది.

"స్వప్నా! నువ్వు మరీ నామీద అధికారం చెలాయించేస్తున్నావు సుమా" అతను సణిగేవాడు.

"మీకోసమే! మీరు ఎప్పుడూ డబ్బులేదు అని అనుకునే రోజు రాకూడదు అని నా తాపత్రయం" అనేది.

ఓకే....ఓకే" అనేవాడతను అంగీకరిస్తూ.

ఒక వారం రోజుల్లో, యిద్దరూ యింటికి కావాల్సిన సామాను మొత్తం తెచ్చేసారు. సుధీర్ త్వరగా అలిసిపోయేవాడు. స్వప్న యేదో సర్దుతుంటే, "రేపు సర్దవచ్చు. వచ్చి పడుకో" అనేవాడు. స్వప్న అతని బలవంతంమీద వచ్చి పడుకునేది.

అతను దగ్గరకు తీసుకుని జుట్టు నిమురుతూ, "స్వప్నా! ఎక్కువ అలిసిపో వద్దు" అంటూ మందలించేవాడు. స్వప్న బుద్ధిమంతురాలిలా అతని పక్కన పడుకుని నిద్రపోతున్నట్లు పడుకునేది.

సుధీర్ నిద్రపోయేవాడు. స్వప్న మెల్లగా లేచివచ్చేది. చప్పుడు లేకుండా సామాను సర్దేది. ఇల్లు అడ్డదిడ్డంగా వుంటే స్వప్నకి చాలా చిరాగ్గావుండేది.

అర్ధరాత్రివేళ ఏదో చప్పుడయితే అలికిడికి సుధీర్‌కి మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూస్తే పక్కన స్వప్న లేదు. వంటయింట్లో సర్దుతోంది.

వెనకనుంచి వెళ్ళి అమాంతం నడుంచుట్టూ చేయివేసాడు.

స్వప్న కెవ్వుమంది. తిరిగిచూస్తే సుధీర్!

"ఎక్కువ పనిచేయవద్దని చెప్పానా!"

"నాకు నిద్రరాలేదు" తప్పుచేసినదానిలా తల దించుకుంటూ అంది.

అతను స్వప్నను అమాంతం చేతులతో ఎత్తుకుని తీసుకువచ్చి మంచంమీద కూలేసాడు.

"చెప్పినమాట వినవనుకో! శిక్షేమిటి తెలుసా?" చూపుడువేలు చూపించాడు.

"ఏమిటి?" నిర్భయంగా అడిగింది.

"నేను యింటికి రాను!"

"మైగాడ్!" కళ్ళు పెద్దవిచేసి చూపిన స్వప్న వెంటనే గట్టిగా చెంపలు వేసుకుంటూ "ఎప్పుడూ, పొరపాటుగాకూడా ఆ పనిచేయకన్నట్టు" తలమీద చేయి పెట్టుకుంది. అతను స్వప్నని లాగి పడుకోబెట్టాడు. తను పక్కకి తిరిగి స్వప్న గుండెల మీద తల ఆనించి పడుకున్నాడు.

"యికనుంచి యిలాగే నిద్రపోతాను! ఎందుకో తెలుసా. నువ్వు కాస్త లేస్తావనుకో! నాకూ మెలకువ వచ్చేస్తుంది."

మరి కొంతసేపటికి అతను నిద్రపోయాడు. స్వప్న అతని తలమీద చేయివేసి నిమురుతూ వుండిపోయింది! స్వప్నకి హఠాత్తుగా అనిపించింది.

"ఇతను నాకెంత సంతోషం ఇస్తున్నాడు. ఇతనికి నేనేం ఇవ్వగలుగుతున్నాను!"

స్వప్న నిట్టూర్చింది. నేనేదయినా మంచి పనిచేసి, యీ సర్వ ప్రపంచంచేత కొనియాడబడి, సుధీర్‌కి గర్వకారణం అయితే ఎంత బాగుంటుంది.

స్వప్నకి నవ్వు వచ్చింది. ఎంత పెద్ద దురాశకదూ!" అనుకొంది.

(ఇంకా వుంది)



లోపం ఎక్కడ ఉంది?

శ్రీరంగం


పొడవైన వరండా, కొద్దిగా మాసినా ఇంకొన్ని రోజులవరకూ సున్నం అక్కరలేదన్నట్లు వున్న గోడలు. రెండుప్రక్కలా క్రమంలో అక్కడక్కడా తెల్ల పెయింటు ఊడి నల్లని మచ్చలతో క్రొత్త డిజైన్లలా కనిపిస్తూన్న మంచాలు. ఒకమూల పాత టేబుల్‌పైన కొత్త టేబుల్‌క్లాత్. వేగంతో కేస్ సీట్లకు నంబర్లు వేస్తూ సిస్టర్ లూసీ. మంచాల్ని సగందాకే

వేడి మీ శక్తిని పిండి
పీల్చేస్తున్నప్పుడు...



గ్లాక్సోస్-డి* తీసుకోండి.

ఉత్సాహాన్నిస్తుంది.
చల్లదనాన్ని కలిగిస్తుంది.
పని సాగేందుకు మీకు
తక్షణ శక్తిని ఇస్తుంది.



అలసట కలిగించడంలో వేడిని మించింది లేదు. అలా వేడి వాతావరణంలో పనిచేస్తున్నప్పుడు శక్తి తరిగిపోతుంది. గ్లాక్సోస్-డి తీసుకుంటే తక్షణమే శక్తివస్తుంది.

పళ్ళరసం, పాలు, టీ, కాఫీ, నీళ్ళు—దేనిలోనైనా సరే గ్లాక్సోస్-డి కలుపుకు తాగండి లేక అలా దేనితో కలపకుండా తీసుకున్నా తీసుకోవచ్చు. మీ కుటుంబంలోని వారందరికీ గ్లాక్సోస్-డి ఇవ్వండి. వారు శక్తిని ఎలా పుంజుకుంటారో చూడండి. పనులైనాసరే, ఆటలైనాసరే బాగా సాగేందుకు తక్షణ శక్తి కోసం గ్లాక్సోస్-డి.



గ్లాక్సోస్-డి*
—మీ కుటుంబంలోని
వారందరికీ తక్షణశక్తి.

GFP. 5841-TG

అక్రమించి రగ్గు కప్పుకొని మూట కట్టినట్లు పడుకున్న పేషెంట్లూ-సందడిలేని తన వార్డుని మొదటిసారిగా రవి చూసాడు.

వార్డుచీఫ్ రాంబాబు బట్టతలతో, పాతకాలం నాటి కోటుతో వెనుక అసిస్టెంటు అట్టహాసంతో వార్డులోకి నడుస్తూ తన్నూ మరో ముగ్గురు హౌస్‌సర్జన్‌లనూ చూసి 'మీరంతా యీరోజే యీ వార్డులో వేయబడ్డ కొత్త హౌస్‌సర్జన్‌లు అనుకుంటాను' అని అందర్నీ ఒకే చిరు నవ్వుతో పలుకరించి, 'బాయ్స్ జీవితంలో హవుసర్జనులవంటి పిరీడ్ లేదు. ఇక్కడ నేర్చు కున్న అనుభవంతో మీరు మీ భవిష్యత్తును ఏర్పరచుకుంటారు. అందుకే మీరు ప్రతి పేషెంటును క్షుణ్ణంగా పరీక్షించి, కావలసిన పరీక్షలు చేసుకుని మీకు అనుమానాలు వస్తే డాక్టరు ఆచారిని అడిగి తెలుసుకొనే స్వాతంత్ర్యం మీకు వుంది. ఈరోజు మన వోపీ రోజు, అందరూ వోపీకి రండి' అంటూ బూట్లు టకటక శబ్దంచేస్తూ పేషంట్లందర్నీ పరికిస్తూ వెళ్ళిపోయాడు.

అతనో తుఫానులా వచ్చి తిరిగి తుఫానులా వెళ్ళినట్లు అనిపించింది రవికి.

తనూ అవుట్‌పేషంటుకు నడిచాడు. వోపీ అంతా ఎలానో వుంది. అక్కడ చాలామటుకు వొత్తుగా పెరిగిన గడ్డాలతో మాసిపోయిన బట్టలతో జనం నిండివున్నారు. అది ఆసుపత్రి అనుకోనివాడికి అక్కడ పూర్‌ఫీడింగ్ జరుగబోతుందనో, లేకపోతే గ్రహణం పట్టినప్పుడు గుమ్మం ముందు సందడో అనిపిస్తుంది.

గదిలో అడుగు పెట్టగానే క్రిక్కిరిసివున్న ఆ గదిలోని ముక్కిపోయిన వాసన గుప్‌మంది. అది పేషంట్ల వొంటినుండి బట్టలనుండి వస్తూన్న వాసన. వాళ్ళమధ్య ఆచారి పెన్నూ పేపరుతో కిటికీ తలుపులు మూసేసి స్టంటు చేస్తున్నాడు.

ఊపిరి బిగపెట్టి చుట్టూ చూసేడు. బాస్ యెక్కడా కనిపించలేదు. ముగ్గురు హౌస్ సర్జనులు ఎగ్జామ్ టేబిల్‌దగ్గర బిజీగా కనిపిస్తున్నారు.

ఊపిరి సలపని యీ వాతావరణంలో కిటికీ తెరచి ఊపిరి అందుకోవాలని కిటికీ దగ్గరకు పరిగెత్తాడు.


ఎందుకో తలెత్తిన ఆచారి 'కిటికీ తియ్యకు పేషంట్లు అక్కడనుంచికూడా బాధిస్తారు' అన్నాడు.

ఆచారి మాటలకు తను ఆగిపోయి "ఇలా గదంతా మనుషులతో క్రిక్కిరిసిపోతే యెలా పనిచేస్తాము సార్?" అన్నాడు.

"ఏం చేస్తాం చెప్పు. మన వోపీకి వచ్చే వాళ్ళందరూ రెక్కాడితేనే కాని డొక్కాడని మనుషులు. ప్రతీవాడు తొందరగా చూపించుకొని తొందరగా బయటపడాలనుకొనే వాళ్ళే. ఆ ఆతృతలో మన మాటల్ని ఎవ్వరూ లక్ష్యపెట్టరు" అన్నాడు ఆచారి.

తను ఎన్నో వోపీలను చూసేడు. వాటిల్లో క్రమశిక్షణ లేకపోయినా క్రమశిక్షణ గురించి ప్రయత్నం అన్నా వుంటుంది. గవర్నమెంటు ఆసుపత్రులయినా కొంచెం శుభ్రంగా కొద్దిగా డాబుగా కనిపిస్తాయి. అంతేకాని ప్రపంచం బీదా బిక్కీ అంతా ఆ నాలుగు గోడల్లోనే యిలాంటి వాతావరణంలో వున్నట్లు అనిపించదు. అసలు పని తొందరగా కానేకాదు. మరీ ఆలస్యం అవుతుంది. ఈమాటే వాళ్ళతో చెప్పడానికి ప్రయత్నించేడు. ఎవరేనా వింటేగా.

ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క భాష అర్థమవుతుంది. వీళ్ళకు అర్థం అయ్యే భాషలో వీళ్ళకు చెబితే వీళ్ళు వింటారు అనుకొని బాయ్ అని పిలిచాడు ఎవరూ రాలేదు. తనే బయటకు వచ్చి రిటైరయిన తీరుబడితో తను బీడీ తాగడానికే పుట్టేను అన్న ధోరణిలో తలుపుకు కొంచెం అవతల రోడ్డుమీద వచ్చిపోయే జనాన్నే చూస్తూ పొగ తాగుతూన్న బాయ్‌ని చేయిపట్టుకొని గుమ్మం దగ్గరకు లాక్కొచ్చి "నీస్థానం యిది తెలిసిందా!" అని కళ్ళెర్రచేసి గదిలో వున్న మనుష్యుల్ని దొరికిన వాడ్ని దొరికినట్టుగా చేయి పట్టుకుని అవతల విసిరేస్తున్నాడు. డాక్టరు కోపంకూడా పడగలడు అని మొదటిసారి తెలుసుకున్న మిగిలిన వాళ్ళు బయటకి వెళ్ళిపోయేరు. అఖర్నవున్న కుంటి



వాడు. గూనివాడు 'సార్ మేము యీ వార్డులోని పేషంట్లం సార్' అన్నారు.

'అయితే ఇక్కడ ఏం చేస్తున్నారు' అన్నాడు.

"ఇక్కడ మేము పేషంట్ల చిట్టీలు ఆచారి గారికి అందించడం, వాళ్ళను బల్లలు ఎక్కించడం ఎలా పడుకోవాలో చెప్పడం, యెడ్మిట్ అయినవాళ్ళని లోనికి తీసుకెళ్ళడం చేస్తూంటాము."

"అయితే మీరు బయటవుండి యెవరు యెక్కువ అవస్థలో వుంటారోవాళ్ళను మొదట పంపిస్తూండండి" అన్నాడు. వాళ్ళుకూడా బయటకు వెళ్ళిపోయారు. సాధారణంగా ప్రతీ అవుట్ పేషంటులో ఆ బాస్ విధిగా కూర్చుంటారు. అడ్మిషన్స్ అన్నీ అతని చేతిలోనే వుంటాయి. తనకు కావలసినవి తను యెడ్మిట్ చేసుకొని బహుకొద్ది బెడ్లు అసిస్టెంటుకి వదిలేస్తారు. ఈ పేషంట్సుకూడా చాలా విచిత్రంగా వుంటారు. వాళ్ళకు బాసేతప్ప యింకెవరూ డాక్టరుకారు అనిపిస్తుందేమో ప్రతి చిన్నబాధకీ బాస్ పరీక్షచేయాలంటారు. వోపీలో తమలాటి హౌస్‌సర్జన్‌ల పని యెవ్వరికీ యింటరెస్ట్ లేని కేసులు చూడడం. రిపీట్ అన్న అక్షరాలు టిక్కెట్లలో రాయడం.

కాని యిక్కడ తామూ, తమలో కలిసిపోయిన ఆచారీ ఈ వార్డుకి పెద్దంటే యేదో గర్వం అనిపించింది. ఆ గర్వంతోనే కుర్చీలో కూర్చున్నాడు.

గూనివాడు గుమ్మంలోంచి తల యివతలకు పెట్టి 'పంపించమంటారా' అని అడిగాడు.

తను తల ఆడించాడు. వాడు ఎవర్నో తీసుకొచ్చి తన ముందుంచేడు.

తను 'ఏంటి బాధ?' అని అడిగేడు.

వాడో కట్ట పాతకాయితాలు అందించాడు. సగం చిరిగివున్న ఆ కాయితాలు సేఫ్టీపిన్నులో బంధింపబడి వున్నాయి. కాగితాలు తిప్ప సాగేడు. ముక్కలుగా చేతికి రాసాగాయి. ఇక వీటిని చూడడం తన వల్లకాదని వాటిని ప్రక్కకు నెట్టి 'ఏంటి బాధ?' అన్నాడు.

"వీడికి బ్లడ్ ప్రషర్ సార్' అన్నాడు గూనివాడు.

ఎవరి బాధ వాడు చెప్పుకోవాలిగాని, ఇంకొకడు యిలా చెబితే చిరాకు అనిపిస్తుంది.

"నువ్వు అవతలికిపో!" అని మాటలతోనే నెడ్దాం అనుకున్న రవి కొంచెం సహనం చూపిస్తూ, వాడి బ్లడ్‌ప్రెషర్ చూసేడు. రెండు

వందలు వుంది. ఒక నిముషం ఆలోచించి "ఎక్కువే వుంది. యెడ్మిట్ అవుతావా?" అన్నాడు.

"ఎంత వుంది సార్!" అన్నాడు గూని వాడు.

"చెపితే నువ్వు తగ్గిస్తావేంటి" అని విసురుగా అనేటప్పటికి 'సార్ వాడికి బ్రహ్మ చెముడు సార్. మీరు ఏం మాట్లాడినా విన పడదు. అందుకే....' సంజాయిషీలాగచెప్పేడు తను వాడి బదులు ఎందుకు మాట్లాడుతున్నాడో.

తను అనవసరంగా విసుక్కున్నానా నన్న పశ్చాత్తాప స్వరంతో 'రెండు వందలు ఉంది' అన్నాడు తల ఎత్తకుండానే.

"అది వీడికి మామూలే సార్. అంతకంటే ఎక్కువయితే అప్పుడు అడ్మిట్ చేసుకోవచ్చు" అన్నాడు.

"అవుతే ఏం చేయమంటావు?" అన్నాడు.

"తలూపేయండి! తృప్తిగా వాడే వెళ్ళిపోతాడు."

"ఇదేదో కొత్త టెక్నిక్‌లా వుందే!" అని తలూపేడు. వాడు లేచి కృతజ్ఞతతో గూని వాడికి సలాంచేసి వెళ్ళిపోయేడు.

తర్వాత అతను ఎంటిపోయి చాలా శోచనీయంగా అన్నాడు. ఇతన్ని ఎడ్మిట్ చేసుకోవాలి. కాని యింతకంటె ముందు ఆచారి నించి యెన్ని బెడ్లు ఖాళీ ఉన్నాయో తెలుసుకోవాలి. 'ఈరోజు ఎన్ని బెడ్లు ఖాళీగా ఉన్నాయి సర్' అన్నాడు.

ఆచారి ఆలోచిస్తున్నాడు. కుంటివాడు తొణకకుండా 'పది' అన్నాడు. తల ఎత్తేటప్పటికి కుంటివాడు మాటలుకు తడుముకుంటూ 'నిన్న ఆచారిగారు ఏఏ కేసులు పంపించవొచ్చో అనుకుంటూంటే....విని లెక్క కట్టేను సార్' అన్నాడు.

వాడి భయానికి నవ్వొచ్చింది.

సరే అని "వీడ్ని ఎడ్మిట్ చేసిరా" అన్నాడు.

"రా తమ్ముడూ" అంటూ వాడ్ని తీసుకెళ్ళేడు కుంటివాడు.

వోపీకి వచ్చిన వాళ్ళని వీళ్లు తమ్ముడో, అన్నో అనో పలకరిస్తున్నారు. ఆ పలకరింపు తమ్మి కనిపెట్టుకునేవారు వున్నారు అన్న భావన పేషెంట్లకు కలుగజేస్తుంది.

పదకొండు గంటలకు అవుట్ పేషెంట్లని చూడ్డం పూర్తయింది. తను లేస్తూ "మీరు టీ తాగిరండి" అంటూ అర్ధరూపాయి ఇచ్చేడు.

"ఒద్దుసార్" అన్నారు వాళ్ళు వొక్కుమ్మడిగా.

బలవంతంగా వాళ్ళ చేతుల్లో ఉంచి 'రండి సార్! మనం అలా వెళ్ళి కాఫీ తాగి వార్డుకి వెళదాం' అన్నాడు ఆచారితో.

త్రోవలో ఆచారి 'ఎలా వుంది వోపీ' అంటూ అడిగేడు రవిని.

"బాగుంది సార్ తమకు అన్యాయం జరుగదు అన్న ధీమాతో ప్రతీవాళ్ళూ మన ఓపీకి వొస్తున్నారు సార్. గవర్నమెంటు ఆసుపత్రుల్లో యిలాంటి తృప్తి పేషెంట్లకు ఉండడం చాలా అరుదు" అన్నాడు.

ఆచారి "అవునోయ్ పేషంట్లు ఆ భావనతో వుంటేనే మనకు జాబ్ శాటిస్‌ఫేక్షన్ అంటూ వుంటుంది. మన ఓపీలో జబ్బును జబ్బుగానే చూస్తాం అంతేగాని జబ్బు వెనుకనున్నమనిషిని చూడం" అన్నాడు.

రవి ఆచారిని చూసేడు. ఖాదీచొక్కా, కాటన్‌పాంటు. తల చుట్టుప్రక్కల అంతా నెరసి వుంది. వయస్సు నలభై అయిదు దాటకపోయినా వార్ధక్యం తాలూకు అలుపు ముఖంలో గోచరిస్తూంది.

"సార్ మీ క్లినిక్ యెక్కడ?" అని అడిగేడు రవి.

ఓపీ వైపు చేయి చూపిస్తూ 'అదేనోయ్ నా క్లినిక్కు.'

"అది కాదు సార్ యింటి దగ్గర ప్రాక్టీసు...."

"అలాంటిది ఏమీలేదు."

"ఎందుకు సార్?" అన్నాడు.

"డాక్టరుకు డబ్బు యెప్పుడు అయితే యిస్తారో యిచ్చిన వాళ్ళు డాక్టరుమీద యేదో అధికారం సాధించేం అనుకుంటారు. అలా అనుకొని వాళ్ళ స్థాయి మరచిపోతుంటారు.

అది నాకు యిష్టంలేదు."

అందుకన్నమాట యీ ఆచారి అవతారం యిలా వుంది. ఖరీదైన బట్టలు లేవు ఆఖరికి రావడానికి స్కూటర్ కూడా లేదు.

ఇద్దరు అయ్యరు హోటల్లో కూర్చున్నారు. తమని చూస్తూ అయ్యరు వొక నమస్కారం పారేసి సర్వర్ని పంపించేడు, స్పెషల్‌గా చూడమని.

"రెండు కాఫీ" అన్నాడు ఆచారి. రెండు నిమిషాల తర్వాత వాడు కాఫీ తెచ్చేడు. 'తీసుకోండి' అని సిప్ చేయడం మొదలు పెట్టేడు.

"సార్!" అన్నాడు కాఫీ పెట్టి కదలని సర్వరు ఆచారి నుద్దేశించి.

"ఏంటి?" అన్నట్లు తల ఎత్తి చూసేడు ఆచారి.

"గజ్జల్లో కురుపులు సార్."

తనకు చిరాకెత్తుకొచ్చింది. తింటుండే సమయంలో యెవరేనా తమ బాధ చెబితే తినే వస్తువు చాలా అసహ్యం అనిపిస్తుంది.

ఆచారి మాత్రం ఏ భావం లేని ముఖంతో ఆసుపత్రి వైపు వేలు చూపిస్తూ 'డాక్టరు అక్కడరా! యిక్కడ కాదు' అన్నాడు.

"సార్ వీళ్ళకు వేళాపాళా లేదా?" అన్నాడు రవి.

"లేదోయ్ వీళ్ళకు డాక్టరు డబ్బు పారేస్తే ఏం చేస్తాడు చూడక చస్తాడా' అన్న నమ్మకం ప్రబలిపోయిందోయ్. ఆ నమ్మకాన్ని కలించిన వాళ్ళం మనమే. అందుకే వీళ్ళు మహా దారుణంగా ప్రవర్తిస్తారు. మనం జబ్బును జబ్బుగా ఏ నాడు చూడగలమో ఆ రోజే డాక్టరు వృత్తికి వొక వ్యక్తిత్వం హోదా అంటూ వుంటుంది."

"ఇది మహాదారుణం సార్."

"వ్యక్తిత్వపు విలువలు అంటూ వున్న వాడికి" అంటూ కాఫీ పూర్తిచేసి పద అన్నాడు.

ఆచారి ఫైనలియర్ క్లాసు తీసుకొనేందుకు వెళ్ళిపోయేడు. గూనివాడు, కుంటివాడూ యెవరినీ గమనించే స్థితిలో లేనేలేరు. వాళ్ళు పేషంట్లకు బట్టలు తొడగటం, మంచాలకు

అగ్రశ్రేణి అంతర్జాతీయ మేధావుల ఆలోచనా మథనం!

'వాకాటి' నిర్వహణలో

సరికొత్త తరహా శీర్షిక

చేత వెన్నముద్ద

వచ్చే సంచిక నుంచే ప్రారంభం

బెడ్ షీట్లు మార్చడం ధర్మామీటరు నోట్లోపెట్టి సిష్టరుకు అందించడం వొకటేమిటి సమస్తం చేసేస్తున్నారు.

తను క్రొత్తకేసుల్ని పరీక్షించి కేస్‌సీట్లు రాస్తున్నాడు. క్రొత్తకేసులు రాసింతర్వాత తనకు యెలాట్ చేసిన బెడ్‌లు రిపీట్ చేద్దామని వచ్చేడు.

ఆ కుంటి, గూనీ తనకు యెలాట్ చేసిన బెడ్‌లలోనే వున్నారు. మంచం దగ్గరకి వచ్చి కుంటి కేస్‌షీట్ చూసేడు. కుంటివాడి పేరు పోచయ్య. అతని కేస్‌షీట్ దుక్కగా అంచులు చుట్టేసి మాసిపోయి చిరుగులతో వుంది. అందులో ఎన్నో రకాల యింకులతో రిపీట్ అంటూ రాసి వుంది. ఏం రిపీట్ చేయాలో పుస్తకం మొదట్లో చూసేడు. అక్షరాలు చిరిగి పోయేయి.

అతనికి అర్థంకాక సిష్టర్ని పిలిచి 'యిది ఏం కేసు?' అన్నాడు.

"అదో రిపీట్ కేస్ డాక్టర్!" అంది.

ఈ సిష్టర్ విట్టీయే అనుకుని 'అదిగాదు యితనికి జబ్బు ఏంటి?' అన్నాడు.

"తెలియదు డాక్టర్."

"పోనీ యితను యిక్కడకు వొచ్చి ఎన్నాళ్ళయిందో తెలుసా?"

"నేను యీ వార్డులో పోష్టయి ఆరు నెల్లయింది. అప్పటినించీ చూస్తూనేవున్నాను. అంతకు ముందు ఎన్నాళ్ళనించి వుంటున్నారో నాకు తెలియదు."

సరే అని మిగతా మంచాలు కూడా చూసి యిక యీ రోజుకు చాలు అనుకొని బయటికి రాబోయాడు.

"ఇంటికి పోతున్నారా" అన్నాడు కుంటివాడు.

"అవును" అన్నాడు తను.

"నమస్తే సార్ అన్నారు వాళ్ళిద్దరూ.

* * *

పంక్చ్యువాలిటీకి మారుపేరు రవి. అతను అలా గంట ఎనిమిది కొడుతూంటే యిలా వార్డులో కాలు పెడ్తాడు. అతను యీ రోజు కాలు పెట్టేటప్పటికే ఆచారి బెడ్ దగ్గర కూర్చుని ఎవర్నో సీరియస్‌గా పరీక్ష చేస్తున్నాడు.

తను దగ్గరికి వచ్చి విష్‌చేసి 'ఏంకేసు సార్!" అన్నాడు 'ఇది లూకీమియా కేసోయ్' అని రెండు నిమిషాల తర్వాత "రవీ యీ పేషంటుకి రక్తం ఏర్పాటు చేయాలోయ్, బ్లడ్ బాంక్‌లో ప్రయత్నించు" అన్నాడు.

బ్లడ్‌బాంక్ అదోలోకం. అక్కడ రక్తం వున్నా మొదట లేదనేస్తారు. వాళ్ళని వొదల కుండా పీడిస్తే రక్తం యిచ్చి వొదిలించు కుంటారు చివరకు.

రవి తను వొక బాటిల్ అడిగితే వీళ్ళు లేదు పొమ్మంటారని రెండు బాటిల్సు అడిగేడు. వాళ్ళు లేదు కాదు అని నసిగి వొక సీసా యిచ్చేరు.

అప్పుడప్పుడు రక్తం సరిగ్గా ఎక్కుతుందో లేదో అని చూస్తూ వార్డు రవుండ్స్ పూర్తి చేసేడు.

వార్డుకి వెళ్ళగానే అక్కడ రాంబాబుగారు కనిపించేరు. తన్ను చూస్తూనే 'రవీ స్పెషల్ రూంలో సీతారామయ్యగారు అని ఎం.పి. వున్నారు. వారికి ఒక పెన్సిలిన్ ఇవ్వాలోయ్. ఇచ్చిరా నేను ఇక్కడనే వుంటాను' అన్నాడు.

సరే అని మందు సిరంజిలో యెక్కించి స్పెషల్ రూంకు వెళ్ళేడు. సీతారామయ్య భారీ విగ్రహం మనిషి. తన్ను చూస్తూనే 'రాంబాబుగారు యింజక్షను యిస్తేనే నేను తీసుకుంటాను' అని పట్టుబట్టేడు. తను తిరిగి వొచ్చి 'సార్ మీరే యివ్వాలట నేను ఇస్తే తీసుకోనన్నారు' అన్నాడు. రాంబాబుగారి ముఖంలో రంగులు మారేయి. తన హావుస్ సర్జన్ యిన్‌సల్టు తన పెర్సనల్‌గా తీసుకొని "సరే వీళ్ళకు యెలా బుద్ధి చెప్పాలో నాకు తెల్సు. రా నీచేతే యిప్పిస్తాను' అని సీతారామయ్య గదిలోకి వెళ్ళి అతనితో 'చూడండి! నేను సిరంజ్ ముట్టుకొని యిప్పటికి పదేళ్లయింది. యింజక్షన్ ఎలా యివ్వాలో కూడా మరిచిపోయేను. నా హౌస్‌సర్జన్ రోజుకి వంద చొప్పున యీపాటికి వేలు యిచ్చివుంటాడు. వాళ్ళు యిస్తేనొప్పి కూడా పెట్టదు. నేను యిస్తే రేపు అది నొప్పయి వాచిపోతే నేను బాధ్యుణ్ణి కాను' అని 'రవీ సిరంజి తే' అన్నాడు.

"వొద్దులేండి డాక్టరుగారూ మీ హావుస్ సర్జన్నే యిమ్మనండి" అన్నాడు సీతారామయ్య, రాంబాబుగారు చిరునవ్వు నవ్వుకుంటూ వెళ్ళి పోయారు.

ఆ రోజునించీ రాంబాబుగారి మీద గౌరవం మరోమెట్టు అధికం అయింది.

* * *

మర్నాడు వార్డులో అడుగు పెట్టేటప్పటికి గూనివాడు, కుంటివాడు చాలా ఉషారుగా వార్డంతా తిరిగేస్తూ కనిపించేరు. తన్ను చూస్తూనే పరిగెత్తుకుంటూ దగ్గరికి వొచ్చి తన చేతిని తీసుకుని ముద్దు పెట్టుకుంటూ 'డాక్టర్ ఏం చెయ్యి డాక్టర్. యీ చెయ్యి పడితే సచ్చి పోయెవాడు కూడా లేచికూర్చుంటాడు సార్' అంటూ చేయిని విడవకుండా ముద్దులాడుతున్నారు.

తనకు చాలా సిగ్గనిపించింది. 'వొరేయ్ ఆపండి ఇంతకీ ఎందుకేంటి ఈ ప్రదర్శన' అన్నాడు.

"నిన్న మీరు రాజుమీద చేయి వేసేరా, యీ రోజు వాడు ఎలా కూర్చున్నాడో చూడండి సార్' అన్నాడు.

"రాజు ఎవరేంటి?" అన్నాడు.

"నేను సార్" అంటూ వొక పదహారేళ్ళ వాడు బెడ్ మీద నించి అరచి, "సార్ నన్ను గుర్తుపట్టలేదా సార్" అన్నాడు.

"నీవు నిన్న ఎడ్మిట్ అయినవాడివి కదోయ్" అన్నాడు.

"నేను అంతకంటే పాతవాడ్ని, మీ ఎగ్జామ్ కేసుని."

అప్పుడు తనకు జ్ఞాపకం వొచ్చింది వీడ్ని సాధారణంగా పరీక్షల సమయంలో పిలుస్తూంటారు. పిల్లలు వీడ్ని పరీక్షిస్తే పరీక్షాధికారి ప్రశ్నలు అడిగి వాటికి తగిన సమాధానం యిస్తే పాసు చేస్తూంటారు. తన దురదృష్టం [illegible] వీడు పరీక్షల్లో తనకే తగిలేడు.

ఆ రోజు వీడు తన్ను యెంత బాధించేడు. [illegible] నన, సార్ ఇది చూడండి సార్, అది వినండి సార్ అంటూ తనకు ఇన్‌స్ట్రక్షన్సు యివ్వసాగేడు. దీన్ని అయిదు నిమిషాలు భరించి తర్వాత విసుగొచ్చి 'నువ్వు నేను అడగకుండా నోరు మెదిపితే తంతా' అన్నాడు.

ఆ రోజు తర్వాత ఈ రోజే చూడడం.

క్రిందటిసారి కంటే మనిషి బాగా క్షీణించి పోయేడు. ఇప్పుడు పదహారేళ్ళ అతని వయసుని చర్మం, ఎముకలే కప్పి వున్నాయి. కళ్ళ చుట్టూ నల్లవలయాలు. ఆ స్థితిలో కూడా అతని కళ్ళలో యేదో మెరుపు తనవాళ్ళ దగ్గర వున్నాం అనే సంతోషం.

"జ్ఞాపకం వచ్చిందోయ్" అన్నాడు కానీ ఈ పదహారేళ్ళవాడ్ని యీ స్థితిలో చూస్తూంటే బాధనిపించింది.

మర్నాడు వార్డులో కాలు బెట్టేటప్పటికి రాజు ఒక సంవత్సరం పిల్లని ఎత్తుకొన్నాడు. వాడిచుట్టూ గూనివాడూ, కుంటివాడూ చేరి సంతోషపడిపోతున్నారు. తను దగ్గరకు వచ్చి 'ఎవరోయ్ యీ పిల్ల' అన్నాడు.

పిల్లని ఆడిస్తూన్న ముగ్గురూ తలయెత్తి "మన ఆస్పత్రి పిల్లండి" అన్నారు వొక్కమ్మడిగా.

తనకు అర్థంకాక 'అంటే' అన్నాడు.

'మన ఆసుపత్రిలో కనేసి యెవరో ఆ చెత్త కుండీ దగర పారేసి వెళ్ళిపోయారు. నేను చూసి తెచ్చుకున్నాను సార్. అప్పటినుంచీ ఆసుపత్రి పెంచుతూనే వుంది' అన్నాడు రాజు.

* * *

ఆసుపత్రిలో వాతావరణం అంతా బరువుగా అనిపించింది. గూనివాడు కుంటివాడూ తన్ను చూస్తూనే డాక్టరుబాబూ' అంటూ బావురుమన్నారు.

వాళ్ళు అలా ఏడుస్తూంటే తను వాళ్ళను అలా చూడలేనేమో అనిపించింది. అయినా మనోభావాలను బైటపడనీయకుండా 'ఏమైంది?' అన్నాడు.

"మన రాజండి, చాలా సీరియస్ అయిపోయేడు" ఎకాయెకి అన్నారు.

"ఏమయిందేంటి?" అన్నాడు

"చూడండి బాబూ యెలా పచ్చగా అయి

పోయాడో, నవ్వుతూ వుషారుగా వుండేవాడు, ఎలా మగతగా కళ్లు మూసుకుంటున్నాడో?" అన్నారు.

తను పరీక్షించేడు. అతని శరీరం ఎక్కించిన రక్తాన్ని తీసుకోలేదు. అందుకే రక్తం విరిగిపోయింది. వళ్ళంతా పచ్చగా కామెర్లతో నిండిపోయింది.

తను దగ్గరకివచ్చి మంచంమీద కూర్చుంటూ 'రాజూ' అని పిలిచేడు. వాడు కళ్ళుతెరచి తన్ను చూసి పల్చటి పెదాలమీద సన్నని నవ్వు చిందిస్తూ 'డాక్టర్ యీసారి పరీక్షలదాకా నేను బ్రతుకుతానా?' అన్నాడు.

"నువ్వు బ్రతుకుతావు రాజూ" అంటూ అతని చేతిని తన చేతిలో తీసుకుంటూ తన బలం అతనిలో ఎక్కిస్తూన్నట్టు పట్టుకున్నాడు గట్టిగా.

"నాకు బ్రతకాలనే వుంది డాక్టర్. కాని నేను పరీక్షలదాకా బ్రతకను. నా రోజులు దగ్గర పడ్డాయి డాక్టర్."

"రాజూ అలా మాట్లాడకు" అంటూ అతని పెదాల్ని తన చేతులతో మూయబోయాడు.

ఆ చేతుల్ని తప్పించుకుంటూ "డాక్టర్ నాది బ్లడ్ కాన్సరు అని రెండేళ్ళక్రిందట అన్నప్పుడే చచ్చిపోదాం అనుకున్నాను. తర్వాత నాకు తెలిసింది. నాకూ వొక ప్రయోజనమంటూ వుందని. అదే వైద్య విద్యార్థులకు పాఠం కావడం. ఈ శరీరాన్ని వాళ్ళ విజ్ఞానానికి ఉపయోగపడేటట్లు చేయడం. అందుకే ప్రతీ పరీక్షలో యెగ్జామ్ కేసు అయేవాడ్ని" అన్నాడు.

ర ర ర

ఆరోజు మంగళవారం.

తమ వోపీ రోజు. తమకు అన్యాయం జరగదుఅన్న ధీమాతో వచ్చే ఆ పేషంట్లు కళ్ళ ముందు మెదిలేరు. ఆ తర్వాత తన్ను హృదయ పూర్వకంగా పలుకరించే ఆ గూనివాడు, కుంటివాడూ, ఆ తర్వాత రాజు. ఉదాత్తభావాల పదహారేళ్ళ బ్లడ్ కాన్సరు పేషంటు. పాపం ఎలా వున్నాడో, అతను బ్రతికే ఆశ లేదని ఆరోజే ఆచారి చెప్పేసాడు. ఆలోచనలు ఉవ్వెత్తు తరంగాల్లా లేస్తూంటే ఆసుపత్రిలో మోటారు సైకిలాపి వోపీకి వెళ్ళాడు. వోపీకి ముందు పెద్ద క్యూ వుంది.

పదినిముషాల తర్వాత కొత్త బాస్ వరదరావు 'రవీ!' అంటూ పిలిచాడు. తను కుర్చీలోంచి లేచి దగ్గరగా వచ్చి 'ఏం సార్!' అన్నాడు.

"ఏంలేదోయ్ వీరిని వార్డుకి తీసుకెళ్ళి యూరిన్ పరీక్షించి, షుగర్ వుందో లేదో నాకు వెంటనే వచ్చి చెప్పు."

"సరే" అంటూ తల ఊపి బయలుదేరాడు.

అసలు వోపీ డ్యూటీలకు టెక్నీషియన్స్ అంటూ వుంటారు. అలాంటిది ఒక హౌస్ సర్జను తీసుకెళ్ళటం బాగుండదు అన్న ఆలోచన రాలేదు.

పదకొండు గంటలకు ఆచారి వెంబడే కాఫీకి బయలుదేరేడు. "సార్ రాజు ఎలా వున్నాడు"ఆచారిముఖం వివర్ణం అయింది. 'రాజు యిప్పుడు ఆసుపత్రిలో లేడోయ్. మెడికల్ కాలేజీలో శవాలమధ్య తనూ ఒక శవం అయి విద్యార్థులకు పాఠాలు నేర్పిస్తున్నాడోయ్' ఆచారి కంఠం కొంచెం ఒణికింది. రవికి 'ది డెడ్ టీచ్ ది లివింగ్' అన్న సామెత జ్ఞాపకం వొచ్చింది.

వార్డు చీఫ్ తనకో పదిబెడ్లు ఎలాట్ చేసేడు. ఆ కేసులు చూసి అందరికీ యింజక్షన్లు ఇచ్చి వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కుంటున్నాడు.

ఇంతలో తను యింజక్షన్ యిచ్చిన పేషంటుని వార్డుచీఫ్ సన్నగా 'ఇంజక్షన్ తీసుకున్నావా వేణూ' అంటూ అడిగేడు.

"ఇచ్చేరు సార్ హౌస్ సర్జనుగారు" అన్నాడు.

"ఏ రంగు యింజక్షను యిచ్చేరేంటి?" అన్నాడు చీఫ్. రవి మనసు బాధగా మూల్గింది.

చీఫ్‌కి తాము యిచ్చే దానిమీద నమ్మకం లేదన్నమాట. అతను రాసింది యిచ్చేమో లేదో అన్న అనుమానం పుచ్చుకున్న వాళ్ళనించి నివృత్తి చేసుకుంటే, హౌస్ సర్జనుగా తమ యిమేజ్ ఏం వుంటుంది.

ఎందుకు యింత పెద్ద చదువులు చదివి పెద్ద హోదాల్లో వున్న వ్యక్తులు యిలా ప్రవర్తిస్తారు? యీ ఆసుపత్రులు ఏం అవుతున్నాయి? ఇందులో లోపం ఎక్కడ ఉంది? ఎన్నో శృంగ దీసే ప్రశ్నలు వొస్తున్నాయి, భారంగా వార్డు నుంచి కదిలిపోయే రవికి.... □

అపోజిషన్

ప్రభాకర్ బాలు

రాజారాం స్వతహాగా మంచివాడు, అభ్యుదయ భావాలు వున్నవాడు. కాని అతనికో దురలవాటు వుంది.

ఎదుటివాడు చెప్పే విషయాన్ని—అది ప్రగతిశీలకమైనదయినా, శాస్త్రీయమైనదయినాసరే ముక్తకంఠంతో ఖండించడం!

"వరకట్నం దురాచారం. దానివల్ల ఎంతోమంది అమాయకుల జీవితాలు నాశనమై పోతున్నాయి" అంటే—

"లేదు వరకట్నం దురాచారం కాదు. స్త్రీలకు ఆస్థిహక్కు బదులుగా ఏర్పరచిన ఓ సదుపాయం" అంటూ వాదనకు దిగుతాడు.

ఎవరయినా కులమతాలని ఖండిస్తే—

రాజారాం సమర్థిస్తాడు!

దేవుడు లేడనే వాడితో—

దేవుడున్నాడని అర్గ్యూ చేస్తాడు!!

దేవుడున్నాడని నమ్మేవారితో—

దేవుడు లేడని వాదిస్తాడు!!!

అతని దొక విచిత్రమైన మనస్తత్వం.

అతని కమిట్‌మెంట్ తెలిసిన సన్నిహిత మిత్రులు "ఇదేమిటి! నువ్వు ఇట్లా మాట్లాడట మేమిటి?" అని ఆశ్చర్యపోతే

ఘెల్లిగా చెబుతాడు "సరదా కోసం" అని. "దేనికయినా అపోజిషన్ వుండాలి. అప్పుడే మజా వొస్తుంది" అంటాడు.

రాజారాం ఎవరితోనయినా అలా వాదించేప్పుడు తను సరదాకి అలా వాదిస్తున్నాననే భావం ఏమాత్రం మొహంలో ప్రతిబింబించదు. చాలా సీరియస్‌గా వుంటాడు. దాంతో ఎదటివాడు మరింత రెచ్చిపోయేవాడు. అతని ఈ అలవాటువల్ల రాజారాం అంటే నెంబర్ వన్ రోగ్ అని దూరమైపోయిన వాళ్లు కూడా వున్నారు. అయినా అతని అలవాటు మాత్రం మారలేదు.

ఆ రోజు—

ఊళ్ళో "మా భూమి" మార్నింగ్ షో ఆడుతోంది.

రాజారాంకి అటువంటి చిత్రాలంటే చచ్చేంత ఇష్టం. కిషన్ చందర్ రాసిన "జబ్ ఖేత్ జాగే" అనే వుర్దూ నవల ఆధారంగా తీసిన చిత్రం అది. నైజాం నవాబు కిరాతక పాలనలో—భూస్వామ్య వ్యవస్థ ఉక్కు పాదాల క్రింద తెలంగాణా ప్రజలు పడ్డ పాట్లు - వాళ్లు వీరోచితంగా చేసిన పోరాటం ఆ చిత్రకథా వస్తువు.

హాలంతా ప్రేక్షకులతో కిటకిటలాడుతోంది.

ఆ సినిమాలోని కొన్ని సంఘటనలు ప్రేక్షకుల కంట తడి పెట్టించేయి....వాళ్ళచేత చప్పట్లు చరిపించేయి—వాళ్ళ పిడికిళ్లు బిగుసుకునేలా చేసేయి.



రాజారాంని కూడా ఆ సినిమా ఎంతో కదిలించింది.

అప్పుడు సినిమాలోని పాత్రలతోపాటు ప్రేక్షకులు కొందరు "ఇంక్విలాబ్—జిందాబాద్" అంటూ ఆవేశపూరితంగా నినాదాలు చేయసాగేరు థియేటర్‌లోనే.

ఉన్నట్టుండి రాజారాం మెదడులోని 'అపోజిషన్' పురుగు తొలవడం మొదలు పెట్టింది.

"ఇంక్విలాబ్ జిందాబాద్."

"జిందాబాద్"—ప్రేక్షకులు.

కాస్త సద్దు మణిగిన వెంటనే రాజారాం అరిచాడు.

"ముర్దాబాద్."

థియేటర్‌లో కల కలం చెలరేగింది:

"ఎవడ్రా అది?" అంటూ ముందు కూర్చున్న ప్రేక్షకులు వెనక్కి చూపులు సారించేరు.

రాజారాంకి పట్టలేనంత సంతోషం వేసింది తన మాటకి వచ్చిన రెస్పాన్స్ చూసి.

మళ్ళీ ఓసారి—

"ఇంక్విలాబ్........"

"ముర్దాబాద్" అన్నాడు.

"అంతే!"

హఠాత్తుగా ముగ్గురు నలుగురు యువకులు విసురుగా లేచి వచ్చి రాజారాం కాలర్ పట్టుకుని లేపి ఫెడేల్ ఫెడేల్‌మని నాలుగు తగిలించారు.

"తన్నండి....కొట్టండి" హాలంతా అరుపులు కేకలు........గందరగోళంగా తయారయింది.

ఈ సంఘటనతో రాజారాం దిమ్మ తిరిగిపోయింది.

ఇపుడు రాజారాం........

దేవుడు వున్నాడు అనే వాడితో—

ఉన్నాడు ఉన్నాడు అంటున్నాడు!

దేవుడు లేడు అనేవాడితో—

అవును దేవుడు లేడు అసలే లేడు అంటున్నాడు!! □

మరువలేని మేలు

— అరిగె రామారావు

"ఇతనే సార్ త్రాగివచ్చి ఆఫీసులో నానా గొడవ చేస్తూంది" అని మా సెక్షన్ ఆఫీసరు అన్నాడు.

"ఇతను మన ఆఫీసు క్లర్కా!"

నేనీ ఆఫీసుకు క్రొత్తగా వచ్చాను. యెవరెవరో కూడా తెలియదు.

"క్లర్కు కాదు సార్! మన పి. డి. సెక్షన్లో లేడీక్లర్కు భర్త. ఉత్తత్రాగుబోతు. త్రాగుడుకు డబ్బులు కావల్సినప్పుడల్లా ఇలా ఆఫీసుకొచ్చి పాపం ఆమెను యిలా యాగీచేసి డబ్బులు గుంజుకుపోతాడు—" అన్నాడు మా ఎస్వో.

తనను త్రాగుబోతు అనేసిరికి అతను 'హుం' అని హుంకరించాడు. శరీరం స్వాధీనంలో లేక తూలుతున్నాడు. మా సెక్యూరిటీ గార్డు గట్టిగా అతని రెక్క పట్టుకొని వుండకపోతే ఎప్పుడో క్రింద పడివుండేవాడు.

మళ్ళీ యిలా యింకోసారి ఆఫీసుకొచ్చి గొడవచేస్తే పోలీసుల కప్పగిస్తానని అతన్ని బెదిరించి పంపించేశాను.

అతడ్ని ఎక్కడో చూసిన గుర్తు—లీలగా మనస్సులో పాతజ్ఞాపకాల మరుగున కదులుతూంది....

"ఆ లేడీక్లర్కును ఒకసారి పిలిపించండి" అన్నాను. మా ఎస్వో ఆమెను పిలవటానికి సెక్షన్లోకి వెళ్ళాడు.

....అతడ్ని ఎక్కడ చూచివుంటాను.... పేపర్ వెయిట్‌ను చేత్తో గిర్‌మని త్రిప్పుతున్నాను—యేదో ఆలోచిస్తూ. అప్రయత్నంగా దానిలాగే నా ఆలోచనలు తిరుగుతున్నాయి. గతస్మృతుల పరిధుల్లో....పదహారు సంవత్సరాల వెనక్కి.

అవును అతనే!

x x x

—అప్పట్లో నాకు పన్నెండేళ్ళుంటాయో-పదమూడేళ్ళుంటాయో! మేం అప్పట్లో నూజివీడులో వుండేవాళ్ళం.

నూజివీడు హైస్కూల్లో తొమ్మిదోక్లాసు పరీక్ష వ్రాశాను.

అవి వేశవికాలం శలవులు.

ఒకరోజు మధ్యాహ్నంపూట నేనూ నా స్నేహితుడు దత్తూ లైబ్రరీకి బయలుదేరాం.

రోడ్డుమీద మా ముందు నడుస్తూన్న ఒకామెను చూపించి దత్తూ, "అదిగోరా ఆ ముందు వెళుతున్నామెను చూడు!" అన్నాడు.

చూశాను. వెనుకనుంచి ఏం కనిపిస్తుంది? లయబద్ధంగా కదులుతున్న పిరుదల మీద వయ్యారంగా నాట్యం చేస్తూన్న పెద్ద వాలుజడ నా చూపులను ఆకట్టుకుంది.

"ఈమె మా బాబాయి వాళ్ళింట్లో క్రొత్తగా అద్దెకు దిగింది. బిడివో ఆఫీసులో పని చేస్తుందట!" దత్తు చెప్పుతున్నాడు....నేను మాత్రం తమాషాగా అటూ యిటూ కదులుతున్న ఆ జడవంకే చూస్తోన్నాను. ఆ యువతి వయ్యారపు నడకా, ఆ అందాల వాలుజడా నా మనస్సులో ఒక సుందర దృశ్యంగా మెల్లమెల్లగా రూపుదిద్దుకుంటూంది....నాకా వయస్సుకే ఆడవాళ్ళల్లో పట్టిచూపే అందాలను వెతకటం అలవాటయింది—ఆడవాళ్ళనే కాదు అందమైనదేదయినా సరే! పసిపాపల బోసినవ్వూ, ఆకాశపు గుండె లోతుల్లోకి ఎగిరే వంటరి పిట్టా చెట్టుకంతకీ పూసిన ఒకేఒక పువ్వూ, చెరువులో లేచే బుల్లిబుల్లి అలలూ, గుడిమెట్లమీద వెన్నెలా—యిలా అందమైనదేదయినా ఒక సుందరదృశ్యంగా మనస్సు పొరల్లో, తెరల్లో నిలచిపోతుండేది. ఏకాంతంలో ఆ సుందర దృశ్యాలను మననం చేసుకోవటం నా నైజంగా మారుతూన్న రోజులవి! నాలో 'ఇన్‌సైట్' పెరుగుతున్న దురదృష్టపు రోజులవి! 'దురదృష్టం' అని ఎందుకన్నానంటే ఈ 'ఇన్‌సైట్' వున్న ఏ వెధవాయి సుఖంగా తిని, హాయిగా నిద్రపోలేడు. తనకే తెలయని ఒక 'తపన' అంతులేని అశాంతీన్నూ!

ఈ తపన నాకా వయస్సుకే ఆ లేతమనస్సుకే పట్టుకుంది!

సరే, కథలోకి వద్దాం—ఆమె రాజాగారి సత్రం ప్రక్కన క్రొత్తగా పెట్టిన బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసులోకి వెళ్ళింది.

దత్తు గర్వంగా నా వంక చూస్తూ, "నేను చెప్పలా బిడివో ఆఫీసులో పనిచేస్తూందని—" అన్నాడు.




వాడి గర్వం వాడిది; నా ఆలోచనలు నావి! అల్లనల్లన కదిలే ఆ జడనుబట్టి ఆమె రూపురేఖలు ఎలా వుంటాయో వూహిస్తున్నాను.

"ఇక్కడ ఒక్కతే వుంటుంది. వాళ్ళ అమ్మానాన్నవాళ్ళు వాళ్ళ వూళ్ళోనే వుంటున్నారంట—"

నేనప్పుడే ఈ లోకంలోకి వచ్చినట్లు,

"ఎవర్ని గూర్చి చెప్పుతుంటా?" అన్నాను.
పాపం వాడికి వళ్ళు మండింది. "ఏదో పెద్ద కవికుమార్‌లాగా పోజుపెట్టకు. నేను చెప్తు తుంది, మా బాబాయి వాళ్ళింట్లో అద్దెకుంటు న్నామె గురించి" వుడుక్కుంటూ అన్నాడు.
ఎప్పుడూ యేదో పోగొట్టుకున్నట్లు వెర్రి చూపులుచూసే నాకు, నా స్నేహితులంతా 'కవి కుమార్' అని పేరుపెట్టారు. ఆ పేరు సార్థకం చేస్తూ నేను మా స్కూలు వ్రాతపత్రికలో రెండు మూడు గేయాలు కూడా వ్రాశాను.
దత్తు అన్నదానికి నేను "ఆమె జడ బాగుంది కదూ!" అన్నాను. దానికి వాడు నా వంక వింతగా చూశాడు.
ఇంతలో లైబ్రరీ వచ్చింది. దత్తు 'చంద మామ' మీద పడ్డాడు. నేను పుస్తకాలు మార్పించటానికి లోపలికెళ్ళాను.
పుస్తకాలిచ్చే పంతులు, "ఏంవయ్యా, నీవు రోజూ నాగా లేకుండా యిలా పుస్తకాలు తీసు కెళ్ళుతావు. ఎవరు చదువుతారు?" అన్నాడు.
"నేనే!" కించిత్ గర్వంతో అన్నాను.
"నీవా?" ఆశ్చర్యంతో తెరచిన నోరు మూయటం కూడ మర్చిపోయాడు. మరి నేను చదివే పుస్తకాలు అలాంటివి — 'చలం', శరత్, కొడవటిగంటి, గనికొండాన్నూ! వూరికే చదవటమే కాదు—ఆయా స్త్రీ పాత్రలు నా మనస్సు గుడిలో దేవతావిగ్రహాలులాగా, అంద మైన చక్కని వర్ణనలు నిశ్చలంగా వెలిగే గూటి దీపాలులాగా నిలిచిపోయేవి. ఆ వ్రాతలు నా మనస్సుకు అలా ఎక్కేవన్న మాట!
మళ్ళీ మర్నాడనుకుంటా, బజార్లో మా కెదు రుగా వస్తోన్నామెను చూపించి, "అది గదిగో మా బాబాయిగారింట్లో అద్దెకుండే ఆమె!" అన్నాడు.
ముందురోజు వెనుకనించీ, మలిరోజు ముందునుంచీ చూశాను. ఆమె అందాన్ని ఆ జడను చూసి నేనూహించిన కళ్ళు నేనూహించి నట్లే కార్తీకదీపాలలాగా వున్నాయి!
ఆ తర్వాత ఆమెని చాలాసార్లు చూశాను. దాదాపు రోజూ చూసేవాడ్ని. ఎందుకంటే దత్తు వాళ్ళ బాబాయి వాళ్ళ యిల్లు మా యింటి ప్రక్క సందులోనే వుండేది. ఆమె ఆఫీసుకు పోవాలన్నా రావాలన్నా మా యింటి ముందు నుంచే దారి మరి.
ఒకరోజు వుదయం దత్తు హడావుడిగా మా యింటికి వచ్చి, "రాత్రి ఐతే జరిగిందిరా.. రామూ!" అన్నాడు.
నేను ఏమని అడిగే లోపలే "ఆ దమ యంతి లేదూ...." అని ఏదో చెప్పబోయాడు. దమయంతి ఎవరంటూ నేను అడ్డుపడ్డాను.
"అబ్బ ఆమేరా, మా బాబాయి వాళ్ళింట్లో అద్దెకుంటుందని చెప్పలా—నీవు 'వాలు జడా- వాలు కళ్ళూ!' అంటావే ఆమె."
"అయితే ఆమె పేరు దమయంతా? ఆమె అందానికి అలాటి పేరే వుండాలి."
"దమయంతి యింట్లో రాత్రి పెద్ద గొడవ జరిగింది. మా సందులో త్రాగుబోతు వెధవ 'రౌడీరజాక్-బస్తీమే సవాల్' గాడు లేడూ? వాడు బాగా త్రాగివచ్చి ఆమె తలుపు కొట్టి మీద మీదకెళ్ళి బలాత్కారం చేయబోయా డంట! ఆమె ఏడుస్తూ మా బాబాయి వాళ్ళిం ట్లోకి పనుగత్తికెళ్ళి దాక్కుంది."
"చూశావా నీకెలాటి న్యూస్ చెప్పానో!" అన్నట్లు వెధవ పోజు పెట్టాడు మా దత్తు గాడు. అది విని నేను మాత్రం చాలా బాధపడి పోయాను. ఆ రౌడీరజాక్‌గాడి మీసాలకు నిప్పు పెట్టుదామన్నంత కోపం వచ్చింది....
మరురోజు ఆమెకు వుద్యోగ మిప్పించిన ఆఫీసరు దమయంతి యింటికి వచ్చి వెకిలి వేషాలు వేయటం మొదలుపెట్టేడంట.
ఈ విషయాలన్నీ దత్తు చెవుతుండేవాడు. కూపీలు లాగటంలో 'డికి వాడే సాటి.
గల్లీలోని అల్లరి రౌడీ అంటే సరే మరి, ఈ ఆఫీసర్లకు ఎలా బుద్ధి వుండదో! అంద మైన ఆడదాన్ని చూస్తే బజారు కుక్కలకన్నా హీనం!
ఆ రోజు ఆదివారమనుకుంటాను. మా అమ్మ నన్ను మార్కెట్‌కెళ్ళి కూర తీసుకు రమ్మంది. తోడుగా వెంట దత్తును తీసికొని బయలుదేరాను. మార్కెట్‌కు వెళ్ళాలంటే



దమయంతి వాళ్ళ యింటి ముందునుంచే వెళ్ళాలి. లోపల్నుంచి కేకలు వినిపిస్తోన్నాయి. ఎవరిదో మొగ గొంతు వినిపిస్తోంది. దమ యంతికూడ బిగ్గరగా మాట్లాడుతూంది. ఏదో వాదులాటలాగుంది.
దత్తూ నేనూ రోడ్డుమీద నిలబడిపోయాం. ఇంతలో ఒక యువకుడు లోపల్నుంచి సీరి యస్‌గా, రేష్‌గా వచ్చి గుమ్మం ముందు నిల బడ్డాడు. కోపంగానే సిగరెట్ వెలిగించాడు. ఇంటి ముందు నిల్చొని చోద్యం చూస్తూన్న మమ్మల్ని చూసి, "మీ కిక్కడేం పని పోండి" అని ఒక్క గదుము గదిమేడు.
ఆ సాయంత్రం దత్తు వచ్చి చెప్పాక తెలి సింది—అతడు ఆమెకు అన్నయ్య అని. వుద్యోగం సద్యోగంలేని జులాయిగాడంట. త్రాగుబోతంట. ఆమె దగ్గర డబ్బులు గుంజుకు పోవడానికి వచ్చాడంట. ఉబ్బసం రోగంతో తీసుకునే తల్లి, బ్రాకెట్లాడే తండ్రీ, 'పెద్ద మనుష' లయిన, అవుతూన్న చెల్లెళ్ళూ, చదువుకుంటూన్న తమ్ముళ్ళూ — వీళ్ళంతా ఆమె మీద ఆధారపడ్డవాళ్ళే. వీళ్ళందరి పోషణా బాధ్యత తనదే! వీళ్ళకోసమే తను వుద్యోగం చేస్తూంది.
ఈ సంగతులన్నీ వాళ్ళ పిన్నికి ఆమె చెప్పుతూంటే మా దత్తుగాడు విన్నాడు.
ఆ సమాచారం వినేసరికి నా గుండెల్లో తడి అయింది. 'అయ్యో! నీకెన్ని కష్టాలు దమయంతీ!' అనుకున్నాను. ఆ రోజంతా ఇదే మాట నా మనస్సులో రింగ్ అవుతూంది.... ఆ సాయంత్రం వంటరిగా మా డాబా మీద కూర్చున్నాను. నా వూహాలోకాల్లో దమయంతి జాలిగా, బేలగా, శోకదేవతలాగా.... అయ్యో, దమయంతికి అన్యాయం జరిగిపోతూంది. దీన్ని ఆపటం ఎలా? అసలు ఆమె గురించి నాకీ తపన ఎందుకు? నేనామెను ప్రేమిస్తున్నానా? అసలు ప్రేమ అంటే ఏమిటి? నాకే నవ్వు వచ్చింది....మరి, మరి ఈ మథనం ఏమిటి? ఈ చిత్రహింస ఏమిటి? నాలో ఏదో 'అర్జ్' నన్ను గట్టిగా వూపేస్తూంది....
క్రిందకు పరుగెత్తుకుంటూ వెళ్ళి నాలుగు తెల్ల కాగితాలు తెచ్చాను. వ్రాయటం మొదలు పెట్టేను....

వ్రాస్తూన్నాను — వ్రాస్తూన్నాను — వ్రాసి వ్రాసి అదొక సుదీర్ఘ లేఖ అయింది. నా భావాల పల్లకీ అయింది, నాలో సుళ్ళు తిరిగే బాధకు అది అద్దమే అయింది.

అందులో ఏమి వ్రాశానో ఇప్పుడు ఇక్కడ ఏకరువు పెట్టలేను. నాకిప్పుడు పూర్తిగా గుర్తు లేదు కూడ. నాకు గుర్తున్నదల్లా ఆమెకు నేను వేసిన కొన్ని సూటి ప్రశ్నలు.... పండు వెన్నెలలు పండించుకోవల్సిన నీ బ్రతుకులో ఎందుకు కారు చీకట్లను కోరి తెచ్చుకుంటావు? అపూర్వమయిన నీ అందాన్ని, యౌవనాన్నీ ఎందుకిలా అడవి గాచిన వెన్నెల చేసుకుంటావు? నీ వాళ్ళకోసం నీ అందం నీ యౌవనమూ ఆగవు. వాళ్ళకు రెక్కలు రాగానే ఎగిరిపోతారు. అప్పటికి నీ రెక్కల్లో సత్తువ సన్నగిల్లిపోతుంది. వాళ్ళదాక ఎందుకు? రెక్కలొచ్చిన నీ అన్నయ్యే పట్టీపట్టకుండా, తన సుఖం తను చూసుకుంటున్నాడు. వీళ్ళూ అంతే! వీళ్ళ కోసం నీ కోర్కెలను చంపుకుంటావా? నీ గుండెల్నే వాటికి సమాధులు చేస్తావా? నీకు మాత్రం పెళ్ళి చేసుకోవాలనీ, ఒక యింటిదానివి కావాలనీ, పిల్ల పాపలతో చక్కగా సంసారం చేసుకోవాలనీ వుండదా? నీకొక మగదిక్కు లేదనేగా ఆ రౌడీవెధవా, మీ ఆఫీసరూ నీమీద అత్యాచారం చేయబోయారు....

—ఇలా సాగిందా వుత్తరం. దాన్ని ఆ రాత్రి జాగ్రత్తగా దాచిపెట్టాను.

మర్నాడు సాయంత్రం మా వూరి బయట వున్న కోనేటి గట్టుకేసి వెళ్ళాను. గట్టుమీద ఆంజనేయస్వామి విగ్రహం వుంది. దాని ప్రక్కనే ఒక జువ్వి చెట్టు వుంది. ఆ చెట్టు క్రింద కూర్చుని ఆ వుత్తరాన్ని మళ్ళీ చదివేను. దీన్ని నేనే వ్రాశానా అనిపించింది. అంత చక్కగా వచ్చింది. సొగసయిన భాషతో, గుండె లోతులను తడిమేటట్లుగా వుంది. దమయంతే గనుక దీన్ని చదివితే తన జీవితంలో తనేం పోగొట్టుకుంటోందో తెలిసి వస్తుంది; గుండెలవిసిపోయేటట్లు ఏడుస్తుంది.

అంతా బాగానే వచ్చింది. మరి దీన్ని ఏం చెయ్యాలి? చించివేయడానికి మనస్సు వప్పలేదు. దీన్ని ఎలాగయినా ఆమె కందజేస్తే— ఎల్లా? మెరుపులాగా ఒక ఆలోచన వచ్చింది. వెంటనే దాన్ని ఆచరణలో పెట్టాలనుకున్నాను.

కాని, ఆమె ఈ వుత్తరం చదివిందో లేదో ఆమె మీద పని చేసిందో లేదో ఎలా నాకు తెలుస్తుంది? అందుకొక 'టెస్టు' పెట్టాలనుకున్నా. అందుకే దాన్ని ఇలా పూర్తిచేశాను.

....వచ్చే శనివారం సాయంత్రం ఆరు గంటలకు కోనేటి గట్టుమీద వున్న ఆంజనేయస్వామి విగ్రహం దగ్గరకొస్తే నీ సమస్యలకొక పరిష్కారం, నీ జీవితానికొక తోడూ దొరుకుతుంది; నీ గుండెల్లో పూలు పూస్తాయి; నీ బ్రతుకు బాటలో వెన్నెలలు కాస్తాయి.

ఉత్తరాన్ని జేబులో పెట్టుకొని మెల్లగా వూళ్ళోకి బయలుదేరాను. అప్పటికే దీపాలు వెలిగాయి.


నేరుగా దమయంతి యింటివయిపు బయలుదేరాను. ఆ మసీదు సందు బిక్కు బిక్కుమంటోంది. రెండు మూడు సార్లు ఆ సందులో అటూ ఇటూ తిరిగేను. కిటికీ తలుపులు తెరిచి వున్నాయి. క్రీనీడలో నక్కి కాళ్ళు పైకెత్తి లోపలికి తొంగిచూశాను. లోపల వంట చేసుకుంటున్నట్లుంది. ముందు గదిలో అలికిడిలేదు. అటూ ఇటూ చూచి మెల్లగా కిటికీగుండా లోపలికి విసిరేశాను. ఆ వుత్తరం నేరుగా ఆమె మంచం మీద పడింది. అంతే, ఆ సందులోంచి ఒక్క పరుగు తీశాను....

అయ్యో, మనవి చేస్తున్నాను అప్పుడు నా వయస్సు పన్నెండో పదమూడో!

—ఎంతో ఎదురు చూసిన శనివారం సాయింత్రం రానే వచ్చింది. చలం నవల ఏదో చేత్తో పట్టుకుని అయిదు గంటలకే చెరువు గట్టుకేసి చేరుకున్నాను.

పగలల్లా మిడిసిపడ్డ ప్రొద్దు జారిపోతూ వుంటే ఆ సాయింత్రం అందాలు దిద్దుకుంటూ వుంది.

గట్టు దిగువ ఇటుక బట్టీల దగ్గర కూర్చున్నాను. ఇదీ అని చెప్పలేని భావోద్వేగంతో కొట్టుమిట్టాడుతూ మాటి మాటికీ గట్టుకేసి



చూస్తున్నాను.

ఒకదాని కొకటి పొంతనలేని ఆలోచనలు! నిజంగా ఆమె వస్తుందా? ఎవరో పోకిరీ వెధవ ఏదో వ్రాశాడులే అని తీసిపారేస్తుందా? ఒకవేళ ఆమె వస్తే ఆమెతో మాట్లాడాలా? అమ్మో! మరెందుకీ పడిగాపులు? నా భాషకూ, భావాలకీ ఇదొక పరీక్ష! ఆమెను ఎలా ఇన్‌ఫ్లుయెన్స్ చేశాయో తెల్సుకోవటం కోసమే! అంతే, మరింకేమీ లేదనుకున్నాను.

అయ్యో, మర్చిపోవద్దు మళ్ళీ చెపుతున్నాను అప్పుడు నా వయస్సు పన్నెండో పదమూడో!

తల త్రిప్పి అటు చూశాను కదా! దమయంతి నిజంగానే వచ్చింది. లేత నీలం జార్జెట్ సిల్కు చీర కట్టి మబ్బుల్లోంచి దిగి వచ్చిన దేవ కన్యలాగా.

నాలో వణుకూ ఏదో ఎక్సైట్‌మెంటున్నూ! ఆమె నా వయిపు చూడగానే తల వంచుకొని పుస్తకం చదువుతున్నట్లు ప్రిటెండ్ చేశాను.

ఆమె అలవోకగా జడ ముందుకు లాక్కొని కొసలు అల్లుకుంటూ జువ్విచెట్టు కానుకొని నిలబడింది. మధ్య మధ్యలో టైం చూసుకుంటూ ఎదురు తెన్నులు చూస్తోంది.

నా గుండెల్లో గర్వంతో కూడిన పొంగు!

ఏ చెట్టుమీద ఏకొమ్మ మాటున కూర్చుందో గాని ఒక కోయిల ఆగకుండా గొంతెత్తి అందంగా కూస్తోంది.

ఆమె విసుగ్గా జడను వెనక్కి విసురుకొని వెళ్ళిపోవడానికి వుద్యుక్తురాలవుతుండగా ఒక వ్యక్తి అటుకేసి వచ్చాడు. ఆమెవంక వింతగా ఆశ్చర్యంగా చూచి చిరునగవుతో, జోడించిన చేతులతో ఆమెను పలకరించాడు.

అతను మావూరతనే. పేరుమోసిన చెడుగుడు ఆటగాడు. పేరు దయానిధి. షోకిల్లాగా తిరుగుతుంటాడు.

వాళ్ళిద్దరూ ఏదో మాటాడుకుంటున్నారు. ఇక్కడ్నుంచి నేను ఇదంతా గమనిస్తూనే వున్నాను.

మలి సంజలు చీకట్లుగా మారుతుండగా వాళ్ళు మెల్లగా గట్టు దిగి అలా మాట్లాడుకుంటూ వూరివయిపు బయలుదేరారు.

నేనూ మెల్లగా లేచాను.

మర్నాడు సాయంత్రం నేనూ, దత్తూ కోనేటి గట్టుకేసి వెళ్ళాం. అప్పటికే ఆ దయానిధీ, ఈ దమయంతీ జువ్విచెట్టుక్రింద కూచుని నవ్వుతూ ఏదో మాట్లాడుకుంటున్నారు.

ఆ మర్నాడనుకుంటా మా అమ్మతో కలసి నేను గుంటూరు పెళ్ళికి వెళ్ళాను. మళ్ళీ తిరిగి వచ్చేసరికి పదిహేను రోజులు దాటింది.

దత్తు వచ్చి, "అరేయ్ కవి కుమార్! 'నీ వాలుజడా—వాలు కళ్ళూ' యిల్లు ఖాళీచేసి వెళ్లిపోయిందిరా!" అన్నాడు.

నెల్లూరు దగ్గర వున్న ఏదో వూరికి కావాలని ట్రాన్స్ఫరు చేయించుకుందట. ఇంట్లో వాళ్ళెవరికీ తన ఆచూకీ కూడా తెలియనీయ లేదంట. మొన్నీమధ్య వాళ్ళ నాన్న వచ్చి ఆఫీసులో వాకబు చేసేవరకు ఆమె ట్రాన్స్ఫరు సంగతి వాళ్ళకు తెలియదంట. పాపం ఆ ముసలాయన లబో దిబోమని మొత్తుకొని పోయాడని దత్తు చెప్పాడు.

అంతే, ఆ తర్వాత దమయంతి ఏమయిందో కూడా నాకు తెలియదు. ఆమె సంగతి పూర్తిగా మర్చిపోయాను కూడ. కాని, చాల రోజులవరకు నాకు గుర్తున్నదల్లా నేను రాసిన ఆ వుత్తరం గురించే.

* * *

మా ఎస్వో ఆ లేడీక్లర్కును వెంటబెట్టుకుని వచ్చాడు.

ఆమెను చూచి అదిరిపడ్డాను.

ఆ సూటి ముక్కూ, ఆ పెద్ద కళ్ళూ - పాపట్లోంచి నెరుస్తూన్న జుట్టూ, శరీరంమీద వయసు చేసిన 'దాడి'....ఓ మైగాడ్, ఈమె ఎవరో కాదు....అనాటి దమయంతే!

నాలో చెలరేగే భావాలను ఏమని చెప్పను? ఎలాగో నా ఎక్సైట్మెంట్ను అణచుకుంటూ ఆమెకు సీట్ ఆఫర్ చేశా.

మా ముసలి ఎస్వో చెప్తున్నాడు— "పాపం, దమయంతమ్మ చాల మంచిది సార్! ఈ త్రాష్టుడూ, త్రాగుబోతూ ఎలా తారసపడ్డాడో గాని...."

"ఇతను చెడుగుడు ప్లేయర్ కదూ...." మాట నోరు జారింది.

ఆమె నా వంక ఆశ్చర్యంగా చూసింది. నేను సర్దుకున్నాను. "ఏ పేపర్లోనో ఫోటో చూసిన గుర్తు...."

"అవును అప్పుడు చెడుగుడు ప్లేయరే! ఇప్పుడు నా బ్రతుకుతో చెడుగుడు ఆడుతున్నాడు....ఇతని కోసమే నా మీదే ఆధారపడ్డ ముసలి తల్లిదండ్రులనూ, చెల్లెళ్ళనూ, తమ్ముళ్ళనూ అన్యాయంగా అర్ధాంతరంగా వదిలేశాను. దిక్కులేని పక్షులను చేశాను. వాళ్ళు చెట్టుకొకళ్ళు, పుట్టకొకళ్ళు అయ్యారు. ముసలితనంలో రోగాలకు మందులేక, ఆకలికి తిండిలేక అమ్మా నాన్నా చనిపోయారు. వయసులో వున్న చెల్లెళ్ళు తెగిన గాలిపటాలయ్యారు. పెద్దది పడుపు వృత్తిలోకి దిగింది. చిన్నది కాలు జారింది. మోసపోయి ఆత్మహత్య చేసుకుంది. తమ్ముళ్ళు గాలివెధవలయిపోయి ఎటెటో పోయారు...." కన్నీళ్ళు వత్తుకుంటూ తన గుండెల్లోని బాధంతా చెప్పింది.

"మరి మీ మీదే ఆధారపడ్డ మీ వాళ్ళను ఎందుకు వదిలేశారు?" వెధవ ప్రశ్న వేశాను.

"సుఖపడిపోదామని; జీవితంలోని ఆనందమంతా జుర్రుకుందామని...."

కొన్ని క్షణాలు మౌనంగా వున్నాక తనలో తాను గొణుక్కుంటున్నట్లుగా అంది:

"....అసలు ఆ పాడు వుత్తరం చేసింది.... నన్ను మైకంలోకి దించింది. ఇదిగో ఈ మహానుభావుడ్ని కలిపింది. నిశ్చింతగా బ్రతుకుతున్న నా బ్రతుకులో భూకంపాలను సృష్టించింది. నా వాళ్ళను నాకు కాకుండా చేసింది. చెట్టుకొకళ్ళు పుట్టకొకళ్లు చేసింది...." పమిట చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

కొన్ని క్షణాలు బరువుగా గడిచేక "సారీ సార్! అనవసరంగా మీ టైం వేస్టు అయింది" అని లేచి నిలబడింది.


"మీకు పిల్లలు...."

విరక్తిగా నవ్వింది.

"సార్, వీళ్ళ తమ్ముడికి మన ఆఫీసులో ప్యూను వుద్యోగం కోసం అప్లికేషన్ పెట్టుకుంది. మీరు దయతలచి...." మా ఎస్వో పాపం జాలిగుండె మనిషి.

"అందరూ మట్టికొట్టుకుపోగా ఆఖరువాడ్ని మాత్రం చేరదీశా. తమ్ముడయినా కొడుకయినా వీడే! రేపు నాకు కొరివి పెట్టేవాడూ వీడే! వాడికి మీరు వుద్యోగం యిప్పిస్తే మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను సార్!" అంది.

అవును. ఆమెకి నేను చేసిన మేలు ఈ జన్మలో మరిచిపోలేదు. □



ఏక్సిడెంట్

'మురళీధర్'

ఎక్స్ప్రెస్ ప్లాట్ఫాం ఆడపెళ్ళివారిల్లులా సందడిగా కళకళలాడుతుంది. గుంటూరు-హైదరాబాద్ రూట్లో క్రొత్తగా ప్రవేశపెట్టబడిన తాతావారి 1210-ఇ సూపర్ ఎక్స్ప్రెస్ 'మైడెన్ రన్'కు సిద్ధంగా వుంది. ట్యూబ్ లైట్ల కాంతిలో, తెలుపు కాషాయ రంగులలో మెరిసిపోతున్న బస్సు, కొత్త పెళ్ళికూతురు పెళ్లై అత్తవారింటికి బయలుదేరుతున్నట్టుంది. విండ్ స్క్రీన్కు ఆర్భాటంగా అలంకరణ చేసిన ఎరుపు, పసుపు, నీలం బల్బులు, నూతన వధువు మంగళసూత్రాలులా మెరుస్తున్నాయ్. పైసగం బ్లాక్ పెయింట్తో కవర్ చేసిన హెడ్లైట్లు, సిగ్గుతో క్రిందకు వాలిపోతున్న వధువు కనురెప్పలులా వున్నయ్. రెండు వైపులా చివరగా, ఆరుతూ, వెలుగుతున్న ట్రాఫిక్ ఇండికేటర్స్ మధ్యమధ్య క్రీగంట చూస్తున్న పెళ్ళికూతురు వాలుచూపులులా వున్నయ్. ప్రక్కల, వెనుకవైపు వున్న పిలి

రంగు తెరలు, వధువు జలతారు మేలిముసుగులా కదులుతున్నయ్. నల్లని క్రొత్త 'గుడ్ ఇయర్' టైర్లు మొదటిసారిగా నేలను తాకుతున్న ఓ అందాల సుందరి పాదాలులా వున్నయ్. అటు, ఇటు వున్న విశాఖపట్టణం, తిరుపతి, భద్రాచలం, కడప. కర్నూలు మొదలగు ఎక్స్‌ప్రెస్‌లు పెండ్లికూతురుకు వీడ్కోలు ఇవ్వడానికి సిద్ధంగావున్న పెళ్ళై కాపురాలు చేసుకుంటున్న స్నేహితురాండ్రుగా ఉన్నయ్.


బస్సు బయలుదేరటానికి ఇంకా పది నిముషాలుంది. షెడ్యూలు టైము తొమ్మిది న్నరకైనా, మొదటి ట్రిప్ కనుక తొమ్మిది ముప్పై తొమ్మిదికి బయలుదేరుతామని, అప్పుడు వర్జ్యంలేని మంచి ఘడియలని డ్రైవరు సుబ్బారావు చేసిన రిక్వెస్టును కాదనలేదు డి.యమ్. తనకు అంత నమ్మకం లేకపోయినా! డి.ఎమ్. గారు డైరెక్ట్ రిక్రూట్. ఇరవై ఐదు సంవత్సరాల పూర్ణయవ్వనంలో వున్నారు. వారు ఎకనమిక్స్ ఎం.ఏ. ఫస్టు క్లాసులో యూనివర్సిటీ ఫస్టుగా వచ్చారు. వారు ఛార్జ్ తీసుకొని కొద్దిరోజులే ఐంది. వారి హిస్టరీ యింకా బాగా తెలియనందున స్టాఫ్ ఒళ్ళు దగ్గర పెట్టుకుని పని చేస్తున్నారు. వారు మాటలు వాడటంలోగూడా-ఆఫీసులో-పొదుపుగా వుంటారు. వారు అలా మార్క్స్‌లిస్ట్ ప్రొవిజనల్ సర్టిఫికేట్ తీసికొని, యిలా రాష్ట్ర కాబినెట్‌లో ఫైనాన్స్ మినిష్టర్ గారి ఏకైక గారాబు పుత్రిక-సుజాత ఎం.ఎస్.సి మెళ్ళో మూడు ముముళ్ళూవేసి-ఇలా అదే చేత్తో—ఆ మూడుముళ్ళు వేయడంలో ప్రాముఖ్యం వహించిన కుడిచేత్తో డి.యం. గా అప్పాయింట్‌మెంట్ ఆర్డరు తీసుకొని జాయినయ్యారు. మొదటిసారి సంక్రాంతి పండుగకు హైద్రాబాద్ అత్తవారింటికి (అత్తగారు కాబినెట్ మినిష్టరు కాకపోవచ్చు-కాని చీఫ్ మినిష్టర్ గారితోనైనా వాదించి తన పాయింటుకు ఆయనను ఒప్పించే ఒకేఒక వ్యక్తి ఫైనాన్స్ మినిష్టరుగారైనా, భార్య దగ్గర వారు ఎప్పుడూ "యస్ మాడమ్" అంచేత మరి అత్తగారు ఎక్కువ పవర్‌ఫుల్) సతీసమేతంగా బయలుదేరారు.

ఇరవైరెండేళ్ళ సుజాత, రెండువైపులా జరీబార్డరు, బూటావు ఉన్న అకుపచ్చ కంచిపట్టు చీరలో పూర్ణస్త్రీత్వంతో మెరిసిపోతోంది. మెడలో ఎర్రరాళ్ళ నెక్లెస్, చేతులకు ఎర్రరాళ్ళ గాజులు, చెవులకు ఎర్రరాళ్ళ దుద్దులు, చిటికెన వ్రేలికి ఎర్రరాళ్ళ ప్రధానపుటుంగరం—వచ్చటి ఫాలభాగంపై ఎర్రని కుంకుమ బొట్టు, గాలికి ఎగురుతున్న జుట్టు, పెద్ద 'వి' నెక్‌తోవున్న ఆకుపచ్చ జాకెట్, పిరుదలదాకావున్న జడ, జడలో మల్లెలు కనకాంబరాలు-డి.యమ్.గారి ప్రక్కన ఒక అంగుళం తక్కువగా, చూచే వారికి సమానంగా ఎత్తు కనపడుతూ, చేతులు కట్టుకొని ఠీవిగా, హుందాగా, మహారాణీలా, నూరు నయాపైసాల ఆంధ్ర ఆడపడుచులా వుంది—సుజాత.

"స్టార్ట్ కాటోయే ముందు కొబ్బరికాయ కొడుతున్నారా?" అధికార స్వరంతో అడిగింది.

"అమ్మా! తప్పకుండానమ్మా! రెండు కొబ్బరి కాయలు, అరడజను నిమ్మకాయలు తెచ్చానమ్మా! ఓ రెండు నిమ్మకాయలు ముందు టైర్ల కింద పెట్టేను. ఓ నాలుగు రేడియేటర్ గ్రిల్‌కు కడతానమ్మా! అయ్యగారు కొడతారేమో అడుగుదామనుకుంటున్నా! మీరు వస్తున్నారు. ఓ కాయ మీరు కొట్టండమ్మా! నేను ఓ కాయ కొడతాను. ముందు మీరు కొడితే శుభంగా వుంటుందమ్మా" వినయంగా అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు కొత్త యూనిఫాం, టోపీలో హుందాగా వున్నాడు. వయస్సు యిరవై ఎనిమిది. బి. ఎ. పాసై ఉద్యోగం వెంటనే దొరకనందున డ్రైవింగ్ నేర్చుకొని ఆర్. టి. సి. లో చేరాడు. ఎప్పుడూ స్టీరింగ్ తిప్పే చేతులు మోటుగా, బలంగా వున్నాయి. ఈ మధ్యనే ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌గా చేస్తున్నాడు. మొదటిసారిగా కొత్తబస్సు ఎక్కబోతుంటే ఏదో థ్రిల్‌గా వుంది. మనిషి ఎంత కరుకుగా కనబడతాడో మాట, మనసు అంత మెత్తన. ప్రొద్దున్నే పూజ చేసుకొని వెంకటరమణుడికి



భక్తితో నమస్కరించి, భార్య ముఖం చూసి, ఐదేండ్ల కొడుకును ముద్దాడి భార్య యిచ్చిన కేరియర్ తీసుకొని డ్యూటీకివస్తాడు. ఆ రోజు శనివారం. ప్రొద్దున్నే పూజ చేసుకొని, రాత్రి వుపవాసం కనుక పర్మిషన్ తీసుకొని ఇంటి దగ్గరే భోంచేసి డ్యూటీకి వచ్చాడు. కనుబొమల మధ్య కుంకుమబొట్టు, చెవిలో పూజ చేసిన పూలతో, తలపై టోపీతో క్రొత్తగా కనబడుతున్నాడు సుబ్బారావు.

కండక్టర్ శామ్యూల్ టికెట్స్ చెక్ చేస్తున్నాడు. తతంగాన్నంతా సుబ్బారావుకే వదిలేసి పని చూసుకుంటున్నాడు.

ప్రయాణీకులు కొందరు ప్లాట్‌ఫాంపై నుంచున్నారు. ఎక్కువమంది తమ నంబర్ల ప్రకారం సీట్లలో కూర్చున్నారు.

నాల్గవ వరుసలో టు సీటర్ పె కిటికీ ప్రక్కగా కూర్చున్నాడు శ్రీనివాసమూర్తి.

పరంధామయ్యగారు, సీతమ్మగారు బస్సు ప్రక్కన నిలబడి ఏమేమో మాట్లాడుతున్నారు. జాగ్రత్తలు చెబుతున్నారు! ముగ్గురి కళ్ళల్లో అంతులేని తృప్తి.

"బాబూ శ్రీనూ! ఆ అపాయింట్‌మెంట్ ఆర్డరు జాగ్రత్త! ఏదో ఆ వెంకట రమణుడు కరుణించి ఇన్నాళ్ళకు ఓదారి చూపాడు. హైద్రాబాద్ వెళ్ళగనే మావయ్యగారింటికి వెళ్ళు. వాడు సంతోషిస్తాడు. వెంటనే చేరగానే వుత్తరం రాయి" శ్రీనివాసమూర్తి చేయి ఆప్యాయంగా నిమురుతూ అన్నారు పరంధామయ్యగారు.

"సూట్‌కేస్‌లో ఫోల్డర్‌లో పెట్టాను. మీరు ఇద్దరూ బిక్కు బిక్కుమంటూ ఇక్కడ ఎందుకు? మావయ్య సహాయంతో ఓ చిన్న ఇల్లు అద్దెకు సంపాదించి, నేను వచ్చి మిమ్మల్ని తీసికెళ్తాను. మీ పెన్షన్ కూడా అక్కడికే వచ్చే ఏర్పాటు చేసుకోవచ్చు. పల్లెలో ఆ ఎకరం అమ్మేసి ఏ బ్యాంకులోనో ఫిక్సెడ్ వేస్తే అవస

రానికి వుంటుంది. జాబ్ పర్మనెంట్ అయితే ఇల్లు కట్టుకోడానికి లోన్ ఇస్తారుట-మా ఆఫీసు వాళ్ళు. ఎలాగో ఓ చిన్న యిల్లు కట్టుకుంటే ఓ భాగం అద్దెకిచ్చి" శ్రీనివాసమూర్తి మనోవీధిలో రంగుల హరివిల్లు వెలిసింది.

"అంతా వాడి దయ" అన్నట్లు చేతులు పైకెత్తి నమస్కరించారు పరంధామయ్యగారు.

"నీవు కాస్త నిలదొక్కుకుంటే మావయ్య కూతురు పద్మావతితో ఆ మూడుముళ్ళు ఆ ఏడుకొండలవాడి సన్నిధిలో వేయిస్తే మా బాధ్యత పూర్తవుతుంది.... ప్రయాణంలో జాగ్రత్త నాయనా! నీ వన్నట్లు మేము కూడా నీతో వుంటే రామా కృష్ణా అంటూ కాలం వెళ్ళదీస్తాం. మీ నాన్నగారికి అరవై అయిదు దాటినయ్, చూపు ఆనటంలా! ముసలితనంలో నిన్ను మాకు ప్రసాదించి ఆ భగవంతుడు ఓ దారి చూపాడు," ఎన్ని నోములు నోచినా సంతానం కలగక ఇహ కలగరని నిరాశ పరచుకొన్న తన నలభై ఒకటవ సంవత్సరంలో పుట్టిన శ్రీనివాసమూర్తిని చూస్తూ అంది సీతమ్మగారు. శ్రీను మాట్లాడలేదు. అతని మనసు పద్మావతి దగ్గర వాలింది.

'త్రీ సీటర్' ఐదవ వరుసలోనున్న శ్రీకాంత్ నళిని తమ నెంబర్లు చూసుకొని కూర్చున్నారు. కిటికీ ప్రక్కగా వారిని పంపడానికి వచ్చి, అప్పటిదాకా వారితో క్రింద మాట్లాడిన స్నేహితులు గుమిగూడారు.

"ఏయ్ నళినీ! ఆఫీసుకు మీరు పెట్టిన సెలవు పది రోజులని గుర్తుంచుకో. మీవారి మత్తులోబడి గంటలు నిమషాలుగా, రోజులు గంటలుగా గడుపుతూ పది రోజులు పది గంటలనుకొని మర్చిపోవాకు మీ ఆనందంలో" అసూయగా అంది అనసూయ.

కొత్త పెళ్ళికూతురు నళిని సగ్గుతో చురుక్కున చూసింది.

"మా శ్రీకాంత్ గుర్తు చేస్తాడులెండి! వాడికి డ్యూటీ ఫస్ట్" సర్దాగా అన్నాడు రాజు.

శ్రీకాంత్ నళిని వర్ణాంతర వివాహం చేసుకున్నారు. ఇరువైపులా పెద్దలు ఒప్పుకోనందున ఆఫీసరు తదితర మిత్రబృందం పెద్దరికం వహించి వారి పెళ్ళి చేశారు. ఒకరోజు సి.ఎల్. గ్రాంట్ చేయడానికి యక్షప్రశ్నలు వేసి వేధించే 'యములాడు' అడక్కుండునే — ఇద్దరకూ హనీమూన్ ట్రిప్‌కు పదిరోజులు లీవ్ శాంక్షన్ చేశాడు.

స్నేహితుల ఛలోక్తులకు చిరునవ్వే సమాధానంగా యిస్తున్నాడు శ్రీకాంత్.

'టు సీటర్'లో ఆరవ సీటులో కూర్చున్న వసుమతికి కళ్ళ నిండుగా నీళ్ళున్నాయ్. అక్కాబావ ఏకాంతంగా (అంతమందిలో కూడా) మాట్లాడుకోడానికన్నట్లు, వసుమతి తమ్ముడు సుధాకర్ క్రిందనే వున్నాడు.

"యూ సిల్లీ! చిన్నపిల్లలా ఆ కన్నీళ్ళేవిటి! నేను అప్పుడప్పుడూ వస్తూ వుంటాను. నాకు మాత్రం సంతోషంగా వుందా! అసలు తొమ్మిది వచ్చింతరవాత తీసికెళ్ళమంటే మీ బామ్మదంతా హడావిడి "మొదటి కాన్పు సీమంతం చెయ్యాలి—ఏడోనెలలో కూడా ఆలస్యమే" అని పట్టుబట్టింది. ఏమైనాసరే! నాకు మాత్రం పాపాయి కావాలి" కిటికీలో గుండా చేతిని నిమురుతూ అన్నాడు కోటేశ్వరరావు.


"పాపం! ఆశ! అంతా మీ యిష్టమే!" అంటూ వెక్కిరించి నవ్వింది. వానలో ఎండ కాసినట్టుంది.

"సార్! అంతా ఎక్కండి! బయలుదేరుదాం!" అన్న శ్యామూల్ హెచ్చరికతో అంతా ఎక్కారు. ఆఖరుసారిగా వీడ్కోలు ఇస్తున్నారు. "ఉంటాం" అంటున్నారు. జాగ్రత్తలు చెబుతున్నారు. వెళ్ళగానే ఉత్తరాలు వ్రాయమంటున్నారు. సిగరెట్ రాయుళ్ళు ఆఖరి పీల్పు పీల్చి బట్‌ను బూటు (చెప్పు) కాలితో రుద్ది ఎక్కుతున్నారు.

సుబ్బారావు తన పొట్లాలతో తీసికొచ్చిన పసుపు, కుంకుమ ముందువైపు రాసి బొట్లు పెట్టాడు.

కంట్రోలర్, ఇతర ఉద్యోగస్థులు డి.ఎమ్. గారితో వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడుతున్నారు.

"అమ్మా! మీరు టెంకాయ కొట్టండి" వినయంగా యిచ్చాడు డ్రైవర్ సుబ్బారావు.



డి.యమ్.గారి వైపోసారి చూసి, బస్సు ముందుకు నడిచింది సుజాత.

అంతా మాటలు ఆపి ఎక్కడలేని గౌరవంతో చూస్తున్నారు.

ఒకే దెబ్బకు సరిగ్గా సగానికి పగిలింది కాయ.

సుబ్బారావు కళ్ళల్లో భక్తి కనబడింది.

కాయ తీసికొని కళ్ళు మూసుకొని యేదో తలచుకొని బస్సుచుట్టూ ముందువైపు తిప్పి కొట్టాడు.

ఎవ్వరివైపు చూడకుండా బస్సు యెక్కి డోర్ వేశాడు.

డి.యమ్.గారు ముందున్న సింగిల్ సీట్లో కూర్చున్నారు. వారి సతీమణి 'టు సీటర్'లో మొదటి సీటుపై కిటికీ ప్రక్కన కూర్చున్నారు.

కండక్టర్ శ్యామూల్ విజిల్ ఊదాడు.

సరిగ్గా తొమ్మిది ముప్పై ఎనిమిది.

నల్లగా తళతళ మెరిసిపోతున్న స్టీరింగుపై కుడిచేయి వేశాడు. ఏదో వింత అనుభూతి కలిగింది సుబ్బారావుకు.

"సార్!" డి.యమ్‌గారి వైపు చూశాడు అనుమతికోసం.

డి.యమ్‌గారు ఒక్కసారి వెనక్కు తిరిగి కలయ చూసి, "రైట్, పోనివ్" అన్నాడు.

గేర్ న్యూట్రల్‌చేసి, గడియారం చూసి, తొమ్మిది ముప్పై తొమ్మిదికి 'స్టార్ట్' చేసి, హెడ్ లైట్స్ ఆన్‌చేసి, క్లచ్ నొక్కి ఫస్టుగేర్ వేసి నెమ్మదిగా యేక్సిలేటర్ ఇస్తూ క్లచ్ రిలీజ్ చేశాడు సుబ్బారావు మెత్తగా. రెండు నిమ్మకాయల్ను నలిపేస్తూ కదిలింది క్రొత్త హైద్రాబాద్ సూపర్ ఎక్స్‌ప్రెస్.

x x x

సెకండ్ గేర్‌లో 'స్టాండింగు' దాటింది. థర్డ్ గేర్‌లో ఊరు దాటి, మెత్తగా నల్లని తారు రోడ్డుపై జారిపోతోంది ఎక్స్‌ప్రెస్.

డి.యమ్.గారికి తన 'డ్రైవింగ్ స్కిల్' చూపించటానికా అన్నట్లు కుదురులేకుండా డ్రైవ్ చేస్తున్నాడు సుబ్బారావు. 'బ్రాండ్ న్యూ' కావటంవల్ల రౌతు మనసు నెరిగి పరిగెత్తే ఉత్తమాశ్వంలా సుబ్బారావు మనసు నెరిగి పరిగెత్తుతుంది ఎక్స్‌ప్రెస్. అలా యేక్సిలేటర్‌పై కాలు వేస్తే మెత్తగా అందుకునే 'పికప్'తో అరవై డెబ్బై కిలోమీటర్ల వేగంతో పోతోంది



బస్. బ్రేక్ పెడల్‌పై కాలు అనిస్తే సెకండ్లలో ఇరవై కిలోమీటర్ల స్పీడుకొచ్చి ఏ మాత్రం కుదుపులేకుండా ఆగుతుంది. ఇంజన్ శబ్దంతప్ప ఏ ఇతర శబ్దాలు లేనందున ప్రయాణము అందరికీ ప్రశాంతంగా వుంది. టర్నింగులు కట్ చేస్తూ ముందుపోతున్న వెహికిల్స్‌ను ఓవర్ టేక్ చేస్తూ 'జర్క్' లేకుండా ఎనభై కిలోమీటర్లలో అతినైపుణ్యంగా డ్రైవ్ చేస్తున్నాడు సుబ్బారావు.

పుచ్చపువ్వులాంటి త్రయోదశి వెన్నెల. చలిగాలి సగం దించిన గ్లాసెస్‌గుండా ప్రయాణీకుల్ని పలకరించి చక్కిలిగింతలు పెడుతుంది.

శ్రీనివాసమూర్తికి రాత్రిపూట వెన్నెలలో వేగంగా వెనక్కుపోతున్న చెట్లు, టెలిగ్రాఫ్ స్తంభాలు, చిన్న ఊళ్ళు చూస్తూ, ఆలోచిస్తూ దూరప్రయాణం చెయ్యడం ఎంతో యిష్టం. "మర్నాడు ఆదివారం. తను పద్మతో ఆనందంగా గడపొచ్చు. సోమవారం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వారి ఆఫీసులో జాయినవుతాడు. పద్మతో రామకృష్ణ 70 యం.యం.లో సినిమా, ఏదైనా ఏ.సి. హోటల్‌లో డిన్నరు చేయాలి! అమ్మా, నాన్న, తను, తద్మా—స్వంత యిల్లు-తమకో బుజ్జిబాబు-అమ్మే చూసుకుంటుంది - తను హాయిగా పద్మతో-సినిమాలు ఓహ్! జీవితం ఎంత మధురం!"

శ్రీకాంత్ నళిని నడుంచుట్టూ చెయ్యివేసి దగ్గరగా వత్తుకున్నాడు.

లైట్లు ఆర్పివేశాడు సుబ్బారావు సిటీ దాటంగానే. నళిని దగ్గరగా జరిగింది. చలిగాలి వారి శరీరాలలో వేడి పుట్టించింది.

"ఐదింటికి, తెల్లవారకముందే 'ద్వారక'లో మన రూంలో వుంటాం" గుసగుసలాడేడు శ్రీకాంత్.

"కాఫీ తీసికొని ఎక్కడికి వెళదాం?" నళిని ప్రశ్న.

"వెళ్ళేదెక్కడికి? భోజనం టైము దాకా రూంలోనే ఇద్దరం....కలిసి....నిద్రపోదామా?" కొంటెగా అన్నాడు.

"అబ్బ పోండి! ఎవరైనా వింటారు" కొన్ని గంటలలో తను శ్రీకాంత్‌తో పంచుకునే అనుభవం ఊహించుకుంటూ పారవశ్యంలో మునిగిపోయింది నళిని.

సుధాకర్ ఇంటి దగ్గర కబుర్లు చెబుతుంటే పరధ్యానంగా వింటూ వుంది వసుమతి.

ధ్యాస కోటేశ్వరరావు మీద వుంది.

"పాపం ఒక్కరు ఏం తిప్పలు పడతారో! హోటల్ భోజనం పడదు. ఒండుకు తినాల్సిందే! ఎంత మంచివారు! తనకన్నా కోపం వస్తుంది కాని ఆయన అలా కాదు. నిజంగా పాప పుడితే ఎంత సంతోషిస్తారో! ఓ రెండు నెలలలో తను పాపతో వుంటుంది. ఆయన వస్తారు యేదో అంటారు! తను సిగ్గుపడుతుంది."

మనోఫలకంపై టెక్నికలర్‌లో చూస్తున్న దృశ్యం "అక్కా! బావ ఎప్పుడొస్తానన్నారే?" అన్న సుధ మాటలతో చెదిరిపోయింది.

మాచర్ల లైట్లు దూరంగా కనబడుతున్నయ్.

పదకొండు మ్కప్పావుకు స్టాండింగ్‌లో ఆగింది ఎక్స్‌ప్రెస్. డి.యమ్.గారు రేడియం డయల్ చూశారు.

సుబ్బారావువైపు మెచ్చుకోలుగా చూశారు.

"వెల్‌డన్! దాదాపు నూట ఇరవై కిలోమీటర్లు రెండు గంటల ఐదు నిమిషాలు."

సుబ్బారావు వినయంగా తల వంచుకున్నాడు.

"టీ తీసికోండి సార్!" రెండు కప్పులతో వచ్చాడు శామ్యూల్.

చాలా మంది టీ తాగడానికి దిగారు.

పది నిమిషాలుండి సుబ్బారావు ఎక్కి ఎయిర్ హారన్ మ్రోగించాడు.

డి.యమ్‌గారు సతీమణి సుజాత ప్రక్కన కూర్చున్నారు. శామ్యూల్ సింగిల్ సీట్‌కు మారాడు.

డ్రైవరు అక్కడ మారవలసి వున్నా—ఏదో కారణం వలన సుబ్బారావునే వెళ్ళమన్నారు.

అద్దాలు పూర్తిగా దించారు చలిగాలికి ...లేక. అంతా తమ సీట్లపై కూర్చున్నారు.

మాచర్ల లైట్లు వీడ్కోలు చెప్పినయ్.

టాప్‌గేర్‌లో ఇంజను మెత్తని శబ్దం జోల పాటలా వుంది.

సుజాత డి.యమ్.గారి కాళ్ళపై తలపెట్టి పడుకుంది. వారిచెయి సుజాత మెత్తని నడు ముస్ను తాకుతుంది. శ్రీనివాసమూర్తి ముందు సీటుకు దిండు ఆనించి తలపెట్టి పడుకున్నాడు.

నళిని శ్రీకాంత్ భుజంపై వ్రాలిపోయింది.

ఎవరికి వీలున్నట్లు వారు నిద్రకుపక్ర మించారు-సుబ్బారావు తప్ప.

శామ్యూల్‌ను అగ్గిపెట్టె అడిగాడు.

నిద్రమత్తులోనే ఇచ్చాడు.

సిగరెట్ ముట్టించి అగ్గిపెట్టె ఇచ్చాడు సుబ్బారావు. 'కాష్‌బాగ్' ఒళ్ళో పెట్టుకొని నిద్రపోయాడు శామ్యూల్. లోపల అంతా చీకటి. సుబ్బారావు నోట్లో సిగరెట్ యెర్రగా మెరుస్తుంది.

"లక్ష ముప్పైవేలు పైనచేసే కొత్తబండి డి. యం. గారు, వారి మిసెస్! యాభైమంది ప్రయాణీకులు, అందరి భద్రతా తన చేతుల్లో వుంది."

ఒక్కసారి భార్య లక్ష్మి, పిల్లవాడు గుర్తు కొచ్చారు. "ఏం చేస్తుంటారో! హాయిగా నిద్ర పోతుంటారు. నిద్రలో అమాయకంగా వుండే లక్ష్మి ముఖం, నవ్వుతుండే బాబు" సుబ్బారావు నవ్వుకున్నాడు.

ఎక్కడా జన సంచారం లేదు. ఒకటీ అరా నైట్ ఎక్స్‌ప్రెస్‌లు, లారీలు.

వాతావరణంలో ఎక్కడా చైతన్యం లేదు. స్తబ్ధత! సాగర్‌ఘాట్ సెక్షన్ వస్తోంది.

తనకు తెలియకుండానే ఎక్కువ స్పీడు పోతున్నానని గ్రహించి ఏక్సిలేటర్ పైకాలు తీసేశాడు. స్పీడోమీటర్ ఇండికేటర్ వెనక్కి తగ్గసాగింది.

"ఘాట్ సెక్షన్ హెయిర్ పిన్ బెండ్స్- ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా— ఇంతే సంగతులు."

సుబ్బారావు సర్దుకొని కూర్చున్నాడు.

టర్నింగ్స్‌లో లైట్ ఆఫ్ చేస్తూ, ఆన్ చేస్తూ ఇంకా జాగ్రత్త కోసం హారన్ ఇస్తున్నాడు. మెత్తగా, పర్‌ఫెక్టుగా తిరుగుతుంది స్టీరింగు. ఏమయినా ప్రమాదం జరుగుతుందేమోనన్నట్లు తెల్లటి హెడ్‌లైటు కాంతికిరణాలు రోడ్డును స్పష్టంగా కనబడేటట్లు చేస్తున్నాయ్.

"అదిగో ఆ అప్ ఎక్కి, ఆ హెయిర్‌పిన్ బెండ్ తిరిగితే ఫరవాలేదు. అయినా ఎన్నిసార్లు రాలేదు! ఏవిటో ఎప్పటి కప్పుడు కొత్తగనే వుంటుంది" అప్ ఎక్కింది ఎక్స్‌ప్రెస్.

ఓ వైపు కొండ అంచు! ఓ వైపు లోయ. లోయవయిపు చిన్న గోడ!

లైట్లు డిమ్‌చేస్తూ, హారన్ యిస్తూ కొండ అంచును చుట్టిన హెయిర్‌పిన్‌బెండ్‌పై స్టీరింగ్ కట్ చేస్తున్నాడు సుబ్బారావు.

అంతే!

ఒక్కసారిగా కాంతి సుబ్బారావు కళ్ళల్లో పడి మిరుమిట్లు గొలిపింది.

క్షణంలో, సగంలో కళ్ళు చికిలించుకొని చూశాడు. తను పూర్తిగా టర్నింగ్ తిరిగే లోపల్నే ఎదురుగా లేలెండ్.

"అరె! అదేవిటి? స్పీడు తగ్గించడు! బ్రేక్ వెయ్యడు? అరెరె! రైట్‌మార్జిన్‌కు వస్తాడేమిటి! తను? ఎటు? లెఫ్టనకొండ!వచ్చేశాడు" సుబ్బారావు లెఫ్టుకు కట్ చేశాడు.

ధన్!


"అమ్మో! అబ్బా! ఏవండీ! ఎక్కడున్నారు? ఒరేయ్ సరసూ! నళినీ! అయ్యయ్యో! ఏదో వత్తేస్తుంది-వోరి నాయనో! నా గుండెల మీద ఈ బరువు....సుజా....సుధా...."

అయిపోయింది.

* * *

ఓ నిముషంలో అంతా అయిపోయింది.

కొండ అంచును ఢీకొని లెఫ్ట్‌సైడు సగంకు పైగా నుగ్గు నుగ్గయిపోయింది ఎక్స్‌ప్రెస్. కుడివయిపు లేలెండ్‌పైనున్న ఐరన్ షీట్స్ కోసుకొని చివరిదాకా చీలికలయి పోయింది. ఎదురుగా నున్న పెద్ద బండరాయికి గుద్దుకొని ఇంజను లోపలకి పోయి ముందు భాగం ఎందుకు పనికిరాకుండా పోయింది లేలెండ్‌కు.



మనుష్యులు, వస్తువులు చెల్లాచెదురుగా పడిపోయారు. మూలుగుతున్నారు. అరుస్తున్నారు. కొంతమందికి అరవటానికి అవసరం లేనట్లు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

కాళ్ళు విరిగినవాళ్ళు, చేతులు తెగినవారు, తలలు పగిలినవారు, పొట్టలు చీరుకుపోయిన వారు—అంతా భీభత్సం. ఆ వెన్నెల వెలుగులో ఏవీ స్పష్టంగా కనబడటం లేదు.

ఎక్స్‌ప్రెస్‌కు కొంచెం వెనుకగా వస్తున్న ఎంబాసిడర్ వచ్చి ఆగింది.

కారులో వారు పరిస్థితి చూసి సాగర్‌కు వెళ్ళటానికి వీలులేనందున మాచర్ల వెళ్ళి డిపోలో చెప్పారు. ఫ్లడ్‌లైట్స్‌తో రిలీఫ్‌పార్టీ వచ్చింది.

ఆ ప్రాంతమంతా లైట్లతో పట్టపగలులా వుంది. సీట్ల క్రింద ఇరుక్కుపోయినవారు, హెడ్ ఆన్ కొలిజన్‌లో ఎగిరి దూరంగా పడ్డవారు, బస్సు లారీ రెంటిమధ్య ఇరుక్కున్నవారు—అందరినీ జాగ్రత్తగా బయటకు తీస్తున్నారు.

డి. యం. గారి తల ముఖం గుర్తుపట్టలేనట్లుగా నలిగిపోయింది. వారి సతీమణి ఎర్రటి బొట్టు రక్తంలో కలిసిపోయింది. నిద్రలో భర్త చేతిని పట్టుకున్న చెయ్యి అలాగే వుంది. సీటు మధ్యలో పడి నలిగిపోయింది సుజాత.

ఇద్దర్నీ ఒక ప్రక్కగా పడుకోబెట్టి గుడ్డ కప్పారు! శ్రీనివాసమూర్తి ఎగిరి బండలమీద పడ్డాడు. తల పగిలి రక్తం ప్రవాహం ఐంది.

సూట్‌కేసులోనుండి బయటపడిన ఆర్డరు ముళ్ళకంపలో చిక్కుకుంది.

ఉద్యోగంలో చేరిన కొడుకు దగ్గర నుండి వుత్తరం వస్తుందని ఎదురుచూసే పరంధామయ్య సీతమ్మలు కొడుకు శవాన్ని చూడవలసివస్తే వారి స్థితి వర్ణించ నెవరి శక్యం? వృద్ధాప్యంలో కొడుకు ఆసరాతో జీవితాన్ని వెళ్ళబుచ్చుకుంటామని కలలు కన్నవారిని

ఎవరు ఎలా ఓదార్చగలరు?

శ్రీకాంత్‌కు రెండు కాళ్ళూ ఫ్రాక్చర్ అయినవి.

ప్రక్కనే వున్న నళిని దగ్గరకు అంత బాధలోనూ దేకు్కుంటూ వెళ్ళాడు.

మరో ఐదారు గంటలలో శ్రీకాంత్‌తో స్వర్గసౌఖ్యాలనుభవించవలసిన నళిని నిర్జీవంగా పడుంది.

శ్రీకాంత్ చిలిపిగా చేసే చేష్టలకు గుర్తుగా నఖక్షత, దంతక్షతాలు, వుండవలసిన చెక్కిళ్ళు పెదాలు, రేకులచే నిర్దాక్షిణ్యంగా చీల్చబడ్డయ్.

శ్రీకాంత్ కౌగిలిలో పరవశం చెందవలసిన అందమయిన ఇరవై మూడేండ్ల శరీరం రక్తంతో తడిసి, ఓ చెయి తెగి దూరంగా పడి వుంది. పదిరోజుల హనీమూన్ ట్రిప్ పది గంటలు కూడా పూర్తి కాకుండా ముగిసింది.

శ్రీకాంత్ తల తిప్పుకొని చేతులలో కప్పుకున్నాడు. కొద్ది దెబ్బలతో బయడపడ్డవారిలో సుధాకర్ ఒకడు. నిద్రకు ఆగలేక, బ్లాంకెట్ బస్‌ఫ్లోర్‌పై రెండు సీట్ల వరసల మధ్య పరచి పడుకున్నాడు.

శబ్దానికి ఉలిక్కిపడి లేచాడు.

అక్క వసుమతిని వెతుక్కుంటూ వచ్చాడు.

ముఖం గుర్తుపట్టలేనంతగా నలిగిపోయింది! కట్టుకున్న చీరె, చెవులకున్న దుద్దులు పోల్చుకున్నాడు.

నడుం నుండి క్రిందభాగం రక్తం వరద అయింది.

ఏ వత్తిడి వల్లనో ప్రక్కగా ఏడు నెలల పిండం రక్తం ముద్దగా పడి వుంది.

పద్దెనిమిదేళ్ళ సుధాకర్ కళ్ళు తిరిగి పడిపోయాడు. లక్ష ముప్పైవేల బస్‌లో పనికొచ్చే భాగం ఒక్కటిలేదు. రోడ్డుకు ప్రక్కగా ఒరిగి వున్న లేలెండ్ ఇంజను పనికిరాదు. సుబ్బారావు, శామ్యూల్ అక్కడి కక్కడే మరణించారు. లారీ కేబిన్‌లో డ్రైవరు, క్లీనరు యిద్దరూ పోయారు. షుమారు ఓ యిరవయిమంది పోయారు. ఇరవై అయిదు మంది తీవ్రంగా గాయపడ్డారు. వాళ్లలో ఓ ఎనిమిది మంది స్థితి మరీ ప్రమాదకరంగా వుంది.

ఆర్. టి. సి. సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు చకచక జరుగుతున్నయ్. శవాలను పోస్టుమార్టంకు గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు పంపారు, అక్కడ బంధువులకు ఒప్పజెబుతారు.

గాయపడినవారిని వారి సితినిబట్టి కొంత మందిని గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు, మరికొంతమందిని దగ్గరలోనున్న హాస్పిటల్‌కు పంపారు.

క్రేన్ తెప్పించి బస్సు, లారీని రోడ్డుమీద నుంచి తీయించాలి. ముందు ఎంక్వయిరీ జరగాలి.

* * *

గుంటూరు జనరల్ హాస్పిటల్ కాజుయాలిటీ, మార్చువరీవద్ద ఏక్సిడెంట్‌లో పోయిన వారి, గాయపడినవారి బంధువులు, స్నేహితులు గుమిగూడారు.

శ్రీనివాసమూర్తి శవం వచ్చింది.

తమకు తల కొరివి పెట్టవలసినవాడికి, తానే తల కొరివి పెట్టవలసి వచ్చింది పరంధామయ్యకు. సీతమ్మగారు ఆ నలిగిన తలను ఒళ్ళో పెట్టుకొని పిచ్చిగా చూస్తూంది.


ఆర్. టి. సి. స్టాఫ్ అందరి కళ్ళల్లో నీళ్ళు!

ఫైనాన్స్ మినిస్టరుగారు విషయం తెలిసి కారులో భార్యతో వచ్చారు. తమ హోదానంతా మరిచిపోయి చిన్నపిల్లవాడిలా ఏడ్చేస్తున్నారు.

సుధాకర్‌కి షాక్‌తో మాట రావటం లేదు. అమ్మ, నాన్న, బామ్మలకు ఏం చెప్పాలి? కోటేశ్వర్రావు అలా మ్రాన్పడిపోయాడు. శ్రీకాంత్ రెండు కాళ్ళు తొడలవరకు తీసేశారు.

క్రచెస్‌తో కుంటుకుంటూ శ్రీకాంత్ కళ్ళు మూసుకున్నాడు. కన్నీళ్ళు ధారాపాతంగా కారుతున్నయ్.

నళిని తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటున్నారు. చీఫ్ మినిస్టరుగారు విజయవాడలో వున్నారు. విషయం విని హుటాహుటి వచ్చారు. అందర్నీ సానుభూతితో పరామర్శించారు. చనిపోయినవారి కుటుంబాలకు రెండు వేలు,



గాయపడినవారికి ఐదువందలు సహాయం మంజూరు చేశారు.

* * *

ఎక్సిడెంట్ గురించి డిపార్టుమెంట్ ఎంక్వయిరీ జరిగింది. ఆర్. టి. సి. జనరల్ మానేజర్, ఆ ఏరియా ఆర్. టి. ఓ. బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు, ఏక్సిడెంట్ స్పాట్ చూశారు.

ఎక్స్‌ప్రెస్ 'బ్రాండ్ న్యూ' మెకానికల్ ఫైల్యూర్ వుండదు. 'లారీ?' ఆర్. టి. ఓ గారు ఆదేశాన్ననుసరించి ఏవో రికార్డ్సు వెరిఫై చేశారు ఇన్‌స్పెక్టర్లు.

"ఇంకా పీరియాడికల్ ఇన్‌స్పెక్షన్ జరగలేదండి. టైముకూడా దాటింది."

"ఆల్‌రైట్! డ్రైవరేమన్నా తాగుంటాడా? సరే-బ్రేక్ ఫెయిల్ కావటం కారణం కావచ్చు" ఆర్. టి. ఓ. గారు తేల్చేశారు.

ఎంక్వయిరీ పూర్తయింది. క్రేన్ వచ్చి రోడ్ క్లియర్ చేసింది. అంతా కార్లు ఎక్కారు.

కానీ యింత ఘాతుకానికి కారణం ఎవరు?

"బ్రేక్స్ సరిగా వున్నవి-నా లోపం లేదు" అని సాక్ష్యం ఇవ్వడానికి లేలెండ్‌కు నోరు లేదు.

"సారాయి దిట్టంగా పట్టించి, టర్నింగ్‌లో కాషన్ ఇవ్వక నిర్లక్ష్యం చేసి, ఎదురెదురుగా లైట్లు వెలుగుతూ, ఆరుతున్నా లెక్కచేయక, అదే స్పీడులో టర్నింగ్ కట్‌చేసి, నిషాలో కుడివయిపు మార్జిన్‌కు ఎక్కువ వచ్చి ఏక్సిడెంట్ చేశా"నని బ్రతికున్నా—మస్తాను చెప్పేవాడు కాదు.

"ఓవర్‌స్పీడ్ పోతున్నావ్ - హెయిర్‌పిన్ బెండ్ స్లో చెయ్ గురూ! అరె! ఎదురుగా ఎక్స్‌ప్రెస్. బ్రేక్ తొక్కు!" అని అరిచి చెప్పానని సాక్ష్యం ఇవ్వటానికి క్లీనర్ ఈ లోకంలో లేడు.

అర్ధరాత్రి జరిగిన ఆ ఎక్సిడెంట్‌కు కారణం ఎన్ని ఎంక్వయిరీలు జరిపినా ఎవరికి తెలుస్తుంది?

ఒక్కని అజాగ్రత్తవల్ల ఎన్ని నిండు ప్రాణాలు? ఎందరి భవిష్యత్తు నాశనమయింది? ఎప్పటికి బాధ్యత తెలుసుకుంటారు? అసలు తెలుసుకుంటారా! ఏమో? □

సరికొత్త సైంటిఫిక్, రొమాంటిక్ సీరియస్ సీరియల్



ఆగష్టు పదిహేను

తెల్లవారుజామున ఐదున్నర.

ప్రకాశరావుకి మెలకువ వచ్చింది. అసలు నిద్రపోయిందెక్కడ? కన్నుమూస్తే చావు గుర్తుకొస్తుంది.

మనిషి చచ్చి ఎక్కడికి వెళ్తాడు?

భ్రూణహత్య చేస్తే రౌరవ నరకానికి. సోదరిని వాంఛిస్తే తప్తలోహ నరకానికి. తండ్రిని ద్వేషిస్తే క్రిమిభక్ష నరకానికి. అబద్ధం చెబితే అధోముఖ నరకానికి. ఇవేమీ కాకపోతే రుధిరాంధ నరకానికో—వైతరణికో....

తనే నరకానికి వెళ్తాడు?

అతను వణికిపోయేడు.

కాలుతున్న పెనాలూ—వ్రేలాడ కట్టబడిన శవాలూ—భయంకరమైన యమభటులూ—ప్రజ్వరిల్లుతూన్న మంటలూ—వూహించుకొని వణికిపోయేడు.

ఇంక మూడు రోజులే.

మరణం అనివార్యం.

చచ్చిపోవల్సిందేనా—

అందరూ....అందరూ చావల్సిందేనా—

ఈ సాయంత్రాలూ—ఈ తోటలూ—ఈ ఆఫీసు—క్యాంటిన్‌లో కబుర్లూ—సినిమాలూ గోపీతో ఆడుకోవటం—భోజనం చెయ్యటం - ఇవేమీ వుండవా—

శరీరాన్ని ప్రాణం వదిలేసిన తర్వాత ఇంకో జీవిని చేరుకొంటుందని అంటారు. అసలు భూమ్మీద జీవి అన్నదే లేకపోతే ఈ ప్రాణాలన్నీ ఏమవుతాయి? నిర్మానుష్యమైన యీ నల్లటి భూగోళం చుట్టూ ప్రేతాత్మలన్నీ తిరుగుతూ వుంటాయా? తనూ అందులో ఒకడవుతాడా?

అసలు చావు ఎలా సంభవిస్తుంది—

కపాలమోక్షం అంటే ఏమిటి?

గుండె ఆగిపోవటం తెలుస్తుందా?

బాధతో శరీరం సుడులు తిరుగుతుందా?

అతని కేడుపొచ్చింది. ఎవరన్నా ఇదంతా

కల అని చెప్తే ఎంత బావుణ్ను! లేదులేదు.... ఇది కలకాదు.

పక్కమీద బోర్లాపడుకుని అతను తల గడలో మొహం దాచుకొని చాలాసేపు ఏడ్చేడు.

తనో అల్పజీవి.

ఎవరూ తనని రక్షించలేరు.

ఆఫీసులో హెడ్ క్లర్కు బారినుంచీ, భూమ్మీద చావు బారినుంచీ తనని ఎవరూ రక్షించలేరు.

అతను లేచేడు....

అందరూ నిద్రపోతున్నారు.

లేచి బయటకొచ్చేడు.

సర్కస్ అయిపోయిన తర్వాత వుండే డేరాలా వుంది బయట. రోడ్లు వూడ్చేవాడు లేక, నీళ్ళు రాక, కరెంట్ లేక....చెత్త కాగి తాలు, దుమ్ము....అంతా అస్తవ్యస్తంగా.... అయోమయంగా వుంది. చెత్తకుండీ పక్క కుక్క ఒకటి నిర్లిప్తంగా పడుకొని వుంది. అంతా నిర్లిప్తతే. ఎక్కడ చూచినా స్తబ్దతే. శూన్యం.

దూరంగా ఎక్కడో పెద్ద చప్పుడు.

వెనకనుంచి తరుముకుంటూ వస్తున్నట్టుగా.

అతడు పరుగెత్తేడు.

వెనుకనుంచి చావు పరుగెత్తుకుంటూ వస్తూ వుంది. అతడు పరుగెడుతున్నాడు. రాళ్ళు, గుట్టలు, కొండలు....అన్నీ దాటుకొంటూ వెళ్తున్నాడు.

ఆఫీసునుంచీ, ఫైళ్ళ మధ్యనుంచీ, భయం నుంచీ దూరంగా పరిగెత్తుకు వెళ్లిపోవడానికి పరుగెడుతున్నాడు ప్రకాశరావు.

ప్రళయం తరుముకొంటూ వస్తూంది.

ఊరి బయట స్మశానం చేరుకున్నాడు.

కపాలాల మధ్యనుంచీ, సమాధుల మధ్య నుంచీ పరుగెడ్తున్నాడు. ముళ్ళు అతడి శరీరాన్ని గాయపరుస్తున్నాయి. కాళ్ళు రక్తంతో తడిసిపోయేయి. చెమట ధారాపాతంగా కారుతోంది. ఆయాసంతో వగర్పొస్తూంది.

చప్పున అతడు ఆగేడు.

స్మశానం మధ్యలో అతను ఆగేడు.

తూర్పు దిక్కునే సూర్యుడు ఉదయిస్తున్నాడు. ప్రత్యూష అంతా ప్రకాశవంతమవుతోంది.

ఎర్రటి సూర్యుడికేసి చూస్తూ అతనోక్షణం నిలబడ్డాడు.

అప్పుడో చిత్రం జరిగింది.

దూరంగా ఎక్కడో గుడ్లగూబ వికృతంగా అరిచింది. ఓ కోడిపిల్ల రెక్కలుకొట్టుకుంటూ హృదయ విదారకంగా అరుస్తూంది.

సూర్యుడు కొద్దిగా పైకి వచ్చేడు.

క్రిందనుంచి—తూర్పుకొండల వెనుకనించి ప్రాక్సిమా సాంక్చువరీ దానివెనుకే ఉదయించింది. నల్లటిముద్దలా వుంది. గోళీలా గుండ్రంగా వుంది. సూర్యుడికీ, భూమికీ, మధ్య వచ్చి నిలబడింది. చిన్న కుదుపు.

సూర్యుడూ, నక్షత్రం, భూమీ ఒకేరేఖలోకి రాగానే ఉషస్సు అంతర్ధానమైపోయింది.

గ్రహణం!

సూర్యుడు కనబడటం మానేసేడు. అడ్డుగా భయంకరమైన నక్షత్రం, అదే దిశలో భూమివైపుకు వస్తూ....

అంతా అంధకారం. ఎక్కడ చూసినా చీకటే.

ఇక మిగిలిన మూడురోజులూ రాత్రిపవలూ వుండదు.

యోగవాసిష్ఠంలో చెప్పింది నిజమవుతూంది.

బైబిల్‌లో చెప్పింది ఋజువవుతూంది.

ప్రపంచం అంధకార బంధురమైపోయింది.

ఒక నక్క మోర ఎత్తి వూళ పెట్టింది. ఒక గ్రద్ద రెక్కలు టపటపా కొట్టుకుంది.

పగిలిన కపాలాల మధ్యనుంచి గాలి వీచినప్పుడల్లా ఎవరో ఏడుస్తోన్న ధ్వని.


ప్రకాశరావు గట్టిగా అరవాలనుకున్నాడు. గొంతుకేదో అడ్డుపడినట్లు నోటమాట రాలేదు. పండుటాకులా వణికిపోయేడు. అంతలో చెట్టుమీదనుంచి ఓ యెండుకొమ్మ అతడిమీద పడింది.

అంతే.

రావల్సినకేక గొంతులో ఆగిపోయింది.

రావల్సిన ఊపిరి గుండెలో ఆగిపోయింది.

కుప్పలా కూలిపోయేడు.



మానసికంగా యెప్పుడో చచ్చిపోయిన ప్రకాశరావు ఈసారి నిజంగా .... శారీరకంగా కూడా చచ్చిపోయేడు.

శైలజ గదిలో మంచంమీద వెల్లకిలా పడుకొని పైకప్పుకేసి చూస్తూ ఆలోచిస్తూంది. ఆమె తన గత పద్దెనిమిదేళ్ళ (వూహ వచ్చిన తర్వాత) జీవితాన్ని సమీక్షించుకొని ఆలోచిస్తే ఆమెకి అది చాలా నిస్సారంగానూ, అర్ధరహితంగానూ కనిపించింది.

ఏం సాధించింది తను?

ఈ ప్రపంచంలో చాలామంది ఏమీ సాధించరు. కానీ వాళ్ళకి బ్రతుకుతున్నామన్న తృప్తి అన్నా వుంటుంది. మరి తనకుందా?

ఆలోచిస్తే....ఉన్నట్టే వుంది.

ఒక కుటుంబాన్ని పోషిస్తున్నానన్న తృప్తి. తమ్ముళ్ళనీ, తండ్రినీ....

మిగతా కోర్కెలగురించి ఆలోచిస్తే....ఈ చివరి నాలురోజుల్లోకూడా తను శృంఖలాలు తెంచుకొని అనుభవించకుండా ఏది ఆపుతుంది? ఒక పెళ్ళికాని స్త్రీ ఇంక జీవితంలో పెళ్ళికాదని తెలిసికూడా (జీవితం ఇంక నాల్గురోజులే కాబట్టి) ఎందుకు నైతిక విలువలకి కట్టుబడి వుంటుంది? కేవలం కుటుంబ గౌరవం రక్షించటానికేనా?

'కుటుంబం.'

చాలా మంచి — గౌరవప్రదమైన పదం అది.

ఒక నిశ్శబ్దపు అర్ధరాత్రి అకస్మాత్తుగా మెలకువ వస్తే కోరలు బయటపెట్టి చుట్టుముట్టే కోర్కెలు గుర్తొచ్చేయి. రాణీ అన్నట్టు అది మానసిక వ్యభిచారమా? కోర్కె శారీరకము. అందులో ఎవరినయినా వూహించుకొంటే అది వ్యభిచారం.

ఆమెలో చిన్నకోర్కె బలంగా పురులువిప్పుకొంటోంది. చాలా చిన్న కోర్కె. ఆ నిర్మానుష్యమైన వీధులగుండా విశృంఖలంగా పరుగెత్తాలని!

పిచ్చికోర్కె.

ఫ్రాయిడ్ చెప్పినట్టు అంతర్గతపుటాలోచన అసంకల్పిత చర్యని అనిబద్ధం చేస్తుంది.

ఆమెకి నవ్వొచ్చింది.

అంతలో తలుపు చప్పుడయింది. తండ్రి లోపలికి వచ్చేడు. ఆమె లేవబోతూవుంటే వారించి ప్రక్కనే కూర్చున్నాడు.

"నీ దగ్గిరెంత డబ్బుందమ్మా?"

ఆమె ఆశ్చర్యపడినా, దాన్ని పైకి కనపించనివ్వకుండా "పదో ఇరవయ్యో వుండొచ్చు నాన్నా" అంది.

"అబ్బే. అంత తక్కువ కాదు, అయిదొందలన్నా కావాలి."

"అయిదొందలా? అంత నా దగ్గరెక్కడిది నాన్నా?"

అతడు కొంచెంసేపు నిశ్శబ్దంగా వుండి, ఆ తర్వాత నిశ్శబ్దాన్ని చెదరగొడ్తూ అన్నాడు- "పోనీ నీ గొలుసు అమ్మేస్తే?"

ఆమె చప్పున తనవైపు చూసుకొని, విస్మయంగా తలెత్తి "ఇప్పుడంత అవసరం ఏమొచ్చింది నాన్నా?" అంది.

"కావాలమ్మా."

ఇంకా నాల్గు రోజుల్లో ప్రపంచం అఖరవబోతూవుంటే ఇప్పుడెందుకు అంత డబ్బు? ఆమె రెట్టించి అడిగింది. అతడికి చెప్పక తప్పలేదు.

"పక్క పల్లెలో బుద్ధధానందస్వామివారు వెలిసేరమ్మా, ఆయన ఇచ్చిన తాయెత్తు కట్టుకొంటే ప్రళయం యేమీ చెయ్యదట" నసుగుతూ అన్నాడు.

ఆమెకి ముందు నవ్వొచ్చింది. ప్రాణభయం చదువుకున్నవాళ్ళనీ, చదువుకోనివాళ్ళనీ, అందర్నీ మూర్ఖుల్ని చేస్తూంది. కానీ ఆమెకి సంతోషం కూడా వేసింది. ఏ విధంగానైనా తమ ప్రాణాల్ని నిలబెట్టటానికి తమ తండ్రి— ఈ కుటుంబ పెద్ద-శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాడు.

"ఎంతట నాన్నా ఆ తాయెత్తు?"

"అయిదొందలట" అన్నాడు ఆయన. కూతురు ఆ మాత్రం ఆసక్తి చూపించటం ఆయనకి సంతోషకరంగా వుంది. తన మాటలు తేలిగ్గా కొట్టిపడేస్తుందనుకొన్నాడు. ఇంటిల్లిపాదినీ పోషిస్తున్న కూతురంటే అతడికేమూలో భయం.

ఆమె మెడలో నుంచి గొలుసు తీసి ఇస్తూ అంది "ఒక తాయెత్తు యింట్లో వుంచుకొంటే ఆ ఇల్లు నిలబడ్తుందీ అన్న నమ్మకం నీకుంటే దాన్ని నేనెందుకు పాడుచెయ్యాలి నాన్నా— తీసుకో—"

వెంట్రుకల మధ్య హుక్కు చిక్కుకొని ఒక పట్టాన రావటంలేదు.

"ఇంట్లో పెట్టుకోవటం కాదమ్మా చేతికి కట్టుకోవాలి. నా చేతికి కాదనుకో...." నవ్వేడు. అయితే ఆ నవ్వులో జీవంలేదు. "ఉన్నవి ఒక అయిదొందలే. ఇంటిల్లిపాదికీ ఎక్కణ్ణుంచి తేగలం?"

"నాకు వీటిమీద నమ్మకం లేదు నాన్నా" అన్నది. లోపల మనసులో మాత్రం—'నాకు ఈ బ్రతుకుమీద పెద్ద ఇష్టంలేదు నాన్నా' అనుకొంది.

హుక్కు విడిపడింది. గొలుసు ఆమె చేతిలోకి వచ్చింది.

"పోన్లే అమ్మా. ఎవరి నమ్మకాలు వాళ్ళవి" అతడు గొలుసు వంక చూస్తూ అన్నాడు. "ఒక చిన్న తాయెత్తు తమ్ముడి చేతికి కడితే వాడు వంశం నిలబెడతాడు."

గొలుసు అందిస్తున్న చెయ్యి క్షణంపాటు స్తంభించింది. గుండెల్లో ఆవేశం ఆవేదన రూపంలో ఉవ్వెత్తున పొంగింది. అతడి వళ్లోకి గొలుసు విసురుగా వచ్చి పడింది. అది తీసుకొని అతడు వెళ్ళిపోయేడు. ఆమె మిగిలిపోయింది ఒంటరిగా.

అప్పుడొచ్చింది ఆమెకి దుఃఖం తెరలు తెరలుగా.

కట్టలు తెంచుకొని.

తాయెత్తు మనిషిని రక్షిస్తుందా లేదా అన్నది కాదు అక్కడి ప్రశ్న. కుటుంబంలో వ్యక్తుల మధ్య బంధాల గురించిన ప్రశ్న అది.

కుటుంబం.

చాలా మంచి పదం అది: తల్లి, తండ్రీ, తమ్ముడు....సున్నితమైన బంధాలూ.

ఇన్ని సంవత్సరాలు రెక్కలు ముక్కలు చేసుకొని తను ఈ కుటుంబాన్ని నిలబెట్టింది. తన సర్వస్వం ధారపోసింది. అయినా ఎవరో ఒకరే బ్రతకాల్సివస్తే దానికి తన కొడుకునే తన వంశం నిలబెట్టుకొనేవాడిగా తండ్రి ఎన్నుకొంటున్నాడు. ఏమి వ్యవస్థ ఇది? ఇందులో

బ్రతకటంకన్నా స్త్రీ చచ్చిపోవటం నయం.

ఆమె కన్నీటితో తలదిండు తడిసిపోయింది. ఎక్కిళ్ళు పైకి వినిపించకుండా ఏడుస్తూంది.

ఈ ప్రపంచంలో తనెంత ఒంటరో ఆమెకి ఆ క్షణం అర్థమయింది. తనమీద పడి తింటున్న వాళ్ళంతా తమ నిజస్వరూపాల్తో రాబందుల్లా కనిపించసాగేరు.

"నాక్కొంచెం ప్రేమ కావాలి. ఎంత కొంచెమైనా చాలు. కొంచెం ప్రేమా.... కొంచెం ఆప్యాయతా...." ఆమె జాలిగా అర్థిస్తూంది.

కొంచెం సేపటికి ఆమె తేరుకొంది. అదే అనిర్వచనీయమైన స్థితిలో ఆమె చేయి ముందుకు జరిపితే తలదిండు క్రింద ఒక ఫోటో తగిలింది. ఆమె అప్రయత్నంగా బైటికి తీసింది.

స్త్రీ జీవితంలోకి ఎప్పుడో ఒక్కసారి, ఒక పురుషుడు మాత్రమే దగ్గరగా వస్తాడు—ఒకే ఒకసారి. నిశ్చయంగా ఆ పురుషుడు తండ్రిగానీ, అన్నగానీ, తమ్ముడుగానీ అవడు. ఆ ఒకరి కోసమే స్త్రీ కలలు కంటుంది.

అయితే శైలజలాటి దురదృష్టవంతులు చాలా మూగగా తమ బంధాల్ని పెనవేసుకొంటారు. ప్రపంచపు చివరి నాలుగురోజుల్లో కూడా శైలజలాటి వాళ్ళు తమ సంస్కారపు పరిధినుంచి బైటికొచ్చి, తమ మనసు వెల్లడించలేరు. అతడు వప్పుకొంటాడా లేదా అన్నది వేరే ప్రశ్న. ఆమె చెప్పలేదంతే.

ప్రేమ ఎప్పుడు యెందుకు ఎలా యెవరి మీద కలుగుతుందో చెప్పటం కష్టం. అది జామెట్రీ కాదు. ఆల్జీబ్రా కాదు.

ఆమె తన వంటరితనాన్ని ఇన్నాళ్ళూ మనసులో యెలా దాచుకొన్నదో, తన ప్రేమని కూడా అలాగే ఈ నాల్గురోజులూ దాచుకొంటుంది.

ఆమె కంటినుంచి ఓ నీటిచుక్క జారిపడి ఫోటోని తడిపింది.

అతడిని ఇంకో అమ్మాయి ప్రేమిస్తోందని తెలుసు. తనకన్నా అతడి వయసు తక్కువని తెలుసు. అయినా ప్రేమ ప్రేమే.

ఆమె ఫోటోని వెనక్కి తిప్పింది. ఎండిన జిగురు అతుక్కొనివుంది అక్కడక్కడా.

అప్లికేషన్ ఫారంనుంచి చింపిన ఫోటో అది.

ఇక శైలజ గురించి రాయటానికేమీలేదు.

నాల్గురోజుల తర్వాత ఆమె సమాధి అయిపోవచ్చుగాక. కలల్లో సమాధి ఎప్పుడో అయిపోయింది.

ర ర ర

"భవతి భిక్షాందేహి మాతా అన్నపూర్ణేశ్వరీ...." చేతులమధ్య భిక్షపాత్రతో ఎలుగెత్తి అరిచేడు వృద్ధుడు.

జానకి బయటకొచ్చింది.

ప్రొద్దున్న యెనిమిదయింది.

అయినా చీకటిగానే వుంది. సూర్యుడి కడ్డుగా ఒక నల్లటిగోళం, నక్షత్రాలు కనబడుతున్నాయి.

కొన్ని కోట్ల సంవత్సరాలనుంచి వస్తున్న ఒక నిర్ణీతమైన పగలూ, రాత్రి మరికలేవు. అంతా రాత్రే. అంతా చీకటే.

"....భవతి భిక్షాందేహి—"

అంత వ్యధలోనూ జానకికి నవ్వొచ్చింది. "ప్రపంచం ఆఖరయిపోతూంటే ఇంకా బిచ్చమెత్తుకోవటం ఎందుకు తాతా—ఎవర్ని అడిగితే యెవరు కాదనను? అయినా అసలు అడగటం యెందుకు? కావల్సింది దొరికేచోట యెవర్నీ అడక్కుండానే తీసుకోవచ్చుగా?"

"ఊహు తెల్సినప్పట్నుంచీ మధుకర వృత్తే నమ్మా. ఈరోజు మనుగడకి ప్రమాదమొచ్చిందని మానుకోమంటావా తల్లీ—"

ఆమె స్థాణువైంది.

ఆ చిమ్మచీకటిలో—ఆ స్తబ్దపు వాతావరణంలో తన యింటిముందు నిలబడివున్న ఆ బిచ్చగాడి నిజాయితీ చూసి ఆమెకంట నీరు వచ్చింది.... ఇదే నిజాయితీ ప్రతి మనిషిలోనూ వుంటే.... మనిషి, చావుని యెంత హుందాగా ఆహ్వానించగలిగి వుండేవాడు!

తన ఆలోచనలని నొక్కిపట్టి ఆమె లోపలికెళ్ళి హరికెన్ లాంతరు సాయంతో రాత్రి తాలూకు అన్నం కొద్దిగా వుంటే పట్టుకొచ్చింది.

"బాగా చీకటిగా వుంది తాతా. ఎలా వెళ



తావు?"

"వెలుగెలా వుంటుందో నాకు తెలియదమ్మా? నేను పుట్టుగుడ్డిని" అన్నాడు వృద్ధుడు. అతడి గాజుకళ్ళు హరికెన్ లాంతరు వెల్తుర్లో నిస్తేజంగా వున్నాయి. అతడి మొహం దీప్తితో వెలుగుతోంది.

ఆమె అతడి పాత్రలో అన్నం వేసింది.

అతడు చెయ్యెత్తి, "దీర్ఘ సుమంగళీభవ" అన్నాడు. నెమ్మదిగా చీకట్లో కల్సిపోయేడు.

ఆమె అటేచూస్తూ నిలబడింది.

ఇంతలో లోపల్నుంచి రమణ వచ్చేడు.

"ఎవర్ని వదినా చూస్తున్నావు?"

"మనిషిని."

అతడికి అర్థంకాలేదు. అయినా దానిగురించి ప్రశ్నించకుండా, "అన్నయ్యేడీ?" అన్నాడు.

"తెలీదు బాబూ. ప్రొద్దున్నే ప్రక్కమీద లేరు" అంది—ఆందోళన నిండిన కంఠంతో.

"ప్రొద్దున్నే ఎక్కడికి వెళ్ళేడు? అందులోనూ యింత చీకట్లో?"

కిటికీల్లోంచి జనం బయటకు చూస్తున్నారు. అందరి మొహాల్లోనూ భయం పేరుకుపోయింది. పగలు ఎనిమిదయినా చీకటి—వళ్ళు గగుర్పొడుస్తూంది. ఆక్రోశించటానికి కూడా శక్తిలేదు.

అంతా స్తబ్దత.

"ఎక్కడికి వెళ్తున్నావు?"

"అన్నయ్య ఎక్కడున్నాడో చూస్తాను—ముందోసారి ప్రొఫెసరుగారింటికి వెళ్ళి. ఆయనను చూసి చాలా రోజులయింది" అంటూ కదిలేడు రమణ.

* * *

బల్లకి కుర్చీకి మధ్యగా పడివున్నాడు ప్రొఫెసరు ఆనందమార్గం. నాలుగురోజుల్నుంచీ తిండీ నీరూ లేకపోవటంతో శోషవల్ల సొమ్మసిల్లి పడిపోయేడు. ఈ క్షణమో మరుక్షణమో ఆఖరిశ్వాస పీల్చుకోవటానికి సిద్ధంగా వుంది ఆ వృద్ధుడి శరీరం. తన ప్రాణం పోయినా పర్లేదు. తను కనుక్కున్నది ప్రపంచానికి తెలిస్తే చాలు. కనీసం సగంమందన్నా బతుకుతారు. భూమ్మీద మనుష్యజాతి అంతరించదు.

ఎలా—?

ఈ విషయాన్నెలా బయటకి తెలియబరచటం?

అతడు చేతులమీద లేవటానికి ప్రయత్నించాడు.... అసలే వృద్ధుడు. అందులోనూ నాల్గురోజుల్నుంచీ ఏమీ తినలేదు. నీరసం పూర్తిగా ఆవరించింది. కుప్పలా కూలిపోయేడు. మళ్ళీ లేవటానికి ప్రయత్నిస్తున్నాడు.

అప్పుడు విన్నాడు బయట అలికిడి.

రమణ కంఠం.

"లేరా ఈయన?"

ఎవరో కుర్రవాడు సమాధానం ఇస్తున్నాడు, "లేరు. నాల్గురోజులక్రితం తాళం వేసుకొని వెళ్ళిపోయాడు."

"ఎక్కడికి?"

"తెలీదు."

ప్రొఫెసర్ గట్టిగా కేక వేయాలనుకున్నాడు. చిన్న మూలుగుమాత్రం బయటకొచ్చింది.

"నే వెళ్తున్నాను. ఆయనొస్తే వచ్చి వెళ్ళేనని చెప్పు."

లోపల ప్రొఫెసరు గిజగిజలాడి పోతున్నాడు. టేబిల్‌మీద గట్టిగా కొట్టటానికి ప్రయత్నించేడు. కుర్చీని బలంగా క్రిందకి తోసెయ్యాలని చూసేడు. సర్వశక్తులు కూడగట్టుకొన్నాడు. అయినా బలం చాల్లేదు. నిస్సత్తువ శరీరాన్ని తూలిపడేట్లు చేసింది. లోపలనుంచి ఏడుపు తన్నుకొస్తూంది. నిస్సహాయంగా పడివున్నాడు.

బయట అడుగుల చప్పుడు నెమ్మదిగా దూరమైంది.

కొంచెంసేపు గాఢమైన నిశ్శబ్దం ఆ గదిలో పేరుకొంది. చావుకి ముందొచ్చే కళలాంటిది అతన్లో ప్రవేశించింది. నెమ్మదిగా చెయ్యిసాచి కలం అందుకొన్నాడు. నన్ను రక్షిస్తే ప్రపంచాన్ని నేను రక్షించగలను. కాగితం తీసుకొన్నాడు.

వణుకుతున్న వ్రేళ్ళమధ్య బలం అంతా పొందుపర్చి వ్రాయటం ఉపక్రమించేడు. ఒక్కొక్క అక్షరమే. ఒక్కొక్క అక్షరమే.

"నన్ను రక్షిస్తే...."

అంతే. అతడి చెయ్యి జారిపోయింది. కను

రెప్పలు అచేతనమయ్యాయి. ప్రాణం శరీరాన్ని వదలిపోతోంది. ఆఖరిశ్వాస నెమ్మదిగా ఊపిరి తిత్తులనుంచి బైటకి వస్తూంది. దాంతోపాటూ ప్రాణంకూడా. ఆత్మజ్యోతి ఆరిపోతున్న ఆఖరి క్షణం. అతడి కళ్ళముందో దృశ్యం మెదిలింది.

రాయల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్.... స్టాక్ హోం. స్వీడన్. హాలు ఆహూతులతో కిక్కిరిసివుంది. ఒక్కోరంగంలో ఒక్కో విషయంలో పరిపూర్ణత సాధించిన మేధావులంతా కూర్చొనివున్నారు. రాయల్ డిగ్నిటీయరి ఆఫ్ హోలెండ్—ది కింగ్....ఎత్తైన వేదికమీద కూర్చుని వున్నాడు.

ఇన్‌వెస్టిట్యూర్ సెరిమనీ మొదలైంది.

ప్రపంచాన్ని రక్షించినందుకు ఆ సంవత్సరపు అత్యున్నతమైన బహుమతి...."ప్రొఫెసర్ ఆనందమార్గం."

ట్రంపెట్స్ మోగుతున్నాయి. అతని బయోడేటా—అతడు సాధించిన విజయాలూ సంక్షిప్తంగా చదవబడుతున్నాయి. గ్రేకలర్ సూట్లో అతడు మెట్లెక్కుతున్నాడు;

ది స్క్రోల్! అతడి విజయం వ్రాయబడిన స్వర్ణపత్రం బహూకరింపబడింది.

ది మెడల్!! తళతళా మెరుస్తూన్న పతకాన్ని అతడి కోటుజేబుకి హోలెండ్‌రాజు అలంకరించేడు.

చివరగా

దీ నోబుల్ ప్రయిజ్!!! ఇరవైలక్షలరూపాయల విలువచేసే చెక్కు.

అతడు రెండు చేతులూ సాచేడు. చాచటానికి ప్రయత్నం చేస్తున్నాడు, కళ్ళముందు దృశ్యం కరిగిపోతూంది. అయిపోతోంది.... అంతా అయిపోతోంది-అయి....పో....యింది.

అతడి ప్రాణం విశ్వంలో కలిసిపోయింది.

టు. వో. త్రీ. ని విడగొడ్తే త్రీ.ఓ.టూ.గా మారుతుందని మర్చిపోయిన ఆ అస్ట్రానమీ ప్రొఫెసరు తన కలల ప్రాంగణంలోనే సమాధి అయిపోయేడు.

* * *

ఆ చీకట్లో ఆమె హరికెన్ లాంతరు పట్టుకొని నడుస్తూంది.ఆమె మొహంలో ఆందోళన కదలాడుతూవుంది.నాలుగువైపులచూస్తూ ముందు కదుల్తోంది. "ఏమండీ" అని పిలుస్తూంది.

బీటలువారిన భూమిలోంచి పడుతూ లేస్తూ ఆమె గమ్యం లేకుండా సాగిపోతూంది. రాళ్ళూ గుట్టలూ దాటుకుంటూ వెళుతోంది. కంగారుని అదిమిపెట్టి, భర్తకేమయిందోనన్న ఆందోళనని నొక్కిపట్టి ఆమె వెదుకుతూంది. రాళ్ళూ గుట్టలూ దాటుకుంటూ వెళ్తూంది.

ఆమె కాలికేదో తగిలింది. వంగిచూస్తే బోర్లాపడివున్న శరీరం. ఎనిమిదేళ్ళ సహచర్యం ఆమెలో అనుమానాన్ని రేపింది. తిప్పి చూసింది.

ప్రకాశరావు. భయంనుంచి దూరంగా. దూరలోకాల్లో.

ఆమె కెవ్వున అరచింది. లాంతరు చేతిలోంచి జారిపోయింది. అతని మృతకళేబరం మీదపడి గోడుగోడున ఏడుస్తూంది. ఆ నిర్మానుష్యమయిన స్మశానంలో ఒంటరిగా ఆమె విలపిస్తూంటే సానుభూతి చూపిస్తున్నట్టు భూమీ ఆకాశం నిస్తేజం అయ్యాయి. పడిపోయిన హరికెన్ లాంతరు మినుకు మినుకుమని వెలుగుతూ ఆరిపోవటానికి సిద్ధంగా వుంది.

ఆమె ఎంతసేపు అలా యేడుస్తూ వుందో తెలీదు. చాలాసేపటికి తేరుకొంది. మోకాళ్ళ మధ్య తలపెట్టుకుని ఆ ఎండిన చెట్టుక్రింద అలానే కూర్చుండిపోయింది.

ఆమె మనసులో యిప్పుడు బాధ లేదు. అంతకన్నా భయంకరమైన స్థితి. నిర్వేదన.

ఆమె తలెత్తి చుట్టూ చూసింది. పిచ్చి మొక్కలూ, ఎండుకొమ్మలు, రాళ్ళగుట్టలు, అన్నిటినీ దాచుకొన్న చీకటి. ఆ చీకట్లో పొదచాటునుంచి మెరుస్తున్న రెండు కళ్ళు. పిల్లివా? నక్కవా? తోడేలువా?

ఆమె వణికిపోయింది. భయంతో కాదు. భర్త శరీరానికి పట్టబోతున్న గతి తల్చుకొని-మరిది ఎక్కడున్నాడో తెలియదు.

ఆమె లేచింది.

(ముగింపు వచ్చే సంచికలోనే)

మి నీ క థ

పెళ్ళయేదెట్లా?

జి. ఎస్.

పార్కులో మూలగా ఉన్న బెంచీమీద ఒక చివరగా మధుమతి కూర్చుని వుంది. రెండో చివర కూర్చున్న మోహన్ ఆకాశాన్ని, చెట్లను, దూరంగా ఆడుతున్న పిల్లలను మార్చి మార్చి చూస్తూ కూర్చున్నాడు.

"ఏదో ముఖ్యవిషయం మాట్లాడాలని చెప్పి నన్ను కూర్చోబెట్టి అరగంట దాటింది. ఇంకా ఎంతసేపని కూర్చోను?" అంది మధుమతి విసుగ్గా. మోహన్ కంగారుపడి ఆమె వైపు చూస్తూ, 'అదేనండీ....అదే....మీకు ఇష్టమైతే పెళ్ళి చేసుకోవాలని....' అనేశాడు గబగబా.

మధుమతి అర్థం కానట్లు చూస్తూ, 'మీ పెళ్ళికి నా ఇష్టం ఎందుకు?' అంది పెంకెగా.

'నేను పెళ్ళాడదల్చుకున్నది మిమ్మల్నే కనుక' అన్నాడు మోహన్, అతని జిడ్డుతనానికి చిరాకు, తడబాటుకి నవ్వు వచ్చాయి మధుమతికి.

'చూడండి మోహన్! మనకు పరిచయమై ఆర్నెల్లుపైనే అయింది. ఒక్క రోజైన నన్ను షికారుకైనా, సినిమాకైనా, కనీసం కాఫీకైనా రమ్మన్నారా? నన్ను కవ్వించే ఒక్క చిలిపి చేష్టకాని, కొంటెమాట విసరటంకాని చెయ్య లేదు. మీ లాంటి జిడ్డుమనిషితో నా ముద్దూ ముచ్చటా ఏం తీరతాయి? అందుకే గుడ్‌బై' అనేసి మధుమతి చరచరా వెళ్ళిపోతుంటే, 'ప్రేమించే పద్ధతి ఇది కాదు కాబోలు' అనుకొని దిగులుగా కూర్చుండిపోయాడు మోహన్.

※ ※ ※

సుమార్లు సంవత్సరం తరవాత ఆ పార్కులోనే చిరుచీకట్లు కమ్ముకుంటున్న సమయంలో తన ఎదురుగా కూర్చొని మాట్లాడుతున్న సునీతను దగ్గరకు లాక్కోబోయాడు మోహన్. భద్రకాళిలా విరుచుకుపడింది సునీత.

'నా కెటువంటి దురుద్దేశమూ లేదు సునీతా! నిన్ను పెళ్ళి చేసుకుంటాను' అంటూ శాంత పర్చబోయాడు మోహన్.

'అయితే మాత్రం! నా అభిప్రాయం తెలుసుకోకుండానే హద్దు మీరుతున్నావా? మూడు ముళ్ళు వేసేవరకు ఓపికపట్టలేనివాడివి పెళ్ళయాక, పెళ్ళాం పండక్కో, పురిటికో పుట్టింటికి వెళ్తే ఎన్ని వేషాలూ వేస్తావో? నిగ్రహం లేని మగవాడంటే నా కసహ్యం' అనేసి విసవిసా వెళ్ళిపోతూంటే, 'నాకింక పెళ్ళయ్యే గీత లేదు కాబోలు!' అనుకొని తల పట్టుకొని కూలబడిపోయాడు మోహన్. □

'కనక్ ప్రవాసి'కి దొరికిన కథ

'జ్యోతి' పాఠకులకు తిలక్ 'పాతకాపు'. నిండా నలభై యేళ్ళు నిండకుండానే, తన కవితాశక్తి 'సుతీక్ష్ణంగా విజృంభిస్తున్న' దశలోనే ఆయన కన్ను మూశాడు. శ్రీశ్రీ చెప్పినట్టు 'తిలక్ చనిపోవడం అంటే మిట్టమధ్యాహ్నమే సూర్యుడస్తమించినట్ట'యింది.

జీవితం

'అమృతం కురిసిన రాత్రి' కవితా ఖండికలతో ఆధునిక కవితారంగంలో తనదయిన ఒక వినూత్న కవితా రీతిని ఏర్పరచి అజరామరుడైన 'తిలక్'ని తెలుగు కవితకు కొత్త అందాలు దిద్దిన కవిగా ఎంద రెరుగుదురో, అసంఖ్యాకంగా రాయకపోయినా ఆధునిక తెలుగు కథకు కొత్తసోయగం తెచ్చిన కథకునిగా అందరూ ఎరుగుదురు. కథల్లోకూడా కవిత్వమే రాశాడు తిలక్. అసహ్యాన్నికూడా అందంగా పలకగలడు తిలక్.

తిలక్ రాసిన కథలు, స్కెచ్‌లు మొత్తం ఇరవైయారుకి మించిలేవు. వాటిలో 21, 'తిలక్ కథలు' పేరుతో పుస్తక రూపంగా రెండు ముద్రణలు పొందినా, 'లిబియా ఎడారిలో', 'జీవితం', 'రాలిన ఆకులు', 'తీవ్రవాద నాయకుడు', 'ఫలిత కేశం' అనే అయిదు కథలూ నేటికీ తిలక్ కథాసంపుటంలో చేరలేదు.

నేటివరకు అలభ్యంగా వున్న ఈ 'జీవితం' కథ 1949 ఆగష్టు 'భారతి' సంచికలో 'శ్రీ కనక్ ప్రవాసి'కి లభించింది.

—ఎడిటర్

→

కీ. శే. దేవరకొండ బాలగంగాధర తిలక్

జననం : ఆగష్టు 1921 — మరణం : జూలై 1966



చేతో లెదర్ సూట్‌కేస్ పట్టుకొని ప్లాట్‌ఫారంమీద ఇటూ అటూ తిరుగుతున్నాడు వెంకట్రావు. అతనికి వెనుకనుంచి యెవరో పిలిచినట్లయింది. తిరిగి చూశాడు—కుటుంబయ్యగారు.

"ఏమండోయ్ కుటుంబయ్యగారూ ఇలా.." వాక్యం పూర్తి చేయకుండా ఆపేశాడు, కుటుంబయ్య ప్రక్కన మెరుస్తో నించొనివున్న పద్దెన్మిదేళ్ళ అమ్మాయిని చూసి. "తిరిగి కుటుంబయ్య పెళ్ళి చేసుకోలేదుకదా!"

రావు ఆశ్చర్యం గమనించి కుటుంబయ్య ఇలా అన్నాడు: "దీన్ని మరచిపోయావుటోయ్! అవునులే, మనం ఆరేళ్ళయింది కల్సుకుని. చిన్నతనంలో, ఇద్దరూ ఆడుకునేవారు కూడాను!" ఇంతకీ ఎవరో చెప్పలేదు రావుకి. ఆ అమ్మాయి నవ్వుతో "మీరు గుర్తించనంతగా మారిపోయానా రావుగారూ" అంది. ఏమనాలో తెలియక డెలికేట్‌గా ఫీలయ్యాడు వెంకట్రావు.

"అమ్మాయి చదువుకుంటోంది. ఈ ఏడాది బి.ఏ జూనియరు అయింది. సంగీతంలోనూ, పెయింటింగులోనూ అభిరుచి వుంది. అయితే, యింజనీరు పరీక్ష ప్యాసై అప్పుడే ఉద్యోగంలో కూడా ప్రవేశించావుట కదూ? ఇలా యెక్కడికి వెళుతున్నావు, కాకినాడేనా? సగం వరకూ మేమూ వస్తాంలే! చాలా ఆనందంగా వుంది నాయనా నిన్ను చూడటం. తెలివితేటలైనవాడవూ, ఇంతకీ....అన్నట్టు, అమ్మాయీ, వాళ్ళమ్మా మనింట్లోనే వుంటున్నారు. ఓహో, నీకు తెలియదు కాబోలు, అమ్మాయి ఫాదరు పోయాడని. నాకూ జవసత్వాలు తగ్గినై. ప్రాక్టీసూ లేదూ మరొహటీ లేదు...." బాటీ దగ్గు వచ్చి కుటుంబయ్యగారి వాక్ప్రివాహానికి అడ్డువేసింది. ప్రక్కనే, ఆ అమ్మాయి నవ్వుతో నించొంది.

ఇంతకీ ఆమె ఎవరో తెలియక తికమక పడుతున్నాడు రావు. తప్పనిసరిగా చిరునవ్వు తెప్పించుకొని "అలాగాండి" అన్నాడు. దూరంగా పొగలు చిమ్ముకుంటూ వస్తూన్న రైలుని చూస్తోన్న ఆమె విలాససంపదని చూసి విభ్రమం చెందాడు.

రైలు వేగంగా వెళ్ళుతోంది. ..గాలికి ఎగిరే ముంగురుల్ని పైకి తోసుకుంటూ, ఆకర్షించే అందమైన నవ్వుతో, ఆమె రావుతో మాట్లాడుతోంది: "నాకు సంగీతమన్నా, పెయింటింగు అన్నా చాలా యిష్టమండీ. నేను చిత్రించిన సంధ్యాసుందరి క్రితం నెల '....' పత్రికలో పడింది చూశారా! జీవితాన్ని ఏదో కొంత ఉపయోగకరం చేద్దామని నా కోరిక. సంగీతం అన్నారా, అబ్బ, వీణలో అనుకున్నంత ప్రవీణత సంపాదించలేదండీ. మంచి గాలి వేస్తోంది, హాయిగా వుంది కదండీ."



ఆమె ఉత్సాహమూ, అమాయకత్వమూ వెంకట్రావును బాగా టచ్ చేసినై. ఆమె నవ్వుతూన్నంతసేపూ తెలీకుండా తనూ నవ్వాడు. కుటుంబయ్య కునుకుపాట్లు పడుతో ఉలిక్కిపడి లేచి "అమ్మాయి, స్టేషను వచ్చిందా?" అన్నాడు. "అప్పుడే ఏం స్టేషనూ!" అంది ఆమె. కుటుంబయ్య దగ్గు దగ్గి (ఉపన్యాసానికి సూచన) మొదలెట్టాడు:

"ఎప్పుడేనా వస్తోందవోయ్ మా వూరు. మా వంతెన రిపేరు చేయిస్తామంటున్నారు. మా వూరు నీ జ్యూరిస్‌డిక్షను క్రిందకే వస్తుందా? వెధవ వూరు, దోమలెక్కువ....అన్నట్టు మీ వూళ్ళో దోమలున్నాయా....మున్సిపాలిటీ ఏం శ్రద్ధ తీసుకోదు కదా! నా కిప్పిస్తే చేర్మెను పని ....రావూ! యీ నాటికీ నేను కోర్టుకి వెళ్ళితే, ఒక్క లాయరూ ఎదురుగ నిల్చొని వాదించలేడనుకో. మేం యిప్పటి వాళ్ళమా! మేం ఓల్డు బియ్యేలం. అమ్మాయి చదువులా, ప్యాషనులా?....అమ్మాయి వీణ మహచక్కగా వాయిస్తుంది. భోజనం అవగానే అమ్మాయి పాట వింటేనేగాని నిద్రపట్టదు కదా! అసలు ఆరోగ్యం పోయిందిలే. డాక్టరుని మంచి టానిక్ యిమ్మనాలి...."

ఒక విషయంలోంచి మరొక దాంట్లోకి దూకుతున్న ఈ ముసలి ప్లీడరు ఉపన్యాసాన్ని "ఓహో, అలాగా" అంటూ కడదాకా విన్నాడు వెంకట్రావు. చివరికి స్టేషను వచ్చింది. కుటుంబయ్యా, ఆమే లేచారు. "నేను వెళ్ళివస్తానండీ మీరింకా నన్ను గుర్తుపట్టలేదు" అంటూ ఫక్కున నవ్వింది. ఆశ్చర్యంగా ఫీలయాడు వెంకట్రావు. "గుడ్ యీవినింగ్, నేను నిర్మలని" అంటూ ఆమె కుటుంబయ్యతో రైలు దిగి మాయమైపోయింది.

స్టన్ (Stun) అయిపోయాడు రావు. నిర్మల—కుటుంబయ్య మేనకోడలు నిర్మల! ఎంత మనిషి అయిందీ, ఎంత అందమైనదీ, ఆరేళ్ళలో ఎంతగా ఎదిగిందీ, గుబురుగా పెరిగిన మొగలివనంలాగ. ఆ నవ్వు, కళ్ళల్లో ఆ తెలివితేటలు....తను మరచిపోగలడా? ఇలా ఆలోచించుకుంటూ తలెత్తాడు. ఎదురుగా ఒక

కోమటీ, విధవా కూర్చున్నారు....

2

"హలో, బ్రహ్మచారి" అని పలకరించాడు శంకరం, వెంకట్రావుని. 'బ్రహ్మచారి' అనే పదం గాలిలో మెలికలు తిరిగి ముల్లులా గుచ్చుకొంది రావు హృదయంలో. పార్కు నుంచి వస్తోంటే పైపెచ్చు శంకరం యిలా అన్నాడు: "ప్రేమ-ప్రేమలేంది బ్రతుకేమిటిరా! ఆఫీసునుండి ఇంటికి వెళ్ళగానే, నవ్వుతో ఎదురై, ఆదరించే ఆడది లేకపోతే ఆ జీవితం నరకం. ప్రేమలో ఎంతహాయి, ఆనందం, చైతన్యం వుందిరా...."

"నిజమే! తను ఎవరినేనా ప్రేమించాడా? తనకి వివాహమాడే వయస్సు దాటిపోయిందేమో కూడా! ఆ ప్రేమానుభవం యెలా వుంటుంది? హాల్‌కెయిన్, మొపాసా, సింక్లార్ మొదలైన వాళ్ళ నవలలు చదివాడు. అంతే! ఒక స్త్రీకి పురుషుడికీ మధ్య యింత ఆకర్షణ, యింత రొమాన్స్ దేవుడెందుకు పెట్టాడు. హత్య, త్యాగం, ఆనందం....చివరికి జీవితం ప్రేమకోసమా! అంత ముఖ్యమా ప్రేమ....

"తన జీవితం చాలా చిత్రమైనది. కాలేజీలో చేరిన రెండేళ్ళల్లో తల్లీ తండ్రీ చనిపోయారు, అప్పు మాత్రం మిగిల్చి. చదువు మానేసి ఏ నౌకరీనో చేద్దామంటూంటే, మేనత్త—ఆ మేనత్త యింటికి తనెప్పుడూ వెళ్ళలేదు. ఆవిడే ఒకటి రెండుసార్లు తన ఇంటికి వచ్చింది. చచ్చిపోతూ పాతిక ఎకరాలు తనకి రాసి యిచ్చింది. అదృష్టం. అదృష్టం కాకపోతే, పరీక్ష ప్యాసవగానే వందరూపాయల ఉద్యోగం రావడమేమిటి, పైఅధికారులచే మెప్పు పొందటమేమిటి. అన్నిటికన్నా రైలులో ఆమెని-నిర్మలని కల్సుగోవట మేమిటి. నెల్లాళ్ళయింది ఆ అమ్మాయిని చూసి. అప్పట్నుంచీ మనస్సు అదో విధంగా అయిపోయింది."

ఇలా ఆలోచించుకుంటూ, తన బంగళాలోకి వెళ్ళి కూర్చున్నాడు. నౌకరు వచ్చి అతని బూట్సు విప్పి, రోజూ అనే మాట ఈవాళా అన్నాడు: "బాబుగారు అలసిపోయారు" రాత్రి పడుకోబోయేముందు కన్నయ్యనిలా అడిగాడు: "ఒరేయ్ ప్రేమంటే ఏమిటో తెల్సునురా?" చాలా అనుభవం వున్నవాడిలా, చిరునవ్వు నల్లని పెదవులమీదకు రప్పించి "ఆడదాని మీద మనసు అవటం" అన్నాడు వాడు. మరి శబ్ద రత్నాకరంలో ఏమి రాశారో!

ఉదయం లేచి డ్రస్సు చేసుకొని కూర్చున్నాడు వెంకట్రావు. కారు ఆగిన చప్పుడయింది. వెంకట్రావు వీధిలోకి ఒక్క గెంతేశాడు. కారులోంచి డిస్ట్రిక్టు యింజనీరు రాఘవరావు దిగాడు. వినయంగా ఆయన్ని ఆహ్వానించాడు రావు.

"నీ శ్రద్ధా, తెలివితేటలూ మెచ్చుకోదగినవోయ్. నేను నీ విషయంలో ప్రత్యేకంగా ఆదరం చూపిస్తాను" అని కాంప్లిమెంటు యిచ్చాడు రాఘవరావు, మీసాల చాటున చిరునవ్వు దాచుకొని. "నర్సాపురం వంతెన రిపెయిర్ చేయించాలి. నీకే ఆ పని యిద్దామనుకుంటున్నాను. నువ్వు అనుభవం సంపాదించాలి. కంట్రాక్టర్లకి లొంగిపోగూడదు సుమీ. అన్నట్టు మీ పేటలో సీతమ్మ మాంచి నెయ్యి పోయిస్తుందిట కదూ, రెండు వీసెలు మనకి పంపించు" అని పర్సు తీయబోయాడు. వెంకట్రావు అతన్ని వారించి, "ఎంతమాట, తర్వాత ఇద్దురుగాని లెండి, సాయంత్రానికి పంపిస్తాను నెయ్యి" అన్నాడు.

ఆయన్ని సాగనంపి, మహానందంతో కుర్చీలో ఒక్క గెంతేసి కూర్చున్నాడు. 'ఏక బంగళ బనేన్యారా' అనే పాటని వెయ్యి వరసల్లో పాడుతూ, గది చుట్టూ తిరిగాడు. చాలా శాంతంగా, నెమ్మదిగా వుండే యజమానికీ వెర్రి ఆవేశం ఎందుకో తెలియక "బాబుగారు చాలా అలసిపోయారు" అన్నాడు కన్నయ్య.

వారం రోజుల్లో ఆర్డరు వచ్చింది. హోల్డాల్, పెట్టె, కన్నయ్యా తోడురా నర్సాపురం బయల్దేరాడు రావు.

3

నర్సాపురం వచ్చి రెండు రోజులైనా కుటుంబయ్యగారి యింటికి వెళ్ళేందుకు తీరిక

లేకపోయింది రావుకి. అందుకని కుటుంబయ్యగారే వచ్చి రావుని ఆహ్వానించి తీసుకువెళ్ళాడు. కుటుంబయ్య చెల్లెలు చాలా ఆదరించింది రావుని. కన్నయ్య నిర్మలకేసీ, రావుకేసీ ఎగాదిగా చూసి, "చిలకా గోరింకల్లా వున్నారు" అనుకొన్నాడు. నిర్మల తనవైపు తిరిగి మాట్లాడినపుడల్లా చొక్కా నలిగిపోయిందేమోననీ, జుట్టు చెదిరిపోయిందేమోననీ అనుమానంతో బాధపడి ఒంటరిగా అద్దంలో చూసుకొని సంతృప్తి పడేవాడు రావు.


భోజనాలయాక కుటుంబయ్య నిర్మలని పాడమన్నాడు. "ఇంజనీరుగారు వింటారు పాడవే" అంది లక్ష్మమ్మ. లక్ష్మమ్మ కుటుంబయ్య చెల్లెలు. అందమైనదీ, చదువుకొన్నదీ. భర్త పోయినప్పట్నుంచీ అన్నగారివద్దనే ఉంటోంది. "అచ్చంగా తల్లిపోలిక నిర్మల" అనుకున్నాడు రావు.

నిర్మల వీణను సున్నితంగా సుకుమారంగా మీటుతూ, కోకిల గొంతుతో పాడుతూంటే మరో ప్రపంచంలోకి వెళ్ళిపోయాడు రావు. ఆమె కళ్ళ కదలికా, పెదవుల వంపూ, నాజూకైన దేహమూ అతనికి ఒక సౌందర్య రేఖగా, ఆలేఖ్యంగా కనబడింది.

"అమ్మాయిని రేడియోకు రమ్మన్నారు. బహుశా ముందు నెలలో ప్రోగ్రాం వుంటుంది" అంది లక్ష్మమ్మ.

"ఎలా వుంది పాట" అంది వీణ క్రింద పెట్టుతూ నిర్మల. అంతవరకూ ఆమెవైపే చూస్తోన్న కళ్ళని మరల్చి, ఉలిక్కిపడినట్లుగా, "బావుంది, బావుంది" అన్నాడు. లక్ష్మమ్మ అతని రహస్యాన్ని గ్రహించింది.

ఎలా బయలుదేరిందో తెలియదుగాని, శరచ్చంద్రుని నవలల గురించి వాదనలోకి దిగారు రావూ, నిర్మలా. "ఆ ట్రాజెడీలు నాకు నచ్చవు-ఉహూ! అంత నిర్దయగా చంపేస్తాడు" అంది నిర్మల. "లేకపోతే పర్‌పస్ ఎలా నెరవేరుతుందీ, నిర్మలమైన ప్రేమ వున్నపుడు" అన్నాడు రావు. "ప్రేమ వుంటే మాత్రం—దేవదాసులాంటి ఆవేశపరులూ, ఉన్మాదులా దేశానికెందుకండీ. ఆడదే జీవితంటండీ. కళ



వుంది, సంఘం వుంది. ఏదో ఒక పనిలో నిమగ్నులవాలి. లేకపోతే తిని కూర్చోవాలి" అంది ఆవిడ. "మరి అది ప్రేమట. ప్రేమించి విఫలులైన వాళ్ళు అలా అవుతారేమో మరి! నాకేం తెల్సును" అన్నాడు రావు ఆలోచిస్తూ. "మీరెవర్నీ ప్రేమించలేదూ? అదేమిటండీ" అంటూ కిలకిల నవ్వుతూ వీణతో లోపలికి పారిపోయింది నిర్మల.

తను ప్రేమించాడా! పాతికేళ్ళు వచ్చినా ఆ ప్రేమ తనకొక స్వప్నభావమే కాని వాస్తవికంగా అనుభవించాడా-అందరూ ప్రేమిస్తారు, తనొక్కడే యిలా అయిపోయాడు. ఈ సందేహాలు రావులో ఆలోచన రేపినై. కుటుంబయ్య యీజీచైరులోనే కునికిపాట్లు పడుతున్నాడు. లక్ష్మమ్మ తన పూర్ణయాత్ర అనుభవాలు చెపుతూ యిలా అంది: ఇంగ్లీషు రాకపోయినా, తెలుగు పత్రికలూ, పుస్తకాలూ నేనూ చదువుతోంటాను నాయనా. స్త్రీకి స్వతంత్రమూ, విద్య వుండాలని నా ఉద్దేశ్యం. మా నిర్మలని చూశావా. అన్నీ చదువుతుంది, వాదిస్తుంది, తెల్సుకొంటుంది. కాలేజీలో కూడా మాట్లాడిందట.... ఏదో దానిమీద ఆశ పెట్టుకొని వున్నాను. ఈ సెలవులయాక మద్రాసు వెళ్ళుతుంది. ఈ ఏడాదితో బి. ఏ. పూర్తి అవుతుంది. అంత వరకూ దాని పెళ్ళిమాట తలపెట్టదలచుకోలేదు. కట్నాలూ, గిట్నాలూ ఏం ఇవ్వలేం సుమీ.

దాన్ని చూసి చేసుకోవలసిందే....ఇంతకీ ఆ యీశ్వరుడున్నాడు."

ఆవిడ దగ్గర్నుంచి సెలవు తీసుకొని, అర్ధమవని భావాలు మనస్సులో కలవరపరుస్తూండగా, తిన్నగా లాడ్జికి వెళ్ళాడు రావు. ఇంతలోకే కాంట్రాక్టరు చౌదరి వచ్చి వంతెన దగ్గరకు తీసుకువెళ్ళాడు. ఆలోచించేందుకు తీరిక యివ్వకుండా. చీకటిపడ్డాక తిరిగి వస్తూంటే, చౌదరి ఆ వూరిని గురించి విసుగెత్తేట్టు పొగిడాడు. ఒక పాడుకొంపను చూపించి దాని చరిత్ర, పరమార్థమూ చెప్పి యిలా అన్నాడు: "రాత్రిళ్ళు దెయ్యాలు కొరకంచులు చేతులతో పట్టుకొని యీ కొంపలో తిరుగుతుంటాయి, ఆ మధ్య ఒక పిల్లాడు పొరుగూరి నుంచి వస్తోంటే, దెయ్యాలు దారి తప్పించి చంపేశాయి. ఉదయానికి ఎముకలు మాత్రం మిగిల్చాయి."

వెంకట్రావుకి దెయ్యాలున్నవనే నమ్మకం లేకపోయినా, భయం ఎక్కువ. ఆ ప్రసంగాన్ని మరొకదాంట్లోకి మార్చేశాడు. విద్యాధికులకి అంతే—దెయ్యాలని నమ్మరు కాని, పిరికితనం!

బంగళాకి వెళ్ళగానే "బాబుగారలసిపోయారు" అంటూ కనకయ్య ఎదురయ్యాడు. రావు అతన్ని పరిశీలించకుండా, గదిలోకి వెళ్ళి మంచంమీద పడుకొన్నాడు. తల దిమ్ముగా వుంది. ఆనందమో, ఏడుపో—ఏదో గుండెలో గుసగుసలాడుతోంది. తను అలవాటుపడి ఆనందించిన ఆ గది ఒంటరితనమూ, నిశ్శబ్దతా చాలా అసహ్యంగా చికాకు కలిగిస్తున్నాయి. ఒక లేతపాదం యీ చివరి నుంచి ఆ చివరికి నడిచి వెళ్ళినట్లనిపించింది. తనలో తెలియరాని ఒక గొప్పమార్పు వస్తోందనుకున్నాడు రావు. లేచి ఒక పుస్తకం తీసి పేజీలు తిరగవేస్తూ, అలాగే నిద్రపోయాడు.

ఉదయం లేచేటప్పటికి మాంచి ఉత్సాహంగా ఫీలయాడు. డ్రెస్సువేసుకొని తిన్నగా వంతెన దగ్గరకువెళ్ళి మధ్యాహ్నం వచ్చాడు. ఒక కునుకుతీసి లేవగానే, నిర్మల నవ్వు మొహం జ్ఞాపకం వచ్చింది. తక్షణం టాయిలెట్ చేసుకొని, గుమ్మం దాటగానే కారులో కుటుంబయ్య, లక్ష్మమ్మ, నిర్మల!

"రావోయి, అలా తోటలోకి వెళ్ళివద్దాం" అన్నాడు కుటుంబయ్య. రావు బెట్టుసరికి "కొద్దిగా పనుంది, కంట్రాక్టర్ని...." అంటూ నసిగాడు. "ఆఫీస్యల్సు పనులు పనులంటారేమిటండి యెప్పుడూ. ఆనందించ లేరటండీ యటువంటి యీవినింగ్సు? మీరు తప్పక రావాలి" అంది నిర్మల చిరుకోపంతో దరస్మితాలని మిళితం చేసి.

ఆ పలుకుల కోసమే వేచివున్నాడు. ఒక్కమారుగా కారులోకి గంతేసి ఆమెను ముద్దెట్టుకొందామనుకున్నాడు. లక్ష్మమ్మ కూడా రమ్మంది. ఒక్క నిమిషంలో వాళ్ళందరూ తోటలో వున్నారు. "నారింజ, బత్తాయి, మామిడి....చక్కని తోట. ఎకరం పదిహేనువందలెట్టి మూడు యెకరాలు కొన్నా"నన్నాడు కుటుంబయ్య సంతృప్తితో, గర్వంతో. తోట చుట్టూ తిరిగి లక్ష్మమ్మతో ఒకచోట కూలబడి తన కోర్టు అనుభవాలు చెపుతున్నాడు. రావూ, నిర్మలా ముందుకు సాగిపోయారు.

"నాకు తోటల్లో తిరగాలని సరదా" అంది నిర్మల.

"నాకున్నూ!"

"నా పెయింటింగులలో సహం యిక్కడ కూర్చొని వేసినవే" నంటూ ఆమె తన స్వవిషయాన్ని గురించి ధారాళంగా ముచ్చటించింది. రావు తన క్లబ్బు విషయాలు చెప్పుతూ యిలా అన్నాడు: "నాకు టెన్నిస్ అంటే ప్రాణం. ఒక కప్పుకూడా సంపాదించాను."



"నాకు టెన్నిస్ ఆడే వ్యాళంటే యిష్టం. టెన్నిస్ అంటే కోపం" అంది నిర్మల కొంటెగా. రావు వుబ్బిపోయాడు ఆ పలుకుల అర్థం ఎనలైజుచేసి!

దూరంగా త్రాచుపాము, హంతకుడి ఆలోచనలా, మెలికలు తిరుగుతూ వెళ్ళింది. నిర్మల "అమ్మో" అంటూ రావు వొళ్ళోకి ఒక్క గంతేసింది. రావు భయంలేదని హెచ్చరించాడు. ఆమె అతని చేతుల్లోంచి తప్పించుకుని ఏమీ ఎరగనట్టుగా "నాకు పాములంటే భయ్యం" అంది. ఆమె స్పర్శ, వెంకట్రావులో జడంగా పడివున్న శక్తుల్ని చైతన్యవంతంగా చేసింది. ఒక థ్రిల్ తన అణువణువులోనూ పొందాడు.

పచ్చని చేలూ, పైరుగాలీ వారి తెచ్చికోలు మర్యాదలని ఒక మూలకి త్రోసి, ప్రకృతి స్వాతంత్ర్యంలోనికి లాక్కున్నాయి. తాను ఒక యింజనీరుననీ, ఆమె ఒక స్త్రీ అనీ మరచిపోయారు. నవ్వుకుంటూ శైశవ చేష్టలతో ఆడటం మొదలెట్టారు.

"ఆ పండు యెవరు ముందు అందుకుంటే వాళ్ళది" అంటూ నిర్మల పరుగెత్తింది. రావు ఆమె ననుసరించాడు. పండు రావుకే దొరికింది. "ఓడిపోయావు నిర్మలా!" అన్నాడు రావు. "మీవలె పరిగెత్తగలమా!" అంది వగరుస్తూ నిర్మల.

"మీ రబలలు—అబలలు" అంటూ రావు ఆమెతోకల్సి తిరిగివచ్చాడు. మధ్యలో సంభాషణని 'పెళ్ళి—దాని చరిత్ర'లోకి మార్చాడు, ఆమె ఉద్దేశ్యం తెలుసుకుందామని. ఆమె ఇలా అంది. "కొన్ని శక్తుల్ని అభివృద్ధి పరచుకుందామన్న వాళ్ళకి పెళ్ళి అనవసరం. కాని, ప్రతీ సామాన్యుడూ పెళ్ళి చేసుకోవల్సిందే!"

"నువ్వు?"

"నేనా....నేనా....మీరేం చేస్తారు" అంటూ నవ్వుతూ సంభాషణ మార్చేసింది నిర్మల. పెళ్ళి విషయం ఆడవాళ్ళ నడగకూడదనీ,వాళ్ళు సిగ్గుపడతారనీ తెల్సుకున్నాడు రావు.

కారు ఎక్కినట్లూ, యింటికి వెళ్ళినట్లూ



జ్ఞప్తిలేదు రావుకి. గదిలో సామాను యిక్కడి దక్కడా, అక్కడి దిక్కడావేసి చిందరవందర చేశాడు. పావలాతీసి, "ఏదేనా కొనుక్కోని తినరా" అని కన్నయ్య కిచ్చాడు. అతని తల వేడెక్కిపోయింది. అద్దంలో చూసుకొని నవ్వుకున్నాడు. ఆమె ముంగురుల్నీ, ఎర్రని పెదవుల్నీ, నవ్వే కళ్ళనీ తల్చుకున్నాడు. కిటికీలోంచి ఆకాశంకేసి చూశాడు. మేఘాలు దట్టంగా క్రమ్మినై. హోరున వర్షం వచ్చింది. సముద్రపుగాలి అతని మొహానికి కొట్టుతోంది. ఆ వర్షంలో తనూ, నిర్మలా తడిసి చలితో 'ఉహూహూ!' అంటూ ఇంటికివస్తే యెంత బావుంటుంది అనుకొన్నాడు.

ఎవరూ యిన్వెంటు చేయలేని విషయం తను కనుక్కొన్నాడు. అది ప్రేమ—ప్రేమ! ఇన్నాళ్ళకి ఆ తియ్యని అనుభవం పొందగలిగాడు. భావిజీవితం నిర్మలతో యెలా గడపాలో ఆలోచించుకుంటూ నిద్రపోయాడు.

4

ఆ వారం రోజులూ కుటుంబయ్యగారి కుటుంబంతో చాలా సరదాగా గడిపాడు. లక్ష్మమ్మ అతనికి రోజుకన్న రోజు ఎక్కువ ఆదరం చూపింది. ఇంక, చలాకీ నిర్మల! రోజూ పాటలు పాడేది, కబుర్లు అనేకం చెప్పేది. విద్యావతి, ఉత్సాహవంతురాలు, తన కన్నివిధాలా సరిపోయిన యువతి—ఆమెని తప్పక వివాహం చేసుకోదలిచాడు. కాని, లక్ష్మమ్మ, బి. యే. అయితేకాని నిర్మలకి పెళ్ళి చెయ్యదలచుకోలేదు. కాబట్టి ఆ ఏడాదీ ఎలాగో లాగ ఓపిక పట్టదలచుకున్నాడు. ఆ ప్రసంగం నిర్మల దగ్గర తీసుకువద్దామనుకున్నాడు కాని, ఆమె యేమి చెపుతుందోనన్న భయమూ సిగ్గు అతన్ని అడగనివ్వలేదు. అయినా ఒక సంవత్సరంగా, తను వేచివుండేది.

ఉదయంలేచి స్నానాది కృత్యాలు తీర్చుకుని, ఒక్కడూ యీజీచైర్‌లో కూర్చున్నాడు. ఆ సమయానికే నిర్మల చేతిలో అట్టా, పెన్సిలూ పట్టుకొని వచ్చింది.

'నిర్మల!'—ఆలా వస్తుందనుకోలేదు రావు

"ఈవాళ మీరు వెళ్ళిపోతున్నారుగా! ఈ పదిరోజులూ అలవాటు అవటం మూలాన్ని, మీరు వెళ్ళుతున్నారంటే యేదో కొత్తగావుంది. ఒక్కరూ గదిలో కూర్చొని ఏం చేస్తారు రండీ, అలా తోటలోకి వెళ్లి లాండ్-స్కేప్‌ని పెయింటు చేస్తాను, చూద్దురుగాని." రావు మాట్లాడకుండా ఆమెతో బయలుదేరాడు. ఆర్టిస్టుకి కలిగే ఆవేశం కళ్ళలో జ్వలిస్తూవుండగా, నిర్మల పెయింటింగు ఆరంభించింది. ప్రక్కనే నిల్చుని ఆనందిస్తున్నాడు రావు—ఆమె అంగుళలు దిద్దిన రేఖలకి కాదు ఆమె భుజం వంపుకీ, వ్రేళ్ళ కదలికకీ, కళ్ళలో వెలుగుకీ. మధ్య లో యేమేమో చెప్పాడు కాని ఆమె వినిపించుకోలేదు. పూర్తిచేసి, విజయచిహ్నం చూపుల్లో దాచి "ఎలావుంది" అంది.

"చాలా బావుంది. నీ అంత బావుంది"అనా లనే అన్నాడు రావు. చిరుకోపంతో చూసి వూరుకొంది. రావు ఆమె చెక్కిళ్ళపై సిగ్గు గులాబీలు పూయటం గమనించాడు.

సాయంత్రం కుటుంబయ్యా, నిర్మలా స్టేషనుకు వచ్చారు, వెంకట్రావుని సాగనంపటానికి. రైలు తప్పిపోయినా బావుండునే, రైలుపట్టాలు కదలిపోతే—యిలా వున్నాయి రావు ఆలోచనలు.

"నేను ఇరవైరోజుల్లో మద్రాసు వెళ్ళిపోతున్నాను. మీరు వుత్తరం రాస్తారా? మీరెక్కడ? యింజనీరుగారు! మీకు మూర్‌మార్కెట్లోంచి చక్కని ప్రెజెంటు కొని పంపిస్తాను. మీరు ఏం యిస్తారు?" అంది నిర్మల.

చెమ్మగిలే కళ్ళతో, రావు రైలులోంచి చేతుమాలు వూపాడు. నవ్వుతో నిర్మల, కుటుంబయ్యతో వెనక్కి తిరిగింది.

5

"సంవత్సరానికి అరవై రెండు నెలలుకాబోలు, వెధవ సంవత్సరాలూ, మాసాలూ" అని విసుక్కుంటున్నాడు రావు. కన్నయ్య తన తెలివినంతా వుపయోగించి, వేళ్ళు లెక్కపెట్టి 'పన్నెండు' అన్నాడు.

రెండు నెలలయింది తను నర్సాపురంనుంచి వచ్చి. కాని, నిర్మల దగ్గర్నుంచి ఒక్కవుత్తరమేనా రాలేదు. తన ఫోటోపంపి, ఆమె ఫోటో కూడా పంపమని వుత్తరం రాశాడు. కాని జవాబు రాలేదు.

రోజూ ఉదయం లేవటం, ఆఫీసుపని చూసుకోవటం, సాయంత్రం క్లబ్బుకెళ్ళటం, శంకరంతో కష్టసుఖాలు మాట్లాడుకోవటం— ఇదీ రొటీన్. డిస్ట్రిక్టు ఇంజనీరు రాఘవరావు గుండె ఆగి, హఠాత్తుగా చచ్చిపోయాడుట! శంకరానికి ఆడపిల్ల కలిగింది. క్లబ్బు వర్ధంతిలో నాటకంవేస్తూ 'త్రి' మూర్ఛపోయేడు. థియేటరులో మంచిపిక్చరే ఆడటం లేదు. రోడ్డులు పాడయినవి రిపెయిర్ చేయించాలి, బాగున్నవి పాడుచెయ్యాలి. యుద్ధంలో అనేకమంది ప్రజలు చచ్చిపోతున్నారు. కన్నయ్యకి కాలిమీద కురుపులేచి మానింది. బంగాళా దుంపలు సుబ్బయ్యకొట్టులో అయిపోయాయిట ....ఇవీ విశేషాలు. వెధవ సంవత్సరాలూ, వెధవ వేషాలున్నూ! వెంకట్రావుకి యిరిటేషన్ యెక్కువయింది.

ఒకరోజున సాయంత్రం శంకరానికి రహస్యము చెప్పేశాడు: "వారేయ్ నేను ప్రేమించానురా!"

"ఏడిశావ్."

"నిజం!"

"ఋజువు!"

"వినయితే కథ!" అని తన ప్రేమగాధని ఆవేశంతో చెప్పాడు.

"నువ్వు ఉత్తరం రాశావుకదా! ఫోటోకూడా పంపావుకదా! అయినా యీ రెండు నెలలకీ నీకు జవాబు రాలేదు. కంక్లూజన్ యేమిటీ— ఆమె నిన్ను ప్రేమించలేదన్నమాట" అన్నాడు శంకరం.

బిక్కమొహంతో యింటికి వెళ్ళిపోయాడు వెంకట్రావు. వీధిలో జట్కాబండి, దీపస్తంభం అన్నీ తన్ని చూసి పరిహసిస్తున్నాయనుకొన్నాడు. తను నిర్మలతో గడిపిన రోజులు జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. "వెధవ శంకరం, వాడికి ఈర్ష్య. లేకపోతే, నిర్మల నన్ను ప్రేమించక పోవటమేమిటీ" అనుకున్నాడు. "యీ వారంలో ఇంకొక వుత్తరం రాస్తా. జవాబు రాకపోతే విషంమింగి పగ సాధించుకుంటా" అనుకున్నాడు. తర్వాత రోజున చిన్న వుత్తరం వ్రాసి పంపాడు. "నీ ఉత్తరాలకి అయిదు పేస్టు పేస్టు బేస్కెట్స్ సరిపోలేదు. నీ ఫోటోలకి గోడలు సరిపోలేదు" అని రాశాడు. తన తెలివికి తనే సంతోషించాడు. లైబ్రరీలోంచి ప్రేమను గురించిన నవలలు తెచ్చుకొని చదవటం మొదలెట్టేడు.

వారం అయింది జవాబు రాలేదు. 'రేపు' అంటే 'రేపు' అనుకొన్నాడు. పదిహేను రోజులయింది: జవాబులేదు. "విషం మింగి ఎప్పుడూ చావను. ఛ! ఇంతకంటె అందమైనదానినీ, విద్యావతినీ పెళ్ళాడి ఏడిపిస్తా" అనుకొన్నాడు.

ఒకవేళ ఆమె సిగ్గుపడిందేమో, సిగ్గయితే, తనతో నర్సాపురంలో అలా అంత సరదాగా తిరుగుతుందా? ఆడవాళ్ళని నమ్మకూడదు.

ఆరోజున మధ్యాహ్నం యింటికి వెళ్ళలేదు. స్నేహితుని ఇంట్లో భోంచేసి, సాయంత్రం క్లబ్బుకి వెళ్ళాడు. అతనికి చీకాకు, తలనొప్పి ఎక్కువయినై. ఒకానొక వాదనలో "ఆడవాళ్ళకి స్వతంత్రం యివ్వగూడదనీ, స్వార్థత్వమూ, మోసమూ వాళ్ళలో హెచ్చు" అనీ వాదించాడు. తర్వాత దీపస్తంభాలు లెక్కపెట్టుతూ ఇంటికి చేరాడు.

గుమ్మం ముందు కన్నయ్య నుంచొని వున్నాడు. రోజూ అనే మాట ఇవాళ అనలేదు "బాటుగారికేదో పెద్ద పళ్ళబుట్ట వచ్చింది. కమ్మని వాసన కొట్టుతోంది" అన్నాడు. ఒకవేళ కంట్రాక్టరేమైనా పంపాడేమో అనుకొని, తిన్నగా వెళ్ళి వెంకట్రావు 'ఉస్సు' అంటూ కుర్చీలో కూలబడ్డాడు. కన్నయ్య ఒక పెద్ద బుట్ట ఎదురుగా పెట్టి, చేతిలో ఒక కవరూ, పార్శిలూ పెట్టాడు. ఆతృతతో వెంకట్రావు కవరు తెరచాడు. నిర్మల దగ్గర్నుంచి. ఆనందంతో, స్పందించే హృదయంతో చదివాడు. అందులో వున్న సారాంశం ఇదీ—తను లాడ్జి మారటంవల్ల ఉత్తరాలు ఆలస్యంగా చేరినట్లూ అదీగాక, అతని ఆతృతని వృద్ధిపొందించటం తనకొక సరదా అనీ వ్రాసింది. "రాజకీయా

లంటే ఈ మధ్య నాకు సరదా కలిగింది. చాలా ఇంటరస్టుతో చదువుతున్నాను....క్రితం నెల రేడియోలో నా పాట విన్నారా?....మీకు చాలా కోపం వచ్చివుంటుంది కదూ ఉత్తరం రాయ లేదని....జీవితంలో నేను చేయవల్సిన పనులు చాలా వున్నాయనిపిస్తోంది. ఈ మధ్య ఆడ వాళ్ళం (విద్యార్థినులం) కలసి ఒక కల్చరల్ క్లబ్బు స్థాపించాము. కళలూ, విజ్ఞానమూ అభి వృద్ధి పొందించటానికి .... ఇంజనీరుగారూ! ఎన్ని రోడ్లు రిపెయిర్ చేయించారు...."
ఇలాగే ఏమేమో రాసింది. పార్శెలు విప్పాడు. ఒక చిన్న సెల్యులాయిడ్ బొమ్మ, దువగ లున్నా—ఫోటో! అచ్చంగా నిర్మల-ఆ నవ్వు తోన్న మొహమూ, ఆ ముంగురులూ, ఆ మృదువైన చేతులూ....

ఆగలేని ఉద్రేకంతో ఆ ఫోటోని ముద్దెట్టు కొన్నాడు. గది తలుపులు వేసుకొని, ఉత్తరం లోని గుండ్రని అక్షరాల్లోని రహస్య హస్త విన్యాసాన్ని తల్చుకొన్నాడు. ఈ శుభవార్త చెప్పినందుకు కన్నయ్యకి అయిదు రూపాయలు బహుమానం యివ్వదలచుకొన్నాడు. ఆ గదీ, టేబిలూ, గోడకిసాలీడూ, పుస్తకాల షెల్ఫూ-అన్నీ ఆనందంతో నవ్వుతున్నాయి.

తర్వాత రోజున ఆమెకి చాలా ఉత్సాహంతో వుత్తరం రాశాడు. ఆమె 'కల్చరల్ క్లబ్బు'ని పొగిడాడు. "నువ్వు నాకు దేవతవు" అన్నాడు ఒకచోట....

అప్పట్నించి ప్రతీ పదిహేను రోజులకీ ఆమె దగ్గర్నుంచి ఉత్తరం వస్తోంది. ఎప్పుడూ సంగీతం గొడవా, కల్చరల్ క్లబ్బు విశేషాలూ. "స్త్రీ తల్చుకుంటే భారతదేశాన్నే కాదు, ప్రపం చాన్నే మార్చివెయ్యగలదు. ప్రపంచకళ్యాణం మా చేతుల్లో వుంది" అని రాసింది ఒకచోట. ఆ వుత్తరాలు, మంత్రాలు చదివి చదివి విసు గెత్తిన పురోహితుడి మొహంలాగ వున్నా, వాటిల్లోనే కొత్తసొంపులూ, కొత్త అర్థాలూ కనిపెట్టుతున్నాడు వెంకట్రావు.

అయిదు నెలలు యిలా గడిచినై. నిర్మల ఫోటో చక్కని ఫ్రేములో అమర్చబడి బల్ల మీద నవ్వుతోంది. హేమంతాలూ, శ్రావణాలూ అన్నీ వొక వసంతంలాగున్నాయి రావుకి. రోజులు లెక్కెస్తున్నాడు. క్యాలెండర్లు తయారు చేసిన వాళ్ళ బుద్ధిహీనతని దూషిస్తున్నాడు. ఆ వూళ్ళో ఒక చిన్న మేడని అద్దెకి మాట్లాడి వుంచాడు, భావిజీవితం నిర్మలతో గడిపేందుకు. సంసారానికి కావల్సిన సామానులేమిటో రాత్రింబవళ్ళు ఆలోచించి ఒక పట్టీ తయారు చేశాడు. ఆ పట్టీలో, ముందు పుట్టబోయే వంశో ద్ధారకుడికి పాలపీపీలూ, తొక్కుడుబండీ, నిర్మలకు పియానో, కుంచెలూ, కాన్వాసూ కూడా వున్నాయి. ప్రొవిన్షియల్ ఇంజనీర్ల సభలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. కార్య నిర్వాహక వర్గంలో సభ్యుడైనట్టు ఆంధ్ర పత్రికలో పడింది. పేపరు కటింగు వొకటి నిర్మలకు పంపించాడు.

పెళ్ళి అయి, సంసారం సాగిస్తూ వున్న మిత్రుల యింటికి తరచు వెళ్ళి, వాళ్ళ సౌఖ్యమూ, వాళ్ళ సొంపూ, సొగసూ చూసి నేర్చుకునేవాడు. "రష్యా అంటే చక్కని దేశమే కాని, ఫేమిలీ-కుటుంబ సౌఖ్యం ఉండదోయ్" అనేవాడు సోషలిస్టు కామ్రేడ్తో. తను నర్సాపురం వెళుతూన్నట్టు నిర్మల దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. కాని ఆమె తేదీ సరిగా వ్రాయక "మూడు నాలుగు రోజుల్లో" అని వ్రాసింది. రెండు రోజులు కాళ్ళు పడి పోయేట్టు స్టేషను చుట్టూ తిరిగి ఆశాభంగం పొందాడు. "రాత్రి బండికెళ్ళిందేమో" అని సమాధానపరచుకొన్నాడు.

నర్సాపురం వెళ్ళి లక్ష్మమ్మని కల్సుకుని, పెళ్ళి విషయం మాట్లాడుదుదామని నిశ్చ యించాడు. కాని ఇంతలోకే అతనికి ప్రభుత్వం పని తగిలింది. వారం రోజులోపికపట్టి ఆశతో, ఆనందంతో, ఉత్సాహంతో, కన్నయ్యని ఇంటి దగ్గర వుంచేసి, 'సిరికింజెప్పడు' అన్నంత వేగంతో బయలుదేరాడు. మానవుడికి రెక్కలు వుండటం చాలా అవసరమని యింజనీర్ల సభలో తీర్మానించటానికి నిశ్చయించుకొన్నాడు.

6

ఏడాది క్రిందటి నిర్మలకన్న ఈ నిర్మలలో

వెధవది - కూడికలు - తీసివేతలు కూడా తప్పులేనట.. అహా మీ నాన్నేం అకౌంటెంటూర్రే - అన్నారు మా మాస్టారు!!



సౌందర్యం యినుమడించింది. ఆమె కళ్ళల్లో వసంతాలు నవ్వుతున్నై. ఆమె శరీరపు కదలి కలో, పెదవి వంపుల్లో జవ్వనపు జిగిబిగి గోచ రిస్తుంది. గులాబీరంగు రిబ్బను కొసను కట్టిన వాల్జడ సౌఖ్యానికి సోపానసరళిలా వుంది.

కుటుంబయ్యకి దగ్గు ఎక్కువయింది. లక్ష్మమ్మ చాలా సంతోషంతో ఆదరించింది. మొదటిరోజున నిర్మల అంతగా మాట్లాడలేదు రావుతో. ఏదో పుస్తకం తీసుకొని మేడమెట్ల మీద కూర్చొని సాయంత్రం వరకూ చదువు తోంది. కొత్తగా నేర్చుకొన్న పాటలు పాడింది. తన యాక్టివిటీస్‌ను గురించి చెప్పింది. ఆమె చలాకీతనానికి గాంభీర్యము తోడై కొత్త అందాన్ని కూర్చింది.

మరునటి రోజున లక్ష్మమ్మ దగ్గర బిడియ పడుతూ వివాహ ప్రసంగం తెచ్చాడు. లక్ష్మమ్మ యిలా అంది: "నాయనా, నిన్నే అడుగు దామనుకొంటున్నాను. కావల్సినవాడవూ, ఉద్యోగస్థుడవూ యింతకన్నా నాకు కావల్సిం దేమిటి? అమ్మాయి కూడా యిష్టపడుతుందనే నా ఉద్దేశ్యం. ఎప్పుడా ప్రసంగం తెచ్చినా, 'నీ కెందుకు నీ గొడవకా'దంటుంది. అయినా ఈ వేళ అడిగిచూస్తాను. చదువుకొన్నవాడవు, దొరలలా మీరే ఆలోచించుకోండి."

లక్ష్మమ్మ అడిగి చెప్పేవరకూ రావు ఓర్చు పట్టలేకపోయాడు. మధ్యాహ్నం నాలుగు గంటలకి నిర్మల గదిలోకి వెళ్ళాడు. నిర్మల వీణ వాయిస్తోంది.

"నిర్మలా!"

"ఊఁ!"

"నీతో ఒక విషయం మాట్లాడాలి."

"చెప్పండి."

"ఇక్కడకాదు-తోటలో!"

ఆమె విశాలమైన కళ్ళనెత్తి రావు కళ్ళల్లోకి చూసింది. ఆమె బుగ్గ లెర్రపడ్డాయి. కాని ఏమీ తెలియనట్టు 'అలాగే' అంది.

తోటలో మామిడి చెట్టుక్రింద నిల్చుని ఆమె నడిగాడు, ఆమె చేతిని తన చేత్తో పట్టుకుని. ప్రకృతి పవిత్రమైన గంభీరత దాల్చింది. పచ్చని చేలు ఎండలో మెరుస్తున్నాయి. ఆ వేళం రావు గొంతులో 'జలజలించింది.'

"నిర్మలా! నేను చెప్పబోయే విషయం నీకు తెలిసే వుంటుంది. నేను తలిదండ్రులు లేనివాణ్ణి. స్వశక్తిచేత ఈ స్థితిలోకి వచ్చాను. నాకు నూట పాతికరూపాయలు జీతము, మేనత్త రాసి యిచ్చిన పాతిక ఎకరాల నా ఆస్తి....నాకు జీవి తంలో ('జీవితం' అని ఉచ్చరించినపుడు అతని గొంతు వణికింది. అతని బ్రతుకు తన యెదురుగా

చిల్చొని నవ్వినట్టనిపించింది.) ఏ కోర్కెలేదు- ఒహటి తప్ప. నా కష్టసుఖాల్ని పంచుకొందుకు నా ప్రేమకు తిరిగి ప్రేమ యివ్వటానికి, నా యింట్లో ఒక దేవత-ఒక చిరునవ్వు-ఒక స్త్రీ- (అతని గొంతు తిరిగి ఒణికింది) నిన్ను ప్రేమిస్తున్నాను నిర్మలా! నీ ప్రేమ అమూల్యం. నిన్ను పెళ్ళి చేసుకొనాలని నా కోరిక. నీ తల్లి యిష్టపడింది. నువ్వు. నువ్వు....ఒప్పుకోవాలి అంతే."


నిర్మల ఒకమారు రావుకేసి చూసి రెప్పలు కిందకి వాల్చింది. రావు ఆమె చేతిని నొక్కుతూ, "చెప్పు నిర్మలా!" అన్నాడు. ఆమె తిరిగి అతనికేసి చూసి రెప్పలు వాల్చింది. ఆ మౌనం చిరుమంటలా రావు గుండెలో సెగల్ని జల్లుతోంది. తిరిగి అడిగాడు రావు. స్ఫుటంగా, మృదువుగా నిర్మల యిలా అంది:

"మీరు వేరొక విధంగా తలిస్తే నేను చెప్పలేను. నాకు మీ యెడ విముఖభావం లేదు. ఈ ఏడాదిలో నా ఉద్దేశ్యాలు మారిపోయినై. కళకీ సంఘానికీ సేవ చేయడానికి నేను కంకణం కట్టుకొన్నాను. నాకు పెళ్ళి చేసుకొనే ఉద్దేశ్యం యేమీలేదు. మీకు కష్టం కలిగిస్తే క్షమించండి. కాని యిది నిశ్చయం."

రావు అమె చేతిని వదిలేశాడు. కళ్ళమ్మట పొర్లివచ్చే నీళ్ళు, పగిలిపోయే గుండె కనబడకుండా, వెనక్కి తిరిగి, మొహం చేతుల్లో దాచుకు చరచర వెళ్ళిపోయాడు. "రావు' రావు" అని పిలుస్తున్న నిర్మల కేక అతను వినిపించుకోలేదు. నిర్మల యింటికి వెళ్ళింది. రావు కన్పడలేదు. "అర్జంటు పని అంటూ వెంకట్రావు యీ బండికి వెళ్ళిపోయాడమ్మాయి!" అంది లక్ష్మమ్మ. నిర్మల జాలితో నిట్టూర్చింది.

7

వెంకట్రావు కొన్నాళ్ళు వీధిలోకి వెళ్ళలేదు. నిర్మల ఫోటో శంకరానికిచ్చేశాడు. ఒక్కడూ ఆకాశంకేసి చూస్తోండేవాడు— మబ్బులు, నక్షత్రాలు, చీకటి, పవలు, సంధ్య. అన్నీ ఆ తెరమీద నాటకమాడుతూండేవి ఈ ఏకాంత ప్రేక్షకుడికోసం.



రోజులూ, వారాలూ, నెలలూ గడిచినై. వెంకట్రావు వీధిలోకి వెళ్ళటం మొదలెట్టాడు. అ వూరి కంట్రాక్టరుతో రోజూ వొక గంట బాతాఖానీ, రెండు గంటలు పేక ఆడేవాడు. సాయంత్రం క్లబ్బుకి వెళ్ళి నలుగురితోనూ కలిసి కూర్చొనేవాడు. కాని "చాలా మితభాషి అయాడురా రావు" అనేవారు స్నేహితులు. యుద్ధాన్ని గురించీ, ఆరోగ్యశాఖని గురించీ, టెన్నీసును గురించీ అందరూ చెప్పుకొనే కబుర్లు విని, ఆలస్యంగా ఒక్కడూ చీకట్లో ఇంటికి వెళ్ళేవాడు. "బాబుగారు అలసిపోయారు" అంటూ కన్నయ్య యెదురుగా వచ్చేవాడు.

ఏడాది గడచింది. అతనిలో ఒక విధమైన అసంతృప్తి, అశ్రద్ధా పాదుకొనిపోయినై. ఆ రోజున తిన్న భోజనపదార్థాలు ఏవో కూడా చెప్పలేడు. శంకరంతో యిలా అనేవాడు: "ఆ రోజులు వేరోయ్! కాని ఆమె నా జీవితాన్ని భస్మం చేసింది." ఎవరేనా తన వివాహ ప్రస్తావన తెస్తే, చిరునవ్వుతో ఇలా అనేవాడు: "ఇరవై ఆరేళ్ళు కదాండి—అదే, ఇరవై ఏడు వచ్చింది. అంటే సగం జీవితం అయింది. ఆ సగమూ సుఖంగా యిలా పోనివ్వండి!" అతను ఉద్యోగం విషయంలో యిదివరకటికన్నా పట్టుదల యెక్కువ చూపాడు. జీతంలో ఇంక్రిమెంటు వచ్చింది.

సాయంత్రం పొలాలగట్లనుంచి వస్తో వివిధ వృక్షాల్ని పరికించేవాడు. కన్నయ్య ఆ ఏడాది వర్షాల్ని గురించీ, రైతుల కష్టాల్ని గురించీ చెప్పేవాడు. రోడ్డుమీదకు రాగానే "ఓహో! యింజనీరుగారా! నమస్కారం" అని పలకరిస్తారు వొకరు.

"కనపడటం మానేశారేం" అంటాడు రావు.

"మా చిన్న వెధవకి వొంట్లో బాగాలేదు. అదీగాక మా అమ్మాయి పురుడు కొచ్చింది."

"అలాగా?"

"మా రోడ్డు విషయం మీరు కొద్దిగా దయవుంచాలి."

"ఏం రోడ్లండీ! గవర్నమెంటు కాదాయం తగ్గిపోతోంది. ఈ డిస్ట్రిక్టు బోర్డు వచ్చాక మరీ అధ్వాన్నం అయిపోయింది" అంటూ చిన్నగా దగ్గుతాడు రావు.

"మరేనండీ! ఈ మున్సిపాలిటీలు-'అమ్మిరాజు' చైర్మను అయాక దరిద్రమే పట్టుకొంది. 'ట' అంటే 'న' రాదు. డబ్బు గుప్పేసి పదవి సంపాదించాడు."

"కలికాలం!"

"చూడండి ఈ మురికి కాల్వలూ....అబ్బ, వెధవ దోమలూ, వెధవ యిదీన్ని" అంటాడు ఆ పెద్దమనిషి.

అక్కణ్ణుంచి తిన్నగా ఇంటికి వెళ్తాడు రావు. కొత్త మిత్రుడు యాజులు, ఎం.ఎస్.సి. వస్తాడు. తెలివైనవాడూ, మంచివాడూ కాని, అహంభావపుపాలు ఎక్కువ. నోబుల్ ప్రయిజు తనకి ఎప్పుడో వస్తుందనే నమ్మకం—తను ముందు చేయబోయే రిసెర్చికి. తర్వాత భోజనం ఆఫీసు కాగితాలు చూసుకోవటమూ, కిటికీలోంచి విశాలమైన బయలు చూడటమూ. కన్నయ్య "పెళ్ళాంమీద బెంగపుట్టింది, సెలవిప్పించండి" అంటాడు. ఆ నక్షత్రాలు ఒక్కొక్కటే రాలిపోతే, యింజనీర్లు ఆకాశానికి రోడ్డువేస్తే, దెయ్యాలు తన్ని లవ్ చేస్తే— ఇలా ఆలోచించుకుంటూ భయంతో నిద్రపోతాడు. ఉదయం తను పక్కమీద నుంచి లేవకుండానే దాసీది రావటం, అంట్లు చప్పుడు చెయ్యటం, కన్నయ్య దానితో సరసాలాడటం వింటాడు. లేచి స్నానంచేసి డ్రెస్సు వేసుకొంటాడు. తిరిగి ఆఫీసు పని. సాల్యూటు చేసే వాళ్ళకి సాల్యూటు చేస్తూ, కీవిలో చిరునవ్వు మిళితంచేస్తూ మాట్లాడాలి. అందరూ 'ఇంజనీరుగారు' అంటూ గౌరవిస్తారు; అంతేకాని, ఒక పద్దెన్మిదేళ్ళ పిల్ల చేతిలో ఓడిపోయాడనీ, ఆమె వెనకాల ఉన్మాదుడులా తిరిగాడనీ ఎవరికి తెలుసు! సాయంత్రం క్లబ్బుకి! తిరిగి యుద్ధాన్ని గురించీ, రేడియోని గురించీ-కబుర్లు. వసంతరావు తన రసికత్వాన్ని గురించి గర్వంగా విశదపరుస్తాడు. ప్లీడరు రామచంద్రరావు పార్కులో మొక్కల్ని గురించీ, శ్రీనివాసరావు రేడియో రిపెయిర్లని గురించీ లెక్చరిస్తారు. అమ్మిరాజు తను సన్నంగా వుండేటందుకు మార్గాలు చెప్పమంటాడు. చివరికి అందరూ పేకాడుతారు. తనకి ఎప్పుడూ నష్టం వస్తుంది. రాత్రి ఒక్కడూ యింటికి వెళ్తాడు. కన్నయ్య "బాబుగారు అలసిపోయారు" అంటూ, చీకటి నవ్వుతో ఎదురొస్తాడు.

వెధవ కలలు వచ్చిన పెద్దనిద్రలాగ, మూడేళ్ళు గడిచిపోయాయి. వెంకట్రావుకి జీతం రెండువందల దాకా పెరిగింది. అతనికి ప్రపంచంలో ఆనందించవల్సిన వస్తువూ, విచారించవలసిన విషయమూ ఏమీలేవు. నిజానికి అతని దృష్టిలో అన్నీ వొకటే! ఏడుపూ, నవ్వూ లేనివాడు తనొక్కడే అనుకొన్నాడు.

ఆ రోజున ఒక్కడూ సిగరెట్ కాలుస్తూ ఈజీచైర్‌లో పడుకొని ఆలోచిస్తున్నాడు. దేవుడు గూడా లేడా అని. తను చాలా పెద్దవాడైపోయినట్టూ, వృద్ధాప్యాన్ని సమీపిస్తున్నట్టూ తల్చుకొని వులిక్కిపడ్డాడు. కన్నయ్య వొక్కగంతేసి "అమ్మాయిగారు వచ్చేరండి" అన్నాడు.

"ఎవరురా?"

"అమ్మాయిగారు—నర్సాపురం అమ్మాయిగారు."

దీనంగా, దైన్యంగా చూస్తో, నిర్మల గుమ్మంముందు నుంచుంది. రావు ఆమె

అకస్మాత్ ఆగమనానికి తెల్లబోయాడు. ఏమనాలో తెలియక కంగారుపడ్డాడు.

"నేను రావటం మీకు చాలా ఆశ్చర్యంగా వుంటుంది" అంది నిర్మల, పేలవంగా నవ్వుతో. వెంకట్రావు తేరుకొని లేచి ఆమెని ఆహ్వానించాడు. అతను చాలా నెమ్మదిగా మాట్లాడాడు:

"కుటుంబయ్యగారు క్షేమమా?"

"పోయారు-ఏడాది అయింది."

"పాపం!" అన్నాడు రావు. నిర్మలలో పూర్వపు చలాకీతనమూ, అయస్కాంతంలా ఆకర్షించే పెర్సనాలిటీ అంతలేదు. ఆమెలో వెలిగే సహజమైన నవ్వులేదు. ఆ నవ్వు యొక్క మాసిపోయిన ఛాయలు మాత్రం కన్పడుతున్నాయి.

"మీ అమ్మగారేం చేస్తున్నారు."

"కాశీ వెళ్ళిపోయింది కోపం వచ్చి."

"ఏం-నిర్మలా!"

"నేను పెళ్ళి చేసుకోనన్నానని."

తర్వాత మౌనం. గతసంగతులు జ్ఞప్తికి వచ్చి ఇద్దర్నీ కలచివేశాయి. వెంకట్రావు కిటికీలోంచి ఆకాశంకేసి చూస్తున్నాడు; పిల్ల మబ్బులు గంతులేస్తున్నాయి, లేగదూడలలాగ. ఇంతకీ ఆమె ఎందుకొచ్చిందీ?

"ఈ గది అంతా యింత చిందర వందరగా వుందేం? ఆడదిక్కు లేందే మగవాళ్ళు యిలాగే ఉంటారు" అంది నిర్మల. ఆ పలుకుల్లో ఆశా, ఆత్రుతా, పరితాపమూ గుడిగంటల్లా శబ్దించాయి. తొమ్మిది గంటలకు రావు ఆఫీసుకు వెళ్ళిపోయాడు. నిర్మల రావు యింట్లోనే ఆగిపోయింది. సిగరెట్టు పీకలూ, పుస్తకాలూ, ఖాళీ అగ్గిపెట్టెలూ, పాతబట్టలూ—గది అంతా అసహ్యంగా వుంది. తిరిగీ రావు సాయంత్రం యింటికి వచ్చాడు. గుమ్మానికెదురుగా నిర్మల నవ్వుతో నుంచొంది. ఇదివరకటికన్నా ఆమె పెద్దదయింది. ఆ సమయంలో తిరిగీ నిర్మలలో పూర్వపు నవ్వూ కళ్ళల్లో వెలుగూ కలిగినై. రావు యిల్లంతా చూశాడు. అన్నీ చక్కగా అమర్చబడి వున్నాయి.

"నిర్మలా-నువ్వేనా?" అన్నాడు రావు.

"ఏం బావులేదూ" అంది నిర్మల. వెంకట్రావు మాట్లాడలేదు. నిర్మలకి కష్టమనిపించింది.

"కోపమా మీకు, స్వతంత్రం తీసుకున్నానని?"

"కాదు నిర్మలా! చాలా సంతోషం. కాని నా మనస్సుకి పూర్వపు గది శాంతీ, సంతోషమూ యిస్తుంది."

నిర్మల ఉలిక్కిపడింది. అతనిలో యెంత భేదం కలిగిందో మానసికంగా! రావు దగ్గరగా కుర్చీలో కూర్చుని తన్ని గురించి యిలా చెప్పింది: "నేను యితర యాక్టివిటీస్ మానేశాను. నాకు విసుగెత్తింది. అవన్నీ భ్రమలు.... అందరూ విమర్శించేవారే! నా కున్న ఉత్సాహం యితరులకి లేదు. నా కోసమా అనిపించింది. అవన్నీ భ్రమలు.... రావు. లేకపోతే స్త్రీలకు పబ్లిక్ జీవితం ఏమిటి?"

"నిజం" అన్నాడు రావు.

"నిజం - ఈ మూడేళ్ళ జీవితమూ-యెంత వృధా చేశానో!"

రావు ఆమెకేసి చూశాడు. ఆమెలో పశ్చాత్తాపమో, బాధో వ్యక్తమవుతోంది.

ఇద్దరూ కలిసి షికారు వెళ్ళారు పొలాల గట్లకి. రావు తన ఆఫీసు పనుల్ని గురించి ముక్తసరిగా చెప్పాడు. ఒకరి హృదయంలో తలకొత్తే ఆశా, నిరాశా, మరొకరి హృదయంలో మోడుపోయిన చైతన్యమూ, నీడలులా, దెయ్యాలులా కదులుతున్నాయి. ఎక్కువసేపు ఇద్దరూ మౌనంగానే వున్నారు.

ఇద్దరూ క్యారేజి భోజనం చేశారు. మధ్య గదిలో రావూ, ప్రక్కగదిలో నిర్మలా పడుకొన్నారు. వరండాలో కన్నయ్య గుర్రుపెట్టుతున్నాడు.

పంద్రెండు గంటలయింది. రావు పడుకొన్నదీ లేందీ చూద్దామని నిర్మల రావుగదిలోకి వచ్చింది. రావు రెండుచేతులతో తలనిపట్టుకొని కుర్చీలో కూర్చొన్నాడు. "మీరు నిద్రపోలేదా?" అందీ నిర్మల.

"..........."

"జబ్బు చేస్తుంది."

"నాకు అలవాటే!"

"తల అల్లా పట్టుకున్నారేం?" నిర్మల అతన్ని సమీపించి అతని కణతల్ని తాకింది. అవి కొట్టుకుంటున్నాయి.

"తలనొప్పి ఎక్కువగా వుందా?"

"అంత ఎక్కువగా లేదు."

నిర్మల తన గదిలోకి వెళ్ళి అమృతాంజనంతో తిరిగివచ్చింది. "చేతులు తియ్యండి, రాస్తాను. నాకు చెప్పలేదేం? ఎందుకు ఒక్కరూ అలా బాధపడతారు?" అని అతని కణతల్ని తాకబోయింది. వెంకట్రావు ఆమెని వారించి, ఆమె చేతిలోని డబ్బా తీసి బల్లమీద పెట్టాడు. ఆమె అక్కడ కొంతసేపు నుంచొంది. ఆ మౌనం ఆమెకి దుర్భరమైంది. తడబడుతూ పక్కగదిలోకి వెళ్ళి కూలబడింది. ఒక నిముషానికి వెంకట్రావుకు వెక్కి-వెక్కి యేడుపు వినపడింది. ఆమె గదిలోకి వెళ్ళి "ఏం! నిర్మలా ఏడుస్తున్నావా!" అన్నాడు,


"నేను రావటం మీకింత కష్టంగా ఉందని నాకు తెలియదు. నేను మీకు అవసర సమయంలో సేవ చేయకూడదూ? మన పూర్వ స్నేహం మరచిపోయారా!" ఆమె యింకా తలగడలో మొహం కప్పుకొని ఏడుస్తో ఉంది.

"లేదు నిర్మలా...." అతని గొంతుక బరువెక్కింది. "నేనేం చేస్తున్నదీ నాకొక్కొక్కసారి తెలియదు. నీ రాక నాకు కష్టం కలిగించలేదు. నీకు కష్టం కలిగిస్తే క్షమించు. నా ఇంటికి వచ్చిన స్నేహితురాలివి, అతిధివి. నీ సౌఖ్యం చూడవలసిన విధి నా కుంది?" నిర్మల తల పైకెత్తింది.

"మీకు నేను అంతేనా? అతిధినేనా? మీ జీవితానికి యింక ఎందుకూ ఉపయోగపడలేనూ?" ఆమె గొంతు గద్గదికమంది.

"నాకు జీవితమనేది వుంటే అది జరిగిపోయింది. నాకు కోరికలు లేవు. అందు మూలాన్ని ఒకరి సాహాయ్యం అవసరమని అనుకోను. నాకు రొటీన్ అలవాటయింది. జీతమిస్తారు పని చేస్తాను — అన్నింట్లోనూ అంతే."

"ఇంక ఎందుకూ వుపయోగపడలేనూ మీ



జీవితానికి? చెప్పండి, చెప్పండి" ఆమె విహ్వలతతో అడిగింది.

"నిర్మలా, ఒకరికొకరు పనికి వస్తారను కోవటం పిచ్చి వూహ. పడుకో నిర్మలా! తలితండ్రులు లేరు నీకు. ఈ గృహంలో ఎవరికేనా నీకనిస్తాను, నాకు సంపాదనా శక్తి వున్నంత వరకు. అలా యిచ్చేందుకు భగవంతుణ్ణి శక్తి యిమ్మని ప్రార్థిస్తాను."

"ఎంత మారిపోయారు మీరు!" అంది నిర్మల, కళ్ళు ఒత్తుకుంటూ. ఆమె తల ఎత్తేటప్పటికి రావు అక్కడ లేడు. చలిగాలి తలుపు సందుల్లోంచి కీచుమంటూ వీచింది.

ఉదయం రావు లేవగానే కన్నయ్య వచ్చి "అమ్మాయిగారు వెళ్ళిపోయారు బాబూ! మీతో చెప్పమన్నారు" అన్నాడు.

"ఎంతసేపయింది?"

"ఇప్పుడే-వీధిలో ఉంటారు."

వెంకట్రావు గుమ్మంలోకి వెళ్ళాడు. ఫర్లాంగు దూరంలో కారుదుమ్ములో నిర్మల నడిచివెళ్ళిపోతోంది-స్టేషన్‌కి!

3

◆ ఎనిమిది నెలలు గడిచాయి. ప్రభుత్వం వెంకట్రావుని ఫారెస్టురేంజికి బదిలీ చేశారు. ఒకరోజున కన్నయ్యతో, సామానుతో బయల్దేరాడు రావు.

ఆ వూళ్ళో మూడువందల గడపకన్న



ఎక్కువ జనాభా లేదు. రెండుమైళ్ళ దూరంలో అరణ్యం కన్పడుతుంది. ఆ వూళ్ళో ఒక పెంకుటిల్లు అద్దెకు తీసుకొని వుంటున్నాడు రావు. కాని అక్కడ అతనికి భోజన సదుపాయం లేదు. ఒకనెల జరిగాక శంకరానికి వుత్తరం రాశాడు వంటలక్కనిగాని,- బ్రాహ్మడినిగాని పంపమని. పదిహేను రోజుల్లో కేశాలున్న విధవ సుందరమ్మ వచ్చి పొయ్యి రాజేసింది.

ఆ వూళ్ళో వాళ్ళకీ, ప్రక్కగ్రామాల వారికీ యింజనీరుగారు ప్రత్యక్షదైవం. పులితోళ్ళూ, దుప్పి చర్మం, కొమ్ములూ, అల్లోనేరేడి పళ్ళూ, యింకా వివిధములైన ఫలసముదాయాలూ ప్రతివారం వెంకట్రావుకి భక్తిశ్రద్ధలతో అర్పించేవారు-వాళ్ళ ఆచార వ్యవహారాలు చిత్రంగా ఉన్నై. వాళ్ళు మాట్లాడే తెలుగు ఒక్కొక్కసారి అర్థమయ్యేది కాదు. పట్టణాల్లో ఉండే కృత్రిమత్వం, అతితెలివీ అక్కడలేవు. కష్టపడి పనిచేసుకుంటారు, అనుభవిస్తారు. పార్టీప్రభుత్వాలూ, యుద్ధాలూ, ప్రజావాదమూ, సామ్యవాదమూ, ఆత్మహత్యలూ, రౌడీమ్మూ, సినిమాలూ, ప్రేమలూ, విరహాలూ వారిని బాధించవు. కడుపునిండా తింటారు, నెలవివార నవ్వుతారు; సలహాలకి వెంకట్రావు దగ్గరకే వస్తారు.

నాలుగు నెలల్లో అతనిలో మార్పు కలిగింది. అతని కళ్ళల్లో జాలి గోచరించేది. అతని జీవితం కరగి కళ్ళల్లోకి వచ్చిందా అనిపిస్తుంది-తిరిగీ ఇదివరకటి రోటీను-జడత్వమూ!

ఆ వూరి నీరు పడక అతనికి పెద్దజబ్బు చేసింది. దగ్గర్లో డాక్టరు ఎవడూ లేడు. ఊళ్లో వున్న భిషగ్వరుడు చెంచయ్య మందిచ్చేవాడు. రెండురోజులు స్మృతిలేకుండా పడిపోయాడు. రాత్రింబవళ్ళు సుందరమ్మ ఏమరక అతనికి ఉపచారం చేసింది. ఆమె ఓర్మికి ఆశ్చర్యపడ్డాడు. ఆమెతో "మీ ఋణం ఏలా తీర్చుకోను" అన్నాడు. నెల్లాళ్ళకి జబ్బు తగ్గింది. చెంచయ్యకి యాభై రూపాయలిచ్చాడు. అంత డబ్బు అతనెప్పుడూ కళ్ళతో చూడలేదు. జీవితాంతం వరకూ, తన వైద్యశక్తిని గురించీ వెంకట్రావు దాతృత్వాన్ని గురించీ చెప్పుకునేవాడు. రెండు నెలల్లో పూర్వపు జవసత్తువలు సంపాదించాడు వెంకట్రావు.

శంకరానికి ఉత్తరం రాశాడు, కొన్ని చీరలూ, సామానులూ పంపమని. సుందరమ్మ ఆ విలువగల చీరలన్నీ చూసి, "నా కెందుకండీ ఇవన్నీ" అంది. "కట్టుకోండి తప్పేముంది" అన్నాడు రావు. సుందరమ్మ అవి ధరించటానికి భయపడేది.


ఆ రోజున వెంకట్రావు అర్ధరాత్రి ఉలిక్కిపడి లేచాడు. వెన్నెల విరగకాస్తోంది. 'శవం మీద కప్పిన తెల్లబట్ట'లా ఉందనుకొన్నాడు. ఇంతలో ప్రక్కగదిలోంచి సన్నగా యేడ్పు వినపడింది, నిర్మల జ్ఞప్తికి వచ్చింది. ఆ గదిలోకి వెళ్ళాడు. కిటికీలో కూర్చొని బయలు చూస్తోంది సుందరమ్మ. ఆమె నల్లని పొడుగాటి జుట్టు ఆమె యొదల్ని కప్పింది. వెన్నెల వెలుగులో ఆమె వదనం మీద నీటిబొట్లు చూశాడు రావు.

"ఏడుస్తున్నారా?" అన్నాడు.

"లేదు" అంటూ ఆమె సిగ్గుతో తడబడుతో లేచింది.

"ఎందుకేడవటం?-గతాన్ని మరచిపోండి" అన్నాడు దయతో.

"నాకు గతమనేది లేదు, నాకు జీవితమే లేదు. నన్ను ఆదరించేవారు లేరు. 'నా' అన్నవారు లేరు. నేను బాల్యంలోనే విధవనయాను"



ఆమె ఏడుస్తోంది చిన్నపిల్లలా.

'ఏం' అన్నాడు వెంకట్రావు. చీకట్లో నడిచేవాడికి దీపంకన్న మరొక పొంతుడు ఎక్కువ సహాయంగా ఉంటాడు. అందుకే వెంకట్రావుకి క్యూరియాసిటీ ఎక్కువయింది.

"నేను ఒక విధవకి జన్మించాను. నా తల్లి నన్ను అమ్మేసింది, హోటలు పెట్టుకున్న వెంకమ్మకి. కాని దాని ప్రియుడు ఒప్పుకోలేదు. ఆ వెంకమ్మ నన్ను పిల్లలులేని తంత్రికి అమ్మింది. అతను ఎనిమిదేళ్ళదాకా విద్యాబుద్ధులు చెప్పించి, ఒహడికి పెళ్ళిచేశాడు. ఆ తర్వాత చచ్చిపోయారు పెంపుడు తండ్రీ, మొగుడూన్నూ—ఒకే ఏడాదిలో. ఆ తర్వాత ఒకరింట్లో పిల్లల నెత్తుకొనేదాన్ని. అక్కడ నాలుగేళ్ళు పనిచేసి మానేశాను. తిండిలేక ఒక రోజున వొకడికి మానాన్ని అమ్మాను. అప్పణ్ణుంచీ, ఆ వూరువిడిచి నేటిదాకా వంట చేస్తున్నాను. మూడుసార్లు అమ్ముడుపోయాను!"

వెంకట్రావు హృదయం కరిగింది. జాలితో ఆమె భుజంమీద చెయ్యి వేశాడు. ఆమె ఆశతో, కాంక్షతో చూసింది. వెంకట్రావు, తెలియని కాంక్షచేత ప్రోత్సాహింపబడి ఆమెని కవుగలించుకొన్నాడు.

నాటినుండీ, సుందరమ్మ అతనికి వంటలక్క, భార్య, ఆదరించే తల్లీన్నూ. ఆమెను 'మీరు' అనే పిలిచేవాడు.

ఒక ఏడాది గడిచాక వెంకట్రావు, ఆమె కోరికమీద ఆమెని కాశీ పంపించాడు. రెండు నెలల్లో ఆమె తిరిగివచ్చి కాశీ విశేషాలు చెపుతూ యిలా అంది: "పాపం, నర్సాపురం నుంచి లక్ష్మమ్మ అనే ఆవిడ నాలుగేళ్ళ నుంచి అక్కడ ఉంటోంది; పోయింది, వారం క్రితం."

"అరెరె!" అన్నాడు వెంకట్రావు.

మూడేళ్ళు గడిచాయి. ఒకనాడు రావుకి ప్రభుత్వపు ఆర్డరు వచ్చింది. విప్పి చూశాడు. తనకు డిస్ట్రిక్టు యింజనీరు పదవి యిచ్చింది ప్రభుత్వం. ఆనందంతో, సుందరమ్మతో ఇలా చెప్పాడు: "రెండు నెలల్లో మనం మన జిల్లా వెళ్ళిపోవచ్చు. అక్కడ సుఖంగా ఉంటుంది."

సుందరమ్మ కడుపుతో ఉంది. ఆమె గర్భవిచ్ఛిత్తి చేసుకొంటానంది. కాని రావు ఒప్పుకోలేదు. "నా ప్రతిరూపాన్ని చంపుకోలేను. నాకు మూడువందల రూపాయల జీతం వస్తోంది. నా జీవితం, నా పేరు నాతో అంతమవకుండా ఒక కొడుకు కావాలి నాకు" అన్నాడు. ఈ మూడేళ్ళ నుంచీ, వారిమధ్య జీవితం చాలా గౌరవంగా నడిచింది. ఒకరితో ఒకరు ఆడ్డే మాట్లాడు



కోరు. సుందరమ్మను 'మీరు' అనే పిలిచేవాడు. కాని ఆ రోజు సుందరమ్మ కొత్త మార్గం తొక్కింది. 'నన్ను మీరు మన్నిస్తే నే నిక్కడ ఉండలేను. మీలో వొక భాగంగా మెలుగుదామనుకుంటున్న నాకు, మీరే సర్వం ఐన నాకు" ఆమె కళ్ళమ్మట నీటి బిందువులు పొర్లినై. వెంకట్రావు తెల్లబోయాడు. ఆమె మీద అతనికి జాలీ, దయా ఉన్నై. 'ప్రేమ' అనేది అతను మరచిపోయాడు, పాతిపెట్టేశాడు. ఒక్కొక్కసారి 'ప్రేమ' కల్ల అనీ, భక్తులకి పూనే ఆవేశంలా యువకులకు పూనుతుందనీ అనుకొనేవాడు. కుటుంబ సౌఖ్యానికి స్త్రీ పురుషుల మధ్య పరస్పరావగాహనా, అనురాగమూ కావాలనీ, ప్రేమ కవులకీ, రచయితలకీ వదలి వెయ్యాలనీ అతని ఉద్దేశ్యం. అయినా అతను ఏ విషయంలోనూ ఎక్కువ ఉత్సాహం తీసుకోలేదు. అతనిలోని శక్తులు మోడు చెందాయి. తనకి 'సింపతీ' వుంది. అయినా, నవ్వుతూ సుందరమ్మతో యిలా అన్నాడు: "నిన్ను మన్నించటంలేదు సుందరమ్మా! అలవాటు చొప్పున అనుకుంటున్నాను. నీ సౌఖ్యం నా సౌఖ్యం" ఆ రోజు నుంచీ 'నువ్వు' అనేవాడు. సుందరమ్మ ఆనందంతో పొంగిపోయింది. "ఆయన యింటికి వచ్చేటప్పటికి అబ్బాయి ఎదురుగా వెళ్ళి 'నాన్నా' అని పిలుస్తాడు. ఆయన అబ్బాయిని ముద్దెట్టుకుంటా"రని ఆలోచిస్తోందేది.

విధి నల్లని పెదవులు వారి జీవితాన్ని ముద్దెట్టుకొన్నాయి. నెల్లాళ్ళకి, పురిటిగండం వచ్చి తల్లీ పిల్లా చనిపోయారు. ఆ రోజున భోరున ఏడ్చాడు వెంకట్రావు. కాని తర్వాత రోజున మామూలు మనిషి అయాడు. నాటి నుంచీ నవ్వు అంటే అతనికి రోతపుట్టింది. కొన్నాళ్ళకు, కన్నయ్యతో, గోదావరి జిల్లాకు ప్రయాణం కట్టాడు.

9

తిరిగీ మూడేళ్ళవరకూ వెంకట్రావు జీవితం సాఫీగా సాగిపోయింది. మోటుతనమూ, నిరాశా అతనిలో పాతుకుపోయినై. చూపు సరీగ్గా ఆనటంలేదు. ఆరోగ్యం క్షీణించటం మొదలెట్టింది. జ్ఞాపకశక్తి తగ్గిపోయింది. ఆఫీసులో దవాల్ బంట్రోతుమీదా, యింట్లో కన్నయ్య మీదా విసుక్కోవటం, గొణుగుకోవటం ప్రారంభించాడు. ఆఫీసునుంచి వస్తే, ఏదో చూసి అలాగే నిలబడిపోయేవాడు.

ఒక కంట్రాక్టులో ప్రభుత్వానికి యాభైవేలు నష్టమొచ్చింది. కంట్రాక్టర్లు రావు కళ్ళల్లో దుమ్ముపోసి, సొమ్ము అంతా గుంజుకొని, తిరిగీ రావుమీద కేసుపెట్టారు. రావు ప్లీడరునేనా పెట్టుకోలేదు. ప్రభుత్వం రావుని డిస్మిస్ చేసింది. పదివేల రూపాయలు రావు కాజేశాడనీ, అందుకని అతనికున్న యిరవై ఎకరాల భూమిలో పది ఎకరాలు ప్రభుత్వం స్వాధీన పరచుకొంది. వెంకట్రావు ఏమీ బాధపడలేదు. కన్నయ్య మాత్రం మానేశాడు, జీతం తగ్గించారనే నెపంమీద.

వెంకట్రావు పది ఎకరాలూ అమ్మేశాడు, ఎనిమిదివేల రూపాయలికి. రెండువేలు పెట్టి ఒక పెంకుటిల్లు కొన్నాడు ఒక గ్రామంలో. ఒక కొత్త నౌకరుని పెట్టుకొన్నాడు. 'ఇంత ఇల్లెందుకు' అనుకునేవాడు. నౌకరుతో 'నా యిల్లు శవరా!' అనేవాడు. ఒక బక్కపిల్లిని చేరదీసి దాన్ని పెంచమని నౌకరుకు ఆర్డరిచ్చాడు. కాగితాలు చిరిగిపోయిన భాగవత పుస్తకం తీసి ఆనందభైరవి రాగంలో చదివేవాడు.

వాళ్ళమండితేం జేస్తానా – నిన్నుకేసులో యిరికిస్తూ – కాగితాల్రాసి తరావాత – హాయిగా వురేసుకు చచ్చుతాను – ఏవనుకుంటున్నావో!



వెంకట్రావుకి గుండెజబ్బు చేసింది. డాక్టర్లు మద్రాసు వెళ్ళమన్నారు. పదిహేను వందల రూపాయలు ఖర్చుపెట్టి మద్రాసులో ఒక ఏడాది ఉండి జబ్బు నయం చేసుకొన్నాడు. మద్రాసు నుంచి వస్తోంటే వొక దిక్కులేని పన్నెండేళ్ళ పిల్లను తనతో తీసుకువచ్చాడు. ఆమెకి 'సుందరమ్మ' అని నామకరణం చేశాడు. ఒక గురువుని నియోగించి సంగీతం చెప్పించేవాడు. ఆమె 'తాతయ్య' అని పిలుస్తోందేది రావుని.

రోజూ సాయంత్రం మాలగూడెం వెళ్ళేవాడు. ఆ పూటకు తిండిలేని వాళ్ళకి పావలా అర్ధా యిచ్చేవాడు. పొరిగింటి లచ్చన్నగారితో తన ఇంజనీరు గొడవలు చెప్తూండేవాడు. ఇలా రెండేళ్ళు గడిచాయి. అతనికి బ్యాంకులో రెండువేలు మాత్రం మిగిలినై.


ఒక పట్టభద్రుణ్ణి వెదకి తీసుకువచ్చి సుందరమ్మకి పెళ్ళిచేశాడు. వెయ్యి రూపాయలు కట్నం, అయిదువందలు ఖర్చు చేశాడు. కన్నీళ్ళతో సుందరమ్మని అత్తవారింటికి పంపించాడు. "మాతో వచ్చివెయ్యి తాతయ్యా" అని ఏడ్చింది. "ఇప్పుడు కాదు, ముందు వస్తానమ్మా" అన్నాడు. జీవితంలో ఒక అనాధ బాలిక నుద్ధరించాను గదా అని సంతృప్తి పడ్డాడు.

క్రమంగా అతని నిల్వసొమ్ము ఖర్చు అయిపోయింది. "చేతుల్లో శక్తి ఉన్నంతవరకూ సుందరమ్మ ఇంటికివెళ్ళి వాళ్ళను బాధించను" అనుకొన్నాడు. ఒక బియ్యపుకొట్టులో గుమాస్తాగా కుదిరాడు, ఇరవై రూపాయల జీతానికి.

వెంకట్రావు శక్తిహీనుడైపోయాడు. గడ్డం పెరిగింది. దగ్గు తిరిగీ వస్తోంది. మనిషి వంగిపోయాడు. మాలపల్లెలో పిల్లలు హాస్యం చేసేవారు. కాని నవ్వలేకపోయేవాడు రావు.

మిట్టమధ్యాహ్నం. అందులో వేసవికాలం. యజమాని ఆజ్ఞప్రకారం, వెంకట్రావు ఆయాసంతో, మూడుమైళ్ళ దూరంలో ఉన్న పొరుగూరు వెళ్ళుతున్నాడు. అతని పాదాలూ, తలా మాడిపోతున్నై. తన పూర్వ జీవితాన్ని తల్చుకొన్నాడు. ఎండిపోయిన గుండెలో ఏ మూల వొక నీటిచుక్క ఉందో, అది కళ్ళలోంచి వెళ్ళుబుకు వచ్చింది.

తిన్నగా పొరుగుగ్రామానికి వెళ్ళి, ఒక కొలనిలో నీళ్ళు తాగి, వొక ఇంటి అరుగు మీద కూర్చొన్నాడు విశ్రాంతికోసం. నాలుగయిదేళ్ళ పిల్లాడు 'బూచాడు' అంటూ ఇంట్లోకి వెళ్ళి ఏడవటం మొదలెట్టాడు. ఒక ముప్పైఆరేళ్ళ స్త్రీ గుమ్మం నుంచి తొంగి చూసి "ఎవరు తాతా, ఏ వూరు మీది" అంది.



వెంకట్రావు కునుకుపాట్లు పడుతో పక్కవూరే అన్నాడు.

"ఏమైనా పిల్లలూ, మనుమలూనా తాతగారూ" అంది ఆవిడ, గుమ్మం దగ్గర అరచాటుగా నించొని. ఇంతలోకి ఆ అయిదేళ్ళ పిల్లాడు వచ్చి 'తాతయ్య' అంటూ వొళ్ళో కూర్చున్నాడు.

"నీ పేరేమిటి" అన్నాడు వెంకట్రావు.

"వెంకట్రావు" అన్నాడు ఆ పిల్లాడు.

"నా పేరూ వెంకట్రావే?" అన్నాడు రావు.

"అందుకే తాతయ్యావ్" అన్నాడు ఆ పిల్లాడు.

ఆ పిల్లాడు పేర్లు చెపుతున్నాడు: "ఆడిపేరు రామం, ఆడిపేరు లచ్మీనారాయణ,"

"నీ స్నేహితుల పేర్లా?" అన్నాడు వెంకట్రావు.

"ఊఁ, అమ్మ పేరు నిర్మల, అమ్మమ్మ పేరు లచ్చిమమ్మ...." అన్నాడు పిల్లవాడు.

వెంకట్రావు గుండెలో శతఘ్ని పేలినట్లయింది. తల పైకెత్తి చూశాడు గుమ్మం దగ్గర స్త్రీని. చిక్కిపోయిన చెక్కిళ్ళూ, ఊడిపోయిన జుట్టూ, మాసిన బట్టలూ-యీామె నిర్మల, నిర్మలేనా? ఆమె ఏదో చెపుతోంది. "ఆయన పోయారు తాతగారూ, మా అమ్మ రాసిచ్చిన పది ఎకరాలమీద బ్రతుకుతున్నామండి. కష్టాలు వచ్చాక మనమేం చేస్తాం తాతగారూ!"

వెంకట్రావు వినిపించుకోలేదు. ఆతృతతో "కుటుంబయ్యగారు ఏమవుతారమ్మా" అని అడిగాడు.

"మామయ్య అవుతాడు. మీరెలా ఎరుగుదురు? అయితే ఇంజనీరు వెంకట్రావుని ఎరుగుదురా తాతయ్యగారూ!" అంది ఆవిడ. ఒకనాటి ప్రియురాలు తన్ని 'తాతగారు' అని పిల్చింది. భూమి గిర్రున తిరిగినట్లయింది. జారిపోయే గుండె ఒకచేత్తో పట్టుకొని, ఒక చేత్తో మోహం కప్పుకొని అక్కడనుంచి తిన్నగా ఇంటివైపు వెళ్ళిపోయాడు. ఈ హఠాత్ ప్రవర్తనకి ఆశ్చర్యపడింది నిర్మల. 'పిచ్చాడు తాతయ్య' అన్నాడు ఆ పిల్లవాడు.

వెంకట్రావు ఇంట్లో మంచంమీద కూలబడ్డాడు. ఇల్లు అంతా నిశ్శబ్దంగా వుంది. పిల్లి 'మ్యావ్' అంటోంది. సూర్యుడూ, చంద్రుడూ, చుక్కలూ భూమిమీద వొక్కసారిగా రాలినై. నల్లని సముద్రపు చీకటి కెరటాలు జీవితపు గట్లుల్ని వొరసికొన్నాయి.

అతనిలో ఉత్సాహమూ, ఆనందమూ నాశనమయిపోయాయి. అతని కళ్ళు ఏదో పోగొట్టుకొన్నట్టు బీదగా చూస్తోంటాయి. వర్షాకాలంలో బోదర కప్పల బెకబెకలూ, వసంతంలో కోకిల కూజితాలూ అతనికి ఒకటే: రాత్రిళ్ళు నక్షత్రాలు కనబడితే, ఉదయం దీపాలు అక్కర్లేకుండా వెల్తురు వస్తుంది. ఆకలికి అన్నం తింటారు. తినటం మూలాన్ని పెరుగుతారు, యవ్వనంలో కామిస్తారు, వృద్ధాప్యంలో-చచ్చిపోయే రోజులు సమీపించిన కొలదీ, చాలా కాలం బ్రతుకుతామనే ఆశతో జీవిస్తారు. శ్రావ్యంగా పాడే వాడికీ, పాటరాని వాడికీ వొకటే హృదయం ఉంది. "నీకంటె నేను గొప్పవాడ్ని" అనటానికి ఎవరికీ హక్కులేదు. ఒకరికి కవిత్వం రాయటంలో, ప్రకృతిని ఆనందించటంలో శక్తి ఉంటుంది, మరొకరికి హృదయాన్ని కరడు కట్టించుకొని చీకట్లని వెదజల్లే శక్తి ఉంటుంది. తోచక దెబ్బలాడుతారు. తెలివితేటలు ఎక్కువై, ప్రభుత్వాలూ, యుద్ధాలూ, విప్లవాలూ, కోర్టులూ కల్పించుకుంటారు. జీవితంలో నగ్నసత్యం తెలుసుకొని, నవలలూ, సినిమాలూ చూసి ఆనందిస్తారు. చివరికి ప్రతిజీవితం ప్రత్యేక జీవితం. ఒకరికీ ఒకరికీ సంబంధంలేదు. ఆశకు అంతులేదు. అంతానికి ఆశ కారణం. ఇది ప్రపంచం, [illegible]జీవితం. □

మనోవిజ్ఞాన శీర్షిక :

మనసు సంగతి

డా. శ్రీమతి జయానాగరంజ్

ఆ అమ్మాయికి పందొమ్మిదేళ్ళుంటాయేమో;

సన్నగా, అందంగా పింగాణీ బొమ్మలా వుంటుంది. ఆమెకి పెళ్ళయింది. భర్తకి పాతికేళ్ళుంటాయి. ఎర్రగా, బొద్దుగా, పొట్టిగా బాగానే వుంటాడు. వాళ్ళ పెళ్ళి జరిగి మూడు సంవత్సరాలైంది. ఆ పిల్ల కళ్ళలోకి చూస్తే అవి వేదనా సముద్రాలవలె కనిపిస్తున్నాయి. ముఖాన నవ్వు కనిపిస్తున్నా, ఆ నవ్వు వెనక యేదో పొగొట్టుకున్న దిగులు నీడలా కదలాడుతోంది. ఆ అమ్మాయికి హిస్టీరియా! ఉన్నట్టుండి తెలివితప్పి పడిపోతుంది. స్పృహలేని ఆ స్థితిలో వెక్కిళ్ళుపెట్టి ఏడుస్తుంది. సుమారు ఆరు నెలలుగా యిలా జరుగుతున్నదని చెప్పాడు ఆ అమ్మాయి భర్త. అడిగితే అన్నీ సవ్యంగానే వున్నాయన్నాడు. అన్నీ బావుంటే, ఆ అమ్మాయి జీవిస్తున్న వాతావరణం, కుటుంబ పరిస్థితులూ, తన చుట్టూ వున్నవారితో సంబంధాలూ—యివన్నీ బాగుంటే యిలా జరగడానికి అవకాశం లేదు. ఆ అమ్మాయిని అడిగాను. మొదట మొహమాట పడింది. భయపడింది. వాత్సల్యంతో మాట్లాడి ఆ అమ్మాయి మనసుకు చేరువయ్యాను.

అప్పుడు మనసు విప్పి మాట్లాడింది. వ్యథాభరితమైన కథని వివరించింది. ఆ అమ్మాయి టెంత్‌క్లాసు పాసయిన వెంటనే పెళ్ళి చేశారు పెద్దవాళ్ళు. యింకా పై చదువులు చదవాలని ఆమె కోరిక. ఆ విషయం పెద్దలకు చెప్పింది. వాళ్ళు వినిపించుకోలేదు. భర్త చదువు కూడా అప్పటికి పూర్తికాలేదు. బి. ఎస్. సీ చదువుతున్నాడు. పెళ్ళి జరిగిన తరువాత పై చదువులకని వేరే వూరు వెళ్ళాడు. ఆమె అత్తవారింట వుండిపోయింది.

అత్తగారింట్లో అందరూ ఛాందసులు. సంస్కారం లేని మనుషులు. ఉమ్మడి కుటుంబం. తోడికోడళ్ళు, మరదులు, ఆడపడుచులు చాలామంది వున్నారు. భర్తకి దూరంగా, భారంగా గడపుతోంది కాలాన్ని. ఏదైనా పుస్తకం చదువుకుంటూ వుంటే, "నువ్వు చదువుకున్న దానివని మాకు తెలుసులే," అంటూ ఎత్తిపొడిచేవాళ్ళు. తనలోని సృజనాత్మక శక్తిని ఈ ఒంటరితనంలో తోడుగా చేసుకుందామని యేదైనా రాయడానికి ప్రయత్నిస్తే "కథలూ, కాకరకాయలు రాసే వాళ్ళు దేశంలో చాలామంది వున్నారులే. నువ్వు కూడా రచయిత్రివైతే యిక అయినట్టే" అంటూ ఈసడించుకునేవాళ్ళు. ఏదైనా అల్లిక పని చేస్తుంటే, "ఈ అల్లికలూ, ఈ కర్టెన్లూ, మా యిళ్ళల్లో పనికిరావమ్మా" అంటూ రంగు దారాలు తీసి అవతల పడేసేవాళ్ళు. చివరికి, సాయంత్రంవేళ, శుభ్రంగా స్నానంచేసి, బొట్టూ కాటుక పెట్టుకొని, సిగలో నాలుగు పూలు తురుముకున్నా ఆ అమ్మాయిని తప్పుపట్టేవాళ్ళు ఆ యింట్లో. కమ్మని కలలు కంటూ, వైవాహిక జీవితాన్ని గురించిన మధురమైన ఊహలతో ఆ యింట కాలుపెట్టిన ఆమె జీవితం ఎడారిలా మారింది. భర్త యెప్పుడన్నా యింటికి వచ్చినప్పుడు కన్నీళ్ళతో నివేదించుకున్నా యేమీ ప్రయోజనం వుండేది కాదు. అతను తల్లి చాటు బిడ్డ.

ఈ రంపపు కోతని ఆమె సుకుమార హృదయం యెంతకాలమని భరించగలదు! పుట్టింటివారికి చెప్పుకున్నా వాళ్ళు కూడా "ఆడపిల్ల అత్తగారి యింటి గడప దాటి యిలా రావచ్చునా?" అని మందలించి పంపారు. ఇంక యెవరితో చెప్పుకొంటుంది? యెలా బతుకుతుంది?

మనసు ఆ ఉద్వేగాన్ని, ఆ ఆవేదననీ, ఆ నిస్సహాయతనీ బయట పెట్టుకోవాలని విలవిలలాడసాగింది. ఫలితంగా యెంతో తెలివిగల ఆ అమ్మాయి తెలివి తప్పి పడిపోసాగింది. వెక్కి వెక్కి ఏడవసాగింది. తను నిర్లక్ష్యం చేయబడిందన్న భావన, మనసు పొరలు చించివేసి శరీరంమీద దాడి చేయడం మొదలెట్టిందన్న మాట. మనసు బాగా గాయపడి, తన సమస్యలకు యిక పరిష్కారం లేదనే నిర్ణయానికి వచ్చి, స్థైర్యాన్ని కోల్పోయినప్పుడు శరీరం మీద కలిగించే ఒత్తిడి వల్లనే 'హిస్టీరియా' వస్తుంది. అమాయకురాలైన ఆ అమ్మాయి విషయంలో జరిగింది యిదే.

హిస్టీరియా యెక్కువగా స్త్రీలలోనే కనిపిస్తుంది. లైంగిక అసంతృప్తికి లోనైన వనితలలో 'హిస్టీరియా' లక్షణాలు బయటపడుతుంటాయి. హిస్టీరియానే మూర్ఛరోగం అంటారు మనవాళ్ళు. పురుషులూ, పిల్లలూ కూడా హిస్టీరియాకి గురయ్యే అవకాశం వుంది. అంతరాంతరాలలో సుడులు తిరుగుతూ, వ్యక్తీకరించడానికి వీలులేని, వీలుకాని బాధలు తారాస్థాయికి చేరినప్పుడు యిలా కట్టలు తెంచుకుని దూకే వరదలా విజృంభిస్తుంది. సమస్యలనీ, బాధలనీ మనసులోనే దాచుకుని బాధపడకూడదు. అలా చేస్తే యిలాంటి "మనోవ్యాధి" తప్పదు! □

వ్యథాభరితమైన ఒక మగువ మనసు కథ

దేవుడు తెల్లబోయాడు

మాదిరెడ్డి సులోచన

అనగా, అనగా ఓ పట్టణంగాని పట్టణంలాటి ఊరుంది. ఆ వూరికి పేరుంది. పేరు వుద్ధరించే రాజుగాని రాజు గోవిందరాజు ఏలు తుండేవాడు. మంత్రిగాని మంత్రి శఠగోపం గారుండి సలహాలిచ్చేవాడు. గోవిందరాజు అయిదేళ్ళు ఎమ్మెల్యేగా చేస్తే, ఆలయపు పూజారి శఠగోపంగారు ఆయనను యథావిధిగా సేవించాడు. ఆ ఊరికి వున్న వేణుగోపాల స్వామి ఆలయం పాడుబడి భిక్షగాళ్ళకు, దిక్కులేని వారికి ఆశ్రయం ఇస్తూంది.

శఠగోపంగారు గుమస్తా, సెక్రటరీ,ప్యూన్ డ్రయివర్, వంటవాడు ఇలా ఇలా యెన్నో వేషాలతో రాజుగారిని కొలిచాడు. అయితే జనం తెలివి మీరారో, తెలివి లేదోకాని యీ సారి ఎన్నికలలో గోవిందరాజు డిపాజిట్ పోగొట్టి, గోళ్ళు గిల్లుకునేలా చేశారు. ఆటో మాటిక్‌గా మంత్రి పదవి పోయింది.

ఈసారి శఠగోపంగారి సలహాయే తిప్పి కొట్టిందని అతని నమ్మకం. "మీరు మొదట ఈ పార్టీ తరపున పోటీ చెయ్యండి రాజుగారూ. గెలిచిందా గెలుపు మీదే. కాక అవతల పార్టీ గెలిచిందనుకోండి. పార్టీ మార్చెయ్యడం ఎంతసేపు!" అన్నాడు.

"ఈ ఊళ్లో నాకు ఓట్లు పడతాయన్న నమ్మ కము నాకు లేదు." నిరాశపడిపోయాడు రాజు.

"ఎవడికోసం పడతాయి. అంతా హరిజను లేగా. మీరూరుకోండి, జగజీవన్‌రామ్ బొమ్మ అడ్డుపెట్టి గెలిపించేస్తాను" అన్నాడు చిటికె వేసి. గోవిందరాజు అంగీకరించాడు.

అపర వేణుగోపాలస్వామిలా వున్న శఠ గోపం మూడు నామాలపై నమ్మకము కుదిరింది.

కానీ అవతలి పార్టీ గెలిచింది. శఠగోపం నెత్తిన గుడ్డేసుకుని వచ్చాడు.

"ఈ జనానికి బొత్తిగా భయభక్తులు కులం మతం అన్న అభిమానం లేదు" అన్నాడు ఆగ్రహంగా.

"సరేలేవయ్యా! ఊరికి మనం ఏం చేసామని ఏడ్పు!" అన్నాడు రాజు.

"ఊరికేం చేయకపోయినా, మనకు మన మయినా చేసుకునే అవకాశం లేదుకదా స్వామీ. చేతిలో చిల్లు పెంకులేదు" ఏడ్వలేక ఓ చవట నవ్వు నవ్వాడు శఠగోపం.

"చూడు పంతులూ! కార్యవాదులు ఓట మిని గెలుపుగానే భావిస్తారు. ఇన్నాళ్లు నువ్వు సలహా చెప్పావు, నేను విన్నాను. ఇప్పుడు నేను సలహా చెబుతాను. నువ్వు విను. డబ్బు నీకు చేతినిండా పని...."

"ఆ! అదెలా సామె. చెప్పండి, నా ప్రాణం లేచి వచ్చింది."

"మరి వచ్చే ఫలితం చెరిసగం పంచుకుందామా?"


"మీతో నాకు వాటా ఏమిటి సామె. ఏదో చెయ్యి విదిలిస్తే బ్రతికేవారము. అసలు పని లేక చస్తున్నామంటే నమ్మండి." విడిపోయిన జుట్టుకిని ముడివేసుకున్నాడు.

"పనా? పోట్లాటలా?" గలగల నవ్వాడు గోవిందరాజు.

"ఏదో ఒకటి! పోలిటిక్స్ అర్థం అయిన వాడిలా గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవడం ఎంత నరకమో మీకు తెలియదు సామి" అన్నాడు.

గోవిందరాజు శఠగోపం చెవిలో తారక మంత్రంలా ఏవో నాల్గుమాటలు చెప్పాడు.

"నిజంగా....నిజమేనా సామె." శఠగోపం ముఖం వెలిగిపోయింది.



"పని పకడ్బందీగా జరగాలి. నీకు చాటింపు చాలా ప్రీతి. కాస్త జాగ్రత్తగా వ్యవహరించాలి" అన్నాడు.

"అబ్బే...." ముక్కుకు అడ్డంగా వేలు పెట్టుకుని, నోరుమూసుకున్నాడు. ఇద్దరూ మరి కాసేపు మాట్లాడి విడిపోయారు.

వారం రోజులు గడిచాయి.

శఠగోపం దిగులుగా రచ్చబండ దగ్గర తలపై గుడ్డేసుకుని కూర్చున్నాడు. అక్కడ చేరిన చిన్నా, పెద్దా విషయం యేమిటని అడిగారు.

"ఏమి ఎలక్షన్లో ఏమో, యెందరి ప్రాణం తీస్తారో మా రాజుగారు పూర్తిగా మారి పోయారు. పిలిస్తే పలకడు, ఉలకడు, అంతా ఆ దేవుడి దయ అంటున్నాడు" అన్నాడు కన్నీళ్ళు ఒత్తుకుంటూ.

"ఛ....ఊరోకోవయ్యా; మతి చాంచల్యం నీ పగవారికి రానియ్యి. మా బావ భక్తి మార్గంలో పడ్డాడు" అన్నాడు రాజుగారి వేలు విడిచిన మేనత్త కొడుకు.

"ఎంత భక్తి అయినా దేశంపై యింత విరక్తా?" అన్నాడు.

"అంతేకాదుట, అక్కయ్యగారు చెప్పారు. రాత్రి అంతా తనలో తానె భజన చేస్తారట," అన్నాడు.

"అయితే వారిని చూడవల్సిందే" అన్నారు పెద్దలు.

"నాకు చూడాలనిలేదు. మహారాజులా తిరిగే మనిషి, అలా అయ్యాడంటే దిగులుగా వుంది" శఠగోపం ఎగబీల్చాడు.

వాళ్ళంతా వెళ్ళేసరికి గోవిందరాజు పడక కుర్చీలో కూర్చుని పైకిచూస్తూన్నాడు. 'కృష్ణం భజరాదా!' అంటూ తనలో తాను గొణుక్కుంటున్నాడు.

"గోవిందరాజుగారూ! నమస్కారమండీ" అన్నా డో పెద్ద.

"కృష్ణార్పణం! రండి వచ్చిలా కూర్చోండి" అన్నాడు అర్ధనిమీలిత నేత్రాలతో అందరినీ ఒకసారి చూచి.

"మీరు ఊళ్ళోకి రావటమే మానేసారు," కూర్చుని అడిగారెవరో.

"ఊరా, వల్లకాడా? అంతా మిథ్య! అంతా మాయ" అన్నాడు.

"అదికాదండీ...." మరొకతను మాట్లాడబోయాడు.

"కృష్ణార్పితం అయిన ఈ ఇంటి ఆవరణలో దేశం, రాజకీయం మాట్లాడవద్దని ప్రార్థన. రారా పుణ్యాత్ములారా! రారా ఓభక్తులారా!" అంటూ పాట మొదలు పెట్టేరు. ఇలా మాట్లాడుతుండగానే, ఆయన తన్మయత్వంలో పాట మొదలు పెట్టేడు. ఆయనకు పాట, ఆట రాదు. అందుకే అందరూ గోవిందరాజుగారిపట్ల గౌరవం యేర్పరచుకున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని, ఒక వేదాంత ధోరణిలో మాట్లాడి వెళ్ళిపోయారు. రోజూ ఇలా హితులు, స్నేహితులు, తెలిసినవారు రావటం పోవటం జరిగింది.

నెలరోజులు గడిచాయి.

ఒకరోజు శఠగోపం హడావుడిగా పరిగెత్తుకుంటూ వచ్చాడు. "ఈ విడ్డూరం విన్నారా? మన గోవిందరాజుగారికి రాత్రి శ్రీకృష్ణ పరమాత్మ కలలోకి వచ్చేడట" అన్నాడు.

"ఆ! నిజమేనా, ఇందాక మా అబ్బాయి చెబితే వుత్తదే అని కొట్టివేసాను" అన్నాడు లింగయ్యశెట్టి.

"ఇదేం చిత్రమండి!ఓసారి వెళ్ళి చూద్దామా! అన్నాడు మరో షావుకారు.

శఠగోపంతో కలసి అందరూ గోవిందరాజు ఇంటికి వెళ్ళారు. ఆయన సన్నగా పాడుతూ కూర్చున్నారు.

"ఏమిటి రాజుగారూ! ఏదో స్వప్నం అని అందరూ అంటున్నారు." ఏం యెరగనట్టు అన్నాడు శఠగోపం.

"ఏదో ఆ కృపాసింధు, ఆ దీనబంధు...." అంటూ మొదలు పెట్టేడు రాజు.

"గోవిందరాజుగారూ! మీరు ఆ వేణుగోపాలుని దర్శించారు. ఆ వైనం విని తరిస్తాం. వివరించండి" అన్నాడు కరణంగారి బావ.

"అది మీకు తమాషాగా వుండొచ్చు. అర్థరాత్రి అయింది. అప్పుడే మాగన్ను పడింది. కృష్ణా కృష్ణా అంటూ నా అధరాలు ఆదిరిపడుతున్నాయి. వెలుగు....వర్ణించలేని వెలుగు వచ్చింది. 'పిలిచావా భక్తా,' అన్నారెవరో. యెటుచూచినా ఆ స్వామే కనిపించాడు. ఆ వేణు నాదమే వినిపించింది. కళ్ళు విప్పలేకపోయాను...."


"ధన్యుడవయ్యా రాజూ...." అంటూ శఠగోపం సాష్టాంగ పడ్డాడు.

"చెప్పనియ్యవయ్యా!" లింగయ్య విసుక్కున్నాడు.

"కళ్ళు విప్పుదాం అంటే జిగురుపెట్టి అంటించినంతగా అంటుకున్నాయి. యేం చేయాలి, నిజమా, కలా అనుకుంటున్నాను. 'రాజూ! ఊళ్ళో వుండాలనుకున్నాను. ఆలయం అడవిలా చేసావ్. పునరుద్ధరించు. ఊరికి జయం కలుగుతుంది' అన్నాడు."

"నిజంగానా?" కరణం నోరు తెరిచాడు.

"అంతేకాదు. విగ్రహాలు విరిగిపోయాయట. తన అంశగల విగ్రహాలు నా పొలంలో



వున్నాయట. త్రవ్వించు అన్నారు." అని చెప్పాడు గోవిందరాజు.

"నీ పొలంలో యెక్కడో చెప్పాడా?"

"పొన్నచెట్టు నీడలో తలదాచుకున్నానని అన్నాడు." రాజుగారు కళ్ళు మూసుకొని విన్నవించాడు.

"త్రవ్విచూస్తే పోలేదా?"

"వద్దు శెట్టిగారూ! వద్దు. విగ్రహాలు దొరికాయనుకోండి. విగ్రహప్రతిష్ఠాపన, గుడిపునః నిర్మించడం నావల్ల అయ్యేపని కాదు. ఆ స్వామిని మనో నేత్రంతో దర్శించి ధన్యుడనవుతాను"అని,మీరు వెళ్ళవచ్చు అన్నట్టు కళ్ళు మూసుకొని 'కృష్ణ కృష్ణ!' అంటూ పాటలు మొదలుపెట్టేడు.

వాళ్ళంతా రచ్చబండ దగ్గరకొచ్చారు.

"ఆయన కృష్ణకృపకు పాత్రుడయ్యాడు. అతన్ని వదలివేద్దాం. మన సంగతి ఏమిటి? ఊరికంతా అరిష్టం కదా'' అన్నాడు శఠగోపం.

"కలలు నిజం అవుతాయా! ఆయన ఆ ధ్యాసలో వున్నాడు కాబట్టి అలా అనిపించి వుంటుంది" అన్నారెవరో.

"ఛ... ఛ... ఆయన వున్నాయి అనలేదు పోనీ డబ్బు ఖర్చులేని పని. మనమంతా తలా ఒక చెయ్యివేసి త్రవ్విచూద్దామా?" అన్నాడు శఠగోపం.

"నీ సలహా బాగుందయ్యా! విగ్రహాలు లేకపోతే అతని ఊహ అవుతుంది. నిజంగా వుంటే, నేను అయిదు వేలిస్తాను" లింగయ్య శెట్టి అన్నాడు.

"అదేం మాట! మేమేనా తీసిపోయింది. విగ్రహాలు బయటపడితే నేను అయిదువేలు ఇస్తాను" రెడ్డిగారు అన్నారు.

"మేమూ ఇస్తాము ఇంతో....అంతో...." కరణంగారు అన్నారు. అరగంటలో పేపర్ మీద లక్షరూపాయలు పోగయ్యాయి. అందరూ కుతూహలంగా వెళ్ళి, రాజుగారి పొలంలో పొన్నచెట్టుకోసం వెతికారు. పొన్నచెట్టు కింద దట్టమయిన పొదలూ పుట్టలూ కనిపించాయి. అతి కష్టంపై అవి పెకిలించారు. పొన్నచెట్టు చుట్టూ మూడురోజులు త్రవ్వారు. రెండు మీటర్ల లోతులో వాళ్ళకు పాతబడిన యిత్తడి విగ్రహాలు దొరికాయి. వాటిని తాకటానికి

అందరి చేతులు వణికాయి.

"ఆగండి....ఆగండి" శఠగోపం దూరం జరిగి శ్లోకాలు చదువుతూ పడిపోయాడు.

నిమిషాలమీద ఈ వార్త ఊరంతా ప్రాకిపోయింది. జనం తండోపతండాలుగా వస్తున్నారు. అదో యాత్రాస్థలంగా మారిపోయింది.

లక్షయాభయివేల రూపాయలు తాలూకా హెడ్‌క్వార్టర్‌నుండి వసూలయి వచ్చాయి. మేళ, తాళాలతో విగ్రహాలను ఊరేగించి తీసుకెళ్ళారు. నిమిషాలపై గుడి పునరుద్ధరించారు.

డబ్బు వస్తూనే వుంది. మన జనం ఇద్దరికే జడిసి దబ్బిస్తారు. ఒకరు పోలీసులు. రెండు దేవుడు.

దానికి పరమ భక్తుడయిన గోవిందరాజు ట్రస్టీ అయ్యాడు.

"నాకీ బాదరబందీ యెందుకు? ఆ స్వామి చరణాలు కడిగిన తీర్థంలో తులసీదళం వేసి యివ్వండి" అన్నాడు.

"అలా అనకండి గోవిందరాజు! నీ మూలంగా కదూ, జనం కళ్ళు తెరిచారు" అన్నారంతా.

మిగిలిన డబ్బు దేవుడిపేర బ్యాంక్‌లో వేయాలని ఆ వడ్డీతో పూజారికి జీతం ఇవ్వాలని దేవుడిపేరిట సంబరాలు జరిపించాలని నిర్ణయం జరిగింది.

"మరొకడు యెందుకు? శఠగోపంగారే పూజారిగా వుంటారు. మొదటి నుండి అన్నీ తెలిసినవాడు" అన్నారు జనం.

"ఆ మహానుభావుడి సేవకు యెప్పుడూ సిద్ధమే" భక్తిగా నమస్కరించాడు శఠగోపం.

నిత్య కళ్యాణం పచ్చతోరణంలా అయ్యింది శఠగోపం పని.

గోవిందరాజు పని ఇరుకులో పడింది. ఆ డబ్బు తనకు దక్కాలి. ఎలా అన్నదే తోచటం లేదు.

ఆశకు అంతులేదు అంటారు. అలాగే శఠగోపం పని తయారయింది. అతను ఈ వచ్చే జీతంతో జీవితం యెలా వెళ్ళమారుస్తాడు! గోవిందరావుగారి సెక్రెటరీగా వున్న కాలంలో యింతో, అంతో మందు కొట్టటం, మజా చేయటం నేర్చుకున్నాడు. అతను గుడికి తాళం పెడుతుండగా గోవిందరాజు వచ్చాడు.

"రండి సామె రండి. తమ దర్శనానికే రావాలనుకుంటున్నాను" శఠగోపం అన్నాడు.

గోవిందరాజు గుడితలుపులు తీయించి, నమస్కరించి, గుడిముందు కూలబడిపోయాడు.

"మీరు చెప్పిన నాటకం యెలా ఆడానంటారు? ఎక్కడయినా పొల్లుబోయిందా?" అన్నాడు శఠగోపం.

"ఏం నాటకం లేవయ్యా! ప్రభుత్వజీతగాళ్ళకిచ్చినట్టు పింఛను నీకు దొరుకుతుంది. గడ్డి కుప్పకాడి కుక్కలా నేనో ట్రస్టీనట, ట్రస్టీని" అన్నాడు కోపంగా.

"అ! ఆ వడ్డీ డబ్బులు రెండుపూటలు చావకుండా తినటానికి సరిపోతాయేమో తప్ప, యెందుకు పనికిరావు" శఠగోపం అన్నాడు.

"నీ ఆశ కూలా! నాకేం మిగిలిందని...."

"మరీ అంత అన్యాయంగా మాట్లాడకండి సామె. స్వామివారి ప్రతిష్టాపనాకు జరిగిన ఖర్చులో యాభై శాతం మిగిలింది" అన్నాడు.

"అదో లెక్క! ఈ డబ్బు మనకొచ్చే మాస్టర్‌ప్లాన్ వేస్తాను. నీ వాటాకు ఓ అయిదు వేలిస్తానయ్యా. తీసుకుని యెక్కడికయినా వెళ్ళు."

"అయిదు వేలా....అయిదు! ముష్టి వేస్తున్నారా సామె" అన్నాడు.

"ముష్టికాక ముడుపా! శఠగోపం ఆశకంతుండాలయ్యా?"

"నాకే ఆశంటారా సామె, మీ గురించి, మీ సన్యసించడం గురించి, మీ భక్తిభావం గురించి వాగిన దానికి టీ ఖర్చులు కావు అయిదు వేలు. మీరేం కష్టపడ్డారండి."

"ఒరేయ్! తిన్నగా అడుగుతావా! నటించటం యెంత కష్టమో నీ కేం తెలుసు?"

"మీరు నటించారు, నేను పద్ద్రమ గుర్తుకురావా? అక్కడే త్రవ్వితే జనం చూస్తారని, అయిదారు మీటర్ల పొడవునా సొరంగం త్రవ్వి విగ్రహాలు పెట్టాను. కూలిని పిలిచినా గుట్టు

బయటపడుతుందని భయపడ్డాను. చేతులకు బొక్కలు వచ్చాయి" అన్నాడు.

"ఇదిగో శఠగోపం కంఠశోష యెందుకు? అయిదువేలు కావాలా వద్దా?"

"నా కెందుకు ముష్టి! సగం వాటా కావాలి."

"వాటా యివ్వకపోతే...." గోవిందరాజుకు కోపం ముంచుకువస్తుంది.

"ఏముంది సామే. జరిగిన విషయాలు ఊళ్ళో అంటాను. నాకేం భయమా!" అన్నాడు నిర్లక్ష్యంగా "మీకు తెలుసు నాకు చాటింపు ఇష్టమని...."

"ఓహో! అంతవరకు వచ్చిందా వ్యవహారం! అలాగే చెప్పుకో పో. దప్పుచ్చుకు మరీ చాటించు. నాకేం భయం" అన్నాడు.

శఠగోపం గుడితాళాలు అయ్యగారిముందు విసిరికొట్టి, విసురుగా ముందుకు వెళ్ళాడు. గోవిందరాజుకు యిలాంటి సందర్భాలలో యెక్కడలేని ధైర్యం వస్తుంది. లేచి, శఠగోపం భుజాన వేసుకున్న పైపంచ ఒడుపుగా అతని మెడకుబిగించి వెనక్కులాగాడు.

"ఏమిటిది...ఏ....మి....టి....సా....మె" అన్నాడు అతను.

ఆ రాత్రి గడిచింది.

తెల్లవారింది. ఊర్లో గల్లంతుగా వుంది. దేవాలయ ధర్మకర్త గోవిందరాజింట్లో చోరీ, తలపై బలంగా బాదడం మూలాన ధర్మకర్త స్పృహ తప్పాడట.

ఆ దొంగతనం చేసిందెవరో కాదుట. పూజారి శఠగోపమేనట. ఆలయం ముందు చచ్చిపడివున్నాడు శఠగోపం. అక్కడక్కడ రూపాయలు, మేడిపువ్వులు, కళ్ళు, పాదాలు పడివున్నాయట.

ధర్మకర్తను పూజారి దోచే ప్రయత్నం చేస్తే, పూజారిని దొంగల రూపంలో వచ్చిన దేవుడే దోచాడని వింతగా చెప్పుకుంటున్నారు. జనం తండోపతండాలుగా వస్తున్నారు.

పోలీసులకు రిపోర్టుద్దామన్నారు అంతా. అప్పుడే తలకు కట్టుకట్టుకుని వచ్చాడు గోవిందరాజు.

"అంతా మిధ్య! అంతా ఆ స్వామిదే అని మరిచి స్వార్ధచింతనతో ప్రాణాలు తీసుకున్నాడు శఠగోపం. పూజారిని నియమిస్తే నా పొలం మీద వచ్చే ఆదాయంతో జీతం యిస్తాను. పోలీసులకిస్తే చచ్చినపామును చంపినట్టు. వాడి శరీరం కోస్తారు, చీలుస్తారు. డబ్బు ముఖ్యంకాదు మనకు. అతను చేసిన ఆ స్వామి సేవ ముఖ్యం. మీరు అందరూ అతన్ని క్షమించాలని ప్రార్థిస్తున్నాను...." అన్నాడు. అందరూ ముఖాలు చూసుకుంటుండగానే గోవిందరాజు ఓ భక్తిగీతం ఎత్తుకున్నాడు. అందరూ గొంతులు కలిపి పాడారు.

అపశృతిలా అప్పుడప్పుడు శఠగోపం భార్య ఏడుపు వినిపిస్తోంది.

అరగంట గడిచింది.

"ఈ కాయాన్ని కృష్ణార్పణం చేయాలంటే డబ్బు కావాలి. ఆ డబ్బు నేనిస్తాను. నా ఇల్లు దోపిడీ అయింది. ఈ ఉంగరం అమ్మి డబ్బు తీసుకురండి" అని చేతి వుంగరం తీసి యిచ్చాడు.

"ఎందుకండీ! తలా పదిరూపాయలు వేస్తాం చాలు" అన్నారు జనం.

అలా, అలా, నిమిషాలమీద వసూలయింది డబ్బు.

శఠగోపం శవం లేచింది. గుడిలో దేవుడు తెల్లబోయినట్టు చూచాడు.

గోవిందరాజు కళ్ళు ఒత్తుకున్నాడు. □

వచ్చే సంచికలో

అవసరాల రామకృష్ణారావు పెద్దకథ

'పిల్లలే బుద్ధి చెప్పాలి'

చదవండి



జాతి మరొకసారి మోసపోయినపుడు

ఎక్కడి కక్కడ తెగిపోతున్న రోడ్లమధ్య సయోధ్య కుదిరేనా
రెండు తలలపాములు మనకి ప్రహరీ గోడలౌతున్నాయిగదా
చేతికీ చేతికీ మధ్య దూరాలెక్కువై
చూపుతో బయల్దేరిన విమానం మధ్యలోనే కూల్తుందిగదా
నాగజెముడు పొదమీద ఆరేసిన
ఆలోచన నవనాడులు తెగిపోయాయి గదా
నేను తలకింద పెట్టుకున్న చేయి నన్ను తొలిచేస్తుందిగదా
ఏమి ఏరుకుంటూ రిక్కడ కళ్ళులేని చేతుల్తో
వెనక్కి నడుస్తున్న దోవమీద నిలబడ్డమీరు
ఎన్నాళ్ళకి జేగంట మోగించగలరు?
చెట్లకి రక్తంపోసి పెంచే సూర్యుళ్ళు మీకు కనపడరా
మీ ఆశల్ని గాలిపూటల్లో నాటి
రాత్రికి ఈ యుగాన్ని బలిచేస్తున్న మీరు
కుతకుత ఉడికే రక్త సముద్రంలోంచి లేవొచ్చే
తూర్పు నాహ్వానించగలరా?
నిర్వేదపు కూలిన గోడకింద పడిపోయిన నాకు
మీ అసంబద్ధ జాతర తొక్కిళ్ళనుంచి
విత్తులోని మొలక షిలిచినట్లు
కోడి గొంతుకలో కూత పేలినట్లు
భూమి గుండెలోని ఖనిజసంపదల చేతుల గాజులు కదలినట్లు
ఒక పిల్లవాడి నవ్వు నన్ను పైకి లేపుతుంది—
నన్ను సముద్రపు కళ్ళలో ముంచి దేశంమీద చల్లుతుంది.
నేనందుకుంటున్న తుపాకి గొట్టంలోంచి
కొత్తసూర్యుడు పుట్టుకొస్తాడు.

—కె. శివారెడ్డి



మీరా మనసు ఉసూరుమంది.

శేఖరం తల తిప్పి వంటగదికేసి చూశాడు. మీరా టీ కప్పు చేత్తో పట్టుకుని వుంది. అ

నిలబడిన తీరు చూస్తే రావటం యిష్టంలేనట్టుగా అన్పించిందతనికి. "అరుణా ఈ రోజే వచ్చింది. అదివరకు అంత స్నేహం వుండి—ఇప్పటిలాంటి బిడియం కావచ్చు—లేకపోతే ఇందాకటి మాటలు—" శేఖరం అరుణకేసి తిరిగి "అరుణా! టీ అయినట్టుంది తీసుకురా" అన్నాడు.

అరుణ యిచ్చిన టీ తాగి అతను వెళ్ళిపోయాడు. తర్వాత మీరా అరుణ దగ్గరగా వచ్చి అంది. "అరుణా! కాఫీ తాగుతావా, హార్లిక్సా...."

"ఏం తాగితే బాగుంటుందంటావ్?" అంది అరుణ.

అరుణ అలా ఎందుకందో మీరాకి అర్థమయింది. అయినా అర్థం కానట్టే అంది "నీ ఇష్టం అరుణా...."

మీరా మాట పూర్తి కాకుండానే "కాఫీయే బాగుంటుంది. ఏమంటావ్!" అంది.

మీరా బాధగా చూసింది అరుణకేసి. ఇప్పుడు తను తాగనంటే అరుణ తాగదు. కానీ ప్రతిదానికీ అరుణ యిలా చేస్తే యేం బాగుంటుంది?

మీరా అక్కడనించి వెళ్ళిపోయింది.

మీరా ఒక కప్పు కాఫీయే చేసి తీసుకొచ్చింది. అక్కడ అరుణ లేదు. మీరా అరుణ గదిలోకి వచ్చింది. అరుణ పెట్టెలోంచి చీరలు తీస్తోంది.

మీరా కాఫీ కప్పు టేబుల్‌మీద పెట్టింది. ఆ శబ్దానికి అరుణ ఇటు తిరిగింది. మీరా అరుణ దగ్గరగా వచ్చింది. అప్పుడు అరుణ చేతిలోంచి ఆ చీర తీసుకుంటూ అంది. "ఇంకా దాచావా అరుణా!"

"నీది చిరిగిపోయిందా?" అని అడిగింది అరుణ.

"వుంది—పెట్లో దాచాను."

"మరి నన్నలా అడుగుతావేం?"

"కాఫీ తీసుకో—నేను నీ చీరలన్నీ చూడాలి."

"ఓహో!" వ్యంగ్యంగా అని; "ఎంత గడుసుతనం నేర్చావు మీరా?" అంది.

"ఏమిటి?" ఆశ్చర్యంగా అంది తలెత్తుతూ.

"ఇలారా చెప్తాను" అని మీరా చేయి పట్టుకుని లాగింది. మీరాని మంచంమీద కూర్చోబెట్టి "ఇప్పుడే వస్తానుండు" మీరాకి మాట్లాడే సావకాశం ఇవ్వకుండా గబగబా అక్కడనించి వెళ్ళిపోయింది.

వెళ్ళిన మరు నిముషంలో మరో కప్పుతో తిరిగివచ్చింది అరుణ.

"అరుణా!" మీరా ఏదో చెప్పబోయింది.

"ముందు ఇది తాగి" అంది కాఫీకప్పు అందిస్తూ.

మీరాకి తనమీద తనకే కోపం వచ్చింది.


"ఊఁ, కానీ! చల్లారిపోతుంది."

"నేనిక్కడ మానేయడం చాలా ఉత్తమం అరుణా! ఇలా అయితే లాభంలేదు!" ముఖం దించుకుంటూ అంది మీరా.

"అదేమిటి మీరా! కాఫీ ఇచ్చినందుకే! నేను వస్తానని—నా గురించి నీకు చాలా రోజుల్నించి తెలుసు. కాని నువ్వెక్కడున్నావో ఎలా ఉన్నావో నాకసలు తెలియదు. హఠాత్తుగా నిన్నిక్కడ చూసి ఎంత సంభ్రమాశ్చర్యాలలో తేలిపోయానో—ఇక్కడ నిన్నిలాటి పరిస్థితుల్లో చూసి యెంత వ్యథ చెందానో నీకు అర్థం కాకపోవచ్చు మీరా!" అరుణ గొంతు వణికింది.

మీరా మనసు బాధపడింది అరుణ మనసు బాధపెట్టినందుకు.

"అదేమిటరుణా! నా గురించి నువు బాధపడతావని నాకు తెలియదూ!"



"అందుకేగా మహాగొప్పగా వూరుకున్నావ్! మొదటంటే మా అమ్మని తెలవదు. అన్నయ్య వచ్చేకా? అమ్మనడిగి ఒక్క కార్డు రాస్తే ఎంత కట్టడిచోట మసలినా ఒక్క కార్డు రాయటానికి వీలులేని పరిస్థితుల్లో ఎవరైనా వుంటారా? నువ్వలా రాస్తే—నాకు రావటానికి కుదరదే అనుకో అన్నయ్యకి చెప్పేదాన్ని—వారికి చెప్పేదాన్ని—నీకీపాటికి మంచి ఉద్యోగం దొరికేది. అన్నయ్య మీద నీకు కోపం పోనట్టుంది...."

"అరుణా చల్లారిపోతోంది" అంది మీరా.

"నువ్వు కానీ."

తప్పనిసరిగా మీరా కప్పుని నోటిదగ్గరుంచుకుంది. అరుణకి సావకాశంగా నచ్చచెప్పాలనుకుంది.

పదకొండు గంటలయిపోయింది. పదిన్నరకే శాంతమ్మగారు శేఖరాన్నీ అరుణనీ భోజనాలు చెయ్యమని చెపుతోంది. శేఖరం గదిలోనే వుండిపోయాడు. అరుణ మీరాతో కబుర్లు చెప్తూ చీరలూ నగలూ చూపిస్తూ వుండిపోయింది.

"ఇంత స్నేహమా పిల్లిద్దరికీ" అనుకుని విస్తుపోయిందావిడ. "మీరా నిజంగా చదువుకోని దానిలానే నటించింది" అని ఆశ్చర్యపోయింది. "పాప తనతోకూడా ఇంత ఇదిగా యెప్పుడూ మాట్లాడదు. ఎప్పుడూ ఏదో పుస్తకం పుచ్చుకుని కూర్చునే పాప." ఆవిడ మనసు క్షణంసేపు మూలిగింది. శాంతమ్మగారు అరుణా మీరా కూర్చున్న గది గుమ్మం దగ్గరకొచ్చి, "పాపా! పదకొండు అయింది. ఇంకెప్పుడూ! వేళపట్టున భోజనం చేయకపోతే ఎలాగ" అంది.

"అప్పుడేనా అమ్మా!" అంది అరుణ.

మీరా గబగబా ఇవతలకి వచ్చేసింది.

శాంతమ్మగారు అరుణని రమ్మని చెప్పి—మీరాని అన్నాలు పెట్టేయమని చెప్పింది.

శేఖరం రాలేదు. ఆకల్లేదు ఇప్పుడప్పుడే తిననన్నాడు. తల్లి చెప్పినా అతను రాలేదు. మొదట మీరాని ఇక్కడ చూసి—ఆ పూట భోజనానికి రావటానికి ఎలా తటపటాయించేడో—ఇప్పుడలాగే వుంది అతని పరిస్థితి. మీరా వడ్డిస్తోంటే అరుణ ముఖం ఎలా వుంటుందో అతనికి తెలుసు. అప్పుడు—తన తప్పు వేయిరెట్లయి కోటిరూపాల్లో కళ్ళముందు కనిపిస్తుంది. అందుకే అరుణ కాస్త సమాధానపడేవరకూ సాధ్యమైనంత వరకూ వాళ్ళిద్దరూ వుండే సమయంలో తను అక్కడికి వెళ్ళకూడదనుకున్నాడు.

శేఖరం అనుకున్నట్టుగానే మీరా వడ్డిస్తోంటే అరుణ మనసు మూగబోయినట్టనిపించింది. సరిగ్గా భోజనం కూడా చేయలేకపోయింది.

"అదేం తిండే పాపా! కారం సరిపోలేదా?" అని అడిగింది శాంతమ్మగారు.

"సరిపోయింది" తల ఎత్తకుండానే జవాబిచ్చింది అరుణ.

మీరాకి చాలా సిగ్గేసింది. అరుణ ప్రవర్తన ఇలాగే వుంటే ఆవిడ ఏమనుకుంటుందోనని.

పన్నెండు దాటిపోయింది.

శేఖరం భోజనానికి రాలేదు.

"చిన్నబాబూ భోజనానికి లే" అంది శాంతమ్మగారు.

"మీరు చేశారా?"

"ఎప్పుడో చేశాం లే. ఒంటిగంట అవుతోంది. మళ్ళీ మీరా వెళ్తుంది."

"నేను కాస్సేపుంటే కాని తినలేనమ్మా!....ఆవిణ్ణి వెళ్ళని" అన్నాడు.

"అదేం! రాత్రి కూడా భోజనంలేదూ! ఏమిటోరా బాబూ! ఇంట్లో వున్నప్పుడేనా వేళ కింత తినవు."

"రోజూ పొద్దుపోయి తినటం అలవాటయిపోయింది కదమ్మా!"

"ఏం అలవాటో ఏమో" అని క్షణం ఆగి మళ్ళీ కొంచెం గొంతు తగ్గించి "మీరా బి.ఏ. పాసయిందటగా! మీరా ఏం చదువుకోలేదుట అన్నప్పుడు కూడా నువ్వూ చెప్పలేదు."

శేఖరం మాట్లాడలేదు.

"ఒకవేళ అంత చదువుకున్నట్టు చెప్తే నేను ఒప్పుకోనని భయపడిందేమో! లేకపోతే అంత చదువుకుని ఇలాంటి పని చేస్తానంటే నవ్వుతారనుకుందో!"

"అవసరం అలాంటిది" తప్పనిసరిగా ఏదో ఒకటి అనాలన్నట్టు అన్నాడు శేఖరం.

మీరా వెళ్ళేకే శేఖరం భోజనానికి వచ్చేడు. అన్నీ టేబుల్‌మీద సర్దివున్నాయి. శేఖరం వడ్డించుకుని తింటోంటే శాంతమ్మగారు అక్కడికి వచ్చింది.

"నేను వడ్డిస్తానుండు" అంది.

"అన్నీ ఇక్కడే వున్నాయి కదమ్మా! నువ్వు కూర్చుని కబుర్లు చెప్పు....అరుణ ఏం చేస్తోంది!" మాటలోనే అరుణ అక్కడికి వచ్చింది.

"పుట్టింటికొచ్చిన ఆడపిల్లలు ఇలాగే వుంటార్రా" అంది శాంతమ్మగారు.

"ఏమిటరుణా!" అన్నాడు శేఖరం తెలిసినా తెలియనట్టే.

"ఏమిటే!" అంది అరుణ తనూ ఏం తెలియనట్లు.

"అమ్మ ఏదో అంటోంది?"

"నీకు తెలుసుగా, చెప్పు" అంది అరుణ తనూ ఓ కుర్చీలో కూర్చుంటూ.

"చూశావా అమ్మా! అరుణ యెలా మాట్లాడుతోందో!" ఫిర్యాదు చేస్తున్నట్లుగా అన్నాడు.

"అదేమిటే పాపా! మనసు అంత పాడుచేసుకుంటారా! స్నేహితురాలు-బాధ వుంటుంది

ఉచితం !! FREE !!

ప్రార్థన

రెండవ ప్రపంచ యుద్ధం జోరుగా జరిగే సమయంలో కొంతమంది భక్తులు కలిసి, యుద్ధంలో మరణించిన వారి భార్యాబిడ్డల కోసం, యుద్ధంవలన నష్టపోయిన వారికోసం, వారి అక్కరలు తీర్చే ధనంకోసం ప్రార్థించుచుండగా, ఇంగ్లండు దేశంలోని ఎసెక్స్ అనే పట్టణంలో నివసించే ఒక రైతు వారికి కొంత ధనము పంపించాడు. నీళ్ళ కొరతవల్ల తన భూముల నుండి సరిగ్గా ఫలం పొందలేకపోతున్నానని, లేకుంటే వారికి ఇంకా కొంత ఎక్కువ ధనం పంపివుండేవాడినని, జర్మనులు విరివిగా వేస్తున్న బాంబులంటే తనకు భయమనీ, అవి తన పంట పొలాలను పాడుచేయకుండా తనకోసం ప్రార్థించమంటూ ఉత్తరం వ్రాశాడు. అసలు బాంబులు ఆ ప్రదేశంలో పడకూడదని ప్రార్థించటం అసాధ్యమనీ, ఎట్టి తిరిగి ఈ పరిస్థితులలో దేవుని చిత్తం ఆ రైతు జీవితంలో నెరవేరేటట్లు ప్రార్థించగలమని వారు అభయమిచ్చారు.

ఈ ఉత్తరం అందిన కొద్దిరోజులకే ఒక పెద్ద జర్మన్ బాంబు ఆ రైతువున్న పరిసరాలలో పడింది. కాని, దానివలన రైతుకుటుంబానికిగాని అతని పంటపొలానికిగాని ఎటువంటి హాని జరగలేదు. అయితే ఆ మారణాయుధం భూమిలోనికి చాలా లోతుగా చొచ్చుకొనిపోయినందువల్ల భూమియొక్క అంతర్భాగంలో ప్రవహిస్తున్న జలధారలు పైకి ఉబికి ప్రవహించటం ఆరంభించాయి. ఈ జలాధారలవల్ల రైతు కుటుంబానికి నీటికొరత తీరటమేకాక చుట్టూ వున్నవారు కూడా ఆ నీటిని ఉపయోగించుకొని వారి వ్యవసాయాన్ని అభివృద్ధి పరచుకున్నారు. ఆ సంవత్సరం తన పంట సమృద్ధిగా పండినందుకు మరింత ధనం దైవసేవకు పంపుతూ తనకోసం వారు చేసిన ప్రార్థనలకు ఆ దేవుడు ఎలా జవాబు అనుగ్రహించాడో దానిని ఆ రైతు నివేదించుకున్నాడు.

చిత్తశుద్ధి కలిగి దేవుడున్నాడనే నమ్మకంతో, ఆయన చిత్తం మన జీవితంలో నెరవేరాలనే నిరీక్షణతో ప్రార్థించినప్పుడే దేవునివద్దనుండి ఇటువంటి ఖచ్చితమైన జవాబు పొందగలం. అన్నీ కలిసి వచ్చినప్పుడు దేవుని ప్రార్థించటం నష్టపోయినప్పుడు దూషించటం కాకుండా ఎల్లప్పుడూ ఒకే రీతిగా ప్రార్థించాలి. మనం అడిగేవాటికన్నా, ఊహించే వాటికన్నా అత్యధికంగా చేయగలిగిన దేవుని గూర్చి తెలుసుకున్నారా?

—చదలవాడ చంద్రమతీదేవి

ఉచితం!!

పాపం-పుణ్యం, సత్యం-అసత్యం, జీవం-మరణం, వెలుగు-చీకటి, ధర్మం-అధర్మం, నీతి-అవినీతి, మోక్షం-నరకం, ఆశీర్వాదం-శాపం, కలహం - సమాధానముల గురించి, అమృతమూర్తి దేవుని కుమారుడైన యేసు క్రీస్తును గురించి మీరు తెలుసుకోదలచుకుంటే నేడే ఈ ప్రక్క చిరునామాకు వ్రాయండి. అందమైన అత్యంత ఉపయోగకరమైన, మీకు నిత్యానందాన్ని ప్రసాదించే పుస్తకం పోస్టు ఖర్చు మేమే భరించి ఉచితంగా మీకు పంపుతాము.

ఉచితం!!!

ఇదీ అడ్రస్ :

డా॥ ఎస్. జాన్‌డేవిడ్

ఫార్ కార్నర్స్

పోస్టు బాక్సు 315

విజయవాడ-2.

FAR CORNERS

Gospel Message Inserted by Far Corners

కాదన్నా. ఏదో మనకి తోచిన సహాయం చేయచ్చు. తప్పులేదు. అన్నీ చక్కదిద్దలేం కదా! నువ్విలా దిగులుగా వుండకూడదు. హెచ్చరికగా తిరగాలి" మందలింపుగా అందావిడ.

శేఖరం ఇంకేం మాట్లాడలేదు. మౌనంగా భోజనం చేయసాగాడు.

*   *   *

మధ్యాహ్నం మామూలు టైముకే మీరా వచ్చింది.

శాంతమ్మగారూ, అరుణా, శేఖరం హాల్లోనే కూర్చున్నారు.

భుజం నిండుగా పమిట కప్పుకుని—తల వంచుకుని లోపలకెళ్ళిపోతున్న మీరాని రెప్ప వాల్చకుండా అలాగే చూస్తూండిపోయింది అరుణ. ఎక్కడికేనా వెళ్తున్నప్పుడు తను పమిట భుజం నిండుగా కప్పుకుంటే మీరా ఏమనేది "అబ్బ! ముసలమ్మలా ఆ పమిట కప్పుకోవట మేమిటే" అని తీసిపారేసేది. "నా కది అలవాటయింది" అంటే "నాకు అలవాటులేదు; మనిద్దరం కలిసి వెళ్తున్నప్పుడు నువు బుద్ధిమంతురాల్లా పమిట కప్పుకుని వస్తే—నీ పక్కన నడుస్తున్న నన్నేమంటారో తెలుసా, ఎవరేనా? నా కోసం నువ్వీ త్యాగం చేయి. నీ కోసం నేనేదేనా త్యాగం చేస్తాను సరేనా?" అన్న మీరా!

ఆ తర్వాత అరుణ వాళ్ళ మాటల్లో కలగజేసుకోలేదు.

ఇది శేఖరం శాంతమ్మగారు కూడా గ్రహించేరు.

శేఖరం పుస్తకం తీసుకుని చూడసాగాడు.

శాంతమ్మగారికి రవంత కోపం కలిగింది. "మీరా గురించి బెంగతో అరుణ యిలాగే దిగులుగానే వుంటుందేమో! ఇదెక్కడి చోద్యం!" అని అనుకోకపోలేదు. కానీ మళ్ళీ వెంటనే సర్దుకుందావిడ. "తనకే మీరాని చూస్తే ఏదో చెప్పలేని అభిమానం ఏర్పడింది. అలాంటిది అంత స్నేహంగా వున్నారాయె...."

తర్వాత శేఖరం తన గదిలోకి వెళ్ళిపోయాడు.

అరుణ పుస్తకం తీసుకుని నామకావాస్తే తిరగేస్తోంది.

శాంతమ్మగారు చెప్పిన పలహారం చేసి, టీ నీళ్ళు పడేసింది. అరుణని ఏం తినాలని వుందని ఎన్నిసార్లడిగినా అరుణ చెప్పలేదు. పైగా తనకేం తినాలనిలేదని చెప్పింది. అడిగి అడిగి ఆవిడకి విసుగొచ్చి తనకి తోచింది చేయమని చెప్పింది.

శేఖరం రాలేదు. గదిలోనే తెచ్చిపెట్టమన్నాడు. రాఘవరెడ్డి వచ్చినప్పుడే అతను టిఫిను గదిలో తీసుకుంటాడు. అదికూడా అతనే స్వయంగా యిద్దరికి తీసుకు తెచ్చుకుంటాడు. తల్లిని తెమ్మనడు.

"ఒరే అదసలే దిగులుగా వుంది. నువు కాస్త పక్కనుంటే నయం. మధ్యానం భోజనం కూడా సరిగా చేయలేదు. ఇలా అయితే ఎలా?" బాధగా-విసుగ్గా అందావిడ.


అతను తడుముకోకుండా అన్నాడు "నువు ఇద్దరికీ తీసుకురామ్మా! నేను అరుణని పిల్చుకొస్తాను" అని ఆవిడ ఇంకేమనటానికీ వీలులేకుండా అక్కడనుండి వెళ్ళిపోయాడు.

శాంతమ్మగారు మీరాని శేఖరానికీ, అరుణకి టిఫిను పళ్ళాలలో సర్ది తీసుకురమ్మంది. మీరా ఆవిడ చెప్పినట్టే చేసింది. మీరా టిఫిను ప్లేట్లు టేబుల్ మీద పెడుతోంటే శేఖరం అరుణని తీసుకొచ్చేడు.

గుమ్మంవరకూ వచ్చిన శేఖరం గుమ్మం ఇవతలే ఆగిపోయాడు.

"ఇందుకా" అన్నట్టు అరుణ అన్నగారికేసి చూసింది.

శేఖరం చూపులు త్రిప్పుకున్నాడు. అరుణకి ఏం చెప్పకుండా "పనుంది. నీతో మాట్లాడాలి రా" అని తీసుకొచ్చేడు శేఖరం. తల్లి ఫలహారం తీసుకొస్తుందనీ, మీరా గురించి వివరంగా



అన్నీ అరుణని అడిగి తెలుసుకోవచ్చని అతను వూహించేడు. అంతా తారుమారయింది. టిఫిను పట్టుకొచ్చిన మీరాని చూస్తూనే అరుణ ఎప్పట్లా-బాధగా ముఖం దించుకుంది.

శేఖరం లోపలకొస్తాడేమో తను వెళ్ళిపోదామని ఒకటి రెండు నిముషాలు చూసింది మీరా. కాని అతను వచ్చే జాడ కనిపించలేదు. మీరా ఇటు తిరిగి రెండడుగులు వేసి ఆగిపోయింది. శేఖరం పక్కకి తప్పుకున్నాడు. మీరా వెళ్ళిపోయింది.

శేఖరం లోపలకి వచ్చేడు. తల్లి ఏదో అనబోతోంటే తల్లిని వెళ్ళిపొమ్మన్నట్లు సౌజ్ఞ చేశాడు. శాంతమ్మగారు వెళ్ళిపోయింది. వెనకే అరుణ కూడా వెళ్ళబోయింది.

"అరుణా! మాట ఇలారా" పిల్చాడు శేఖరం.

ఏమిటన్నట్లు చూసింది అరుణ.

"ముందు ఇలా వచ్చి కూర్చో!" అంటూ తనో కుర్చీలో కూర్చున్నాడు.

అరుణ మాట్లాడకుండా వచ్చి కూర్చుంది.

"టిఫిను తీసుకుంటూ" అని టిఫిను ప్లేటు అరుణ ముందుకు జరిపాడు.

అరుణ మాట్లాడలేదు. తీసుకోలేదు.

"తీసుకో అరుణా!"

"నువ్వు కానీ" పొడిగా అంది అరుణ.

"అలా వున్నావేం" అందామనుకున్నాడు "నీకు తెలియదా" అంటుంది వెంటనే. అందుకే నచ్చచెప్తున్నట్టుగా అన్నాడు "అరుణా!.... మీరాకి చాలా తొందరలోనే మంచి ఉద్యోగం వచ్చేలా చూస్తాను. ఏ ప్రయివేటు కంపెనీల్లోనన్నా దొరక్కపోదు. నువ్విలా దిగులుగా వుంటే అమ్మ ఎంత బాధపడుతుందో తెలుసా? తన గురించి నువ్విలా దిగులుగా వుండటం—నువ్వు దిగులుగా వున్నావని అమ్మ బాధపడటం మీరాకి ఇష్టంగా వుంటుందా? నువ్వే ఆలోచించు."

అరుణ మాట్లాడలేదు.

"తన గురించి కూడా నువ్వు ఆలోచించు—అప్పుడు నీకింత బాధనిపించదు."

"బాగుందన్నయ్యా!" అరుణ నవ్వింది. "మీరా గురించి ఆలోచించకపోతే నా కింత బాధెందుకు?"

"నే నంటున్నది అదికాదు" అని రెండు మూడు క్షణాలు ఆగి అన్నాడు: "అమ్మ మీ స్నేహాన్ని అర్థం చేసుకోగలదు కానీ, నువ్విలా బాధపడ్తూ కూర్చోవటం అమ్మ సహించగలదా? మీరా ఇక్కడ చేరిన కొద్దిరోజులకే అమ్మ అభిమానానికి పాత్రురాలయింది. మీరా అంటే అమ్మకి ఎంత అభిమానమో అమ్మంటే మీరాకి రెట్టింపు గౌరవం—అలాంటిది అమ్మ మనసు బాధపడ్డం మీరా సహించగలదా? ఇలాంటి పరిస్థితుల్లో మీరా ఇక్కడనించి తప్పుకోవచ్చు—అప్పుడు ఆ కుటుంబానికి ఈ ఆధారం కూడా వుండదు. ఇంకోటి దొరక్కుండా ఇది వదులు కుంటే ఒక్క నెలయినా సరే! అలాంటి పరిస్థితుల్లో వున్నవాళ్ళు ఎదుర్కోగలరా!

మీరాని అమ్మ—ఇంట్లో ఒక వ్యక్తిగా అభిమానిస్తోంది. అలాంటి అభిమానాన్ని, గౌరవాన్ని దూరం చేసుకోవాలని యెవరూ అనుకోరు. నువ్విలాగే వుంటే అమ్మ సహించలేదు. ఇప్పటికే ఆవిడ చాలా బాధపడుతోంది."

"మీరాకి ఇప్పుడు ఎంత ఇస్తున్నారు" చాలా నీరసంగా అడగింది అరుణ,

"ఎనభై....అమ్మ వంద ఇస్తానంటోంది" అన్నాడు శేఖరం. వంద ఇస్తే మీరా తిరిగి ఇరవై రూపాయలు ఇచ్చిన వైనం చెప్దామా అనుకున్నాడు క్షణంసేపు. మళ్ళీ అరుణ మీరాని అడిగేస్తే! అని మళ్ళీ వూరుకున్నాడు.

అరుణకి చెప్పలేనంత నీరసంగా, అలసటగా వుంది. చాలా సున్నిత మనస్తత్వంగల అరుణ మీరా ఈ పరిస్థితికి తట్టుకోలేకపోతోంది. మీరాతో వున్నంత స్నేహం అరుణకి ఎవరితోనూ లేదు.

"నలుగురు గలవాళ్ళు కావాలంటారు ఇదేకాబోలు. కనీసం అక్కా చెల్లెళ్ళు-అన్నదమ్ము లన్నా లేకపోవడం ఎంత దురదృష్టం!" అంది బాధగా.

అదివరకు అరుణ మాటలద్వారా మీరాకి తల్లి, బామ్మ తప్ప ఎవరూ లేరని తెలుసుకున్నాడు శేఖరం. అయినా తెలియనట్టే అడిగేడు "ఎవరూ లేరేమిటి" అని.

"ఎవరూలేరు. వుంటే ఎవరో ఒకరు సహాయం చేయకపోనా!"

"తండ్రీ?"

"ఏమో తెలియదు. ఒకసారి అడిగితే ఏడ్చేసింది—పోయేదేమో! వాళ్ళమ్మని రెండు సార్లు చూశాను. ఆవిడ బొట్టుపెట్టుకోదు. అది చెప్పలేక ఏడ్చుంటుంది."

వాళ్ళిలా మాట్లాడుకొంటోంటే శాంతమ్మగారు వచ్చింది. "ఇంకా తీసుకోలేదూ" అంది.

"ఇదిగో! అరుణా! కానీ" అన్నాడు శేఖరం.


అరుణ బలవంతంగా తినసాగింది.

శాంతమ్మగారు మోడా వాళ్ళకి దగ్గరగా జరుపుకుని కూర్చుంది.

మీరా శేఖరానికి అరుణకి టీ—శాంతమ్మగారికి హార్లిక్స్ అక్కడపెట్టి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది. మీరా ఇంకా వంటపనిలోనే వుంది. మధ్యాహ్నం మీరా వచ్చేకా అరుణ మీరా దగ్గరకిగాని మీరా అరుణ దగ్గరగాని రాలేదు.

శాంతమ్మగారు రోజులా తనతో మాట్లాడలేదని మీరా గ్రహించింది. 'ఇలా అయితే లాభంలేదు. ఎంత మంచితనం వుంటే మాత్రం పనివాళ్ళని తమతో సమానంగా సరసని కూర్చోపెట్టుకోవడానికి ఎవరు హర్షిస్తారు? అరుణ దీనికి తట్టుకోలేదు....ఇదీ మంచిదే! తను ఈ ఇంట్లోంచి బయట పడిపోతే అదే చాలు. ఇలాంటి అవకాశం తనకి మళ్ళీ రాదు' అనుకుంది మీరా.



మీరా వంటపని పూర్తిచేసి అక్కడ అన్నీ సుభ్రంగా సర్ది ఇవతల కొచ్చింది.

శాంతమ్మగారు శేఖరం వాకిట్లో కూర్చున్నారు.

మీరా అరుణ గదిలోకి తొంగి చూసింది. అరుణ మంచంమీద దిళ్ళకి ఆనుకుని కూర్చుంది. పుస్తకం చేతిలోవున్నా పరధ్యాన్నంగా ఎటో చూస్తోంది.

మీరా మెల్లగా వెళ్ళి అరుణ వెనకాల నిలబడింది.

అరుణ ముఖం తిప్పకుండానే "అయిందా పని" అని అడిగింది.

అరుణ గొంతులో బాధ స్పష్టంగా తెలుస్తోంది. "అయింది" అయింది మీరా.

ఇంక అరుణ మాట్లాడలేదు.

ఎడంచేయి అరుణ భుజంమీద వేసి, కుడిచేత్తో మంచం పందిరి కర్రని పట్టుకుంటూ అంది మీరా "అరుణా! నువ్వు నాకో సహాయం చేసిపెట్టాలి. నీ మేలు ఎన్నటికీ మర్చిపోను."

"చాలా విచిత్రంగా వుందే! నా సహాయం కావాలా, నీకు! అయినా నేనేం చేయగల్ను" హేళనగా అరుణ మాటకి మీరా ఏం జవాబు చెప్పలేకపోయింది.

రెండు మూడు క్షణాలు ఆగిన అరుణ మళ్ళీ అంది "అయినా ఏదో అడిగావు! తెలుసుకోవాలిగా! దాంట్లో తప్పు లేదుగా! అయినా పెద్దలు అంటూ వుంటారు. ఎంతటి విరోధులైనా సరే-గుమ్మంలోకొస్తే ఆదరంగా ఆహ్వానించాలనీ-ఆదుకోవాలనీ—" ఆగిపోయింది అరుణ.

అరుణ ధోరణికి విస్తుపోయింది మీరా.

"చెప్పు మీరా!" అంది అరుణ అలాగే కూర్చుని.

"అదే అరుణా!....అమ్మగారితో చెప్పు నేను మానేస్తాననగానే సరేనమని చెప్పు! నీ మేలు ఎన్నటికీ మర్చిపోను. జీవితాంతం నీకు కృతజ్ఞురాలినై వుంటాను అరుణా!" ఎంత మామూలుగా అనాలని ప్రయత్నించినా మీరా గొంతు వణికింది.

చేతిలో పుస్తకం గిరాటేసినట్టుగా పడేసి లేచి సరిగా కూర్చుని, మీరా చేయిపట్టి లాగింది. "మీరా ఇలారా!" అంటూ తన పక్కన కూర్చోపెట్టుకుంది.

మీరా యాంత్రికంగా వచ్చి కూర్చుంది.

"మీరా!" అంది అరుణ మీరాచేయి తనచేతిలోకి తీసుకుంటూ.

"చెప్పరుణా!" నిర్లిప్తంగా అంది మీరా.

మీరా భుజంమీద చెయ్యివేసి దానిమీద చెంప ఆన్చుకుంటూ అంది అరుణ. "నా మాటలతో నిన్ను చాలా బాధపెడ్తున్నాను కదూ!"

"లేదు అరుణా! నువ్వు నన్నూ—నేను నిన్నూ ఎప్పుడూ బాధ పెట్టుకోలేదు. ఎప్పుడూ పెట్టుకోం కూడా. కానీ మనం ఇద్దరం కలిసి అమ్మగార్ని బాధపెడ్తున్నాం."

ఆశ్చర్యంగా తలెత్తుతూ అంది అరుణ "అమ్మనా! అమ్మనేం బాధపెట్టేం?"

"ఈ రోజంతా నువ్వెలా వున్నావో నీకు తెలియదా అరుణా! నువ్వొస్తావని ఎంత సంబరపడుతున్నారు అమ్మగారు. కాని నువ్వు నా గురించి బాధపడ్తూ అన్నం కూడా తినకుండా ఆవిణ్ణి చాలా బాధపెడ్తున్నావు. నా కెంత సిగ్గుగా వుందో తెల్సా? ఆవిడతో మాట్లాడలంటేనే చచ్చే సిగ్గుగా వుంది...."

"నువ్వేం చేశావ్ మధ్య!"

"నా గురించేగా నువ్వలా వున్నది?" క్షణం ఆగి మళ్ళీ అంది మీరా "అరుణా! నేను అమ్మగార్కి చెప్దామనుకుంటున్నాను ఇక్కడ మానేస్తానని. అమ్మగార్ని వెంటనే "ఊ" అనమని చెప్పు అరుణా! నేనిక్కడ మానేస్తే ఇక రాననుకోకు! రోజూ రెండుపూటలా వచ్చి చూసి వెళ్తాను. మనిద్దరం కలిసిమెలిసి తిరగొచ్చు. అప్పుడు నువ్వేమిచ్చినా కాదన్ను అరుణా! స్వయంగా నువ్వే కాఫీ ఫలహారాలు తీసుకొద్దువుగాని—సరదాగా తిందాం! వారానికోసారి యిక్కడే భోజనం చేస్తాను. వారానికి రెండురోజులు చేస్తాను పోనీ—మాకు ఖర్చులు కలిసి వస్తాయి."

తెల్లబోయినట్టుగా కళ్ళు వెడల్పు చేసుకుని వింటున్న అరుణ మీరా చివరన్న మాటకి చప్పున తన చేత్తో మీరా నోరు మూసేసింది. "అవేం మాటలు మీరా! నేనన్న మాటలు నువ్వర్థం చేసుకోలేదు" అంది బాధగా.

"నీ మాటల్నీ—నీ అభిమానాన్నీ నేను అర్థం చేసుకున్నాను అరుణా! నువ్వే నా పరిస్థితి అర్థం చేసుకోవట్లేదు. అమ్మగారు నన్ను ఎంత అభిమానంగా చూస్తారో నీకు తెలియదు అరుణా! అలాంటి అభిమానాన్నీ ఆప్యాయతనీ దూరం చేసుకోవాలని ఎవరూ అనుకోరు. మనిద్దరం ఎంత స్నేహితులైతే మాత్రం! నీ పక్కనే కూర్చుని-నీతో సమానంగా వుండాలంటే-ఒంటిమీద తెలివి వున్నవాళ్ళు ఎవరేనా చేస్తారా అరుణా!...."


"అంటే!"

"అవును అరుణా! అమ్మగారికి నా మీద మంచి అభిప్రాయం ఏర్పడింది. దాన్ని నేను మాపుకోదలుచుకోలేదు. అమ్మగారు నన్ను కాఫీ తీసుకోమన్నా నా కెంత సిగ్గుగా వుంటుందో తెలుసా? కొన్ని కొన్ని హద్దులనేవి ఎప్పుడో ఏర్పడినాయి అరుణా! వాటిని అధిగమించి ప్రవర్తిస్తే అసహ్యంగా వుంటుంది. అయినా అది నీ వల్లకాదు. మనిద్దరం ఈ గదిలో ఉన్నప్పుడే స్నేహితులం—అది నేను మర్చిపోకూడదు—అది నావల్లకాదు. అందుకని—"

ఇద్దరూ కాస్సేపు మౌనంగా వుండిపోయారు.

తను చెప్పవలసింది చెప్పేశాను అనుకున్న మీరా మనసు కొంచెం తేలికపడింది.

"అవును మీరా! నువ్వన్నది నిజమే! అన్నయ్యకూడా ఇందాక నువ్వన్నట్లుగానే అన్నాడు.



ఏమిటో మీరా! వంటింట్లోకి రావాలంటేనే నాకు ఏమిటోలా వుంది" అరుణ కళ్ళు తుడుచుకుంటూ అంది.

"అరుణా! మొట్టమొదట నువ్వు మానవలసింది ఇది" అంటూ అరుణ కళ్ళు తన పమిట కొంగుతో తుడిచింది. "అరుణా! నువ్విలాగే వుంటే అస్సలు నీకు కనపడను. నన్ను చూడగానే ఎంతో సంతోషిస్తావనీ ఎన్నో కబుర్లు చెప్తావనీ నీ రాకకోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తోంటే-ఇదేనా? ఇలాగే వుంటూరా" చిరుకోపంగా అంది.

"హఠాత్తుగా నిన్నిక్కడ చూసి ఎంత ఉక్కిరిబిక్కిరయేనని!....పోనీలే మీరా! జరిగిన దానికి బాధపడుతూ నిన్ను మరీ బాధపెడ్తున్నానేమో...."

"ఛ! అవేం మాటలు అరుణా!" మధ్యలోనే వారింపుగా అంది మీరా.

"మీరా! అన్నయ్య నీకు ఏదేనా కంపెనీలోనన్నా మంచి ఉద్యోగం చూస్తానన్నాడు తొందరలోనే. మీ అమ్మగార్ని ఒప్పించి శుభ్రంగా ఉద్యోగం చేయి."

మీరా మాట్లాడలేదు.

అప్పుడే గుర్తుకొచ్చినట్టుగా అంది అరుణ "అవునూ! మీరా మీకు తెలుసున్నవాళ్ళు ఎవరూ లేరా? మీ బామ్మగారున్నప్పుడు నీ పెళ్ళిప్రయత్నం ఏం చేయలేదా?...."

అరుణ మాటలు పూర్తికాకుండానే మధ్యలో అంది మీరా "అరుణా! నీకు పుణ్యముంటుంది పెళ్ళిమాటెత్తకు!....చేసుకున్న వాళ్ళంతా ఏం సుఖపడ్తున్నారు—మా అమ్మేం సుఖపడింది."

"అదేమిటి మీరా! అసలు...."

ఇంకా ఏదో అనబోతున్న అరుణని ఏమీ అననీయలేదు. "ఒద్దు అరుణా! ఆ సంగతులింక బందుచేయి" అంది.

ఇంక అరుణ ఏమీ అనలేదు.

(సశేషం)



అల్లావుద్దీన్ అభినవ దీపం

దాస్ బాబు

మజ్జు ప్రత్యక్షమై—

"ఏం అల్లావుద్దీన్ సాబ్....అరవై వోల్టుల బల్బు ఖర్చు లేకుండా దొరికింది కదా అని యెప్పుడు పడితే అప్పుడు తోమడమేనా?" అని విసుగ్గా అడిగాడు.

"మరేం చెయ్యమంటావ్? నువ్వు లేకుండా ఈ లోకంలో ఒక్క క్షణంకూడా బతకలేక పోతున్నాను...." అల్లావుద్దీన్ బుంగమూతిపెట్టి అన్నాడు.

"ఈ డైలాగు యే అమ్మాయితోనైనా చెప్పు....అక్కరకొస్తుంది. హుఁ! ఏ క్షణాన నా దీపం నీచేత చిక్కిందోకాని....నా బతుకూ అంతే అయింది. క్షణం క్షణం నీ సేవే! వేరే ధ్యాసే లేకుండా చేశావు. ఇంతకీ యిప్పుడు ముంచుకొచ్చిన ప్రమాద మేమిటి?" మజ్జూ అడిగాడు.

"చూడు మజ్జూ, మనం ఈ లోకంలోకి వచ్చి అర సంవత్సరం నిండుగా గడిచి పోయింది. కాని నా బతుకే వెలితిగా మిగిలి పోయింది—" అల్లావుద్దీన్ నిట్టూర్చాడు.

"తెలుగు సినిమా యేదన్నా చూశావా యేం? అచ్చంగా తెరభాష దూకుతోంది నోట్లోంచి!" అని మజ్జూ నవ్వాడు.

"నీ కంతా నవ్వులాటగా వుంది. వచ్చి యిన్ని రోజులయింది; ఏదీ ఇల్లు లేదాయె—వాకిలీ లేదాయె; ఉద్యోగం లేదాయె—సద్యోగం లేదాయె; చదువు లేదాయె — చట్టుబండ లేదాయె—ఏమిటీ దారుణం?" అల్లావుద్దీన్ ఆవేశంగా అన్నాడు.

"ఈ దేశంలో ఏవున్నా లేకపోయినా చట్టుబండలకేం కొదువలేదు! మీకు ఉద్యోమేగా కావల్సింది, చూద్దాం—" మోర పైకెత్తాడు మజ్జు.

"ఈ దేశంలో ప్రతివాడూ చూద్దాం అనే వాడేగాని చేద్దాం అనేవాడు ఒక్కడూ కనిపించడు. సరే, అర్జంటుగా నాకు ఉద్యోగం కావాలి. ఇది నా ఆజ్ఞ—" కొస్త కోపంగా అన్నాడు అల్లావుద్దీన్.

మజ్జు కాసేపు ఆలోచించే—

"ఉద్యోగం పురుష లక్షణం అన్నారు పెద్దలు. ఆ లక్షణం నిరూపించుకోడానికైనా మీరు ఉద్యోగం చేయడం మంచిదే! కాని—సార్—మన కెవరిస్తారు సార్—ఉద్యోగం?...."

"మనం—అంటా వేమిటి? ఉద్యోగం నాకు....నీ కెవడిస్తాడు? చూడు యేదన్నా మార్గం—" అక్కడే చెట్టుకింద చతికిల బడుతూ అన్నాడు. మజ్జూ కూడా కూలబడి, ఆకాశంకేసి కాసేపు చూసి—చటుక్కున లేచి

నిలబడ్డాడు.

"సార్....అల్లావుద్దీన్‌గారో .... మీరు అదృష్టవంతులండీ! ఇక్కడ ఉచ్చురావుగా రని ఓ పెద్ద మనిషున్నాడు. అతణ్ని కలుసు కుంటే...."

"ఉచ్చురావుగా రేంటి మజ్జూ....అ పేరు...."

"ఉచ్చురావుగా రంటే—ఉద్యోగా లు చూపించే రావుగా రన్నమాట. ఉచ్చ—పొడి అక్షరాల పేరు. రండి....ముందు ఆ పెద్ద మనిషిని కలుసుకుందాం—" మజ్జు దారి తీశాడు. అల్లావుద్దీన్ అతని వెనకాలే నడి చాడు.

ఓ పెద్ద భవనం ముందు ఆగారు. గేటు వాచ్‌మన్‌తో కాసేపు ఘర్షణపడి — ఓ రూపాయి ముడుపు చెల్లించి—ఉచ్చురావుగారి గదిలో తేలారు. నేరుగా వెళ్ళి ఉచ్చురావుగారి బల్ల ముందు నిల్చుని నమస్కారం చేసి.... కుర్చీల్లో కూర్చున్నారు. ఉచ్చురావుగారు వాళ్ళ నమస్కారాన్ని పుచ్చుకోలేదు; వాళ్ళ నసలు పట్టించుకోకుండా—టెలిఫోను మోగకముందే —రిసీవర్ని ఎత్తి చెవి దగ్గర పెట్టుకుని—

"ఆఁ .... ఎవురూ .... ఆఁ....మంత్రిగారా? నమస్తే నమస్తే. ఏదో, మామీద దయ కలిగి నట్టుంది....సరేగాని....మొన్న ముగ్గుర్ని మీ దగ్గరికి పంపించానే వాళ్ళకి ఉద్యోగం వేయిం చారా? ఆఁ ఉద్యోగాలు ముగ్గురికీ దొరికాయా? బావుంది. ఏదో నా మాట నిలబెడుతున్నారు. పరోపకారం చేస్తే పుణ్యం దక్కుతుందం టారు—ఈ జన్మ కంతకంటే ఇంకేం కావాలి చెప్పండి? అందుకే నన్నాశ్రయించి చాలా మంది...."

—ఈ మాటలు అల్లావుద్దీన్‌కి ఒక పట్టాన అర్థం కాలేదు. పోతే, మజ్జూకి బాగా అర్థ మయింది కాబోలు—రెండు చేతులు జోడించి, గురుభక్తిని వొలకబోస్తూ, వినయం పుట్టి పడుతూ వుంటే—

"అయ్యా రావుగారూ....ఇక చాలండి. మంత్రిగారితో మాటలు ఆపుచేసి ముందుగా నా నమస్కారాన్ని స్వీకరించండి. ఆహా....సిస లైన పుణ్యాత్ములు ఎన్నాళ్ళకు ఎదురయ్యా రండి! మీ దేవిఁ జన్మో కానీండి!...మీ దరి దాపుల్లో కొస్తేనే మా జన్మలు తరించిపోతాయి. వంగలేను....లేకపోతే కాళ్ళమీద పడి...."

—మజ్జు ముగించకముందే, వినయ చిహ్నాలు ముఖం నుంచి మాయం కాకముందే—

"వద్దు బాబు! అసలే మరుగుజ్జువి, బల్ల కింద దూరిపోతావు"—ఉచ్చురావుగా రన్నారు. ఆ మాటలు అర్థమయ్యాయేమో, అల్లావుద్దీన్ పకపకా నవ్వాడు. అయినా మజ్జు చలించ లేదు.

"సార్....మీరు పంపించే వాళ్ళందరికీ మంత్రిగారు ఉద్యోగాలు వేశారంటే....మీ పలుకుబడి యెంత మందంగా ఉందో ఊహిం చుకోలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నా ననుకోండి—"

"చాలు —పైకొస్తావు. మంత్రిగారితో చెప్ప మన్నావా నీకు ఉద్యోగం కావాలని?—"

అల్లావుద్దీన్ బిత్తరపోయాడు.

"అబ్బే నాక్కాదండి—వీర విక్రమ పరా క్రమోపేదుడు శ్రీమాన్ అల్లావుద్దీన్‌గారికి— వీరే వారు—" పరిచయం చేశాడు.

"ఏవిటీ అక్రమం? పిల్లికూనలా వున్నాడు. ....ఇతడా అతగాడు?"

అల్లావుద్దీన్ ముఖం కందిపోయింది.

"మీ మీద ఒట్టు—యితడే నండి అల్లా వుద్దీన్. ఇతనికే నండి ఉద్యోగం—"


ఉచ్చు రావుగారు అల్లావుద్దీన్ని యెగా దిగా చూసి—

"మాయాదీపం సాయంతో రాకుమారిని అప్పుడోసారి మీ గదిలోకి రప్పించుకున్నారుగా అప్పుడె మనిపించిందండీ?" నోరూరించు కుంటూ అడిగాడు.

"భయం—అనిపించింది."

"భయమా—ఎందుకు?"

"దీపం పోతుందేమోనని—" తల తిప్పి మజ్జుకేసి చూస్తే తన ప్రశ్నలకి జవాబు చెప్పేది మజ్జూ అని తేలింది. ఉచ్చురావు ముఖం చిట్లించి—



"కాస్తా నువ్వు నోరు కట్టేస్తావా? ఆఁ.... అయితే, భయంకొద్దీ ఆ మాయా దీపాన్ని భద్రంగా వుంచుకొస్తున్నారన్నమాట! మరి.... అంత అద్భుత దీపం పెట్టుకుని బంగారు కాసులు కురిపించుకోక మీ కెందుకండి ఉద్యోగం?...."

అల్లావుద్దీన్ మజ్జు కేసి చూశాడు.

"కాసులేం కర్మండీ, కావాలంటే బంగా రపు యిటుకల్నే కురిపించొచ్చు. ఎటొచ్చి సొంతానికవి పనికి రావు. మాది కూడా పరోప కార సంస్థే—"

"బావుంది. మీరు లోపలికొస్తూంటేనే అనుకున్నా. అందరికీ నేను సహాయం చేస్తుంటే, యివాళ నాకు సహాయం చేసేవా ళ్ళొస్తున్నారని. ఆఁ....యేవీఁ లేదు. మన సంస్థని కాస్త విస్తృత పర్చాలని కోరిగ్గా వుంది. యెన్నో అక్కర్లేదు. ఏదీ ఒక్క యిటుక—ఒకటంటే ఒకటి చాలు" అభ్య ర్థిస్తూ అన్నాడు.

"మరి మా సార్‌కి ఉద్యోగం యిప్పి స్తారా?"

"ఓ బంగారపు యిటుక యిటు పారె య్యండి. చదువున్నా లేకపోయినా, అనుభవం వున్నా లేకపోయినా ఒక మాంచి ఉద్యోగం వేయిస్తా—యిటుక........" ఉచ్చురావుగారు మ్యావ్ మ్యావ్ మన్నారు.

"చదువు....అనుభవం అంటున్నారు...." అల్లావుద్దీన్ గొణిగాడు.

"అదంతే నండి! మీరు బియ్యే చదివి ఉద్యోగానికి దరఖాస్తు పెట్టారనుకోండి. అది చాలదు. కనీసం అయిదేళ్ళ అనుభవం వుండాలి!"

"అయితేసార్, అటు పాతపనివాళ్ళకూ మీ ఉద్యోగాలు పనికిరావు; యిటు కొత్త చదువు లకీ ఉద్యోగాలు అందవు. అనుభవం సంపా యించిపెట్టిన ఉద్యోగాన్ని వదులుకొని ఎవరూ రారు. కొత్తగా కాలేజీనుంచి బయటపడిన వాడికి అనుభవం యెక్కడి నుంచొస్తుంది?" మజ్జూ చిన్నపాటి లెక్చర్ దంచాడు.

"అందులోనే వుంది తిరకాసు! ఈ నాడు లక్షల్లో డిగ్రీలు సరఫరా అవుతుంటే ఉద్యో గాలి యెవరి కివ్వమన్నావ్? అందుకే అర్హతలనీ, అనర్హతలనీ కొన్ని ప్రత్యేకమైన నిబంధనలు పెట్టి—వడపోసి పారేస్తారు. మిగి లినవాళ్ళకి, ఉత్తరాలూ, దక్షిణాలూ చూసుకుని ఉద్యోగాలు వేస్తారు....నా లాటివాడు నూటి

కోటికి ఒక్కడుంటాడు. ఉద్యోగంకోసం వచ్చినవాణ్ణి మరీ నిలువుదోపిడి చెయ్యకుండా, మినిష్టర్‌గారితో ఒక మాట చెప్పి—మన పలుకుబడిమీదనే ఉద్యోగం వేయిస్తా. ఇది గుర్తుంచుకోండి—మా వంశం హరిశ్చంద్రుడి వంశం" చివరి మాటలకి చేతులు కట్టుకుని, తల పక్కకి తిప్పుకుని యింటి కప్పుకేసి చూపులు మళ్ళించాడు.

కాసేపు అల్లావుద్దీన్, మజ్జూ మౌనంగా వున్నారు.

"అయితే సార్ నిలువుదోపిడి లేదన్నారుగా....మరి... మా సార్ ఉద్యోగం...." మజ్జూ నసిగాడు.

"అది నా కోడిలెయ్. కాకపోతే ఒకటి. నే నడక్కపోయినా, మీ లాంటివాళ్ళు అభిమానం కొద్దీ ఆఫీసు ఖర్చులకని నాల్నెల్ల జీతం అడ్వాన్సుగా యిస్తుంటారు. నా సాదర ఖర్చు కని ముందు వో వంద పుచ్చుకుంటాను. యిలాంటి చిల్లర ఖర్చులు ఉద్యోగం దొరికే వరకు వుంటాయనుకోండి. అంటే మన దగ్గరేపీ ఆలస్యం కాదు. మినిష్టర్‌గారు అస్తమానం టూరు వెళ్తుంటారా....అదే ఇబ్బంది. మీకు యీ గొడవలేపీ లేకుండా ఉద్యోగం కావాలంటే—వో బంగారు యిటుకను యిటు రానివ్వండి!"

అల్లావుద్దీన్ మళ్ళీమజ్జుకేసి చూశాడు ఆశగా.

"బంగారపు యిటుక అంటే పెద్ద కష్టమేమీ కాదనుకోండి. పోతే మాయా దీపంలో తైలం పొయ్యాలి. పెద్దగా ఏం కాదులెండి. ఓ వంద చాలు—"

ఉచ్చురావు కళ్ళు మిటమిటమన్నాయి.

"ఆలోచించుకోండి. బంగారం యిటుకను బజారులో పెడితే లక్షరూపాయ లొస్తాయి. వంద యెన్నో వంతు?"

మజ్జు కళ్ళెగరేశాడు.

"పొద్దున్నే బోణీ జరిగింది. ఇంద వంద. రానియ్ బంగారం యిటుక—" ఉచ్చురావు వంద నోటు అల్లావుద్దీన్ చేతిలో పెట్టాడు.

దాన్ని మజ్జూ లాక్కొని—

"ఏదీ మీరు పెట్టుకొన్న టోపీ ఇటివ్వండి" ఉచ్చురావు తీసి మజ్జుకిచ్చాడు. దాన్నితీసుకుని-

"ఆహా! ఏం టోపీ సార్ యిది—" ఆశ్చర్యంగా అన్నాడు.

"ఖద్దరు టోపి. మంత్రిగారు చదివించారు...." తడుముకోకుండా జవాబిచ్చాడు ఉచ్చురావు.

"రోజు కెన్నిసార్లు పెడుతుంటారు సార్ దీన్ని?"

"అదేం ప్రశ్న? బుర్ర గోక్కున్నప్పుడల్లా తీసి పెట్టుకుంటూ వుంటాను—"

"అబ్బా....అంత తేలిగ్గా టోపీ పెడతారన్న మాట. సరే, మీకు బంగారం యిటుకేగా కావల్సింది."

"అంతె....అంతే....ఒక్కటి చాలు—" లాలాజలాన్ని మింగుతూ అన్నాడు.

"అయితే అల్లావుద్దీన్ సార్, ఈ టోపీని తమరు ఉచ్చురావుగారి బుర్రమీద పెట్టండి—పెట్టండి సార్ ఫర్వాలేదు—" టోపీ అల్లావుద్దీన్‌కి అందిస్తే, అల్లావుద్దీన్ ముందుకు వంగి ఉచ్చురావుగారి తలమీద టోపీ పెట్టాడు. అది బంగారం యిటుకయింది!

"ఆశ్చర్యం! అద్భుతం!! అబ్బ! ఈసారి ఎలక్షన్లో ఎమ్మెల్లేని కాకపోతే యిటుకమీద ఒట్టే!! ఓహో....హో....ఏం అద్భుతం ఆహాహా—" ఉచ్చురావు ఊగిపోతూ.... తన్మయత్వంలో పలకరిస్తూవుంటే-మజ్జూ అల్లావుద్దీన్ని గిల్లి తలుపు దగ్గరకెళ్ళి నిల్చున్నాడు.

అల్లావుద్దీన్ కూడా మెల్లగా అక్కడకు వెళ్ళాడు.

"అయ్యా ఉచ్చురావుగారు....వందకి వందనాలు! మీ నెత్తిమీదున్న బంగారం యిటుక వద్దనుకుంటే మీ టోపి మళ్ళీ మీకు వచ్చేస్తుంది. ఇటుకని తలమీద నుంచి తీశారనుకోండి—దాంతోబాటు మీ తలకాయ కూడా వూడి వస్తుంది; పాడెకు మిగిలేది మొండెమే-అది గమనించి నడుచుకోండి—అటూ ఇటూ మెసిలేరా హాంఫట్, ట్ర్వాయ్" అంటూ ఠకీమని తలుపువేసి, పరుగు లంకించుకున్నాడు మజ్జు—వంద వున్న జేబును గట్టిగా పట్టుకుని. అతని వెనకాలే మహావీరుడు అల్లావుద్దీన్ కూడా పరుగెత్తక తప్పింది కాదు.

(ఇంకా వున్నారు)

బావా మరదలీయం

గుళ్ళపల్లి డి. చింతామణి

"హలో బావా! కంగ్రాట్స్!" అంటూ హడావుడిగా బట్టలుతుకుతున్న చేతుల్తోటే వచ్చి చేతులు పట్టుకుని కుదిపేసింది హేమ. (ఓమాట-హేమ మన హీరోయిన్. చక్కటి రూపం, ఎత్తరి—తగ్గట్టు ఒళ్లు, దొండపండులాటి పెదవులు, కొట్టవచ్చినట్టు ఆ ముక్కు, నవ్వితేనే సొట్టలు పడేట్టుండే ఆ పాలబుగ్గలు—అలా నవ్వితేనే ముత్యాలు రాలేయా! అ[illegible] భ్రమింపచేసేంటి చక్కటి పలువరస, కలువపువ్వులాంటి కనులు, పూరేకల్లాంటి రెప్పలు, హరి[illegible]ల్లంటి కనుబొమలు, పిరుదలమీద జీరాడే [illegible]లాటి జడ—అబ్బే! ఏం తేడా లేదు సార్ ..మన సగటు తెలుగు సినిమా హీరోయిన్ అన్నమాట!) సుబ్బారావుని (ఖర్మ [illegible] ఈ సుబ్బిగాడే మన హీరో సార్! [illegible] (శ్రా[illegible]నివాడు దున్నపోతయి పుట్టున్" [illegible] ప్రిన్సిపల్ కూడా తెలిసి [illegible]ట్టి సినిమాచూస్తే వుండే [illegible]టాయి; ఒక్క అమ్మా [illegible]న పేరు తగిలించలేనం [illegible] పరాఫ్ ఇన్‌ఫినిటీ— [illegible] పట్టాకాగితాన్ని గాల్లో [illegible] పెళ్ళి—పెళ్ళి [illegible] "ఉద్యోగం వచ్చేం—ఉద్యోగం [illegible] ఓ నిరుద్యోగి [illegible] కూడా [illegible] షికారు [illegible] అని [illegible] హీ[illegible] పదా రెడ్ [illegible] చూపించే మన సుబ్బిగాడు హేమ పరి[illegible] పట్టె [illegible] దత్రపొంగలి, ముద్ద [illegible] బియ్యప్పరవాన్నం (దానవిమానుల క్షమించాలి) సగ్గుబియ్యం జావ—అవండీ మనవాడి క్వాలిఫికేషన్లు—తిట్టకండి సార్—నేను ముందే చెప్పాగా! మనవాడు అమాయకుడి గ్రేట్ అని.)

హయ్యో, హయ్యో అని ఎనభయి యెనిమిది మెలికలు తిరిగిపోతున్న సుబ్బారావుని లోపల్నుంచి వస్తున్న సావిత్రమ్మచూసి(ఇదిగో ఈవిడే సార్—మన హీరో, హీరోయినుల మధ్య కాంక్రీటు వంతెన లాంటిది; హీరోయిన్‌కి మాతృదేవి. పెద్దవయస్సును తప్పని సరిగా మోస్తున్న ఆవిడ. వేరే మగదిక్కులేనిదీ, రైలుకి ఇంజను, గార్డుపెట్టెల మధ్య వుండే బోగీల లాటిది.) ఏవయ్యా, సుబ్బారావూ! ఉద్యోగం ఇంకా రాలేదుకదా అనిచెప్పి భరతనాట్యం నేర్చుకుంటున్నావా ఏమిటీ? అంది.

అబ్బే! లేదత్తయ్యా, అదేంలేదు, అదేం లేదు—మరి అంటూ చెప్పబోతున్న సుబ్బారావుకి పళ్ళుబిగించి అపరకాళిలా చూస్తున్న హేమ కనిపించి గతుక్కుమని వళ్ళంతా చెమటలు పట్టగా, "శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం" అంటూ ఆంజనేయ దండకంలోకి దిగిపోయి ఆ ఖంగారులో పైకే చదివేసేడు.

కిసుక్కున నవ్వి—ఏవిటి బావా! ఆంజనేయ దండకం చదువుతున్నావ్ అంది హేమ.

తల పైకెత్తే ధైర్యంలేక కంగారు పడిపోతూ అబ్బే ఏంలేదు, ఏం లేదు అన్నాడు పాపం సుబ్బారావు గోళ్ళుగిల్లుకుంటూ.

అరె! అదేవిటీ, పెళ్ళిచూపుల్లో పెళ్ళికూతురు కూచున్నట్లు గోళ్ళు గిల్లుకుంటూ కూచున్నావ్!?

తప్పనిసరిగా తల పైకెత్తి చూసిన సుబ్బా

రావుకి, తనకేసే కొంటెగా చూస్తూ, నాలిక బుగ్గకిపెట్టి కొరుక్కుంటూ, నవ్వుతున్న హేమ కనిపించింది. దాంతో వుక్రోషం వచ్చేసి ఇంక వుండబట్టలేక నిన్నూ....నిన్నూ....అంటూ హేమ వెనకబడ్డాడు—వ్వెవ్వెవ్వెవ్వె అని వెక్కిరిస్తూ హేమ లోపలికి తుర్రుమంది. హేమని అందుకోలేక ఆ కంగారులో నాలిక కరుచుకుని మళ్ళీ ఆ కుర్చీలోన్నే కూలబడ్డాడు సుబ్బారావు పాపం.

అలా కాసేపు కూచుని బయల్దేరి వెళ్ళి పోతున్న సుబ్బారావుకి బుర్రలో కపీమని వెలిగింది లైటు, అరె! హేమ కంగ్రాట్స్ ఎందుకు చెప్పిందీ? అని

ఇదంతా కిటికీలోంచి చూస్తూన్న హేమ సన్నగా ఈలేసుకుంటూ సుబ్బారావు తలుపు కొట్టగానే తీసి—అరె! మళ్ళీ వచ్చావేమిటి? అంటూనే గుమ్మానికడ్డం నిలబడింది.

సరే—అయితే నేవస్తా; అని మళ్ళీ వెనక్కు తిరగబోతున్న సుబ్బారావు రెక్క ట్టుకు గుంజి లోపలకు లాగి గడియవేసింది.

అరె, అరె, అరె....అంటున్న సుబ్బారావుని ఓరగాచూస్తూ జడ గిరాగిరా తిప్పుతూ—అరె లేదు, గిరెలేదు, కూచోవయ్యా బావయ్యా! అని కుర్చీలో కూలేసి అమ్మా! బావకి ఆ మైసూర్‌పాక్ ఇలా పట్రావే అని కేకెసింది.

ఆవిడ, రిప్లయికొర్డులా ప్లేటునిండా మైసూర్‌పాక్‌లు తెచ్చి సుబ్బారావుముందు పెట్టి తీసుకోవోయ్. ఇప్పుడే వస్తాను అంటూ అత్తయ్యా, అత్తయ్యా అని సుబ్బారావు ఘోషిస్తున్నా వినిపించుకోకుండా లోపలికి జారుకుంది మెల్లిగా.

అత్తయ్యా లేదు—ఏం లేదు, ఊరికేను కూచోమంటుంటే....

అదికాదు ఇవన్నీ నాకేనా? ఇంటికా? అనుమానంగా యెగాదిగా చూస్తూన్న సుబ్బారావునిచూసి ముసిముసిగా నవ్వి, ఓసారి పైట సవరించుకొని అబ్బే—నీకుకాదు, నాకు అని మేలమాడి ఊఁ....ఊఁ....తిను తిను అని తొందర పెట్టింది.

ఇది ఎక్కడి కర్మరా బాబూ! తప్పేట్టు లేదు అనుకుంటూ ఓ మైసూరుపాక్ తీసిన వాణ్ని ఆగు....అంది హేమ. తీస్కింది తీసినట్టుగానే మళ్ళీ ప్లేటులోకి వదిలేశాడు సుబ్బారావు మళ్ళీ ఏమొచ్చిందిరా బాబూ? అనుకుంటూ.

ఇందాక నీకు కంగ్రాట్స్ చెప్పాను గుర్తు వుందా? అంది.

అప్పుడే గుర్తుకొచ్చింది సుబ్బారావుకి, తన్నసలు మళ్ళీ అందుకే వెనక్కి వచ్చినట్లు.

ఆఁ, ఆఁ .... చెప్పావ్ అన్నాడు బళ్ళో మాష్టారికి కుర్రాడు బుద్ధిగా పాఠం, అప్పచెప్పినట్టు.

అబ్బా! అంటూ తల పట్టుకుని....మరెందుకు చెప్పావని అడగవేం? అంది మళ్ళీ.

అదే, అదే. ఎందుకూ? అన్నాడు.

హమ్మయ్య. అలా అడిగేవ్ బాగుంది ఇక విను. అన్నట్టు, చూడూ — ఇప్పుడు మైసూరుపాక్ తియ్యి అంది.

బుద్ధిగా తీసేడు.

తిను—

ఆఁ ఆఁ తింటున్నా; అని సగం కొరికేడు.

మిగిలిన సగాన్ని సుబ్బారావు చేతిలోంచి దొరక పుచ్చుకుని, తనుకూడా కాస్తకొరికి, ఆశ్చర్యంగా నోరు తెరుచుకునిచూస్తూ, గమ్మున తేరుకుని అయ్యో—ఎంగిలి — ఎంగిలి అని ఘోషిస్తున్నా వినకుండా నోట్లో కుక్కేసింది. ఆ గడబిడలో పొలమారిన సుబ్బారావు నెత్తి మీర రెండుకొట్టి మంచినీళ్ళగ్లాసు నోటికందించింది. దాంతోపాటే కవరు ఒకటి ఇచ్చింది.

ఆత్రంగా విప్పిచూసి, థేంక్యూ హేమా! అని, ఇంట్లో చెబుతాను అని పరుగెట్టబోతున్న సుబ్బారావు కాలరు పట్టుకు ఆపి, చేతిలోంచి ఆ అపాయెంట్‌మెంట్ ఆర్డరు లాగేసింది.

అదిలా ఇచ్చేయ్ హేమా! ఇచ్చెయ్యవా హేమా! అనీ, ప్లీజ్ ఇయ్యవా హేమా అనీ అడిగించుకుంటూ ఆ గదంతా తిప్పి తిప్పి, మడతబెట్టి జాకెట్లోకి దాచింది.

అదిచూసి, రొప్పుతూన్న సుబ్బారావు కళ్ళు తేలేసి కుర్చీలో కూలబడిపోయాడు.

అదసలు మీయింటి కెలా వచ్చింది, అదీ నీ చేతికెలా వచ్చింది అనడిగేడు కాసేపటికి.



డైరెక్టుగా అందేస్తే స్పెషాలిటీ యేముంటుందని మనం రిసీవ్ చేసుకున్నాం ఆ కవర్ని అని తనకేసి తర్జనితో చూపిస్తో అంది.

ఏం నీకా కవరు కావాలా? తప్పదంటె చెప్పు మరి,—ఊఁ ఇచ్చేయ్ ప్లీజ్ అన్నాడు హేమ మాట పూర్తి కాకుండానే. ఆశగా అడుగుతున్న సుబ్బారావుకేసి చూసి, మూతి సున్నా చుట్టి నాలిక తిప్పుతూ అంది—అరె! కవరు నీ చేతిలో పెట్టుకొని నన్నడుగుతావేమిటి? అని.

చేతిలో కవరుకేసి ఉక్రోషంగా చూసుకొని నేలకేసి కొట్టి వంటింట్లోకి కంప్లెయింట్ చేయడానికి వెళ్ళిపోయేడు సుబ్బారావు. వెనకాలే హేమా వెళ్ళింది.

ఏమే హేమా! అతని కాయితమేదో ఉందట ఇచ్చెయ్యకూడదుటే? అంది సావిత్రమ్మగారు.

కాయితమా? అబ్బె, నాకేం తెలీదమ్మా, బావమీద ఒట్టు అనేసి ఓరగా సుబ్బారావుకేసి చూసి వెక్కిరించింది.

లేద త్తయ్యా, తనే దాచేసింది నా అపాయెంట్ మెంట్ ఆర్డరుని—

ఉత్తిదేనే అమ్మా! నేనేం దాయలేదే అంది సుబ్బారావుమాట మధ్యలోనే తుంచేస్తూ.

అదేవిటయ్యా సుబ్బారావూ—అదేం తెలీదంటుంటేనూ! అంది ఆవిడ.

కాద త్తయ్యా — ఎక్కడ దాచిందోకూడా నేను చూ స్తేను, అని ఇంకా ఏదో చెప్పబోతున్న సుబ్బారావుకి అడ్డువస్తూ....

పెద్ద....దాచాన్ట. ఎక్కడ దాచానో తెలి స్తే తీసుకోవచ్చుగా? కంప్లెయింట్ కూడా ఎందుకు? అని మూతి మూడువంకర్లు తిప్పి సాగదీసింది.

(ప్చ్. పాపం! ఏం చెప్పగలడు పాపం. ఆ అపాయెంట్ మెంట్ ఆర్డరు తన జాకెట్లో దాచేసిందీ. నన్ను తన జాకెట్లోంచి కాయితం తీసుకోమంటుందీ! అని ఎలా చెప్పగలడు పాపం. ఏం పాపమో, ఎప్పటి పాపమో అనుకుంటూ)

అలాగయితే నువ్వే అట్టేపెట్టుకో ఆ ఆర్డరు అని విసురుగా వెళిపోతున్న సుబ్బారావు వెనకాలేవచ్చి, నీ యిష్టం మరి—అ కాయితం ఇదిగో అని దూరంగావున్న టేబుల్ మీదకి గిరాటేసింది.

అది చూస్తూనే ఒక్క అంగలో టేబుల్ కేసి దూకిన సుబ్బారావుకి, అంత స్పీడుగానూ అడ్డువెళ్ళి చేతులు చాపి నిలబడి ఆ ఆర్డరు పట్టుకొని, ఇంతటి శుభవార్త చెప్పినందుకు నువ్వో చిన్న ప్రజంటేషన్ ఇస్తానంటే ఇచ్చేస్తా నా కాయితం అంది ఊరిస్తూ.

చెప్పు యిచ్చేస్తా, అన్నాడు సుబ్బారావు ఆ కాయితం వచ్చిందే చాలన్నట్టుగా.

వేలితో బుగ్గ చూపించి వో ముద్దు అంది.

ఆఁ ముద్దా! అని నోరు తెరుచుకునిచూస్తూ కుర్చీలో కూలబడిపోయేడు సుబ్బారావు.

ఆఁ—యివ్వకూడదేమిటి వో ముద్దు, పెద్ద అంది.

అయ్య బాబోయ్! ఇంకేమయినా వుందా? అని గుడ్లు పెద్దవిచేసి చేతులు గుండెల కడ్డంగా పెట్టుకున్నాడు.

ఏం చిన్నప్పుడు ఎన్నిసార్లు పెట్టలేదేవిఁటీ ముద్దు. ఇప్పుడు పెట్టినంత మాత్రాన ఏమయిపోతుందేమిటి? అని దీర్ఘంతీసి—అయినా నీకీ ఆర్డరు అక్కరలేకపోతే నేనేం చేయను మరి? అని మళ్ళీ జాకెట్లో దాచింది.

అదిమాసి గుడ్లు మిటకరించి చూస్తూ కూచుండిపోయేడు సుబ్బారావు.

పోనీ యింకేదయినా కోరుకో హేమా? మరీ అలాటిదయితే ఎలా? ప్రాధేయపడిపోయేడు తెగ.

ఆఁ....అలా అంటావుగాని ఏదైతే తీరుస్తావులే? ప్రతిదానికే యింకోసాకు చెపుతావ్ అంది అనాసక్తత నటిస్తో.

అబ్బే—లేదు. లేదు. తప్పకుండా, తప్పకుండా....ఎలా గారంటీ ఇవ్వాలో తెలీక తికమక పడిపోసాగేడు,


"స"లాగైతే సాయంత్రం ఫస్టుషోకి రెండు టికట్లు బుక్ చేశాను పద! అంది.

అమ్మో—ఇందుకన్న మాట ఇంక గొడవానూ అని అనుకుని ఆ మాటపైకనే ధైర్యం లేక అబ్బే—నేను ఒక్కణ్ణీ—నీ ఒక్కతెతోటీ సినిమాకా అబ్బే-అది మన సంప్రదాయం కాదు. అబ్బే—

సంప్రదాయం గాడిదగుడ్డూట. పెద్ద ముసలాడిలాగ. నా ఒక్కతెతోటీ కాక ఇంకెంత మందితో వెడదామనుకుంటున్నావ్?

అలాకాదు—చూడు—ప్లీజ్...,

ఆఁ .... నాకింకేం చెప్పక్కర్లేదులే. అది ధర్మంకాదూ!—కాబోయే భర్తతోటి అందునా మేనబావతోనైనా తిరక్కూడదూ—అది మన సంప్రదాయం కాదూ .... పాత చింతకాయ పచ్చడీ—జీలకర్ర. ఇవేగా నువ్వు చెప్పేదీ—



అయినా నాకు తెలీదేవిఁటిలే....

నువ్వొట్టి ముద్దపప్పు....

—సుబ్బారావు జుట్టు నిక్కబొడుచుకుంది.

సగ్గుజావ....

—స్ప్రింగులా వంగున్నాడు

శుద్ధ దద్దోజనం....

—షర్టు సర్దుకున్నాడు

చక్రపొంగలి—బియ్యంపరవాన్నం అని ఏకధాటిగా అనేసి విసురుగా జడ వెనక్కి విసిరి స్పీడుగా లోపలికెళ్ళిపోయింది.

కర్రలా స్ట్రెయిట్ గా కూర్చున్నాడు సుబ్బారావు.

ఏమీ తోచక జుట్టు పీక్కున్నాడు. ఓ అయిదు నిమిషాలకి సరే ఏదైతే అదయిందని అలాగే వెడదాం హేమా! అని లోపలకి కెళ్ళి చెప్పాడు.

ఆ మాట వినీ విననట్టే ముక్కు చీది, అటు తిరిగి పడుకుంది మంచంమీద.

నిజంగానే హేమా, ఫస్ట్ షోకి తప్పకుండా వెడదాం అన్నాడు.

ఆఁ....ఇదంతా బూటకంలే అంది తనలో తనే నవ్వుకుంటూ.

అబ్బే—లేదు తప్పకుండా వెడదాం. నేను ఇంట్లో చెప్పి వస్తాను. వెడదాం అన్నాడు.

నిజంగానేనా? అంది.

ఆఁ....నిజ్ఝంగా—అన్నాడు నమ్మకంగా. నమ్మమంటావ్?

—ఆఁ....పూర్తిగా, అన్నాడు.

అలా అయితే సరే అని చెంగుని లేచి కూర్చుంది.

మరి ఆ ఆర్డర్ ఇయ్యవూ — చేతులు చాపేడు.

అమ్మ ఆ పప్పులేం వుడకవ్. సినిమానుంచి వచ్చేకే ఇచ్చేది అంది.

ఉష్—అని ఓ వేడి నిట్టూర్పు విడిచి సరే సరే అలాగయితే రెడీకా అని చెప్పి వెళ్ళిపోయేడు.

మంచం మీంచి ఒక్క దూకుదూకి ఈలేసుకుంటూ, అమ్మా! బావ సినిమాకి వస్తున్నాడే అంటూ సావిత్రమ్మగార్ని కౌగలించేసుకుంది ఒక్కసారిగా.

అబ్బ! ఉండవే, ఏవిఁట, నీకసలు ఆ మూడుముళ్ళు వేయించేస్తేకాని ఈ అల్లరి తగ్గదు. పాపం! అతన్ని ఏడిపించేస్తున్నావు కదే. ఇంతవరకూ ఆస్తి వున్నా ఉద్యోగం రాలేదని అంటుంటే ఊరుకున్నాం—యింక

ఆ అడ్డుకూడా తీరిపోయింది. ఇంక అన్నయ్యతోటీ, వదినతోటీ మాట్లాడమే తరవాయి అంది, పవిటికొంగు వేలికి చుట్టుకుంటూ సిగ్గు పడుతున్న కూతుర్ని చూసి. అదే ప్రథమం కూతురు సిగ్గుపడడం చూడడం ఆవిడకి.

ఫో,అమ్మా..అని ఒక స్టీరియోటైప్ డైలాగు వేసేసి పడగ్గదిలోకి తుర్రుమంది, ఊహాలోకంలో ఓ డ్యూయేటు పాడుకుందుకు.

* * *

ఎంతకీ రాదేమని హేమ తిట్టుకుంటుండగా ఆ సాయంత్రం వచ్చింది-సుబ్బారావూ వచ్చేడు. కానీ, కూడా సుబ్బారావు ముద్దుల మేనల్లుడు మూడేళ్ళవాడు "టార్జాన్" వున్నాడు.

అది చూస్తూనే ఉస్సురని నిట్టూర్చి వెనకాలే ఇంకెవరైనా వస్తున్నారేమో అని అనుమానంగా చూస్తున్న హేమ భావం గ్రహించి అబ్బే, యింకెవరూ లేరులే—వీడే సరదాగా సిని....

"మా" చూస్తానంటేనూ!—తీసుకొచ్చేవ్, అంతేనా? అంది హేమ.

అంతేనన్నాడు.

అంతే? అంది.

ఆఁ ఆఁ అంతే....

మొహం చూడు అంతేట—అదికాదుగాని, నీకు అలా చల్లగాలిలో చక్కగా నడిచివెళ్ళి, అలా చక్కగా సినిమా చూసి, అలా అలా అలా—ఇంకేదోలా....అలా యింకేదీ అనిపించదా!

అబ్బే—ఇంకేం అనిపించందే....చప్పరించేసేడు సుబ్బారావు.

అవున్లే, నీ కెందుకనిపిస్తుందీ!—సువ్వొట్టి దద్దోజనం, చక్ర—

మధ్యలోనే అందుకుని .... "పొంగలి", ముద్దపప్పు, బియ్యపరవాన్నం, సగ్గుబియ్యం జావ—అని తన ప్రవర తనే చెప్పుకున్న సుబ్బారావుకేసి అరే, సుబ్బారావు బావకి యింత ధైర్యం ఎక్కణ్ణించి వచ్చిందబ్బా!....అని కళ్ళు ఇంతింత చేసుకుని ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయింది హేమ!

మావఁయ్యా....సినిమా అని సుబ్బారావు మెడపట్టుకు వేళ్ళాడుతోన్న టార్జాన్‌గాడి మాట వినగానే ఈ లోకంలోకి వచ్చి—

సరె పద అంది—అంతకన్న పెద్దవాళ్ళు రానందుకు సరిపెట్టుకుంటూ.

ధియేటర్‌కి చేరగానే అబ్బే ఈ సినిమాకా?-ఛస్తే రాను అన్నాడు దానిమీద "బ్లో హాట్-బ్లోకోల్డ్" అక్షరాలు చూస్తూనే.

అదేం? అంది విస్మయంగా హేమ.

ఛ. ఛ. అబ్బ! నే చెప్పలేను ఆ సినిమా గురించి—అబ్బే! నేను రాను అన్నాడు.

మరేం చేద్దామంటావ్? నీరసంగా అడిగింది.

బుర్రగోక్కుంటూ చుట్టూ చూశాడు. "యశోదా కృష్ణ" అందమైన హోర్డింగు కనబడింది. దానికెడదాం అన్నాడు హుషారుగా.

ఏవిఁటి ఆ సినిమాకా? అంది నీరు కారిపోయి.

ఆఁ....దానికే వెడదాం. కృష్ణుడు, పుట్టడం, కంసుణ్ని వధించడం, పూతనని సంహరించడం, ఇంకా....అని చెప్పుకుపోతున్న సుబ్బారావుకేసి చూసి, అదీ....అదోలా చూసి-ఏదోలా అయిపోయింది హేమ.

సుబ్బారావు చెప్పడం అయేక కూడ, ఊఁ కొడుతున్న హేమకేసి ప్రశ్నార్థకంగా చూసి-

హేమా అన్నాడు.

ఆఁ....అంది ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చి.

అదేవిఁటీ! అలా అయిపోయేవ్ అని అమాయకంగా అడుగుతున్న సుబ్బారావు మొహంలోకి చూస్తూ — సరే. పద అంది ఏదో ఒక సినిమాకైనా అసలంటూ వెడుతున్నాం అనుకుంటూ.

టికెట్లు ఫ్రీగా దొరికాయి. సినిమా మొదలయింది. ధియేటరంతా ఖాళీగా వుంది.

మధ్యసీట్లో టార్జాన్‌గాడ్ని కూర్చోబెట్టి, తన పక్కనే ఎక్కడ కూర్చుంటుందోనన్న భయంతో అలా కూచో హేమా అంటూ అవతలి సీటు చూపించేడు.

అబ్బే అలా యెందుకు, ఇక్కడ కూచుంటాను అని టార్జాన్‌గాడ్ని ఒళ్ళోకి లాక్కుని వాడి సీట్లో కూలబడింది ఉస్సురంటూ.

కాసేపటికి తన చెయ్యి తీసి సుబ్బారావు చేతిమీద వేసింది. ఆ స్పర్శ తగుల్తూనే పాము మీదపడినట్టుగా, తన చెయ్యి ఒడిలోకి లాగేసుకున్నాడు సుబ్బారావు.

హేమ దీర్ఘంగా నిట్టూర్చడం ఆ సినిమా హోరులో కలిసిపోయింది.

ఇలా కాదని:

సుబ్బారావుకేసి తన మల్లెపూల జడ విసిరింది. ఆ మల్లెల్లోంచి వస్తున్న ఘాటు సుబ్బారావుకి ఏదో మత్తు మత్తుగా అనిపించసాగింది. అలా మత్తుగానే హేమకేసి మొదటిసారిగా చూడబోతున్న సుబ్బారావు మెడని కప్పపిల్లలా పట్టుకున్నాడు టార్జాన్‌గాడు — బాబోయ్! రాక్షసుడంటూ.

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు సుబ్బారావు. వాణ్ని గుండెలకదుముకుని లేదు నాన్నా—లేదురా, రేయ్—అబ్బే లేదమ్మా వాళ్ళు బొమ్మలమ్మా....మననేం చెయ్యరు అన్నాడు సుబ్బారావు అనునయిస్తో.

గుండెల కదుముకున్న టార్జాన్‌గాడ్ని చూసి హేమ అదోలా యిబ్బందిగా కదిలింది కుర్చీలో.

ఈ లోపుగా యింకో రాక్షసుడు వచ్చేడు తెరమీదకి. ఇంకోసారి కెవ్వుమన్నాడు టార్జాన్. ఇంక వెళ్ళిపోదాం మావఁయ్యా, రాక్షసులు చంపేస్తారు మావఁయ్యా, అంటూ అందుకున్నాడు. ఊరుకోకుండా అదే పనిగా రాగం మొదలుపెట్టేడు వాడు. ఇంక తప్పనిసరిగా సుబ్బారావూ ఆ వెనకే హేమ లేచి వచ్చేశారు.

బయటికొచ్చేసేక మావఁయ్యా-చాక్లెట్, చాక్లెట్ అంటున్నవాణ్ని చూసి మండిపోయి, ఒక్కటిద్దామనుకుంది హేమ. ఈ లోపుగా వాడు తన చాక్లెట్. తినేసి—మరి అత్తయ్యకో అంటూంటే—నాకేం వద్దులే. పదండి పోదాం అని వాడి బుగమీద ఓ సారి ముద్దెట్టుకుంది, కొట్టడం మానేసి.

* * *

కొన్ని రోజులు గడిచిపోయేయ్.

ఓ రోజు — వదినా! అంటూ వచ్చిన సావిత్రమ్మని ఎదురేగి సాదరంగా లోపలికి తీసుకువచ్చింది మహాలక్ష్మి. వెనకనే వచ్చిన హేమని ఏం కోడలా మరీ నల్లపూసైపోయావ్ అని మేలమాడింది.

కాసేపు ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పి హేమకి శ్రావణంలో వివాహం చేసేద్దామనుకుంటున్నాను వదినా. నాకా వయసు మీదపడుతోంది. దీన్ని నీ కొడుకు చేతిలో పెట్టేస్తే నా కింక ఏ చీకూ చింతా వుండదు అంది తల వంచుకు కూచున్న కూతుర్ని చూపిస్తో. మళ్ళీ అవిడే అంది.

అందుకని, సుబ్బారావుకి కూడా చెప్పు, శ్రావణంలో ముహూర్తంపెట్టించడానికి అభ్యంతరమేమైనా వుందేమో? అన్నట్టు అన్నయ్యగార్ని కూడా కనుక్కో అనగానే—మహాలక్ష్మి లేచి, ఇంకా ఎప్పటిదాకానో ఎందుకూ? ఇప్పుడే మాట్లాడతాను అంటూ ఫోన్‌చేసి మాట్లాడి ఆయనేం అభ్యంతరం లేదంటున్నారు వదినా. వాడినే కనుక్కోమన్నారు అవన్నీ అంది.

ఇదంతావింటున్న సుబ్బారావు మహాలక్ష్మిని లోపలికి పిలిచేడు.

మహాలక్ష్మి వెళ్ళింది.

అమ్మా! నాకు హేమని చేసుకోవడం ఇష్టం లేదమ్మా అన్నాడు.

అదేవిఁరా అంది ఆవిడ ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకుంటూ.

ఏంలేదు. నేను చేసుకోనన్నానంతే.

ఆదేవిఁటిరా చిన్నప్పటినుంచి అనుకుంటున్న సంబంధం. పైగా మేనరికం. యిలాటివి బంధువులు దూరం కాకుండా, ఆ వేలుకావేలు దూరంగా అయిపోకుంగా నీ ఉండేందుకేరా చేసుకునేది. అదే నిర్ణయమైతే, చేసుకునేవాడివి నువ్వు కాదంటే నేనేమి చేయగలనులే అని వెళ్ళిపోతుండగా—

హేమ వచ్చి అంది. ఏం బావా? నేనేం తప్పు చేశాను? పెద్దవాళ్ళందరూ అంటేనేగా నేను నీపై ఆశలూ, మమతలూ నింపుకొన్నది,

అతికష్టంమీద కంఠం బిగపట్టుకుంటూ.

కావచ్చు.... నేను కోరుకునే అమ్మాయి నీలా రాలుగాయిలా వుండకూడదు. నీలో మన అలవాట్లూ, సాంప్రదాయాలూ ఒక్క టున్నాయా? కేవలం అందుకే నేను చేసుకో నన్నాను అన్నాడు.

ఏమిట్రా—అన్నయ్యా.... హేమని చేసుతో న●టున్నావ్ అంటూ వంటింట్లో టిఫిన్ ఏర్పాట్లు చేస్తున్న శైలజ అట్లకాడతో వచ్చింది.

మరి లేకపోతే నా అపాయింట్ మెంట్ ఆర్డర్ దాచీ, సినిమా అనీ, గినిమా అనీ— అబ్బబ్బ అన్ని తిప్పలు యెందుకు పెట్టింది మరి? అన్నాడు యేదో తెలివైన ప్రశ్న వేసినట్టు.

ఏడిసేవ్ లే—ఆ ఆర్డరు నేనే యిచ్చి పార్టీ అడిగి ముప్పుతిప్పలు పెట్టమన్నాను అంది హేమకి సైగచేస్తో శైలజ.

ఇంకా ఏదో చెప్పబోతున్న సుబ్బారా నోటికి తాళంవేసి, శ్రావణంలో ముహూర్తం పెట్టించేయమంటున్నాను అంటూ మహాలక్ష్మి, ఈ శుభసందర్భంలో ఓ స్వీటు అంటూ శైలజా నిష్క్రమించేరు.

ఆ తర్వాత అటూ ఇటూ చూసి హేమ గట్టిగా తపీమని సుబ్బారావు కాలు ఓ తొక్కు తొక్కి తుర్రుమనిపోయింది.

* * *

హేమాఁ—అంటూ కౌగిలించుకుంటున్న సుబ్బారావుకి హేమ ఎందుకో గింజుకుంటు న్నట్టనిపించి—అబ్బ, ఏవిఁటీ—ఆఁహా.... ఊఁ....అని మురిపాలుపోతూ కౌగిలించు బోయేప్పటికి, సుబ్బారావు కౌగిలిలో ఆ ఉక్కిరి బిక్కిరికి తట్టుకోలేక శీతాకాలపు చలికి దుప్ప టీలో దూరిన బొచ్చుకుక్క సుబ్బారావు చెవి కొరికి "కుఁయ్"మంటూ బయటకురికింది. □



హైదరాబాదా, మద్రాసా?

'తెలుగు చిత్ర పరిశ్రమ తెలుగునాటనే వర్ధిల్లాలి' అనే నినాదం పదేళ్ళు పాతబడింది యిప్పటికి. ఇది సంకుచిత ప్రాంతీయ తత్వ మేమీ కాదు. న్యాయమైన కోరికే. అయితే ఆశించడం వేరు ఆచరణ సాధ్యం చేయడం వేరు. మనకు 'ఆశిస్తున్నా'మనే నాయకులే యెక్కువ. ఆచరణలో ఈ ఆశయాన్ని సాధించ డానికి నిరంతరం కృషి చేసేవారు తగినంత మంది లేరు మనకు. ఆ మాటకొస్తే మద్రా సులో తెలుగు సినిమా పరిశ్రమ యింతగా పాదుకొనిపోవడానికి కారణం — 'మద్రాసు మనదే' అని తెలుగువారు గట్టిగా నమ్మడమే! ఈ నమ్మకం వమ్మయిపోయాక కూడా తెలుగు సినిమా 'ఉత్పత్తి' కేంద్రాన్ని తెలుగునాటికి

'కాళి'లో చిరంజీవి, జయలక్ష్మి



తరలించలేకపోయాము. మద్రాసులో వున్న సౌకర్యాలూ, సాధనసామగ్రీ, నిష్ణాతులైన సాంకేతిక నిపుణులూ యేరీ మరి తెలుగునాట! ఎంత చిత్తశుద్ధితో ప్రయత్నించినప్పటికీ మన సినిమారంగ నాయకుల ప్రయత్నాలు ఈ విషయంలో అంతగా ఫలించకపోవడానికి యిది కూడా ఒక కారణమే.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు లక్ష రూపాయల సబ్సిడీ యిస్తున్న కాలంలోనే ఆ లక్ష మేము మద్రాసుకీ హైదరాబాదుకీ తిరగడానికే సరిపోతున్నాయని నిరాశ ప్రకటించిన నిర్మాతలున్న విషయం మనకు తెలుసు. అక్కడ మొత్తం నాలుగు స్టుడియోలు— సారథి, అన్నపూర్ణ, రామకృష్ణ, భాగ్యనగర్—

'కేటుగాడు'లో మోహన్‌బాబు, సీమ





'పిల్ల జమీందార్'లో అక్కినేని, జయసుధ

వున్నాయి. వాటికి చేతినిండా పనిలేదు. స్టుడియో అని అభివృద్ధి చేయాలంటే స్టుడియోలకి పని కల్పించాలి. ఈ సదుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని హైదరాబాదు స్టుడియో

లతో కనీసం 30% శాతం చిత్రీకరించిన సినిమాకి మాత్రమే సబ్సిడీ యిస్తానని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో సినిమాపరిశ్రమఅభివృద్ధి కోసమని వ్యయప్రయాసల కోర్చి ప్రభుత్వ రుణసహాయంతో స్టుడియోలు నిర్మించిన తెలుగు సినిమా బాంధవుల శ్రేయస్సుకు, తెలుగు

'సుజాత'



నాట తెలుగు సినిమా అభివృద్ధికి ఈ నిర్ణయం కొంత మేరకు దోహదం చేస్తుంది. అందునా, దాసరినారాయణరావువంటి దర్శకులు, అక్కినేని నాగేశ్వరరావు, ఎన్. టి. రామారావువంటి ఉద్దండులైన నటులూ తెలుగునాడుకు తెలుగు సినిమాలని తరలించాలనే కృత నిశ్చయంతో వున్నట్టు కనిపిస్తోంది కనుక ఈ ప్రయత్నం ఫలించే అవకాశాలు కూడా వున్నాయి.

అయితే కొత్తగా తెలుగు సినిమాలలో కొత్తగాలి ఒకటి వీస్తోంది-పూర్తి ఔట్‌డోర్ చిత్రనిర్మాణం! 'శంకరాభరణం' వంటి చిత్రం కూడా నిజానికి ఔట్‌డోర్‌లో నిర్మించబడినట్టే లెక్క. రాజమండ్రిలోని ఒక యిల్లు, గోదావరి తీరం, కొన్ని ఇతర ప్రాంతాలలో ఆ చిత్రం తీసినట్టు కనిపిస్తోంది. ఇప్పటి ఈ సబ్సిడీ నిబంధనల ప్రకారం యిటువంటి చిత్రాలకు సబ్సిడీ లభించదనుకోవాలి. అంటే పూర్తి అవుట్‌డోర్ చిత్రాలు తెలుగుదేశంలో చిత్రపరిశ్రమ అభివృద్ధికి వ్యతిరేకమనుకోవాలా? లేక ఔట్‌డోర్ చిత్రాలని సబ్సిడీ సంఘం, చిత్రాలుగా గుర్తించడానికి నిరాకరిస్తుందనుకోవాలా? ఇది చాలా చిన్న ప్రశ్నగా కనిపించవచ్చు కానీ అటు రాష్ట్రప్రభుత్వమూ, యిటు పరిశ్రమలోని ప్రముఖులూ తీవ్రంగా ఆలోచించవలసిన సమస్య యిది. ప్రభుత్వం వారి కొత్త సబ్సిడీ విధానం అపార్థాలకు దారితీయకముందే అందరూ ఆలోచించి సవ్యంగా అర్థం చేసుకోవలసిన విషయం యిది!

దాసరి చేసిన పెళ్ళి

దాసరి నారాయణరావుగారు ఏది చేసినా ఘనంగా చేస్తారని వ్యాఖ్యానించిన ఒక పాత్రికేయ మిత్రుడితో ఏకీభవించని వారుండరు నారాయణరావుగారిని ఎరిగిన వాళ్ళలో. మే నెల ఏడున, తన మేనల్లుడు, [illegible]యాగ్రహణ దర్శకుడు కె. ఎస్. హరి [illegible] సుబ్రహ్మ[illegible]లోని ఏ.వి.ఎమ్. రాజేశ్వరి [illegible] మండపంలో ఘనంగా జరిపిం[illegible] వధువు చి. సౌ. నాగమణి. ఆ [illegible] జరిగిన రిసెప్షన్‌లో పాత్రికేయుల దగ్గరి[illegible] [illegible] నటీనటులు, దర్శకులు, నిర్మాతల వరకు అందరినీ సాదరంగా ఆహ్వానించి [illegible]

చూపించారు నారాయణరావుగారు. విష్ విష్ ది యంగ్ కపుల్ ఎ వెరీ హేపీ మేరీడ్ లైఫ్!

మూగకు మాటొస్తే

మూగతనం మనిషి చేయని నేరానికి ప్రకృతి విధించే శిక్ష. అటువంటి మూగకు మాటొస్తే? మాట నేర్పినవారు అంతవరకూ చేసిన నేరాలకు శిక్ష, వారి ద్రోహానికి తగిన దండన. కొంత జీవితాన్ని మూగగా గడిపిన ఒక అమ్మాయికి మాటొస్తే ఏమవుతుందో చూపిస్తున్నారు శివకామేశ్వరీ ఫిలింస్ వారు తమ 'మూగకు మాటొస్తే' చిత్రంలో.

కె. విజయకుమార్ నిర్మించిన ఈ వర్ణ చిత్రంలో జయసుధ ప్రధానపాత్ర దరించింది. కథానాయకుడు మరళీమోహన్. కవిత కూడా ఒక ముఖ్యపాత్ర ధరించింది. రసవత్తరమైన ఈ కుటుంబగాధా చిత్రానికి దర్శకుడు వి. మధుసూధనరావు. నటిగా జయసుధ ప్రతిభా వ్యుత్పత్తులను మరోసారి నిరూపించనున్న యీ చిత్రం జూన్‌లో విడుదలకానుంది.


రాబర్ట్, రామ్. రహీమ్

పద్మావతీ ఫిలింస్‌వారు భారీవ్యయ ప్రయాసల కోర్చి తీసిన చిత్రం రాబర్ట్, రామ్, రహీమ్. భారతదేశమంతటా బాక్సాఫీసులు బద్దలు కొట్టిన 'అమర్, అక్బర్, ఆంథోని' ఆధారంగా నిర్మించిన ఈ చిత్రంలో విజయనిర్మల దర్శకురాలిగా, యెటువంటి కథనైనా యెంత ప్రతిభావంతంగా హేండిల్ చేయగలదో కనిపించింది. ముఖ్యంగా తనని పెంచి పెద్దచేసిన ఫాదర్ ఖూనీ చేయబడినప్పుడు కృష్ణ జీసస్‌ని ప్రశ్నించే దృశ్యం వంటివి చాలా బాగా చిత్రీకరించిందామె. కృష్ణ, రజనీకాంత్ చేసిన ఫైట్స్ తెలుగు సినిమాలలో అపూర్వమే అనాలి. డూప్ లేకుండా తీశారని విన్నాము. చాలా థ్రిల్లింగ్‌గా వున్నాయి. శ్రీదేవి, సునీత, [illegible] జయలక్ష్మి, అంజలీదేవి, చంద్రమోహన్, జగ్గయ్య తదితరులు నటించిన ఈ భారీ చిత్రానికి సంభాషణలు త్రిపురనేని మహారథి. సంగీత దర్శకుడు చక్రవర్తి.

—దేవీదాసు

బహుమతి రు. 100!

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆ ధా రా లు

జూలై '80

అడ్డం :

1. లాభంలేదు
3. ఆభరణం
5. ప్రార్థనకు ప్రారంభం
7. చావకుంటే తినవచ్చు
9. ఆవు మనుమరాలు
10. కాలభాగం
12. ఫాషన్ శిక్షిత
13. లోకువ
15. కాలంతో రాలేవి
16. ఇకారం ఇంటికన్నా పదిలం
17. 15, 23, అడ్డంలో పైసలు
18. కొనడం చావడం
20. చంద్రుడిది ఆయుధం
22. టైమ్ లిమిట్
23. చూ. 15 నిలువు
25. ఆ యిది కోరేది ఆహారం
27. రామాయణ భారతాలలో వుంది
29. దంతవీణ ధ్వన్యనుకరణ
31. లేనివాళ్ళకి దేవుడు.
32. అయిపోయింది

నిలువు :

1. జన చైనాకు 1949లో
2. రారు అంటే అతిశ[illegible]
3. సింహాలకీ, [illegible]
4. జమీందార్ల [illegible]
5. కాని, ఎరుపు
6. చెట్టు పెదవి
7. రా అంటే [illegible]
8. ఎడం కాదు
11. 19 [illegible]
14. వదుల. కాదు
15. 23 [illegible]
18. [illegible]
19. [illegible]
21. [illegible]
22. [illegible]
23. [illegible]
24. [illegible]
26. 20లో సగం
28. అకారంతో మౌని
30. పరిపోయిన పడగళ్ళు

జూన్ పదబంధ ప్రహేళిక సమాధానాలు:

అడ్డం : 1. సగం 3. బాసా 5. రాబడిన 7. సావధానం 9. కర్మ 10. న్యగ్రమా 12. రవి 13. తిల 15. వీణ 16. హస్తి 17. కంది 18. కరి 20. కప్ర 22. వేద 23. వాలుక 25. వతో 27. మలిసారి 29. కలహించు 31. కహో 32. క్కచు

నిలువు : 1. సబర్మతి 2. గండి 3. బావ 4. సాధారణ 5. రాక 6. పన్ను 7. సామ్రా 8. నంవి 11. గది 14. లహరి 15. వీచిక 18. కదలిక 19. జ్వాలు 21. ప్రవహించు 22. వేమ 23. వారి 24. కక 26. తోచు 28. సాహో 30. లక్క

నిబంధనలు గమనించండి :

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి జూన్ 25 వ తేదీలోపు మాకు చేరేట్టు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపేవారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపై నే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 100/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్ కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది. ఒక ఎంట్రీమీద ఇరువురి పేర్లు వుండకూడదు.

జూన్ ప్రహేళిక విజేతలు:

మాదిరాజు శివప్రసాదరావు, హైదరాబాదు. ఆర్. శ్రీమన్నారాయణ, నల్లగొండ.

డా. రామానుజాచార్యులు, కె. సత్యనారాయణ, హైదరాబాదు. బి. బి. ఆర్. కృష్ణమూర్తి, చెక్కలి. దేశరాజు వెంకట రమణారావు, విజయనగరం. అలవర్తి వెంకటసుబ్బారావు, నందివెలుగు. అంబారుఖానా లలిత ఈశ్వరి, గుండూరు (కర్ణాటక). సి. హెచ్. నరసింహారావు, మహతీమూర్తి హైదరాబాదు. శ్రీమతి దాశరధి విజయలక్ష్మి, హైదరాబాదు. ఐ. వెంకటేశ్వర్లు, కర్నూలు, యం. శ్యామల, కర్నూలు. పిన్నక నాగేశ్వరరావు, వేజండ్ల. ఎన్. సి. హెచ్. జగన్నాధాచార్యుల, కొత్తగూడెం. కె. జె. ఎం. కృష్ణారావు, ఏలూరు. శ్రీమతి కె. ముత్యాలు, ఏలూరు. ఎం. సుబ్రహ్మణ్యస్వామి, విశాఖపట్నం. జి. సుబ్బారావు, రాజమండ్రి. టి. నరసింహారావు, మచిలీపట్నం. కె. వెంకట్రావు, విశాఖపట్నం. కందాళ కనకమహాలక్ష్మి, వట్టిపల్లి సీతామహాలక్ష్మి, విశాఖపట్నం. డా॥ జి. ఎస్. ప్రకాశశాస్త్రి, విశాఖపట్నం. ఎం. వేణుగోపాలశర్మ, ఖమ్మం. ఎం. ఎల్. ఎన్. ఆచార్యులు, సింహాచలం, కె. కృష్ణమోహన్, విశాఖపట్నం. టి, ఏ. రాజు హైదరాబాదు. జి. పుల్లప్ప, కానాల. సి. హెచ్. లలిత, శ్రీకాకుళం. కె. శివప్రసాద్, వేములవాడ. పి. శ్రీనివాసమూర్తి, ఎగువపీ కేరు. ఎం. శ్రీరాములు, అరసపల్లి (శ్రీకాకుళం జిల్లా) వంగల రంగాచార్యులు, ఎస్. కృష్ణమూర్తి, ఆదిలాబాద్. శ్రీమతి ఏ. శ్యామలాదేవి, శ్రీకాకుళం. తోట చంద్రశేఖరరెడ్డి, పొద్దుటూరు. కె. బి. జయరామరెడ్డి, కర్నూలు. ఎం. వి. రాయుడు, బెంగుళూరు. బి. సాహితి, మద్రాసు. డా॥ ఎస్. ఎన్. శర్మ, విశాఖపట్నం. పి. వి. రామారావు, ఖమ్మం. ఐ. నీలకంఠరావు, ఖమ్మం. ఎస్. గోపాల్, కావలి డా॥ పి. సుమతి, హైదరాబాదు. వై. బి. రెడ్డి, నెల్లూరు. వజ్రె నాంచారయ్య, విశాఖపట్నం. టి. నాగపద్మావతి, కూళ్ళ. వి. విజయభాస్కర రెడ్డి, కానాల. ఈరంకి రామం, అమలాపురం సత్యవాడ సత్యవెంకట సుబ్బారావు, ముక్కామల. కె. సీతారామశర్మ, విజయవాడ. ఎం. భాస్కరరావు, హైదరాబాదు. బుగత సత్యనారాయణ మూర్తి, అమలాపురం. సి. ఎస్. ఆర్. మూర్తి, అమలాపురం. కుమారి వి. శ్యామల, నందిగామ. ఎం. శివరామమూర్తి, విశాఖపట్నం, వి. కిషోర్ బాబు, నగరం. ఏ. బి. సుబ్రహ్మణ్యం, శ్రీకాకుళం. ఎస్. లక్ష్మీనారాయణ, విశాఖపట్నం, అందుకూరు శివాజీ, కొత్తవలస. సి, ఎస్. శర్మ, హైదరాబాదు. తెన్నేటి సుధాదేవి, హైదరాబాదు. శ్రీమతి శారదా శ్రీనివాసరావు, పుత్తూరు. టి. హేమనళిని, వరంగల్.

గమనిక :

ఈ నెల ప్రహేళిక పోటీలో పాఠకులు చాలా ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ప్రహేళికను పరిష్కరించడంలో కూడా చాలామంది కృతకృత్యులయ్యారు. విజేతలు ఎక్కువ మంది వుండటంవల్ల, లాటరీ పద్ధతిలో ఐదుగురు బహుమతి గ్రహీతలను నిర్ణయించాము. వారి పేర్లు : 1. పి. వి. రామారావు, ఖమ్మం, 2. ఎం. శివరామమూర్తి, విశాఖపట్నం, 3. వి. కిషోర్ బాబు, నగరం, 4. బుగత సత్యనారాయణమూర్తి, అమలాపురం, 5. పూడిరాజు శివప్రస్తాదరావు, హైదరాబాదు.

Edited&Publîshed by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony, Kodambakkam, Madras-600024 & Printed by D. Hanumantha Rao at Kranti Press, 12, Francis Joseph Street, Madras 600 001

JYOTI, JULY '80 Rs/3 Regd No: M: 8669

